ఈనాడు


విజయవాడ 10-7-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 331

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు



విజయవాడ 10-7-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 331
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మీ పనితీరు ఆశించినట్లు లేదు

కీలకమైన రాజకీయ అంశాలపైనా ఎందుకు స్పందించరు? • మహిళా ఎమ్మెల్యేని వైకాపా నాయకుడు కించపరిస్తే మీకు పట్టదా?

వైకాపా కుట్ర రాజకీయాల్ని ఎండగట్టడంలో మీకేంటి ఇబ్బంది? • మీ శాఖల్లో చేస్తున్న మంచి పనుల్ని ప్రజలకు ఎందుకు చెప్పరు?

కొందరు మంత్రుల తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం • రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా వైకాపా తప్పుడు మెయిల్స్ పంపుతోందని ఆగ్రహం

ఈనాడు - అమరావతి

మంత్రుల్లో కొందరి పనితీరు ఆశించినట్లు లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. కీలకమైన రాజకీయ అంశాలపైనా దాదాపు సగం మంది మంత్రులు వేగంగా స్పందించట్లేదని, ప్రజలకు అవగాహన కల్పించట్లేదని అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన మహిళా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా నాయకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చాలామంది వెంటనే గట్టిగా స్పందించలేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. "మంత్రులు ఇంకా పూర్తి స్థాయిలో పనిచేయట్లేదు. మీకు ప్రత్యేకంగా సామాజిక మాధ్యమ బృందాన్ని, పీఆర్వోను కేటాయించాం. అయినా మీ శాఖల్లో చేస్తున్న పనుల్ని ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతే ఎలా? ఇప్పటికీ 50% మంత్రులు ఈ విషయంలో వెనకబడ్డారు. మీ సమస్యేంటి? మంచి పనుల్ని ప్రజలకు చెప్పలేరా?" అని సీఎం అసహనం వ్యక్తం చేశారు. "సందర్భానుసారం వెంటనే స్పందించాలి. మామిడి రైతులకు డబ్బులిస్తున్నాం. దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.270 కోట్లు వెచ్చించి పొగాకు కొంటున్నాం. అవన్నీ మీరు ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ఎలా? మనం పనిచేయడమే కాదు, దాన్ని ప్రజలు గుర్తించేలా చేయాలి. అవసరమైన విషయాలపై వెంటనే స్పందించకపోతే నష్టం జరుగుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టట్లేదని, సున్నితమైన అంశాలపై ప్రజల్ని చైతన్యవంతులను చేయడంలోనూ విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు.. సిగ్గులేకుండా సమర్థనా?

"వైకాపా నాయకులకు మహిళలంటే కనీస గౌరవం లేదు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా నాయకుడు అంత అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా, సిగ్గులేకుండా దాన్ని సమర్థించుకున్నారు. అలాంటి వ్యక్తిని వైకాపా నాయకులు వెనకేసుకుని వస్తున్నారు. మహిళలు మనోధైర్యం కోల్పోయి, బయటకు రాకుండా చేయడమే వారి దాడుల వెనుక లక్ష్యం. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పుడు అనేక అంశాలపై విమర్శలు, ప్రతి విమర్శలు వచ్చేవి. కానీ అవి హద్దుదాటకుండా, బాధ్యతాయుతంగా ఉండేవి. ప్రస్తుతం వైకాపా నాయకుడి విధ్వంసకర విధానాలు, కుట్రలు చూస్తుంటే... ఇలాంటి వాళ్లతోనా మనం రాజకీయం చేయాల్సి వస్తోందన్న బాధ కలుగుతోంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

(మిగతా 3లో)


క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సీఎస్ విజయానంద్

కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రాయలసీమ ఎత్తిపోతల, వేదవతి, రాజోలిబండ..

నిలిపివేసిన ఎన్నో ప్రాజెక్టులు మళ్లీ పట్టాల పైకి

రాష్ట్ర మంత్రిమండలి ఆమోదంతో అడుగులు ముందుకు

తోతాపురి మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

కిలోకి రూ.4 మద్దతు ధరతో రూ.260 కోట్లు మంజూరు

ఏపీ స్పేస్ పాలసీ 4.0కి ఆమోదం

రవాణా వాహనాల హరితపన్ను రూ.1,500-3,000కి తగ్గింపు

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

11లో


గుజరాత్‌లోని వడోదరా సమీప ముజ్‌పుర్‌లో వంతెన కూలడంతో నదిలో పడిపోయిన వాహనాలు

వడోదరాలో కుప్పకూలిన వంతెన

నదిలో పడిపోయిన వాహనాలు.. 11 మంది మృతి

మృతుల్లో ఇద్దరు చిన్నారులు

12లో


ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో కార్మికుల భారీ ర్యాలీ

సమ్మె పాక్షికం

దేశ వ్యాప్తంగా భారీగా పాల్గొన్న కార్మిక సంఘాలు

నిత్యావసరాలకు కలగని ఇబ్బంది

3లో

అంతా జగ'న్నాటకమే'

మనుషులే పుస్తకాలు.. అనుభవాలే పాఠాలు!



ప్రత్యేక కథనం 14లో

- మామిడికాయలను జగన్ కాన్వాయ్ ముందు పోసి అన్నదాతలు నష్టపోతున్నారని డ్రామాలు
- తోట యజమాని, నాటక సూత్రధారి ఇద్దరూ వైకాపా నాయకులే
- ఓ రైతు ర్యాంపునకు తెస్తున్న పండ్లనూ లాక్కున్న వైకాపా కార్యకర్తలు
- తోపులాటలో కార్యకర్త గాయపడితే లాఠీఛార్జే కారణమని జగన్ ఆరోపణ
- ఎస్పీ మణికంఠతో వాగ్వాదం
- బంగారుపాళ్యంలో నాటకాన్ని రక్తి కట్టించిన వైకాపా అధినేత


చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జగన్ పర్యటనకు వచ్చే ముందు మామిడికాయలను ట్రాక్టర్లతో రోడ్డుపై పడేసి తొక్కించుకుంటూ వెళుతున్న వైకాపా శ్రేణులు

ఈనాడు, చిత్తూరు: జగన్ ఇంటి నుంచి అడుగు బయటపెడితే చాలు జరిగేదంతా జగన్నాటకమే. ముందస్తు ప్రణాళిక ప్రకారం అంతా నడిపిస్తారు. ఏదో జరిగిపోతోందంటూ ప్రజల్ని భ్రమింపచేసేలా పక్కా పథకాన్ని రచించి దాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తూ నాటకాన్ని రక్తి కట్టిస్తారు. పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో తన కారు కింద సొంత పార్టీ కార్యకర్త సింగయ్య పడినా దయ లేకుండా ముందుకెళ్లి తమ నాటకాన్ని ప్రదర్శించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో బుధవారం రైతులను పరామర్శించేందుకంటూ చేసిన పర్యటనలోనూ అదే నటన. ఒకవైపు మామిడి రైతులు కష్టాలు పడుతున్నారని చెబుతూనే మరోవైపు తన పార్టీ నాయకులతో అవే మామిడికాయలను ట్రాక్టర్లతో నడిరోడ్డుపై పోయించి తొక్కించారు. ముందుగానే కొంత మందిని సిద్ధం చేసి ఈ తతంగాన్ని నడిపించారు. తిరుపతి గ్రామీణ మండలం లింగేశ్వర్‌నగర్‌కు చెందిన వైకాపా యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శశిధర్ రెడ్డి.. జగన్ కాన్వాయ్ ముందు తోపులాటలో కింద పడగా పోలీసులే లాఠీఛార్జి చేశారని ఆరోపించారు. చిత్తూరు ఎస్పీ మణికంఠతో జగన్ వాగ్వాదానికి దిగారు. మా పార్టీ

(మిగతా 3లో)



మీరు పోలీసులా? రాక్షసులా?

- విచ్చలవిడిగా లాఠీఛార్జ్ చేస్తారా?
- మీకూ సమస్యలుంటాయి.. ఎవరికి సమస్య వచ్చినా పలికేది నేనే
- డీఐజీ, ఎస్పీ, లంచాలు తీసుకునే సీఐల మాటలు పోలీసులు వినొద్దు
- వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యలు
- పంటను కొనుగోలు చేసి ప్రభుత్వమే అమ్ముకోవాలని డిమాండ్

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి మార్కెట్ యార్డు వద్ద మీడియాతో మాట్లాడుతున్న వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి

13లో

అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం కలెక్టర్లకు

జిల్లా రిజిస్ట్రార్ విచారణ నివేదిక మేరకు చర్యలు

వెంటనే అమల్లోకి వచ్చేలా నోటిఫికేషన్ జారీ

ఈనాడు, అమరావతి: ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే.. వాటిని రద్దుచేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీకి దఖలు పరుస్తూ కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. 2023 మార్చిలో చట్టసభల ద్వారా ఆమోదం పొందిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడంతో జారీచేసిన ఈ నోటిఫికేషన్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చిందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయలక్ష్మి వెల్లడించారు. సివిల్ కోర్టులకు మినహా అక్రమ ఆస్తుల రిజిస్ట్రేషన్లు రద్దుచేసే అధికారం ప్రస్తుతం ఎవరికీ లేదు. దీనివల్ల ఫోర్జరీ డాక్యుమెంట్లు, ఇతర అక్రమ పద్ధతుల్లో ఆస్తుల విక్రయాల

(మిగతా 3లో)



కొండంత భక్త జనం.. కొంగుబంగారానికి ప్రదక్షిణం

సింహాచలంలో వైభవంగా గిరి ప్రదక్షిణ

2లో


సింహాచలం సమీపంలోని అడవివరం వద్ద పుష్ప రథం వెంట భక్తజన సందోహం. పుష్ప రథంలో సింహాచలం అప్పన్న విగ్రహం (అంతర చిత్రం)



పాఠశాలకు బాటేసిన ఉపాధ్యాయుడికి కలెక్టర్ ప్రశంస


ఉపాధ్యాయుడు సీతారామరాజుకు చెక్కు అందజేస్తున్న కలెక్టరు షాన్‌మోహన్

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పాఠశాలకు ఇబ్బందులు లేకుండా విద్యార్థులు రాకపోకలు సాగించేలా పంట కాలువపై సొంత సొమ్ముతో కాలిబాట వంతెన నిర్మించిన కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారు సూరంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజును కాకినాడ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ అభినందించారు. లక్ష చెక్కును అందజేశారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో డీఈవో రమేష్‌తో కలిసి కలెక్టరును సీతారామరాజు కలిశారు. పాఠశాలకు వంతెన నిర్మాణం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడడంతోపాటు గుణాత్మక విద్యను అందించాలని ఆయనకు సూచించారు. కలెక్టర్ అందించిన సొమ్ముతో పాఠశాల భవనానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తానని సీతారామరాజు తెలిపారు.

మహిళలను కించపరచడం... వైకాపా నాయకులకు అలవాటే

ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టిన పురందేశ్వరి

ఈనాడు, అమరావతి: మహిళలను కించపరచడం వైకాపా నాయకులకు అలవాటుగా మారిందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె తప్పుబట్టారు. ప్రశాంతిరెడ్డికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మహిళల పట్ల వైకాపా విద్వేషం... మరోసారి బయటపడింది

ప్రశాంతిరెడ్డికి సంఘీభావం తెలిపిన భువనేశ్వరి

ఈనాడు, అమరావతి: మహిళల వ్యక్తిత్వ హననం చేసేలా వైకాపా నాయకులు తరచూ చేస్తున్న అత్యంత అవమానకర, అభ్యంతరకర వ్యాఖ్యలు... సమాజంపై వారి అభిప్రాయాలు ఏమిటో తెలుపుతోందని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి ధ్వజమెత్తారు. ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన మురికి వ్యాఖ్యల్ని ఎక్స్ వేదికగా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ కఠిన సమయంలో ఆమెకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

కొండంత భక్త జనం.. కొంగుబంగారానికి ప్రదక్షిణం

● సింహాచలంలో వైభవంగా గిరి ప్రదక్షిణ

సింహాచలం, న్యూస్‌టుడే: విశాఖలోని సింహాచల క్షేత్రంలో సింహగిరి ప్రదక్షిణ మహోత్సవం బుధవారం వైభవోపేతంగా జరిగింది. ఏటా ఆషాఢ పౌర్ణమి ముందు చతుర్దశి నాడు భక్తులు సింహాచలం గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సింహగిరి దిగువన తొలిపావంచా నుంచి కొండ చుట్టూ 32 కి.మీ. మేర ప్రదక్షిణను సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. సింహాద్రి అప్పన్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి పుష్ప రథాన్ని ప్రారంభించడంతో పాదయాత్ర ప్రారంభమైంది. విశాఖ, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ వేడుకలో పాల్గొన్నారు. భక్తజనుల గోవింద నామస్మరణ, మంగళవాద్యాలు, జానపద కళారూపాల మధ్య అప్పన్నస్వామి పుష్ప రథం తొలిపావంచా నుంచి ఉత్సాహంగా కదలగా.. భక్తజన సందోహం అనుసరించింది. దేవస్థానం ఈఓ త్రినాథరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు గోడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు రథంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు యాత్రలో పాల్గొన్నారు. దారి పొడవునా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, అల్పాహారం అందజేశాయి.

★ ప్రదక్షిణ మహోత్సవం సందర్భంగా ట్రాఫిక్, భక్తుల నియంత్రణలో యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ప్రణాళిక లేకుండా ట్రాఫిక్ మళ్లించడంతో వాహన రద్దీ ఏర్పడింది. ఈ ప్రభావం నగరంపై పడింది. తొలిపావంచా వద్ద పలుసార్లు భక్తుల తోపులాటలు చోటుచేసుకున్నాయి.


పుష్ప రథాన్ని ప్రారంభిస్తున్న పూసపాటి అశోక్ గజపతిరాజు. చిత్రంలో ఎంపీలు శ్రీభరత్, అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, తదితరులు


హనుమంతువాక కూడలి వద్ద గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై ఉచిత వెబినార్

ఈఏపీసెట్- 2025 (గతంలో ఎంసెట్) కౌన్సెలింగుకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఈనాడు - 'చదువు', గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (GGU)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న (ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్ జూమ్ ప్లాట్‌ఫామ్‌పై జరగనుంది.

అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సంబంధిత నిపుణులు దీనిలో పాల్గొంటారు. ఈఏపీసెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ కీలక అంశాలు, వెబ్ ఆప్షన్ మెలకువలు, బ్రాంచి, కళాశాల ఎంపికలో జాగ్రత్తలు, బ్రాంచీలవారీగా కెరియర్ అవకాశాలు తదితర అంశాలపై నిపుణులు సూచనలు, సలహాలు అందిస్తారు.

ఇంజినీరింగ్ కౌన్సెలింగుకు హాజరవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతోపాటు కౌన్సెలింగుపై అవగాహన పెంపొందించుకోవాలనుకునే ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే..

13-07-2025 (ఆదివారం) నాడు..

● క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లేదా

https://bit.ly/apengwebinar వెబ్ లింకు ఓపెన్ చేయండి (లేదా)
zoom id- 917 6881 2223
Passcode- 478741తో జాయిన్ కావచ్చు.

నమ్మకం నిలబెడతా.. గౌరవం పెంచేలా పనిచేస్తా

● బాధ్యతల స్వీకరణ వేళ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో ప్రతి కార్యకర్త, తానే అధ్యక్షుడిని అయ్యానన్నంత ఉత్సాహంతో నన్ను ఆశీర్వదిస్తున్నారు. అందరి ఆలోచనలు, సలహాలతో ముందుకెళ్తా. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటా' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'అందరూ ఏకగ్రీవంగా ఆశీర్వదించి భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవితో గౌరవించారు. ఈ గౌరవాన్ని రెట్టింపు చేసేలా పనిచేస్తా. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆవిర్భావ దినోత్సవం రోజు బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉంది. దేశంలోనే రాష్ట్రాన్ని నంబర్ 1గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తా. విజయవాడలోని లెనిన్ సెంటర్‌కు తెలుగుభాష వైభవాన్ని చాటిచెప్పిన విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలి' అని పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర పూర్వ అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. కార్యకర్తలతో మమేకమయ్యే మాధవ్ అధ్యక్ష బాధ్యతలు సంపూర్ణంగా నిర్వహిస్తారనే నమ్మకం ఉందన్నారు. అంతకుముందు మాధవ్ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి భాజపా కార్యాలయం వరకు ర్యాలీగా ప్రదర్శనగా వెళ్లారు. కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, లెనిన్ సెంటర్‌లో విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎన్.ఈశ్వరరావు, 20 సూత్రాల అమలు కార్యక్రమ ఛైర్మన్ లంకా దినకర్, పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు సాదినేని యామిని శర్మ తదితరులు పాల్గొన్నారు.

★ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను, మంత్రి నారా లోకేశ్‌ను మాధవ్ బుధవారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు.


భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పీవీఎన్ మాధవ్‌ను ఆశీర్వదిస్తున్న ఎంపీ పురందేశ్వరి. చిత్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు ★ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లతో మాధవ్

గిన్నిస్ బుక్ రికార్డు దిశగా.. నేటి తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం

శ్రీసత్యసాయి జిల్లాలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మరో రికార్డు సాధనకు రంగం సిద్ధమైంది. ఒకే రోజు రెండు కోట్ల మందితో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని (మెగా పీటీఎం-2.0) ప్రభుత్వం నిర్వహించనుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు... అందరినీ ఒక చోటకు తీసుకొస్తోంది. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆలోచనతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించనున్న కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హాజరు కానున్నారు. 74,96,228 మంది విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు మెగా పీటీఎం-2.0 లో పాల్గొననున్నారు. మొత్తం 2.28 కోట్ల మంది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిర్వహించే ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డు సాధించనుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లుల పేరుతో మొక్కలు నాటనున్నారు. మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టులు ఇవ్వనున్నారు.



శ్రమను నమ్ముకుంటే చాలు.. విజయం మీదే

ఈ ప్రపంచం మేధావులది కాదు. అదృష్టవంతులది కూడా కాదు. బలవంతులది అంతకంటే కాదు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా స్థిరంగా పనిచేసుకుంటూ ముందుకెళ్లేవారే ఈ పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలుస్తారు. అందుకే భద్రమైన భవిష్యత్తు కావాలంటే శ్రమను నమ్ముకోండి. కష్టం ఎప్పుడూ మిమ్మల్ని మోసం చేయదు.

– హామిల్టన్ లిండ్లీ, లాయర్

ఆత్మీయ సమావేశాల్లో భాగస్వాములు కావాలి: లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ-ప్రైవేటు విద్యాసంస్థల్లో నిర్వహించనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల్లో అందరూ భాగస్వాములు కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. "ఆత్మీయ సమావేశాల ఆవశ్యకతపై నేను రాసిన వ్యాసం ఈనాడు పత్రికలో బుధవారం ప్రచురితమైంది. సమాజ భాగస్వామ్యంతోనే విద్య-వికాసం సాధ్యం. స్వర్ణాంధ్ర-2047 కల సాకారం. బడి వైపు ఓ అడుగు వేసి.. విద్యార్థుల భవితకు బాటలు వేయండి" అని లోకేశ్ కోరారు. ఈనాడు.నెట్ లింక్‌ను పోస్టుకు జత చేశారు.

విశాఖ సంస్థకు శ్రీశైలం ప్లంజ్‌పూల్ అధ్యయన బాధ్యతలు

ఈనాడు, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టులో ఏప్రాన్ దిగువన స్టీల్ సిలిండర్ల పరిస్థితి ఏంటి? ప్లంజ్‌పూల్ ఎలా ఉంది.. తదితర అంశాలను నీటి లోపల నుంచి వీడియో, ఫొటోలు తీసి అధ్యయనం చేసే బాధ్యతలను విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్‌కు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ర్యాటిఫై చేసింది.

హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలుకు రూ.273 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 20 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు నిమిత్తం మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం రూ.273.17 కోట్లు మంజూరు చేసింది. ఇందులో పొగాకు కొనుగోలుకు రూ.240 కోట్లు, ఖర్చులకు రూ.33.17 కోట్లు కేటాయించింది. అడ్వాన్సుగా రూ.100 కోట్లు విడుదల చేసింది.

జనసేనలోకి వైకాపా జడ్పీటీసీ సభ్యులు

ఆహ్వానించిన పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నలుగురు వైకాపా జడ్పీటీసీ సభ్యులు బుధవారం జనసేనలో చేరారు. జనసేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో చింతలపూడి జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, అత్తిలి జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, పెరవలి జడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రజనీలు ఉన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైకాపాలో తాము అనేక అవమానాలు ఎదుర్కొన్నామని, జనసేన సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ పనితీరు నచ్చి ఈ పార్టీలో చేరినట్లు నలుగురు జడ్పీటీసీ సభ్యులు వెల్లడించారు.

★ పవన్ కల్యాణ్ సమక్షంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు (విజయవాడ), వైశ్యసత్ర సముదాయం అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు (కనిగిరి), శ్రీకాశీ అన్నపూర్ణ చౌల్ట్రీస్ అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస్ (నంద్యాల) జనసేనలో చేరారు.


జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన దేవకి వెంకటేశ్వర్లు, భవనాశి శ్రీనివాస్, పెనుగొండ సుబ్బారాయుడు

ప్రాంతీయ వ్యాపార వాతావరణ ర్యాంకుల్లో ఏపీకి నాలుగో స్థానం

ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తూ ఒక్కో మెట్టు ఎదుగుతోంది. ప్రఖ్యాత ఎకనమిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలోని ఎకనమిక్ ఇంటెలిజెన్స్ విభాగం భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ వ్యాపార వాతావరణానికి ప్రకటించిన ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ 6.9 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచింది. కర్ణాటక, దిల్లీలు కూడా ఇవే మార్కులతో నాలుగో స్థానంలో ఉన్నాయి. తొలి మూడు స్థానాల్లో తమిళనాడు (7.4), గుజరాత్ (7.3), మహారాష్ట్ర (7.1)లు నిలిచాయి. 2025-29 మధ్య రాష్ట్రాల్లో ఉండబోయే వాణిజ్యపరమైన వాతావరణాన్ని అంచనా వేసి ఈ సంస్థ దేశంలోని 15 పెద్ద రాష్ట్రాల పనితీరుకు 1-10 మార్కులు ప్రకటించింది. అందులో 6.8 మార్కులతో తెలంగాణ ఏడో స్థానంలో నిలిచింది. ఈ ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులను సమీక్షించి, విశ్లేషిస్తుంది. దీని ప్రధాన కార్యాలయాలు లండన్, న్యూయార్క్, హాంకాంగ్, దుబాయ్‌లలో ఉన్నాయి. ఈ సంస్థ చేసే ఆర్థిక, రాజకీయ, వ్యాపార విశ్లేషణలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఇప్పుడు ఈ సంస్థ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆర్థిక, రాజకీయ, మౌలికవసతులు, నియంత్రణ సూచీలు, దేశ, విదేశీ పెట్టుబడుల పరిస్థితులను ఆధారంగా చేసుకొని 2025-29 మధ్యకాలంలో రాష్ట్రాల్లో ఉండబోయే పరిస్థితులను విశ్లేషించి ఈ ర్యాంకులు ప్రకటించింది. ఇందులో తెలంగాణ తర్వాతి స్థానంలో హరియాణా (6.5), కేరళ (6.2), ఉత్తర్‌ప్రదేశ్ (6), రాజస్థాన్ (5.8), పంజాబ్ (5.8), మధ్యప్రదేశ్ (5.6), పశ్చిమబెంగాల్ (5.1), బిహార్ (4.6)లు ఉన్నాయి. ఈ ర్యాంకుల పట్ల తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని టాప్ ఎచీవర్ స్టేట్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో సాగుతున్న రాష్ట్రప్రభుత్వ సత్తాకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న మౌలిక వసతులతో తూర్పు ప్రాంతానికి గేట్‌వేగా మారుతోందని పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

10-7-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
పూర్ణిమ: రా. 1-47 తదుపరి బహుళపక్ష పాడ్యమి
పూర్వాషాఢ: పూర్తి
వర్జ్యం: మ. 3-19 నుంచి 5-01 వరకు
అమృత ఘడియలు: రా. 1-30 నుంచి 3-12 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-55 నుంచి 10-46 తిరిగి మ. 3-07 నుంచి 3-59 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.35; సూర్యాస్తమయం: సా.6.35
వ్యాస పూర్ణిమ, గురు పూర్ణిమ

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	39.3	29.4
తిరుపతి	39.2	28.0
రాజమహేంద్రవరం	38.5	25.5
నరసాపురం	37.8	26.0
విజయవాడ	37.1	26.6
విశాఖపట్నం	37.0	27.0
విజయనగరం	37.0	27.0
కడప	37.0	27.0
ఒంగోలు	36.5	24.6
తాడేపల్లిగూడెం	35.6	27.4
గుంటూరు	35.0	28.0
కర్నూలు	34.3	25.2
శ్రీకాకుళం	34.0	27.0
అనంతపురం	34.0	25.2
హైదరాబాద్	31.8	23.4
కరీంనగర్	31.0	23.0

వెంకటగిరి చేనేత కళాకారుడికి సంత్ కబీర్ అవార్డు

వెంకటగిరి, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన చేనేత కళాకారుడు, డిజైనర్ లక్కా శ్రీనివాసులు సంత్ కబీర్ అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకోనున్నారు. శ్రీనివాసులు తండ్రి చిన్నయ్య నుంచి చేనేత కళ నేర్చుకున్నారు. ఆర్టిస్ట్ కావడంతో తొలి నుంచి డిజైన్ చేసి చేనేత మగ్గంపై నేసేవారు. గతంలో పట్టుచీరపై జరీతో భగవద్గీతలోని 5 శ్లోకాలు నేసి బెంగళూరు ఇస్కాన్‌కు అందించారు. గోకుల బృందావనంలో రాధాకృష్ణులు, చెలికత్తెలు, చిలుకలు, వానరం, జింక, బాతు వంటివి నేయడంతో 2013లో జాతీయ చేనేత అవార్డు అందుకున్నారు. 'లక్ష్మీవృక్షం' నేసినందుకు ప్రస్తుతం సంత్ కబీర్ అవార్డుకు ఎంపికయ్యారు.


శ్రీనివాసులు


పట్టుచీరపై నేసిన భగవద్గీత శ్లోకాలు


మగ్గంపై నేసిన లక్ష్మీవృక్షం

నేతన్నకు కీర్తి.. నేటితరానికి స్ఫూర్తి!

● ఇక్కత్ డిజైన్‌లో ప్రతిభ
● జాతీయ అవార్డుకు ఎంపికైన సత్తెనపల్లి వాసి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళి చదివింది ఆరో తరగతే అయినా.. ఆయనలోని వారసత్వ చేనేత ప్రతిభ జాతీయ అవార్డు వరకూ తీసుకెళ్లింది. తండ్రి నుంచి నేర్చుకున్న చేనేత ఇక్కత్ డిజైన్ కళ భవిష్యత్తు తరాలకూ అందాలని చేస్తున్న కృషికి ఎనలేని గుర్తింపు లభించింది. నాలుగున్నర దశాబ్దాలుగా చేనేత డిజైన్లపై పని చేస్తున్న మురళి.. అమరావతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్నారు. ఈ కృషికి గుర్తింపుగానే 'జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డు'కు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 19 మందికి అవార్డులు ప్రకటించగా.. రాష్ట్రం నుంచి ఆ ఘనత మురళికి దక్కింది. ఆగస్టు 7న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. మురళి.. తన తండ్రి సాంబయ్య నుంచి బాల్యంలోనే చేనేత కళా నైపుణ్యాన్ని నేర్చుకున్నారు. ఎన్నో ఒడుదొడుకులు ఎదురైనా మగ్గం, రాట్నం వదల్లేదు. అందరూ మెచ్చేలా డిజైన్లను రూపొందించారు. 30 ఏళ్లుగా ఇక్కత్ డిజైన్‌లో చేనేత వస్త్రాలు నేస్తున్నారు. ఆయనలోని నైపుణ్యాన్ని ప్రభుత్వాలు గుర్తించి విద్యార్హతతో సంబంధం లేకుండా శిక్షకుడిగా ఎంపిక చేశాయి. 2016 నుంచి చేనేత సేవా కేంద్రం ద్వారా కార్మికులకు శిక్షణ ఇస్తున్నారు. ఎన్ఐడీలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.



అమరావతిలోని ఎన్ఐడీలో ఇక్కత్ డిజైన్‌పై విద్యార్థికి శిక్షణ ఇస్తున్న కర్నాటి మురళి

మీ పనితీరు ఆశించినట్లు లేదు

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డుపై మామిడికాయలు పోయించి.. గొడవ చేశారు: మామిడి కొనుగోళ్లు పూర్తవుతున్న తరుణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రజల్ని రెచ్చగొట్టాలనే జగన్ చిత్తూరు జిల్లాకు వెళ్లి దౌర్జన్యానికి దిగారని చంద్రబాబు ధ్వజమెత్తారు. "తోతాపురి మామిడిని చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా కొనుగోలు చేయించాం. రైతులకు కిలోకి రూ.4 చొప్పున సాయం అందజేశాం. కొనుగోళ్లు 80% పూర్తయ్యాక... ఇప్పుడు జగన్ బంగారుపాళ్యం వెళ్లి హడావుడి చేశారు. వైకాపాకు చెందిన రైతు పొలం నుంచి మామిడికాయలు తెప్పించి ఆయనే రోడ్డుపై పోయించారు. ఆయనే వాటిని చూపిస్తూ, గోల చేశారు. పరిమిత సంఖ్యలో జనాన్ని తీసుకెళ్లాలని పోలీసులు చెబితే భారీగా జనసమీకరణ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, అనుమతి లేకుండా రోడ్‌షో చేశారు" అని సీఎం మండిపడ్డారు.

బాండ్లలో పెట్టుబడి పెట్టొద్దని తప్పుడు మెయిళ్లు: రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా పలు దేశ, విదేశీ కంపెనీలకు వైకాపా కుట్రపూరితంగా ఈమెయిల్స్ పంపడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. వైకాపా చేస్తున్న ఈ కుట్రలపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. ఈ అంశాన్ని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఏపీఎండీసీ బాండ్లలో పెట్టుబడులు పెట్టొద్దని ఏకంగా 200 దేశ, విదేశీ కంపెనీలకు వైకాపా తమ పార్టీ సానుభూతిపరుడితో తప్పుడు మెయిళ్లు పంపించిందని ఆధారాలతో ఆయన వివరించారు. తెర వెనక కుట్రలతో రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకోవడం, ప్రభుత్వం పథకాలు అమలుచేయట్లేదని దుష్ప్రచారం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇలాంటి విషయాల్ని మంత్రులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం సూచించారు.



ఇది తీవ్ర నేరమని, రాజద్రోహం స్థాయి చట్టం కింద కేసులు పెట్టాలని తెలిపారు.

గంజాయి, డ్రగ్స్‌తో సంబంధముంటే ఆస్తులు స్వాధీనం: గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంపై మంత్రివర్గ సమావేశంలో గంటకుపైగా చర్చ జరిగింది. "గంజాయి సాగు, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. గంజాయిని పట్టుకోవడంతోనే అయిపోదు. బాధ్యుల్ని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదుచేసి, ఆస్తుల్ని సీజ్ చేయాలి. మనం అంత సీరియస్‌గా పనిచేయకపోతే, గంజాయి దందా నియంత్రణలోకి రాదు" అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో గతంలో గంజాయి సాగు ఏ స్థాయిలో ఉండేది, కూటమి అధికారంలోకి వచ్చాక ఎలా నియంత్రించిందన్న విషయాన్ని మంత్రివర్గానికి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వివరించారు. మన రాష్ట్రంలో గంజాయి సాగు దాదాపుగా నియంత్రించామని, ఒడిశా నుంచి రాష్ట్రానికి వస్తోందని తెలిపారు. దాన్ని నియంత్రించేందుకు అన్ని మార్గాలనూ పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పలురకాల డ్రగ్స్ వివిధ రూపాల్లో వస్తోందని, దానిపైనా సీరియస్‌గా దృష్టిపెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. వాటిని కేంద్ర మాదకద్రవ్యాల చట్టం కింద నియంత్రించడమంటే చాలా సమయం పట్టొచ్చని, వాటిని రాష్ట్ర డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం పరిధిలోకి తెస్తే మనమే చర్యలు తీసుకోవచ్చని మంత్రి మనోహర్ సూచించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ముసాయిదా బిల్లు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. విద్యార్థుల వసతిగృహాల్లో ఆహార, నీటి కల్తీని నియంత్రించాలని, వర్షాకాలంలో అతిసారం వంటివి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

రాజధానికి మలివిడత సమీకరణపై రైతులకు వివరించండి: రాజధాని మలివిడత భూసమీకరణపై ఆ ప్రాంతంలోని కొందరు రైతుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని మంత్రి మనోహర్ ప్రస్తావించినట్లు తెలిసింది. పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుంటూ... తనను కలసిన కొందరు రైతులు కూడా దానిపై అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. రాజధానిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే క్రమంలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ వంటివాటి ఏర్పాటుకు మలివిడత భూసమీకరణకు వెళుతున్నామని, దానివల్ల రైతులకు చేకూరే ప్రయోజనాన్ని వారికి అర్థమయ్యేలా మంత్రులు వివరించి చెప్పాలని సీఎం పేర్కొన్నారు.

నిత్యావసరాల ధరల్ని నియంత్రించాం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో నిత్యావసరాల ధరల్ని గణనీయంగా నియంత్రించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దీనిపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం బాగా పనిచేసిందని కితాబిచ్చారు.

వైకాపా వాళ్లే రైతుల్ని రెచ్చగొడుతున్నారు

నెల్లూరు జిల్లా కరేడులో సౌరవిద్యుత్ ప్యానళ్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములు ఇవ్వవద్దని వైకాపా నాయకులే రైతుల్ని రెచ్చగొడుతున్నారని, మరోపక్క కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి పరిశ్రమలు రావట్లేదంటూ వాళ్లే సాక్షి పత్రికలో దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. రైతుల సమస్యలు వినేందుకు, పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి రావాలంటే పరిశ్రమలు అవసరమన్నారు. మంత్రులు చొరవ తీసుకుని రైతుల్లో అవగాహన కల్పించాలని, వైకాపా కుట్రల్ని తిప్పికొట్టాలని సూచించారు.

అంతా జగ'న్నాటకమే'

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్త తల పగలకొట్టే హక్కు నీకెవరు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనికి పోలీసులే ప్రథమ చికిత్స చేయించినా ఆ విషయం చెప్పకుండా అసత్య ప్రచారానికి దిగారు.

మార్కెట్‌కు తీసుకొస్తుంటే లాక్కుని.. వైకాపా జెండాలు కట్టి..

బంగారుపాళ్యం మండలం కొత్తపల్లె గ్రామంలోని హెలిప్యాడ్ నుంచి జగన్ బయలుదేరి తిమ్మోజుపల్లి సమీపానికి వచ్చిన తర్వాత ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, వైకాపా నేత ప్రకాష్‌రెడ్డి తోట నుంచి అకస్మాత్తుగా ఐదు ట్రాక్టర్లు (ఏపీ 03 ఏఏ- 0218, ఏపీ 20 యూ 9212, ఏపీ 03 ఎమ్ 018, ఏపీ 03 ఎస్ 8542, ఏపీ 03 టీబీ 5532) జగన్ కాన్వాయ్ ముందుకు వచ్చాయి. వస్తూనే ట్రక్కు ఎత్తి కాయలను చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై పోశాయి. ఇందులో రెండు ట్రాక్టర్లను ఈచనేరిపల్లికి చెందిన దుర్వాసులు అనే రైతు నుంచి బలవంతంగా లాక్కున్నారు. గ్రామం నుంచి అమ్ముకోవడానికి తిమ్మోజుపల్లిలోని ర్యాంపునకు తీసుకొస్తుండగా వైకాపా జెండాలు కట్టి తోటలోకి తీసుకెళ్లారు. వైకాపాకే చెందిన మరో నాయకుడి మూడు ట్రాక్టర్లలోని మామిడిని వాటికి జత కలిపి రోడ్డుపై పోసుకుంటూ వెళ్లారు. జగన్ కారు వాటిని తొక్కుకుంటూనే వెళ్లింది. స్థానిక కార్యకర్తలు ఆయనకు ఓ పండును ఇచ్చి.. గిట్టుబాటు లేక రైతులు ఇలా పంటను నేలపాలు చేసుకుంటున్నారని మొసలి కన్నీరు పెట్టుకున్నారు.



రూట్ మ్యాప్ ఉల్లంఘించారని చెబుతున్న ఎస్పీ మణికంఠపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జగన్



వసీం ట్రేడర్స్ దుకాణంలో వైకాపా కార్యకర్తల కాళ్ల కింద నలిగిపోతున్న మామిడి కాయలు



తోపులాటలో కాలు విరిగిన సుబ్రహ్మణ్యం అనే కార్యకర్త

కర్షకులు లేరు.. కార్యకర్తలే

- మామిడి రైతులను పరామర్శిస్తానని వారితో ఒక్క మాటా మాట్లాడని జగన్
- మండీకి తీసుకొచ్చిన కాయలను తొక్కిన వైకాపా కార్యకర్తలు
- కష్టాలు తెలుసుకుంటామంటూ కార్యకర్తలతో దండయాత్ర

ఈనాడు, చిత్తూరు: జగన్ బంగారుపాళ్యం పర్యటన.. పేరుకే రైతులకు పరామర్శ. కానీ ఒక్క రైతుతో కూడా మాట్లాడలేదు. ముందస్తు స్క్రిప్ట్ ప్రకారం కార్యకర్తలే చుట్టూ ఉండేలా చూసుకున్నారు. పైగా అన్నదాతలపై అపారమైన ప్రేమ ఉన్నట్లు పర్యటన ఆసాంతం హావభావాలు ప్రదర్శించారు. ఆయన హెలికాప్టర్ దిగినప్పటి నుంచి బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వచ్చే వరకూ వైకాపా శ్రేణులు తప్ప ఒక్క రైతూ ఆయన వెంట లేరు.

బుధవారం ఉదయం వైకాపా అధినేత దండయాత్రగా వచ్చి.. వ్యాపారానికి నష్టం కలిగిస్తారని భావించిన మండీల యజమానులు మధ్యాహ్నం వరకు తెరవలేదు. నాలుగు దుకాణాల్లో మాత్రమే కార్యకలాపాలు జరిగాయి. 22వ నంబరు దుకాణంలోని వసీం ట్రేడర్స్ దగ్గరకు జగన్ వచ్చి రైతులు, వ్యాపారులతో మాట్లాడేలా వైకాపా నేతలు ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం ఆ దుకాణాన్ని తెరిపించారు. సీజన్ చివరికి చేరుకోవడంతో అక్కడ తోతాపురి బదులు టేబుల్ వెరైటీలు ఉన్నాయి. అక్కడికి వెళితే పరువు పోతుందని గ్రహించిన జగన్.. తన కారు ఆగిన 25వ దుకాణం వద్దే విలేకర్లతో మాట్లాడి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. వైకాపా కార్యకర్తలు అక్కడికే ఒక సంచిలో మామిడికాయలు తీసుకొచ్చి. . ఆ తర్వాత వాటిని కిందపడేసి వెళ్లారు. వసీం ట్రేడర్స్ మండీలో వైకాపా నేతలు, కార్యకర్తలు మామిడిని తొక్కుకుంటూ పోవడంతో వ్యాపారులకు దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. జగన్ పర్యటన నేపథ్యంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డు, ర్యాంపుల వద్ద రూ. కోటి విలువ చేసే మామిడికాయల వ్యాపారం స్తంభించిపోయి రైతులు, వ్యాపారులు ఇబ్బందిపడ్డారు.

రప్పా రప్పా నరికేస్తాం

బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు ప్రతిరోజూ 500 మంది రైతులు, వ్యాపారులు వస్తుంటారు. జగన్ పర్యటనకు పోలీసులు అంతే సంఖ్యలో అనుమతి ఇచ్చారు. దీనికి భిన్నంగా దాదాపు 6వేల మంది అక్కడికి వచ్చారు. ఉద్రిక్తతలు తలెత్తవచ్చని ఊహించిన పోలీసులు తెరిచిన గేటు నుంచి కార్యకర్తలను లోపలికి పంపారు. వారు మార్కెట్ ప్రాంగణం అంతా 'జై జగన్.. సీఎం జగన్'.. 'రప్పా రప్పా నరికేస్తాం' అని నినదించారు.

ఈటీవీ, టీవీ5 వాళ్లు ఉన్నారా?

జగన్ దండయాత్రగా మార్కెట్ యార్డుకు చేరుకోగానే అక్కడున్న వైకాపా మూకలు కొందరు ఈటీవీ, టీవీ5 ఛానల్ ప్రతినిధుల గురించి వాకబు చేశారు. వాళ్లు కెమెరాలు పట్టుకుని ఉంటారు చూడండి అంటూ మాట్లాడటం లైవ్‌లో రికార్డయింది.


'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైకాపా గూండాల దాడి

జగన్ పర్యటనలో వైకాపా గూండాలు రెచ్చిపోయారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులోని వసీం ట్రేడర్స్ మండీలో వైకాపా కార్యకర్తలు మామిడికాయలు తొక్కేయడాన్ని ఫొటో తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అనుచరుడు ప్రకాష్ ఆచారి గమనించారు. 'నువ్వు ఎవరు? ఇక్కడ ఎందుకు ఫొటోలు తీస్తున్నావు' అని ప్రశ్నించారు. తాను ఫొటోగ్రాఫర్‌నని చెబుతుండగానే తలపై చేత్తో గట్టిగా కొట్టారు. అతను తప్పించుకునే ప్రయత్నం చేయగా మిగతా కార్యకర్తలు చుట్టుముట్టి, పిడిగుద్దుల వర్షం కురిపించారు. అక్కడే ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఇతను మన వాడు కాదని సైగ చేయడంతో వారు మరింతగా తమ ప్రతాపాన్ని చూపారు. అతని కెమెరా లాక్కుని మెమొరీ కార్డు తీసుకున్నారు. ఇదంతా చూస్తే మీడియా ప్రతినిధులపై దాడి చేయాలనేది వారి ముందస్తు వ్యూహంగానే కనిపిస్తోంది. జగన్ విలేకర్ల సమావేశం ముగించుకుని వెళుతుండగా కొందరు కార్యకర్తలు ఆయనను చుట్టుముట్టి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. దాంతో ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుడి చేయి కార్యకర్తలకు అందకుండా పెట్టుకోగా వెనకున్న కార్యకర్తలు ఆ చేతిని పట్టుకుని లాగారు. దీంతో జగన్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఒకరిపై చేయి చేసుకున్నారు. మరో యువకుణ్ని మెడ పట్టుకుని లాగేశారు. జగన్ పర్యటనలో నిబంధనల ఉల్లంఘన, కుట్రపూరితంగా మామిడికాయలు కింద పోసి తొక్కించడం, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి సంబంధించి పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు.



చిత్తూరు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేస్తున్న వైకాపా మూకలు

ఏడాది కష్టం నేలపాలు: దుర్వాసులు, రైతు



10 టన్నుల మామిడిని బలవంతంగా వైకాపా నాయకులు లాక్కున్నారు. మామిడి రైతులను పరామర్శించేందుకు వచ్చిన జగన్‌కు ఈ అరాచకం పట్టదా? ఏడాదిగా కష్టపడిన పంటను ఇలా వృథా చేసేస్తారా? జగన్, ఆ పార్టీ నేతల మూలంగా నాకు రూ.90 వేలు నష్టం వచ్చింది. ప్రభుత్వం ఇచ్చే సాయం కూడా అందలేదు. ఇప్పుడు నాకెవరు న్యాయం చేస్తారు?

అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం కలెక్టర్లకు

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లకు అడ్డుపడడం లేదు. ఈ నేపథ్యంలో అక్రమ ఆస్తుల రిజిస్ట్రేషన్ల నిరోధానికి జాతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908ను సవరించిన (ఏపీ యాక్ట్ ఎమెండ్‌మెంట్-2023) బిల్లుకు 2023 మార్చి 20న శాసనసభ ఆమోదం తెలిపింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. దీని అమలు ఉత్తర్వులు ఇప్పుడు వెలువడ్డాయి.

కమిటీ పరిశీలన

రిజిస్ట్రేషన్లు అక్రమ పద్ధతుల్లో జరిగినట్లు ఫిర్యాదులు అందగానే జిల్లా రిజిస్ట్రార్ వాటిని పరిశీలిస్తారు. ఆధారాల ప్రాతిపదికన కలెక్టర్ నేతృత్వంలో ఏర్పడే కమిటీకి సిఫార్సు చేస్తారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా రిజిస్ట్రార్, ఇతర అధికారులు ఉంటారు. నిషిద్ధ జాబితా నుంచి విడిపించిన 13 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ (ఎసైన్డ్) భూముల్లో 25వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో అక్రమాలు జరిగినవి 7వేల ఎకరాల వరకు ఉన్నాయి. తాజా ఉత్తర్వులతో ఇలాంటి రిజిస్ట్రేషన్లను రద్దుచేయడం సులువవుతుంది.

సబ్-రిజిస్ట్రార్లకు మూడేళ్ల జైలు

నిషిద్ధ జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు చేసినా, ఒకే ఆస్తికి రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేసినా, కోర్టు ఎటాచ్‌మెంట్‌లో ఉన్నవాటికి రిజిస్ట్రేషన్లు చేసినా.. అలాంటి సబ్-రిజిస్ట్రార్లకు మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. ఈ మేరకు సవరించిన చట్టంలో పేర్కొన్నారు. విధినిర్వహణలో సబ్-రిజిస్ట్రార్ వ్యవహరించిన తీరు వల్ల క్రయ, విక్రయదారులకు నష్టం వాటిల్లినట్లు రుజువైతే ఏడేళ్ల వరకు జైలుశిక్ష విధించవచ్చని ఇప్పటికే అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ చట్టంలో పేర్కొన్నారు.

బ్రాండెడ్ కంపెనీలతో ఒప్పందాలపై స్టాంప్‌డ్యూటీ వసూలు

బ్రాండెడ్ కంపెనీలతో వ్యాపారం చేసేందుకు కంపెనీలు లేదా వ్యక్తులు చేసుకునే ఒప్పందాల (ఫ్రాంఛైజ్) విలువ అనుసరించి స్టాంపుడ్యూటీ వసూలు అమలు నోటిఫికేషన్‌ను రెవెన్యూ శాఖ బుధవారం జారీచేసింది. ఈ నోటిఫికేషన్ అనుసరించి తీసుకునే చర్యలు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో రెవెన్యూశాఖ పేర్కొంది. ఒప్పంద కాలపరిమితి ఏడాది వరకు ఉంటే రూ.1,000, పదేళ్లలోపు ఉంటే ఏడాదికి రూ.1,000 చొప్పున స్టాంపుడ్యూటీ చెల్లించాలి. పదేళ్లు దాటితే రూ.25,000 వరకు స్టాంపుడ్యూటీ వసూలుచేస్తారు.

మురికి వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నపై కేసు నమోదు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన మురికి వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన వైకాపా సమావేశంలో నల్లపరెడ్డి ప్రసన్న ఇష్టారాజ్యంగా మాట్లాడడంపై మహిళలు మంగళవారం పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. భారీఎత్తున ప్రదర్శన నిర్వహించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దిల్లీలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న వివిధ సంఘాలకు చెందిన కార్మికులు



విజయవాడలో ఐక్యత చాటుతున్న వివిధ సంఘాల నాయకులు

దేశవ్యాప్త సమ్మె పాక్షికం

- భారీగా పాల్గొన్న కార్మిక సంఘాలు
- నిత్యావసరాలకు కలగని ఇబ్బంది
- యథావిధిగా ప్రజా రవాణా

దిల్లీ: నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణ చర్యల్ని వ్యతిరేకిస్తూ 10 కార్మిక సంఘాలకు చెందిన దాదాపు 25 కోట్ల మంది ఉద్యోగులు, కార్మికులు బుధవారం దేశవ్యాప్త సమ్మెకు దిగారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ), ఎన్ఎండీసీ లిమిటెడ్, ఖనిజ, ఉక్కు కంపెనీల ఉద్యోగ సంఘాలు, బ్యాంకులు, బీమా కంపెనీలతో సంబంధం ఉన్న సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగ సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. సమ్మెలో పాల్గొన్న 10 సంఘాల్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ ఉన్నాయి. యునైటెడ్ కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంస్థలూ సమ్మెకు మద్దతిచ్చాయి. అయితే సమ్మె కారణంగా నిత్యావసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. ప్రజా రవాణాకూ పెద్దగా అంతరాయం కలగలేదు. కేరళ, ఝార్ఖండ్, పుదుచ్చేరిలలో కొన్ని సేవలకు అంతరాయం కలిగింది. పశ్చిమ బెంగాల్‌లో సమ్మె తీవ్రత ఎక్కువగా ఉంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. బస్సు డ్రైవర్లు హెల్మెట్లు పెట్టుకొని విధులు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య కొన్నిచోట్ల ఘర్షణలు జరిగాయి. బెంగాల్, ఒడిశాల్లో ఆందోళనకారులు రైల్వే స్టేషన్లలోకి ప్రవేశించి, పట్టాలపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కొన్నిచోట్ల జాతీయ రహదారులను దిగ్బంధించారు.

4 కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతి, ప్రైవేటీకరణను విరమించుకోవాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఉండాలని, పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించాలని, ఈపీఎఫ్‌వో చందాదారులకు రూ.9,000 కనీస పింఛను చెల్లించాలని, పంటలకు కనీస మద్దతు ధరలు కల్పించాలని, వ్యవసాయ రుణ మాఫీ చేయాలని యూనియన్లు డిమాండు చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం, పంజాబ్, కేరళ, ఝార్ఖండ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, గోవా, మేఘాలయ, మణిపుర్, బిహార్‌లలో సమ్మె బాగా ప్రభావం చూపిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తెలిపారు. రాజస్థాన్, హరియాణా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కొన్ని ప్రాంతాల్లో సమ్మె జరిగిందని నివేదికలు వచ్చాయని వివరించారు.

విజయవాడలో గళం విప్పిన కార్మికలోకం

ఈనాడు-అమరావతి, విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా విజయవాడలో కార్మికులు కదం తొక్కారు. ఎర్ర జెండాలు చేతపట్టి వన్‌టౌన్ రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. లెనిన్ కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఈ సమ్మె ప్రారంభం మాత్రమే అని, రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద యుద్ధం చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్మికుల హక్కులకు విఘాతం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, ఇఫ్ట్యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్, వైఎస్ఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

పని గంటలు పెరిగినా.. వారానికి గరిష్ఠ పరిమితి 48 గంటలే

మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి

ఈనాడు, అమరావతి: కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్మిక, కర్మాగారాల చట్టాల సవరణలతో కర్మాగారాల నిర్వహణలో సౌలభ్యం, కార్మికుల హక్కులు, ఆరోగ్యం, భద్రత, ఆదాయ భద్రత మరింత పెరుగుతాయని స్పష్టంచేశారు. వారానికి 48గంటల గరిష్ఠ పని పరిమితి, అదనపు సమయం సహా 60 గంటల పరిమితి యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ''రోజువారీ గరిష్ఠ పని గంటలు 9 నుంచి 10కి పెంచినా వారానికి 48గంటలు యథావిధిగా ఉంటాయి. విశ్రాంతి విరామం ఆరు గంటల తర్వాత 30 నిమిషాలు ఉంటుంది. ఓవర్‌టైం పరిమితి త్రైమాసికానికి 50/75 గంటల నుంచి 144 గంటలకు పెంపు ఉంటుంది. దీనికి రెట్టింపు వేతనం వర్తిస్తుంది'' అని సుభాష్ తెలిపారు.

రాజధానిలో పరిపాలన నగరం సరిహద్దులు నోటిఫై చేస్తూ గెజిట్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో 1,575 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న పరిపాలన నగరం సరిహద్దులు, జోనింగ్ నిబంధనలు, పట్టణ రూపకల్పన మార్గదర్శకాలను నోటిఫై చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవి తాజాగా వెలుగులోకి వచ్చాయి. బృహత్తర ప్రణాళికను ప్రభుత్వం ఇప్పటికే రూపొందించింది. తాజాగా దాన్నీ ఈ నోటిఫికేషన్‌కు జతచేసింది. జోనింగ్ నిబంధనలు, పట్టణ రూపకల్పన మార్గదర్శకాలను సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో ఉంచింది.


ఈనాడు

ప్రజాశ్రేయస్సుకు ప్రకృతి సేద్యం

దిగుబడులు దండిగా రావాలంటే రసాయన ఎరువులను ఇబ్బడిముబ్బడిగా వాడాలి, పురుగుమందులను విరివిగా పిచికారీ చేయాలనే భావన చాలామంది రైతుల్లో బాగా నాటుకుపోయింది. అలా వాళ్లందరూ కలిసి గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ పంట భూముల్లో 6.5 కోట్ల టన్నుల కృత్రిమ ఎరువులను గుమ్మరించినట్లు అంచనా. అవిగాక కీటకనాశనులను 68వేల టన్నుల వరకు చల్లారు. గతితప్పిన ఇటువంటి సేద్య విధానాల మూలంగా నేలతోపాటు ప్రజారోగ్యమూ తీవ్రంగా దెబ్బతింటోంది. పెట్టుబడి తడిసి మోపెడై సేద్యం భారంకావడమే కాదు- పంట భూములు నిస్సారమవుతుండటంతో జాతి ఆహార భద్రతే ప్రమాదంలో పడుతోంది. ఈ దారుణావస్థను తప్పించేందుకు దేశీయంగా కోటి మంది రైతులను ప్రకృతి సేద్యంవైపు మళ్లించాలన్న లక్ష్యంతో కేంద్రం నిరుడు ఒక పథకాన్ని తెచ్చింది. పర్యావరణ హితకర వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేయిస్తూ, రాయితీలనూ అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సత్సంకల్పానికి రాష్ట్రాల చొరవ తోడైతేనే ప్రకృతి సేద్యం విస్తృతమవుతుంది. రసాయనాల ఉద్ధృతిలో కొట్టుకుపోతున్న వ్యవసాయానికి జీవకళ అద్దుతూ, ఆరోగ్యకర సమాజానికి బాటలుపరుస్తూ, అంతిమంగా వికసిత భారతావని ఆవిష్కరణకు అది తోడ్పడుతుంది!

నిపుణుల అభిప్రాయం ప్రకారం- ఎకరా జొన్నకు 96 కిలోలకు మించి యూరియా వాడకూడదు. అధిక ఫలసాయం ఆశించి ఏపీలో కొన్నిచోట్ల నాలుగొందల నుంచి ఎనిమిదొందల కేజీల వరకు యూరియాను వెదజల్లుతుండటం కలవరపరుస్తోంది. పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర తదితర చోట్ల ఎన్‌పీకే ఎరువులు, చీడపీడ మందుల వినియోగం మరీ కట్టుతప్పుతోంది. దీనివల్ల భూసారాన్ని పెంచడంలో ప్రధాన పాత్ర పోషించే సేంద్రియ కర్బనం తెగ్గోసుకుపోతోంది. ప్రమాణాల ప్రకారం అది నేలలో 0.75 నుంచి మూడు శాతం దాకా ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల 0.5శాతం కన్నా తక్కువకే పరిమితమవుతోంది. దాంతో పంటల్లో పోషకాలు లోపిస్తున్నాయి. వాటి స్థానంలో ప్రమాదకర రసాయన అవశేషాలు పెద్దమొత్తంలో పోగుపడి జన భారతం అల్జీమర్స్, క్యాన్సర్లు వంటి జబ్బుల పాలవుతోంది. సేంద్రియ సేద్యం లాభదాయకం కాదన్న దురభిప్రాయం రైతులోకంలో ప్రచారమవుతోంది. కానీ, ఈ విధానంలో పంటల దిగుబడి 41శాతం, సాగుదారుల ఆదాయం 49శాతం మేర పెరుగుతున్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడైంది. పైగా ఇప్పుడు సహజ సిద్ధ ఉత్పతులకు గిరాకీ పెరుగుతోంది. కాబట్టి సుస్థిర సాగువైపు రైతులను నడిపించడంలో అన్ని రాష్ట్రాలూ పోటీపడాలి!

అధికారిక లెక్కల ప్రకారం- ప్రకృతి సేద్యాన్ని చేపట్టేందుకు దేశవ్యాప్తంగా ఇంతవరకు ఎనిమిది లక్షల మంది చిన్నరైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. జీరో బడ్జెట్ వ్యవసాయానికి ఊతమిచ్చేందుకు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ వంటివి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. మిగిలిన రాష్ట్రాలు ఇలాంటి మేలిమి పద్ధతులను పరిశీలించి అవసరాన్నిబట్టి అమలుచేయవచ్చు. సమాజానికి శ్రేయస్కరమైన సాగు విధానాలకు మద్దతు లభించాలంటే- వ్యవసాయ వర్సిటీలు, డిగ్రీ కోర్సుల్లో దాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి. సహజ మార్గాల్లో భూసారం పెంపు, జీవ ఎరువులూ బయో పెస్టిసైడ్స్ తయారీ, వినియోగంపై రైతుల్లో అవగాహన పెంచాలి. వాటిని తక్కువ ధరకు అందజేసే కేంద్రాలను విరివిగా నెలకొల్పాలి. సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ, మార్కెటింగ్ వసతుల విస్తరణపైనా ప్రభుత్వాలు దృష్టి సారించాలి. అప్పుడే పెద్దసంఖ్యలో సాగుదారులు ప్రకృతి సేద్యానికి సంసిద్ధులవుతారు!




ఉపాధ్యాయుడు ఒక సబ్జెక్టును బోధిస్తున్నాడంటే ముందు దాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించాలి. అప్పుడే పిల్లలకు ఆసక్తి కలిగేలా చెప్పగలుగుతాడు. సులభమైన పద్ధతులు చెబుతూ ఉత్తీర్ణత మీద దృష్టి పెట్టేవారు వృత్తికి న్యాయం చేయలేరు.

– కె.సి.నాగ్, గణితశాస్త్ర నిపుణులు

ఎవరు గురువు?

పుట్టినరోజు అంటే అందరికీ చాలా ప్రియమైనది. ఆ రోజు పుట్టారు కాబట్టి సంతోషంగా, పండుగలా జరుపుకొంటారు, జరుపుకోవాలి. మరి జ్ఞానం పుట్టినరోజు ఎప్పుడు? జ్ఞానం లేకపోతే జీవితం లేదు. అంత గొప్పదైన జ్ఞానం ఎప్పుడు పుట్టింది? దాని రూపం ఏంటి? ఆ రూపమే గురువు.

'గు' అంటే అంధకారం. 'రు' అంటే తొలగించడం. గురువు అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ఇస్తాడు. ఆ గురువు ఆషాఢ పౌర్ణమినాడు జన్మించాడు. దాన్ని అందరు గురువులకు పుట్టినరోజుగా చెబుతారు. ఆ రోజు వ్యాస పౌర్ణమి కూడా. ఎవరి గురువును వాళ్లు పూజించి, సత్కరించుకున్నా.. గురు పరంపరలో ఆది గురువును పూజించడం మన కర్తవ్యం. వేదాలను బోధించిన వేదవ్యాసుణ్ని మొదటి గురువుగా చెబుతారు. లోకానికి ఆయన జ్ఞానభిక్షను ప్రసాదించారు. ఇతిహాస, పురాణాలు, ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాల్లో గురువును గౌరవించి పూజించేవారు. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. పరమ గురువైన శివుడు, పార్వతీదేవిల మధ్య దివ్యమైన సంభాషణలు జరిగాయి. గురుగీత అనే ఈ సంభాషణ మూలంగా గురువు ప్రాముఖ్యం లోకానికి తెలిసి వచ్చింది.



అంతర్యామి

గురువు మాత్రమే నిజమైన జ్ఞానాన్ని ప్రసాదించగలడని; ఆయనే భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక మార్గదర్శకుడని వివరిస్తోంది గురుగీత. గురువును దైవంగా భావించాలి. ఆయన నుంచి పొందిన జ్ఞానం ఆధారంగా జీవితాన్ని మలచుకోవాలి. ఏ పని చేసినా సత్యం, ధర్మం, నీతి, నిజాయతీలతో చేయాలి. అయితే, గురువును తెలుసుకోవడం అంత సులువైన పని కాదు. 'గురుకృపాహి కేవలం..' అనే ఒకే ఒక్క మార్గం ద్వారా ఆయనను నిజంగా తెలుసుకుంటామని గురునానక్ తెలియజేశారు. గురువు కన్నా అధికమైనవాడు లేరని ఆదిశంకరుడు చెప్పారు. గురువు మధ్యలో విశ్వం ఉంది. విశ్వం మధ్యలో గురువున్నాడని కృతయుగ దత్తాత్రేయస్వామి బోధించాడు. గురువు పాత్ర కేవలం బోధించడం కాదు, అజ్ఞానంలో నిద్రపోతున్న మనిషిని మేల్కొల్పాలి. ఓషో చెప్పినట్లు- సత్య స్వరూపాన్ని పూర్ణంగా చూపించి, ఎరుక కలిగించి మన నిద్రను వదిలించేవాడే నిజమైన గురువు. 'గురువు మానవరూపంలోనే ఉండనక్కర్లేదు. నీ భావాన్ని బట్టి ఎవరినైనా గురువుగా భావించి సాధన కొనసాగించవచ్చు' అని సూచిస్తారు రమణ మహర్షి. మనం చేసే, చేస్తున్న తప్పులను మించిన గురువులు ఉండరు. నిరంతరం నేర్చుకోవాలి. తప్పులు దిద్దుకోవాలి. ముందుకు సాగిపోవాలి.

ఎవరి సమక్షంలో మనకు అనూహ్యమైన ప్రశాంతత కలుగుతుందో, మన మనసు భయరహితంగా మారి విశ్రాంతి పొందుతుందో ఆ వ్యక్తే మన గురువు. ఈ విశ్వం దైవలీల. ఈ లీలా రహస్యాన్ని చక్కగా వివరించి చూపించేవాడే నా గురువు అంటాడు భక్త రామదాసు. 'మీ జ్ఞానంతో ఎల్లప్పుడూ నన్ను ముందుకు నడిపిస్తున్నందుకు ధన్యవాదాలు గురువర్యా... మీ మార్గదర్శకత్వం, మద్దతు ఎల్లప్పుడు ఉత్తమంగా కృషి చేయడానికి నన్ను ప్రేరేపించాలి' అని ఈ గురుపౌర్ణమి వేళ వేడుకుందాం.

– ఆనందసాయి స్వామి

భాజపా వ్యూహాత్మక అడుగులు...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి నేటి నవ్యాంధ్ర వరకు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ప్రస్థానం ఎన్నో ఎత్తుపల్లాలు చూసింది. 2024 ఎన్నికల తరవాత రాష్ట్రంలో ఆ పార్టీ వేస్తున్న ప్రతి అడుగులోనూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు రాబట్టగల స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. తాజాగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ నియామకం ద్వారా సంస్థాగత నిర్మాణంపై భాజపా దృష్టి సారించింది.

ఆంధ్రప్రదేశ్‌లో భాజపా రాజకీయ బలాన్నీ, దాని ముందున్న సవాళ్లనూ అర్థం చేసుకోవాలంటే- కూటమితో ఉన్నప్పుడు, ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఆ పార్టీకి లభించిన ఓట్ల శాతాలను విశ్లేషించడం ముఖ్యం. రాష్ట్ర విభజనకు ముందు, 1983 శాసనసభ ఎన్నికల్లో భాజపా తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో కాషాయపార్టీ 2.76శాతం ఓట్లతో మూడు స్థానాలు గెలుచుకుంది. తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్న 1999 ఎలక్షన్లలో భాజపా పనితీరు గణనీయంగా మెరుగుపడింది. నాడు 12 శాసనసభ స్థానాలు(3.67% ఓట్లు), ఏడు లోక్‌సభ స్థానాలు(9.91% ఓట్లు) సాధించి రికార్డు సృష్టించింది. కానీ, ఆ తరవాత దాని రాజకీయ గ్రాఫ్ క్రమంగా



తగ్గుముఖం పట్టింది. రాష్ట్ర విభజన అనంతరం, 2014 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వీచిన మోదీ ప్రభంజనం, తెదేపా, జనసేనలతో పొత్తు భాజపాకు బాగా కలిసొచ్చింది. అప్పుడు నాలుగు శాసనసభ స్థానాలు(2.2% ఓట్లు), రెండు లోక్‌సభ స్థానాలు(7.22% ఓట్లు) గెలుచుకుని రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యింది.

పాఠం నేర్పిన ఓటమి

2019 ఎన్నికలు భాజపాకి అత్యంత గడ్డు కాలాన్ని మిగిల్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించే విషయంలో తలెత్తిన విభేదాలతో తెదేపా దూరం కావడంతో ఒంటరిగా పోటీ చేసిన భాజపా ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఒక్క శాసనసభ స్థానాన్ని కూడా గెలవలేకపోగా, కేవలం 0.84శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన 173 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. లోక్‌సభ స్థానాల్లోనూ ఖాతా తెరవలేకపోయింది. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కలిపి 0.98 శాతం ఓట్లే తెచ్చుకోగలిగింది. ఈ ఫలితంతో- ఆంధ్రప్రదేశ్‌లో భాజపా రాజకీయ మనుగడకు మిత్రపక్షాల మద్దతు ఎంత కీలకమో స్పష్టంగా తెలియవచ్చింది.

దాంతో, 2024 ఎన్నికలకు వచ్చేసరికి భాజపా అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె, చంద్రబాబు నాయుడి వదిన అయిన దగ్గుబాటి పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా నియమించింది. తద్వారా తెదేపాతో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు అనువైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించింది. అంతర్గతంగా ఆమె అనుసరించిన వ్యూహాత్మక సమన్వయం- పార్టీలోని భిన్న వర్గాల విధేయతలను తిరిగి భాజపా వైపు మళ్లించడానికి దోహదపడింది. తెదేపా-జనసేనల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటు చర్చల్లో పురందేశ్వరి వ్యవహారశైలి కీలక పాత్ర పోషించింది. ఈ వ్యూహాత్మక ఎత్తుగడల ఫలితంగా 'కూటమి' భాగస్వామ్యంతో 2024 ఎన్నికల్లో భాజపా అద్భుతమైన పునరాగమనం చేసింది. ఎనిమిది శాసనసభ స్థానాలు గెలుచుకుంది. అలాగే, ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీచేసి మూడింటిని కైవసం చేసుకుంది. శాసనసభ స్థానాల్లో 2.83శాతం, లోక్‌సభ స్థానాల్లో 11.28శాతం ఓట్లు సాధించింది.

సైద్ధాంతిక క్షేత్రంలో పోటీ

ప్రస్తుతం భాజపా ఒకేసారి రెండు లక్ష్యాలతో ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. స్వల్పకాలిక మనుగడ కోసం కూటమిలో కొనసాగుతూనే, దీర్ఘకాలంలో సొంతంగా బలపడటానికి పునాదులు వేసుకుంటోంది. ఇందులో భాగంగానే, లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికైన పురందేశ్వరి స్థానంలో- ఎలాంటి ఆర్భాటాలూ లేని, సంస్థాగత నిర్మాణంపై మంచి పట్టున్న పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడయ్యేలా అధిష్ఠానం పావులు కదిపింది. ఆయన తప్ప మరెవరూ అధ్యక్ష స్థానం కోసం తలపడలేదు. ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తగా, మాజీ ఎమ్మెల్సీగా, ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన దివంగత చలపతిరావు కుమారుడిగా మాధవ్‌కు బలమైన నేపథ్యమే ఉంది. ఆయన నిబద్ధత, నిరాడంబర వ్యక్తిత్వం సంస్థాగత నిర్మాణంలో పార్టీకి కలిసి వస్తాయని అధిష్ఠానం విశ్వసిస్తోంది. అయితే, కొత్త అధ్యక్షుడి ముందున్న మార్గం అంత సులభమైనదేమీ కాదు. భాజపా జాతీయ అజెండాలోని 'వికాస్ (అభివృద్ధి)' నినాదాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సీఈవో ఇమేజ్‌తో సొంతం చేసుకున్నారు. రాజధాని అమరావతి వంటి బృహత్ ప్రాజెక్టులతో ఆయన అభివృద్ధి ఎజెండాను నడిపిస్తున్నారు. మరోవైపు, హిందూత్వ సైద్ధాంతిక క్షేత్రంలో- ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 'సనాతన ధర్మ పరిరక్షకుడి'గా తనను తాను నిలబెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితులు రాష్ట్రంలో భాజపాను ఒక రకంగా నిష్క్రియాత్మక పాత్రలోకి నెడుతున్నాయి. కూటమిలోని బలమైన భాగస్వామి అయిన తెదేపాను ఇబ్బంది పెట్టకుండా, తన సొంత అజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్లలేని స్థితిలో ఆ పార్టీ ఉంది. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కాషాయ పార్టీకి ప్రత్యేక గుర్తింపునిచ్చే ప్రధాన సైద్ధాంతిక అంశాలను, ఏపీలో దాని మిత్రపక్షాలే బలంగా ఆక్రమించాయి.

నెమ్మదిగా విస్తరించడానికి...

భాజపా వ్యూహం 'సైద్ధాంతిక పరిచయం' (ఐడియలాజికల్ ఫెమిలరైజేషన్) అనే సహనంతో కూడిన పంథాలో సాగుతున్నట్లే కనిపిస్తోంది. అధికార కూటమిలో భాగస్వామిగా ఉంటూనే రాష్ట్రంలో తన ఉనికిని క్రమంగా విస్తరించుకుంటోంది. విశాఖపట్నంలో జరిగిన యోగా దినోత్సవం వంటి కార్యక్రమాలను- పార్టీ సాంస్కృతిక జాతీయవాదాన్ని తెలుగు ప్రజల చైతన్యంలోకి నెమ్మదిగా చొప్పించడానికి చేస్తున్న 'సాఫ్ట్ పవర్' ఎత్తుగడలుగా చూడవచ్చు. భాజపా అధిష్ఠానం తన మిత్రపక్షాలను ముందుంచి, తక్షణ ఆధిపత్యం కంటే క్రమమైన ప్రజామోదం, సంస్థాగత విస్తరణపైనే దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. పాపులర్, మాస్‌లీడర్ కంటే... మాధవ్ వంటి పూర్తిస్థాయి సంస్థాగత నాయకుడే క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణానికి మరింత సమర్థంగా పనిచేయగలరనే అధిష్ఠానం నమ్మకం వెనక అంతరార్థమిదే!

– పెద్దాడ నవీన్, సీనియర్ పాత్రికేయులు



మనం... మనుషులం!

ట్రాఫిక్ జామ్ వల్ల రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం ఆలస్యమైంది. పరిగెత్తుకెళ్లి చివరి నిమిషంలో బోగీలోకి దూకాను. నా బెర్త్ వెతుక్కుని, దాహంతో రొప్పుతూ సీట్లో కూలబడ్డాను. ఏసీ బోగీ కావడంతో కాసేపటికి స్థిమితపడ్డాను.

ఒకప్పుడు రైలు ప్రయాణం అంటే, కిటికీ పక్కన కూర్చుని చల్లగాలినీ, వానచినుకుల్నీ ఆస్వాదించడం; వెనక్కి పోయే చెట్లూ, రైలుతో పాటే వచ్చే చందమామని ఆశ్చర్యంగా చూడటం; కిటికీలో నుంచి కనపడే వారందరికీ టాటాలు చెప్పటం... ఎంత సంబరంగా ఉండేది! టీ కాఫీలు, పేపర్లు, పల్లీలు, పండ్లు అమ్మేవాళ్లతో బోగీ ఇంకెంత సందడిగా ఉండేది! ముఖపరిచయం లేకపోయినా తోటి ప్రయాణికులతో ఆప్యాయంగా ముచ్చట్లు పెట్టి, టిఫిన్లు పంచుకుని, వంటలనుంచి రాజకీయాల దాకా కబుర్లెన్నో చెప్పుకొని గమ్యం చేరేసరికి మంచి స్నేహితులైపోవడం చాలామందికి అనుభవమే. ఎన్ని గంటల ప్రయాణం చేసినా అసలు బడలిక తెలిసేది కాదు.

అదంతా గుర్తు చేసుకుంటూ చుట్టూ చూశాను. ఎవరి లోకంలో వాళ్లున్నారు. పలకరిద్దామన్నా తలెత్తి చూసేవారేరీ? చెవిలో ఇయర్ పాడ్స్ పెట్టుకుని ఫోను మాట్లాడేది కొందరైతే, ఇంకొందరు గేమ్స్ ఆడుతున్నారు, సినిమాలు చూసేవాళ్లు, పాటలు వినేవాళ్లు, ల్యాప్‌టాప్‌లో ఆఫీసు పనులు చక్కబెట్టేవారు... అందరూ యమా బిజీగా ఉన్నారు. పక్కనెవరున్నారో కూడా ఎవరికీ పట్టడం లేదు. చేస్తున్న పనులు ఆపకుండానే ఆర్డర్ పెట్టిన ఫుడ్ తిన్నారు. మరి కాసేపటికి ముసుగులు తన్నేశారు. అదే ఒకప్పుడైతే బెర్త్ నంబర్లతో సంబంధం లేకుండా పెద్దవాళ్లూ పిల్లలూ ఉంటే వాళ్లకి కింది బెర్తులు ఇచ్చేసి మిగిలినవాళ్లు పై బెర్తుల్లో సర్దుకోవడం, ఒకవేళ ఎవరైనా ఇవ్వకపోతే బతిమాలి సర్దుబాటు చేసుకోవడం, బాత్‌రూమ్‌కి వెళ్తే వాళ్ల లగేజీ చూస్తూ ఉండమని చెప్పడం, పిల్లల్ని పట్టుకోవడం... ఏమీ లేదు. ఎవరి తిప్పలు వాళ్లవే, ఎవరి ప్రపంచం వాళ్లదే. ఈ పరిస్థితి చూస్తుంటే ఒకవేళ ఎవరికైనా సాయం చేయబోతే... వీడు మామూలు మనిషేనా అని అనుమానంగా చూసేలా ఉన్నారు. చేసేదేముంది, నేనూ నా బెర్త్‌మీద పడుకుని నిద్రపోయాను. రైలు ఎక్కినప్పుడు ఎలా ఉన్నారో, దిగేటప్పుడు కూడా అలాగే తలెత్తి చూడకుండా ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. తీసుకెళ్లడానికి మీకోసం ఎవరొచ్చారు, ఇంత పొద్దున్నే ఆటోలు దొరుకుతాయా... లాంటి ప్రశ్నల్లేవు, ఫోను నంబర్లు ఇచ్చిపుచ్చుకోవడాలు, వెళ్లొస్తామని చెప్పుకోవడాలు... ఏమీలేవు. పరిచయమైతే కదా అవన్నీ.

చేరుకోవాల్సిన గమ్యం ఎంత ముఖ్యమో ప్రయాణమూ అంతే ముఖ్యం. భిన్న వర్గాలకు, వృత్తులకు సంబంధించిన కొత్త వ్యక్తులు పరిచయమయ్యేది ఇలాంటి ప్రయాణాల్లోనే. ఆ అవకాశాన్ని ఉపయోగించుకోకుండా ఫోను తెరల్లో ఇరుక్కుపోతే సంఘజీవి అన్న మాటకి అర్హుడేనా మనిషి? రైల్లోనో బస్సులోనో ఊరెళ్లడమే కాదు, జీవితమూ ఒక ప్రయాణమే. కొద్దిగంటల రైలు ప్రయాణాన్నే ఆస్వాదించలేని మనం ఇక జీవిత ప్రయాణాన్ని ఏమాత్రం ఆస్వాదిస్తున్నట్లు? నిజ జీవిత పరిచయాలనూ స్నేహాలనూ పెంచుకోకుండా ఇరవై నాలుగ్గంటలూ వర్చువల్ లోకంలో మునిగితేలితే మనకీ యంత్రాలకీ తేడా ఏముంటుంది?

– పొలిశెట్టి



కోరలుచాస్తున్న మలేరియా

ప్రపంచవ్యాప్తంగా మలేరియా కేసులను 2030 నాటికి 90 శాతం మేర తగ్గించాలని సంబంధిత వ్యూహాత్మక ప్రణాళిక పిలుపిచ్చింది. కానీ, 2023లో విశ్వవ్యాప్తంగా 26.3 కోట్ల మలేరియా కేసులు వెలుగు చూశాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి కోటికి పైగా ఎక్కువ. నిర్దేశిత తగ్గింపు లక్ష్యానికన్నా 2023లో మలేరియా కేసులు మూడు రెట్లు ఎక్కువగా నమోదయ్యాయి. పైగా ఇటీవలి కాలంలో అవి మరింతగా పెరుగుతుండటం ఆందోళన రేపుతోంది. 2000-2023 మధ్య కాలంలో ప్రతి వెయ్యి మంది జనాభాకు మలేరియా కేసులు...

2000	79
2015	58
2020	59.1
2021	58.6
2022	58.6
2023	60.4

(ఆధారం: డబ్ల్యూహెచ్‌వో వరల్డ్ హెల్త్ స్టాటిస్టిక్స్-2025)

సుస్థిరాభివృద్ధికి మత్స్య సాంకేతికతలు

పల్లెటూరి నుంచి పట్టణాల వరకు అందరికీ అందుబాటులో ఉండేవి, మాంసాహారంలో చౌకగా లభించేవి మంచినీటి చేపలు మాత్రమే. ప్రపంచ చేపల ఉత్పత్తిలో దాదాపు ఎనిమిది శాతం వాటాతో మన దేశం రెండో స్థానంలో ఉంది. గడచిన కొన్ని దశాబ్దాలలో మత్స్య రంగంలో ఇండియా గణనీయమైన ప్రగతి సాధించింది. విధాన సంస్కరణలకు నూతన సాంకేతికతలు తోడుకావడంతోనే ఇది సాధ్యమైంది. నేడు జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా...

గతంలో నీటి వనరుల్లో చేపల పెంపకంకోసం విత్తనాన్ని నదుల నుంచి సేకరించుకునేవారు. అది అంత స్వచ్ఛంగా ఉండేది కాదు. ఫలితంగా చేపల ఉత్పత్తి ఆశించిన స్థాయిలో వచ్చేది కాదు. 1957, జులై 10న ఒడిశాలోని కటక్ పరిశోధన కేంద్రంలో డాక్టర్ కె.హెచ్. అలికున్ని, డాక్టర్ హెచ్.హీరాలాల్ చౌదరి అనే శాస్త్రవేత్తలు కార్ప్ చేపలలో పునరుత్పత్తిని ప్రేరేపించడానికి కృత్రిమంగా హార్మోన్ ఇంజెక్షన్ (హైపోఫిసేషన్) అనే సాంకేతికతను ప్రవేశపెట్టి విజయం సాధించారు. ఇది ఇన్‌ల్యాండ్ ఆక్వాకల్చర్‌లో విప్లవానికి దారితీసింది. భారత మత్స్య రంగానికి ఆ శాస్త్రవేత్తలు అందించిన సేవలను స్మరించుకోవడానికి ఏటా జులై 10న జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

రైతులకు అండగా...

దేశీయంగా 1980-81లో దాదాపు 24.42 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయితే, 2023-24 నాటికి ఆ పరిమాణం 184 లక్షల టన్నులకు చేరింది. ముఖ్యంగా ఇన్‌ల్యాండ్ ఆక్వాకల్చర్‌లో ఈ అభివృద్ధి ఇంకా ఎక్కువగా నమోదైంది. 1980లలో తొమ్మిది లక్షల టన్నులకు లోపే పరిమితమైన మంచినీటి చేపల ఉత్పత్తి, ఆపై నాలుగు దశాబ్దాల్లో అంతకు పదమూడు రెట్లకు పైగా పెరిగింది. మన దేశంలో ఆంధ్రప్రదేశ్ అతిపెద్ద చేపల ఉత్పత్తి కేంద్రంగా విరాజిల్లుతోంది. ఆ తరువాతి స్థానాల్లో పశ్చిమ్ బెంగాల్, గుజరాత్‌లు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలతో తెలంగాణలోనూ చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. మత్స్య రంగానికి చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవ పథకాన్ని తీసుకొచ్చింది. ఉత్పాదకతను పెంచడం, నాణ్యతను మెరుగుపరచడం, దేశీయంగా చేపల వినియోగంతోపాటు ఎగుమతులను ప్రోత్సహించడం, నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి అవకాశాలు కల్పించడం తదితరాల లక్ష్యాలతో ఈ పథకాన్ని చేపట్టింది. 2015-16లో రూ.3వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన నీలి విప్లవ పథకం- మత్స్య సంపద సమగ్ర అభివృద్ధికి తోడ్పడింది. ఈ రంగంలో సుస్థిరాభివృద్ధికోసం




2020లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనను ఆరంభించారు. రూ.20వేల కోట్ల పెట్టుబడి లక్ష్యంతో గడచిన అయిదేళ్లలో అమలైన ఈ పథకం- మత్స్య రంగంలో కీలక మార్పులకు చోదకశక్తి అయ్యింది. వ్యవస్థాపక సామర్థ్యాలూ వ్యాపార నమూనాల వృద్ధితో పాటు ఆక్వాకల్చర్‌లో నూతన ఆవిష్కరణలకు ఇది అవకాశమిచ్చింది.

మత్స్య రంగం మన దేశంలో దాదాపు 2.8 కోట్ల మందికి జీవనోపాధి కల్పిస్తోంది. పరోక్షంగా ఇంకెంతో మందికి జీవనభృతి లభిస్తోంది. చేపల రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుంది. డిజిటల్ సాధనాలు, డేటా విశ్లేషణల సాయంతో నీటి నాణ్యతను పర్యవేక్షించడం, దాణాను అవసరం మేరకు వినియోగించడం వంటివి సాధ్యపడతాయి. చేపల ఆరోగ్యాన్ని మరింత సమర్థంగా కనిపెట్టుకుని ఉండటానికీ అవి ఉపయోగపడతాయి. ఆటోమేటెడ్ ఫీడింగ్ సిస్టమ్స్, నీటి అడుగున డ్రోన్లతో పర్యవేక్షణ వంటివి ఆక్వాకల్చర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. ఈ సాంకేతికతలు ఉత్పాదకతను పెంచుతాయి. కేంద్రం నాలుగేళ్ల కిందట ఆవిష్కరించిన 'మత్స్య సేతు' మొబైల్ యాప్- ప్రధానంగా మంచినీటి ఆక్వాకల్చర్ టెక్నాలజీలపై ఆక్వా రైతులకు అవగాహన కల్పించేందుకు అక్కరకొస్తోంది. మెరుగైన నిర్వహణ పద్ధతులను అవలంబించే విధంగా రైతులకు మార్గనిర్దేశం చేస్తోంది.

వనరుల సద్వినియోగం

నూతనంగా నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులలో మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకుంటున్నాయి. మార్కెటింగ్ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాయి. మత్స్యకారులకు సహకార సంఘాలను ఏర్పాటు చేస్తూ, వాటికి తగిన ఆర్థిక సాయమూ అందిస్తున్నాయి. వీటన్నింటి ఫలితంగా మత్స్య ఉత్పత్తులలో ఏటా పెరుగుదల నమోదవుతోంది. మన దేశంలో ముఖ్యంగా తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మంచినీటి చేపల ఉత్పత్తికి అవకాశాలు ఇంకా పుష్కలంగా ఉన్నాయి. రిజర్వాయర్లు, పెద్ద చెరువుల లోతట్టు పరివాహక ప్రాంతాలలోని భూముల్లో చాలావరకు ఎప్పుడూ నీరు పట్టి చిత్తడిగా ఉండటంతో పంటల దిగుబడి ఆశించిన మేరకు రావట్లేదు. అలాగే కొన్ని భూములు జమ్ముతో నిండి నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇలాంటి వాటిని తగిన జాగ్రత్తలతో చేపల చెరువులుగా మార్చితే ఎంతో లాభదాయకంగా ఉంటుంది. దీని ద్వారా ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి. మత్స్య రంగంలో సాధించే అభివృద్ధి దేశార్థిక ప్రగతికి వెన్నుదన్ను అవుతుంది.


– డాక్టర్ లక్ష్మప్ప బోయిని
సహాయ సంచాలకులు, మత్స్య శాఖ, వనపర్తి



ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
గురువారం జులై 10, 2025

మెగా 'పీటీఎం'కు సర్వం సిద్ధం

మాచవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, సాంఘిక సంక్షేమ, కేజీబీవీ, మోడల్ కళాశాలలతో పాటు ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన కళాశాలల్లో ఈ నెల 10వ తేదీన నిర్వహించే మెగా 'పీటీఎం' (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)కు సర్వం సిద్ధం చేశామని డీఐఈవో డా.ప్రభాకరరావు తెలిపారు.



బుధవారం మాచవరం ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత నూతన విద్యా సంవత్సరంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఇంటర్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు తమ తమ తల్లిదండ్రులకు ఆహ్వానపత్రికలు అందజేశారన్నారు. హాజరైన తల్లిదండ్రులతో విద్యార్థుల ప్రగతిపై విశ్లేషణతోపాటు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, టగ్-ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తున్నారు. బహిరంగ సమావేశంలో కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, స్పాన్సర్స్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. జిల్లాలో సుమారు 70 వేల మంది ఇందులో భాగస్వాములవుతారని ఆయన వెల్లడించారు.

కలెక్టర్ లక్ష్మీశకు రెడ్ క్రాస్ పురస్కారం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెడ్ క్రాస్ సొసైటీకి కలెక్టర్ జి.లక్ష్మీశ అందిస్తున్న సేవలకు పురస్కారం లభించింది. నగరంలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సమావేశంలో, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డు అందుకున్నారు. ఆ సొసైటీకి ప్రెసిడెంట్‌గా ఉన్న కలెక్టర్.. సొసైటీ చేస్తున్న సేవలు, నిధుల సమీకరణలో విశేష ప్రతిభ చూపడంతో పాటు సామాజిక సేవకు చేసిన కృషికి ఈ అవార్డు దక్కింది. గవర్నర్ అభినందనలు తెలిపారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించే రెడ్ క్రాస్ మరింత పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అవార్డు స్వీకరణతో తనపై బాధ్యత ఇంకా పెరిగిందన్నారు. రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే పరీడా, చైర్మన్ వై.డి.రామారావు, వైస్-చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ట్రెజరర్ పి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్

స్వగృహ యోగం.. లక్ష్యానికి దూరం

చొరవ చూపితేనే శ్రావణ మాసానికి కొలిక్కి

ఈనాడు, అమరావతి

పేదల సొంతింటి గృహ ప్రవేశానికి ప్రభుత్వం శ్రావణమాసంలో ముహూర్తం పెట్టింది. లక్ష్యం ఉన్నతంగా ఉన్నా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటికి 50 శాతం కూడా పూర్తి కాలేదు. మరో 15 రోజుల్లో శ్రావణమాసం మొదలు కానుండడంతో అధికారులు ప్రణాళికతో వెళ్తేనే లక్ష్యానికి చేరువ కావచ్చు.



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు)లో చివరి దశకు నిర్మాణాలు

జిల్లా	లక్ష్యం	పూర్తి	పెండింగ్
కృష్ణా	10,007	3,618	6,389
ఎన్టీఆర్	10,820	5,294	5,526
మొత్తం	20,827	8,912	11,915

ఉమ్మడి జిల్లాలో వివరాలు..
మంజూరైన గృహాలు: 1,80,937
పూర్తి చేసినవి: 55,831
పైకప్పు పూర్తి అయినవి: 8,638
మొదలు పెట్టనివి: 56,110

42.8 శాతమేనా: గత తెదేపా పాలనలో అమలు చేసిన ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వైకాపా సర్కారు పట్టించుకోలేదు. నిర్మాణం చేపట్టిన వారికి ఐదేళ్ల పాటు పైసా ఇవ్వలేదు. కూటమి సర్కారు మాత్రం వైకాపా హయాంలో మంజూరైన నివాసాలకు చేయూతనిస్తోంది. ఉమ్మడి జిలాలో 20,827 గృహాలు పూర్తి చేసి శ్రావణమాసంలో గృహ ప్రవేశాలు చేయించాలని నిర్ణయించింది. సమయం ముంచుకొస్తున్నా రూ. 42.8 శాతం ఇళ్లు మాత్రమే అధికారులు పూర్తి చేయగలిగారు.

వైకాపా పాపమే.. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో నిర్మాణాలు పట్టాలెక్కించినా వైకాపా పాపాలతో నిర్మాణాలు ముందుకెళ్లడం లేదు. గ్రామాలు, పట్టణాలకు పదుల కిలోమీటర్ల దూరంగా కొండలు, గుట్టలు, పొలాల్లో, శ్మశానాల్లో లేఔట్లు ఏర్పాటు చేశారు. వాటిల్లో విద్యుత్తు, రహదారులు, తాగునీరు, డ్రెయిన్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో చాలా నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు లాక్కుంటామని గత ప్రభుత్వం బెదిరించడంతో కొందరు మొదలుపెట్టి వదిలేశారు. రెండు జిల్లాల్లో ఇలా పునాదుల్లో వదిలిన నిర్మాణాలు వెయ్యికి పైగా ఉన్నాయి.

చొరవచూపితే సాధ్యమే.. శ్రావణమాసంలో గృహ ప్రవేశాలకు ఇంకా ప్రభుత్వం నిర్ణీత తేదీ నిర్ణయించలేదు. జులై 25 నుంచి ఆగస్టు 22 వరకు శ్రావణమాసం ఉంటుంది. ఆగస్టు మొదటివారం వరకు నిర్మాణం చేయడానికి అవకాశం ఉంది. పైకప్పు దశ, పైకప్పు పూర్తి అయిన నిర్మాణాలు రెండు జిల్లాల్లో 8,638 ఉన్నాయి. వీటిని పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారిస్తే దాదాపు 85శాతం నిర్మాణాలు పూర్తి చేయవచ్చు. సాధ్యమైనంత వేగంగా నిర్మాణాలు పూర్తి చేస్తామని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల హౌసింగ్ పీడీలు వెంకటేశ్వరరావు, రజినీకుమారి తెలిపారు.

కృష్ణమ్మకు గోదారి తోడు

పోలవరం నుంచి గోదావరి జలాలు పట్టిసీమ ద్వారా బుధవారం ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్దకు చేరాయి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణమ్మకు సారె సమర్పించారు. - ఈనాడు, అమరావతి



హరిత నగరం... అమరావతి

రూపుదిద్దేందుకు నిర్మాణ సంస్థలతో సీఆర్డీఏ సమావేశం



నిర్మాణ సంస్థలతో చర్చిస్తున్న అదనపు కమిషనర్ నవీన్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రాజధానిని పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ చర్యలు ప్రారంభించింది. అమరావతిలోని భవనాలను గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో నిర్మించాలని నిర్ణయించింది. కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించడంతో పాటు ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచడం, సంప్రదాయ సౌర విద్యుత్తు వినియోగం, విద్యుత్తును ఆదా చేసే ఉపకరణాలు, సామగ్రి ఉపయోగించడం, నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నదే సీఆర్డీఏ ముఖ్య లక్ష్యం. గాలి, వెలుతురు వచ్చేలా నిర్మాణాలు చేపడితే.. విద్యుత్తు వినియోగం తగ్గుతుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. ఆయా అంశాలపై విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం మూడు నిర్మాణ సంస్థలతో సమావేశం నిర్వహించింది. సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ నేతృత్వం వహించారు. చెన్నైకు చెందిన ఎలా గ్రీన్ బిల్డింగ్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ కన్సల్‌టెంట్స్, ముంబయికు చెందిన ఎసన్షియల్ ఇండియా గ్రీనిడ్జ్ ఎనలటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడకు చెందిన చినోయ్ డిజైన్ సర్వీసెస్ సంస్థలు.. గ్రీన్ బిల్డింగ్ అంశంపై తయారు చేసిన ప్రాజెక్టులు, యాక్షన్ ప్లాన్‌ను వివరించాయి. అమరావతిలో ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణాలతో పాటు త్వరలో నిర్మించే హౌసింగ్ డెవలప్‌మెంట్స్‌పై ఎడ్జ్ (ఎక్సలెన్స్ ఇన్ డిజైన్ ఫర్ గ్రేటర్ ఎఫిషియన్సెస్) విధానంలో నిర్మాణాలు చేపడతామని వివరించారు. గ్రీన్ బిల్డింగ్ నిర్మాణాలతో ప్రజారోగ్యం మెరుగవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని సీఆర్డీఏ అధికారులు వెల్లడించారు.

విరుల బోణీకి.. ఆధునిక విపణి

గాంధీనగర్‌లో నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం

విజయవాడ నగరంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో ఆధునిక పూల మార్కెట్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. గాంధీనగర్ జి.ఎస్.రాజు రోడ్డులో 80 సెంట్లలో ఉన్న రైతుబజార్‌ను తొలగించి దాని స్థానంలో అన్ని సౌకర్యాలతో మోడల్ పూలమార్కెట్ కట్టబోతున్నారు. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేశారు. అధికారులు, హోల్‌సేల్ పూల వర్తక సంఘం ప్రతినిధులు కలిసి కడియం పూల మార్కెట్‌ను సందర్శించి అక్కడి మౌలిక వసతులను పరిశీలిస్తారు. దేశంలోనే అధునాతనంగా మార్కెట్‌ను నిర్మించేలా నమూనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించనున్నారు.

విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో రైల్వే స్థలంలో ఉన్న హోల్‌సేల్ పూల మార్కెట్‌ను తరలించనున్నారు. ఈ మార్కెట్‌కు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఖమ్మం నుంచి కూడా పెద్దఎత్తున పూల వ్యాపారులొచ్చి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. చాలాకాలంగా ప్రతిపాదనలు ఉన్నా ఈ మార్కెట్‌ను ఎక్కడికి తరలించాలనే విషయంలో స్పష్టత లేక అలాగే కొనసాగిస్తున్నారు. రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా దీనిని తరలించాలని కొంతకాలంగా జిల్లా యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలోనే గాంధీనగర్‌కు తరలించాలని నిర్ణయించారు.

90శాతం దుకాణాలు వర్తక సంఘానికే.. మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తుంది. అక్కడ దుకాణాల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని హోల్‌సేల్ పూలమార్కెట్ వర్తక సంఘమే పెట్టుకునేలా ఒప్పందం చేసుకోనున్నారు. అనంతరం 90శాతం దుకాణాలను సంఘం సభ్యులకు మాత్రమే కేటాయిస్తారు. మిగిలిన 10 శాతం దుకాణాలు ప్రభుత్వ నిర్వహణలో ఉంటాయి. స్థలాన్ని అద్దె ప్రాతిపదికన కేటాయిస్తారు. ప్రతి మూడేళ్లకు 10 శాతం చొప్పున లీజును పెంచనున్నారు.



రవాణాకు అనుకూలం.. జి.ఎస్.రాజు రోడ్డులో నిర్మించే మోడల్ పూలమార్కెట్‌కు అన్ని ప్రాంతాల నుంచి తేలికగా చేరుకునేలా రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉంది. 2023లో ఇక్కడ రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. సమీపంలోనే కేదారేశ్వరపేటలో మరో రైతుబజార్ ఉండడంతో దీనికి పెద్దగా డిమాండ్ లేదు. కేవలం 15 స్టాల్స్ మాత్రమే రైతులు ఏర్పాటు చేస్తున్నారు. రైతుబజార్‌ను తొలగించి ఏడాదిన్నరలో హోల్‌సేల్ పూలమార్కెట్‌ను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన. – ఈనాడు, అమరావతి

వర్తక సంఘాలతో కలెక్టర్ సమావేశం

హోల్‌సేల్ పూల మార్కెట్ వర్తక సంఘం ప్రతినిధులతో ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ బుధవారం సమావేశమయ్యారు. మార్కెటింగ్, ఉద్యాన, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు. దేశంలోనే మోడల్‌గా పూల మార్కెట్‌ను నిర్మిస్తామని, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, వినియోగదారులందరికీ ఆమోదయోగ్యంగా ఉండబోతోందని కలెక్టర్ వెల్లడించారు. ప్రస్తుత మార్కెట్ ఎవరికీ ఇబ్బంది లేని రీతిలో తరలింపునకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. నూతన మార్కెట్ వినియోగదారులతో పాటు నగరానికి వచ్చే సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించే రీతిలో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు.



కేటీఎం పండుపై పీటీ వారెంట్ దాఖలు

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గ్యాంగ్ వార్ కేసులో ప్రధాన నిందితుడు కోడూరి మణికంఠ అలియాస్ కేటీఎం పండుపై పటమట పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గత ఏడాది పెనమలూరు పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేయడంతో కొన్ని నెలలుగా నెల్లూరు జైలులో ఉన్నాడు. పటమట పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదైన కేసులో అరెస్టు పెండింగ్ ఉండడంతో తాజాగా పీటీ వారెంట్ దాఖలు చేశారు. మంగళవారం నెల్లూరు జైలు నుంచి తీసుకువచ్చి విజయవాడలో న్యాయమూర్తి ముందు హాజరు పరచగా.. రిమాండ్ విధించారు.

ముగిసిన ఈసెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ ద్వితీయ ఏడాదిలో ప్రవేశానికి సంబంధించి నిర్వహిస్తున్న ఏపీఈసెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బుధవారంతో ముగిసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెబ్ ఆధారిత కేంద్రానికి చివరి రోజున 191 మంది అభ్యర్థులు వచ్చి ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఆర్మీ సంతతి విభాగంలో ఐదుగురు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో 59 మంది, ఎన్‌సీసీ విభాగంలో 81 మంది, దివ్యాంగుల కేటగిరీలో 32 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో 14 మంది వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయ సారథి తెలిపారు.

నడమంత్రపు సిరితో పతనం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

సాధారణ బీమా ఏజెంటుగా ఉన్న ఆదిత్య.. యూట్యూబ్‌లో వీడియోలు చూసి ట్రేడింగ్‌పై అవగాహన పెంచుకున్నాడు. పట్టు దొరికిందని నమ్మకం కలిగిన తర్వాత దానిని ఆచరణలోకి పెట్టి పరీక్షించుకున్నాడు. 2020లో స్నేహితులు, బంధువుల నుంచి డబ్బులు పోగు చేసి స్టాక్ ట్రేడింగ్, ఫారెక్స్ ట్రేడింగ్ ప్రారంభించాడు. రెండేళ్ల తర్వాత భారీ లాభాలు కళ్లజూశాడు. దీంతో 2020 మార్చిలో ఆదిత్య నలుగురు ఏజెంట్లతో అద్విక ట్రేడింగ్ కంపెనీ మొదలుపెట్టాడు. ప్రారంభంలో 1 నుంచి 3 శాతం వరకే ఏజెంట్లకు కమీషన్ ఇచ్చేవాడు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వ్యాపారాన్ని విస్తరించాడు. 2023 మార్చి నాటికి వ్యాపారం రూ.20కోట్లకు చేరింది. ఏజెంట్ల సంఖ్య 30కు పెరిగింది.

'అద్విక' మోసంలో కొత్త కోణాలు

అత్యాశకు పోయి 10శాతం ఎరజూపి: తక్కువ సమయంలో అధికంగా వసూలు చేయాలన్న అత్యాశతో ఆదిత్య తప్పటడుగులు వేశాడు. లక్ష్యాలు విధించి 10 నుంచి 12 శాతం వరకు కమీషన్ పెంచడంతో ఏజెంట్లు పోటీ పడి మరీ వసూలు చేశారు. దీంతో అనతి కాలంలోనే రూ.100కోట్ల పెట్టుబడులకు సంస్థ చేరింది. కంకిపాడులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో బుల్లితెర నటులతో భారీ కార్యక్రమం ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత నుంచి ట్రేడింగ్‌ను వదిలేసి వచ్చిన డబ్బును కమీషన్లు, వడ్డీల చెల్లింపులకే పరిమితం కావడంతో పక్కదారి పట్టడం ప్రారంభమైంది. నడమంత్రపు సిరితో కోట్లకు పడగలెత్తిన ఆదిత్య అత్యాశకు పోయి డిపాజిటర్లు, ఏజెంట్లను నట్టేట ముంచాడు. దుబాయ్‌కు చెందిన ఖబానా క్యాపిటల్‌లో ఫారెక్స్ ట్రేడింగ్ కోసం రూ.21కోట్లు వెచ్చించాడు. మల్టీ బ్యాంకులో రూ.23 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఎడాపెడా కమీషన్లు ఇవ్వడం, రూ.కోట్లలో వృథా ఖర్చులతో వ్యాపారం కుప్పకూలింది.

సలహాలిచ్చినందుకు రూ.2.16కోట్లు: మార్కెట్‌లో ఎందులో పెట్టుబడులు పెడితే లాభదాయం అని సలహాలు ఇచ్చేందుకు నాగలక్ష్మి అనే సలహాదారుని ఆదిత్య నియమించుకున్నాడు. ఆమెకు రూ.2.16 కోట్లు చెల్లించాడు. ఆమె భర్త బాలకృష్ణ ఏజెంట్‌గా చేరాడు. చాలా మందికి నష్టాలు రాగా ఇతనికి మాత్రం రూ.4కోట్లు మేర ప్రయోజనాలు దక్కడంలో ఆదిత్య కీలకపాత్ర పోషించాడు.



పుట్టిన రోజు వేడుకలో నిందితుడు ఆదిత్య

ఎంవోల కోసం ఏజెంట్లు: ఇప్పటివరకు 1,100 మంది పైగా డిపాజిటర్లతో 1,669 ఎంవోయూలు చేసుకున్నాడు. ఇంకా చాలా మంది ఒప్పందాలు చేసుకోలేదు. బోర్డు తిప్పేసిన వ్యవహారంతో బాధితులు ఏజెంట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో వారు విజయవాడలోని అద్విక కార్యాలయానికి క్యూ కడుతున్నారు. బుధవారం పలువురు ఏజెంట్లు వచ్చి పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్యను కలిసేందుకు ప్రయత్నించగా పంపించేశారు.

ముఖ్యమంత్రిని కలిసేందుకు యత్నం: ఈ మోసానికి సంబంధించి సీఎం చంద్రబాబుని కలిసి తమ గోడు వినిపించేందుకు పలువురు బాధితులు, ఏజెంట్లు ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం అపాయింట్‌మెంట్ తీసుకునేందుకు చూస్తున్నారు. తాము చెలించిన సొమ్ము వెనక్కి ఇప్పించి న్యాయం చేయమని అర్థించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇక అక్రమాలకు తావుండదు

ఎన్టీటీపీఎస్ బూడిద తరలింపు షురూ.. ★ ప్రైవేటు వ్యక్తులకు టెండర్లు

విజయవాడ, న్యూస్‌టుడే: జెన్‌కో బూడిద తరలింపునకు టెండర్లు ఆహ్వానించి కేటాయింపులు చేయడంతో ఏళ్ల తరబడి సాగుతున్న బూడిద మాఫియాకు అడ్డుకట్ట వేసినట్లయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్టీటీపీఎస్ బూడిద తరలింపు, అమ్మకాలపై జెన్‌కో యాజమాన్యం ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో చైన్నెకి చెందిన రిఫ్లెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నాగార్జున ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్స్‌లు సంయుక్తంగా వాటిని మూడు సంవత్సరాలకు గానూ టెండర్లు దక్కించుకున్నాయి. అందులో డ్రై ఫ్లైయాష్‌ను రూ.89352000లకు, హైడ్రోజన్ యాష్‌ను రూ.5420250లు ఉండగా మొత్తం రూ.9,47,72,250కు దక్కించుకున్నారు.

సంస్థకు మంచి ఆదాయం

ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్తు ఉత్పాదన 1978లో ప్రారంభమైంది. అప్పటి నుంచి దశల వారీగా యూనిట్లు పెరుగుతూ వచ్చాయి. 2024 జనవరి నాటికి మొత్తం 2560 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సంస్థ సాధించింది. అయితే నాలుగు దశబ్దాల పాటు బూడిద పేరుకుపోవడంతో కొండల మధ్య వాటి నిల్వలు ఏర్పాటు చేసి చెరువులుగా సంస్థ మార్చింది. ఇదిలా ఉంటే కొన్నేళ్ల నుంచి బూడిదను ఫిల్లింగ్, రహదారుల ఏర్పాటు, బ్రిక్స్ తయారీలో వాడుతుండడంతో బూడిదకు డిమాండ్ పెరిగింది. దీంతో స్థానికంగా మాఫియా తయారై అధికార్లను బెదిరించి సొంత వాహనాలను పెట్టుకొని బూడిద తరలింపు కార్యక్రమాలను చేపట్టారు. ఏళ్ల తరబడి ప్రభుత్వాలు మారినా ప్రజాప్రతినిధులు, వారికి బంధువులు, షాడోలు పెద్ద ఎత్తున బూడిదను తరలించి సొమ్ములు చేసుకొన్నారు. రూ.వేల కోట్లు బూడిద సంపద తరలిపోయిందంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అనుమతితో జెన్‌కో చేసిన నిర్ణయం చరిత్రాత్మకం. టెండర్లు పిలిచి మూడు సంవత్సరాలకు రూ.9 కోట్లు ఆదాయాన్ని సంస్థకు చేకూరేలా చేసింది.

సీఎస్ఆర్‌కు కేటాయించాలి: బూడిద ద్వారా సంస్థకు రానున్న ఆదాయం రూ.9 కోట్లు సంస్థ సమీప ప్రాంతాలకు సీఎస్ఆర్ (కంపెనీ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కి కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పనులకు శ్రీకారం



ఎన్టీటీపీఎస్ 800 మెగావాట్లకు సంబంధించి ఇబ్రహీంపట్నంలో ఉద్యోగులకు ఐదేళ్ల కిందట క్వార్టర్స్ నిర్మించారు. అప్పట్లో 65 శాతం పనులు పూర్తవగా, వైకాపా అధికారంలోకి రాగానే పనులు నిలిచిపోయిన వైనాన్ని 'నిధులు లేక.. నిర్మాణాలు పూర్తి కాక' శీర్షికన 03-3-2024లో 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. కూటమి ప్రభుత్వం చొరవతో జెన్‌కో క్వార్టర్ల నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. మిగిలిన పనులను నాలుగు నెలలుగా ఎన్టీటీపీఎస్ వివిధ విభాగాలుగా విభజించి కాంట్రాక్టుల ద్వారా పనులు పూర్తి చేస్తోంది. ఈ ఏడాది డిసెంబరుకు 216 క్వార్టర్లను ఉద్యోగులకు కేటాయించనున్నట్లు ముఖ్య ఇంజినీరు శివరామాంజనేయులు తెలిపారు.

స్పందనకు వందనం

శరవేగంగా క్వార్టర్ల నిర్మాణం



ఈనాడులో ప్రచురించిన కథనం

-ఈనాడు, అమరావతి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

తాను మరణిస్తూ.. నలుగురికి జీవం పోసి..

బ్రెయిన్‌డెడ్ మహిళ అవయవాల దానం

మంగళగిరి, న్యూస్‌టుడే: తాను మరణిస్తూ ఆమె మరో నలుగురికి జీవం పోశారు. మంగళగిరి ఎయిమ్స్ తెలిపిన వివరాల మేరకు మంగళగిరి మండలం నిడమర్రుకు చెందిన మండేపూడి శేషారత్నం(63) ఈనెల 1న రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. చికిత్స కోసం ఎయిమ్స్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యుల సమ్మతితో, ఏపీ జీవన్‌దాన్ సమన్వయంతో అవయవ పునరుద్ధరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించారు. కాలేయం, రెండు మూత్రపిండాలు, కళ్లను మార్పిడి కోసం కేటాయించారు. ఎయిమ్స్‌లో ఒక కిడ్నీ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. మరో కిడ్నీని కృష్ణాజిల్లా చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఫౌండేషన్‌కు, కాలేయాన్ని తాడేపల్లిలోని మణిపాల్ వైద్యశాలకు, కార్నియాలను (కళ్లు) విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ఐపీడీ బ్లాక్‌లో దాతకు నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను సత్కరించారు. వ్యక్తిగతంగా నష్టం జరిగినప్పటికీ శేషారత్నం కుటుంబ సభ్యులు చూపిన దయ, చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్నపూర్ణ, మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఎయిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.



శేషారత్నం (పాత చిత్రం)

కొండను మింగేస్తున్నారు

పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు

న్యూస్‌టుడే, నందిగామ

నందిగామ మండలం రాఘవాపురం కొండ గ్రావెల్ మాఫియా, కొంత మంది నేతలకు వరంలా మారింది. యంత్రాలతో తవ్వి గ్రావెల్ అక్రమ రవాణా సాగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవట్లేదు. పొక్లెయిన్లతో కొండను తవ్వే క్రమంలో పెద్ద పెద్ద బండరాళ్లు, గ్రావెల్ జారిపడి ప్రాణాలు కోల్పోతున్నా లెక్క చేయని పరిస్థితి నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి గ్రావెల్ తవ్వి టిప్పర్‌కు లోడింగ్ చేస్తుండగా ఒక్కసారిగా కొండ నుంచి రాళ్లు టిప్పర్‌పై పడడంతో దాని డ్రైవర్ మృతి చెందారు. అయినా అధికారుల్లో చలనం రాలేదు. మరోపక్క అక్రమ తవ్వకాలు, రవాణా నిరాటంకంగా సాగుతుండడంతో కొండ స్వరూపం కోల్పోయి కళావిహీనంగా కనిపిస్తోంది. ముందు నుంచి చూస్తే కొండ బాగానే ఉన్నా రాఘవాపురం రోడ్డు వైపునకు వెళ్లి చూస్తే దీని అసలు రూపం తెలుస్తుంది.



పెద్దఎత్తున గ్రావెల్ తవ్వకాలు

203 ఎకరాల్లో రాఘవాపురం కొండ

రాఘవాపురం గ్రామం వద్ద సర్వే నంబరు ఒకటిలో 203 ఎకరాల్లో కొండ విస్తరించి ఉంది. ఆధ్యాత్మికంగా, పర్యావరణ పరంగా ఎంతో ప్రాముఖ్యం ఉన్న కొండపై గత కొన్నేళ్లుగా అక్రమార్కుల కన్ను పడింది. దీనిని ప్రధాన అక్రమ ఆదాయ వనరుగా చేసుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధుల అండతో పెద్దఎత్తున కొండ తవ్వి గ్రావెల్ తరలించారు. దీని ద్వారా రూ.కోట్లు గడించారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్న ప్రస్తుత ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అర్ధరాత్రి కొండ వద్దకు వెళ్లి అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. కొండ వద్దనే రాత్రంతా ఉండి ఆందోళనలు చేశారు. అయినా అక్రమ రవాణా ఆగలేదు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణం, ప్రైవేట్ వెంచర్లకు కొంత మంది గ్రావెల్ తవ్వి భారీగా సొమ్ము చేసుకున్నారు. నాణ్యమైన గ్రావెల్ కావడంతో ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్లలో రోడ్లు, స్థలాల మెరక, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

★ ప్రభుత్వం మారినా అక్రమ తవ్వకాలు ఆగలేదు. వీటి వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనికితోడు టిప్పర్లను నేరుగా కొండకు ఆనించి లోడింగ్ చేస్తుండడంతో కొండ రాళ్లు విరిగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఏసీపీ కార్యాలయం పక్క నుంచే..

రోజూ ఏసీపీ కార్యాలయం పక్క నుంచే మధిర రోడ్డు మీదుగా గ్రావెల్ టిప్పర్లు వెళ్తున్నాయి. నందిగామలోనే ఆర్డీవో, ఆర్టీవో, ఏసీపీ అధికారుల కార్యాలయాలున్నా చర్యలు తీసుకోవట్లేదు. కొందరు అధికారులకు ముడుపులు అందుతుండడం వల్లే వారు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తల్లికి వందనం రాలేదు.. టీసీ ఇవ్వడం లేదు

జిల్లా విద్యాశాఖాధికారితో ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావుతో 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ చేసి సమస్యలు చెప్పారు. సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఆ వివరాలను సూపరింటెండెంట్లు డి.సూరిబాబు, పి.నాగరాజు, ఏఎస్‌వో శివశంకర్, రికార్డు అసిస్టెంట్ ఎం.ప్రసాదబాబు నమోదు చేసుకున్నారు.

ఈనాడు మీతోడు



తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేస్తున్న డీఈఓ సుబ్బారావు, వివరాలు రాసుకుంటున్న అధికారులు సూరిబాబు, నాగరాజు, శివశంకర్, ప్రసాదబాబు

? మా పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. తల్లికి వందనం రాలేదు. - **షేక్ ఫాతిమా (లబ్బీపేట), కోటిరామయ్య (వెల్లంకి) ఎల్.సుజాత (వన్‌టౌన్), కావ్య (అజిత్‌సింగ్‌నగర్), ఆర్.మహాలక్ష్మి (పటమట), రాజేశ్ (గాయత్రి నగర్)**

డీఈఓ : రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని బడులకు మాత్రం వర్తించదు.

? తల్లికి వందనం అర్హుల జాబితాలో మా పిల్లల పేర్లు ఉన్నాయి. నగదు మాత్రం జమ కాలేదు? - **ఎం.రమ్య (అజిత్‌సింగ్‌నగర్), రవికుమార్ (అజిత్ సింగ్‌నగర్), శిరీష (లబ్బీపేట), ఎం.స్వప్న(గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం మండలం)**

డీఈఓ : అర్హులకు ఈ నెల 10న రెండో విడత నగదు జమ అవుతుంది. ఆందోళన వద్దు.

? తల్లికి వందనం మా కుమారుడికి రాలేదు. సచివాలయానికి వెళ్తే 300 యూనిట్లు దాటి విద్యుత్తు వాడినందున రాలేదని సమాధానం చెప్పారు. విద్యుత్తు అధికారులను సంప్రదిస్తే 276 యూనిట్లు వాడినట్లు వచ్చింది. ఆ వివరాలు సచివాలయానికి తీసుకెళ్తే సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ తేవాలని చెప్పారు. విద్యుత్తు అధికారులను అడిగితే దాని గురించి తెలియదంటున్నారు. - **ఆర్.తిరుమలరావు, కస్తూరిబాయిపేట, విజయవాడ**

డీఈఓ : కలెక్టరేట్ కార్యాలయంలో తల్లికి వందనానికి సంబంధించి ప్రత్యేకమైన ఫిర్యాదు విభాగం ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లి సమస్య తెలియజేస్తే పరిష్కారం అవుతుంది.

? గత ప్రభుత్వంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పుగా చేసినందున తల్లికి వందనం పథకం రాలేదు. మా కుమారుడి ఆధార్ అనుసంధానం చేస్తే 16 ఎకరాల పొలం ఉన్నట్లు చూపడంతో ఎంపిక కాలేదు. గతంలో జీఎస్టీ చెల్లించడం వల్ల మా పిల్లలకు వర్తించలేదు. - **రాణి(కస్తూరిబాయిపేట), కోటేశ్వరరావు (కంచికచర్ల), ఎండీ షబానా కండ్రిక (విజయవాడ)**

డీఈఓ : హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తప్పిదాలు, జీఎస్టీ చెల్లింపు సమస్యలను సచివాలయానికి వెళ్లి సరి చేసుకోండి. పొలం విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కారం అవుతుంది.

? మా ఇద్దరి పిల్లలు కొణకంచి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం మా పిల్లలకు మంజూరు కాలేదు. - **దుర్గారావు, కొణకంచి, పెనుగంచిప్రోలు మండలం**

డీఈఓ : సచివాలయంలో ఫిర్యాదు చేయండి. సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

? పుచ్చలపల్లి సుందరయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో మా కుమారుడు చదువుతున్నాడు. ఏకరూప దుస్తులు ఆలస్యంగా ఇచ్చారు. కుట్టడం జాప్యమైంది. వేసుకు రావాలని ఒత్తిడి చేస్తున్నారు? వర్షం పడిందని ఆలస్యంగా వెళ్తే గుంజీలు తీయిస్తున్నారు? ఉపాధ్యాయులు సరిపడా లేరు. - **శ్రీనివాసరావు, అజిత్‌సింగ్‌నగర్**

డీఈఓ : ఇబ్బందులు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. గురువారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఉంది. ఒక జత ఏకరూప దుస్తులైనా కుట్టించి వేసుకెళ్లేలా చూడండి.

? రెడ్డిగూడెం మండలం పాత నాగలూరు ఎంపీయూపీ పాఠశాల భవనం అసంపూర్తిగా ఉంది. కృష్ణలంక ఏపీఎస్ఆర్ఎంసీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు. విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. - **దేవిడ్ రాజు (పాత నాగలూరు), కృష్ణారావు (కృష్ణలంక)**

డీఈఓ : కొద్ది రోజుల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. మంజూరు చేయగానే పనులు ప్రారంభిస్తాం. భవనాల నిర్మాణం పూర్తి చేస్తాం.

? అజిత్‌సింగ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మా కుమార్తె ఆరో తరగతి చదివింది. మరో పాఠశాలలో చేర్పడానికి టీసీ అడిగితే ఇవ్వడం లేదు. కరెన్సీనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మా కుమారుడిని ఆరో తరగతిలో చేర్చాం. మూడు నెలలే చదివాడు. అనారోగ్యంతో బడికి వెళ్లలేదు. టీసీ అడిగితే ఫీజు మొత్తం చెల్లించాలంటున్నారు. టీసీ ఇస్తే దావాజీగూడెం జడ్పీ పాఠశాలలో చేరుస్తాం. - **సూర్యం (అజిత్‌సింగ్‌నగర్), శ్రావణి (యనమలకుదురు)**

డీఈఓ : మీరు డీఈవో కార్యాలయానికి వచ్చి అర్జీ పెట్టుకోండి. మీ కుమార్తెకు టీసీ ఇచ్చేలా చూస్తా. దావాజీగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి చెబుతా. అక్కడ మీ కుమారుడిని చేర్చండి. ఆన్‌లైన్‌లో పాఠశాలకు టీసీ వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

? గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నారా? ప్రైవేటు పాఠశాలలు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. - **చంద్రశేఖర్ (పెనుగంచిప్రోలు), మాధవి(భవానీపురం), షణ్ముఖ్(ఇబ్రహీంపట్నం)**

డీఈఓ : ఫిర్యాదు చేస్తే గుర్తింపు లేని బడులపై చర్యలు తీసుకుంటాం. గత ఫీజుల నియంత్రణ చట్టం ప్రకారం పాఠశాలలు నిర్వహించలేమని ప్రైవేట్ యాజమాన్యాలు హైకోర్టుకు వెళ్లాయి. న్యాయస్థానం వారికి స్టే ఇచ్చింది.

? చందర్లపాడు మండలం ఏటూరు ఎంపీపీఎస్ పాఠశాలలో తాగునీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలి. - **తిరుపతిరావు, ఏటూరు**

డీఈఓ : ఆర్వో ప్లాంటు పనిచేయడం లేదు. వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

గ్రావెల్ అక్రమ తవ్వకాల్లో టిప్పర్ డ్రైవర్ మృతి

మరొకరికి గాయాలు

వ్యవహారం బయటకు పొక్కకుండా మాఫియా ప్రయత్నం



కొండ వద్ద పొక్లెయిన్‌పై పడిన గ్రావెల్, రాళ్లు



ప్రమాదంలో దెబ్బతిన్న టిప్పర్

నందిగామ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురం కొండ వద్ద మంగళవారం అర్ధరాత్రి యంత్రాలతో నిర్వహించిన అక్రమ తవ్వకాల్లో టిప్పర్ డ్రైవర్ మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మాఫియా నాయకుల ఒత్తిడితో పోలీసు, రెవెన్యూ అధికారులు కేసును సమయానుకూలంగా కూడా పరిశీలించారు. దీనికితోడు తమకు ఫిర్యాదు రాలేదని, వచ్చినప్పుడు చూస్తామని చెప్పడంపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. పెద్ద ప్రమాదం జరిగిన సంఘటన స్థలం నుంచి అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా కొండ వద్ద నుంచి టిప్పర్‌ను తరలించడం గమనార్హం. కొండలో మంగళవారం అర్ధరాత్రి పొక్లెయిన్‌తో అక్రమంగా తవ్వి టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రావెల్ పోస్తుండగా ఒక్కసారిగా మట్టి, రాళ్లు టిప్పర్, పొక్లెయిన్‌పై పడిపోయాయి. దీంతో టిప్పర్‌లో ఉన్న జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామానికి చెందిన దాసరి చిన్నవెంకటేశ్వర్లు(37)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా అక్కడే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా కొందరు ముఖ్యనాయకులు రంగంలోకి దిగి తమవంతు ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. దీనిలో భాగంగా అర్ధరాత్రి కొండ వద్ద ప్రమాద స్థలం వద్ద నుంచి దెబ్బతిన్న టిప్పర్‌ను మరో పొక్లెయిన్‌తో తీయించి నందిగామలోని ఎన్ఎస్పీ క్వార్టర్స్ స్థలంలోకి తరలించారు. ప్రమాద స్థలంలో ఆధారాలు లేకుండా చూడాలని ప్రయత్నాలు చేశారు. వాస్తవ విరుద్ధంగా టిప్పర్ గ్రావెల్ రవాణా చేస్తుండగా అదుపుతప్పి పడిపోయిందని మార్పు చేసే దుశ్చర్యలు చేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంగా మార్చేందుకు పూర్వాచరణ .. నందిగామకు చెందిన స్థానికులు మాట్లాడుతూ ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నందిగామలో ఏసీపీ, ఆర్డీవో కార్యాలయాలు ఉన్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఆర్డీవో కె.బాలకృష్ణను 'ఈనాడు' వివరణ కోరగా.. విషయం తనకు తెలియదని చెప్పారు. అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ వైవీవీఎల్ నాయుడును సంప్రదించగా దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి పూట టిప్పర్‌తో వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు. జరిగిన సంఘటన స్థలంలో మరో రకంగా ఉన్నట్లు సమాచారం ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భర్త మృతితో కన్నీరుమున్నీరు .. దాసరి చిన్నవెంకటేశ్వర్లుకు రావిరాల గ్రామానికి చెందిన నాగమణితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవనోపాధి కోసం నందిగామ వచ్చి ఏడో వార్డులో నివాసముంటున్నారు. భర్త మృతి చెందడంతో భార్య, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

కోలాహలంగా భాజపా అధ్యక్షుడి ప్రదర్శన



కార్యకర్తల ద్విచక్ర వాహనాల ర్యాలీ



మాధవ్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

భవానీపురం, న్యూస్‌టుడే: భాజపా ఏపీ అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం ఉదయం నివాళులు అర్పించారు. భాజపా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పీవీఎన్ మాధవ్ నాయకులతో కలిసి నివాళులు అర్పించిన అనంతరం సూర్యారావుపేటలోని భాజపా రాష్ట్ర కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. మధ్యలో లెనిన్ సెంటర్ వద్ద ఉన్న విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పలువురు భాజపా నాయకులు మాధవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జ్వరాలు, డెంగీ, మలేరియా, డయేరియా వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి క్షేత్ర స్థాయిలోని ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు తదితరులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కలుషిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఒక్క కేసూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దోమల నివారణ నిమిత్తం యాంటీ లార్వల్ ఆపరేషన్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. జ్వరాల వివరాలను ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని చెప్పారు. పారిశుద్ధ్య చర్యలు, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తూ.. 4,000 హెక్టార్ల లక్ష్యంగా ఉద్యాన పంట తోటల పెంపకం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, డ్వామా పీడీ ఏ.రాము, డీపీవో పి.లావణ్యకుమారి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో జె.బంధువతి, జిల్లా మలేరియా నివారణ అధికారి వి.మోతీబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సమన్వయకర్త జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు.. జరిమానా

విజయవాడ నేరవార్తలు: చెక్ బౌన్స్ కేసులో నిందితుడైన వ్యాపారి కుదరవల్లి వెంకట నరసయ్యకు ఏడాది జైలు శిక్ష, రూ.20లక్షల జరిమానా విధిస్తూ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రత్యేక న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. పటమటలంకకు చెందిన వెంకట నరసయ్య . 2020 సంవత్సరంలో బోడి సీతారామరాజు వద్ద రూ.15 లక్షలు అప్పు తీసుకున్నారు. దీనికి సంబంధించి 2021లో ఆయన రూ.17.70 లక్షలకు చెక్ ఇచ్చారు. ఇది బౌన్స్ కావడంతో సీతారామరాజు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వెంకట నరసయ్యకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

రెడ్ క్రాస్ సేవలు చిరస్మరణీయం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ బ్రాంచి వార్షిక సమావేశం నిర్వహించారు. గవర్నర్ నజీర్ మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్, ప్రథమ చికిత్స శిక్షణ, ఉచిత వైద్యశిబిరాల ద్వారా రెడ్ క్రాస్ సభ్యులు అందిస్తున్న సేవలు గుర్తు చేశారు. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తోపాటు ఉత్తమ సేవలు అందించిన సభ్యులకు ఈ సందర్భంగా పురస్కారాలు, జ్ఞాపికలు బహూకరించారు. ఈ సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ బ్రాంచి ఆడిట్ నివేదికను సభ్యులు ఆమోదం తెలిపారు. సొసైటీ ఛైర్మన్ రామారావు, జనరల్ సెక్రటరీ ఎ.శ్రీధర్ కుమార్, ట్రెజరర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ సభ్యులతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

పరువు నష్టం కేసు విచారణ వాయిదా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సాక్షి దిన పత్రిక, వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై పురపాలకశాఖ మంత్రి నారాయణ వేసిన పరువు నష్టం కేసు విచారణ వాయిదా పడింది. దేశ వ్యాప్తంగా కార్మిక సమ్మెకు న్యాయవాదులు సంఘీభావం ప్రకటించడంతో.. విజయవాడలోని లాయర్లు తమ విధులు బహిష్కరించారు. దీంతో ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానంలో విచారణకు వచ్చిన పరువు నష్టం కేసును వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం



తిరువూరులో దస్త్రాలు పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియా, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: త్వరలోనే రామచంద్రాపురంలో జాతీయ రహదారి అభివృద్ధి సమస్య పరిష్కరిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ ఇలక్కియా పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె కొన్ని స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో అభివృద్ధి చేయాల్సిన జాతీయ రహదారిని పరిశీలించి విస్తరణకు అడ్డుగా ఉన్న మూడు ఇళ్ల యజమానులతో మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఏ అధికారులు తమకు నష్ట పరిహారం ఇవ్వలేదని, పరిహారం తక్కువగా ఉందని యజమానులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తొలగించాల్సిన గృహాల వారికి అర్హత ఉంటే ఇళ్లస్థలాలు మంజూరు చేస్తామని, జిల్లా కలెక్టర్‌కు వినతి చేస్తే వారికి నష్ట పరిహారం పెంచే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎ.కొండూరు కేజీబీవీ సందర్శించి అక్కడ బాలికలకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. గొల్లమందల గ్రామ సమీపంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అటవీ భూములు, ఇళ్ల స్థలాలను ఆశాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. తిరువూరులో 'జవహర నవోదయ విద్యాలయ' ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట తిరువూరు ఆర్డీవో కె.మాధురి, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'జగన్ డ్రామాలు ప్రజలు గమనించాలి'



మాట్లాడుతున్న దేవినేని

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాజకీయ లబ్ధి పొందేందుకే జగన్ మామిడి రైతుల పరామర్శ పేరుతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ట్రాక్టర్లతో మామిడి కాయలను రోడ్డుపైన పోసి నాటకాలు ఆడుతున్నారన్నారు. జగన్ ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనించాలన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. గతంలో కిలో మామిడి రూ.2లు ఉన్న సమయంలో ఎప్పుడూ స్పందించలేదని విమర్శించారు. వైకాపా పాలనలో రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల ఊబిలోకి నెట్టారని, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారని, ఆర్థిక పరిస్థితిని నాశనం చేశారన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు.

పోలీస్ సిబ్బందికి వైద్య సేవలు



అధికారికి రక్తపోటు పరీక్షిస్తున్న వైద్యులు, పక్కన సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో. . పని ఒత్తిడితో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న పోలీసు సిబ్బందికి ఆరోగ్యపరంగా మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చొరవ చూపారు. కమిషనరేట్ పరిధిలోని పలు ఆసుపత్రుల్లో బుధవారం పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి జనరల్ బాడీ హెల్త్ చెకప్ కార్యక్రమం ప్రారంభించారు. మెడ్‌స్టార్, ఆంధ్రా ఆసుపత్రి, కామినేని, క్యాపిటల్, సెంటినీ, హెల్ప్ ఆసుపత్రుల్లో.. 4వేల మంది సిబ్బంది, అధికారులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేస్తారు. ప్రతి రోజూ 250 మందికి చొప్పున పరీక్షలు నిర్వహిస్తారు. దీనికయ్యే ఖర్చును పోలీస్ కమిషనరేట్ ఫండ్ నుంచి చెల్లిస్తారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం ప్రత్యక్షంగా పలు ఆసుపత్రులను సందర్శించి.. సిబ్బందికి అందుతున్న సేవలను పర్యవేక్షించారు.

నకిలీ పవర్ టూల్స్ స్వాధీనం



విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీలో నకిలీ పవర్ టూల్స్ నిల్వ చేసిన గోదాములపై వన్ టౌన్ పోలీసులు బుధవారం దాడులు చేశారు. పాతబస్తీకి చెందిన పవర్ టూల్స్ కంపెనీ డైరెక్టర్ మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్ఆర్ అప్పారావు వీధిలోని విజయశ్రీ టూల్స్ గోదాములో నకిలీ పవర్‌టూల్స్ గుర్తించారు. అందులో సన్‌ఫ్లవర్ కటింగ్ వీల్ బ్లాక్స్ 1,992 బాక్సులు, పవర్ టెక్స్‌రెడ్ 400 బాక్సులు, సిటీ సర్కులర్స్ బాక్సులు 480 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గురుప్రకాష్ తెలిపారు. వాటి విలువ రూ.15లక్షలు ఉంటుందన్నారు.

శాకంబరిగా పార్వతీదేవి



యనమలకుదురు (కానూరు), న్యూస్‌టుడే: ఆషాఢ మాసం మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చన చేశారు. ఆలయ దాత, ఏపీ ధార్మిక పరిషత్తు సభ్యుడు సంగా నరసింహారావు.. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్.భవాని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

విజయవాడ క్రీడలు: ఏసీఏ (ఆంధ్రా క్రికెట్ సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నీ మంగళగిరి, పేరేచర్లలోని ఏసీఏ క్రికెట్ మైదానాల్లో జరుగుతుంది. టోర్నీలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల జట్లు తలపడనున్నాయి. ఈ నెల 10వ తేదీన పేరేచర్ల మైదానంలో గుంటూరు, ప్రకాశం జట్ల మధ్య, మంగళగిరి మైదానంలో కృష్ణా, పశ్చిమ గోదావరి జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నాయని ఏసీఏ వర్గాలు వెల్లడించాయి.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు 9985095965

? గడ్డమణుగు గ్రామంలో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు పారక దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. -రవి, స్థానికుడు

✔ సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీసి దోమల నివారణ చర్యలు చేపడతాం. -హరికృష్ణ, కార్యదర్శి

స్పందనకు వందనం

★ కోడూరు గ్రామంలో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచి ప్రసాద్‌లు స్పందించి, గత మూడు రోజులుగా గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు.
-న్యూస్‌టుడే, జి.కొండూరు

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గణపవరం(మైలవరం) : గణపవరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో టౌన్‌ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 10న సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామ్మోహనరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

గోదావరి జలాలకు జలహారతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: గోదావరి జలాలు కృష్ణానదిలో కలిసేందుకు పోలవరం కాలువ మీదుగా బుధవారం పవిత్ర సంగమం చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని కవులూరు ప్రజలు కట్టుబడిపాలెం, కవులూరు గ్రామాల మధ్య పోలవరం కాలువ నిర్మించిన వంతెన పైకి పెద్ద సంఖ్యలో చేరుకుని గోదావరి జలాలకు జలహారతితో స్వాగతం పలికారు.

సాయి మందిరంలో పూజలు



ఇబ్రహీంపట్నం గ్రామీణం: గురు పౌర్ణమి సందర్భంగా ముందస్తు పూజా కార్యక్రమాల్లో భాగంగా ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ అభయ సాయి మందిరంలో బుధవారం అభయ సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబాకు లక్ష మల్లెపూల సహస్ర నామార్చన చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

పోషక విలువలున్న గ్రాసం పెంచండి

పుల్లూరు(మైలవరం), న్యూస్‌టుడే: పోషక విలువలు గల పశుగ్రాసాలను పెంచడం ద్వారా పశువులకు ఆరోగ్యంతో పాటు, పాల ఉత్పత్తి బాగుంటుందని పశుసంవర్ధకశాఖ జేడీ హనుమంతరావు పేర్కొన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పుల్లూరు పశువైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల నిర్వహించిన నట్టల నివారణ మందుల పంపిణీలో పాల్గొని, పశువులకు అందించారు. ఈ సందర్భంగా శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీ హరిహరనాథ్, మండల పశువైద్యాధికారి సుమంత్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆపద గుర్తించి.. ప్రమాదం తప్పించి

న్యూస్‌టుడే, గొల్లపూడి

★ ఇటీవల గొల్లపూడి పోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డు దాటుతున్న ఇబ్రహీంపట్నానికి చెందిన గుత్తేదారును కారు ఢీకొంది. సంఘటనా స్థలంలోనే అతను చనిపోయారు.

★ కొన్ని రోజుల కిందట డీమార్ట్ వద్ద షాపింగ్ ముగించుకుని రోడ్డు దాటుతున్న మహిళను అటుగా వెళ్తున్న వాహనం ఢీకొనడంతో మృత్యువాత చెందారు.

ఇలా రెండేళ్లలో జాతీయ రహదారిపై 40కి పైగా ప్రమాదాలు జరగ్గా 8 మంది దుర్మరణం చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. అదుపుతప్పి వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. గొల్లపూడి డీమార్ట్, ఆసుపత్రి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలుగా పోలీసులు గుర్తించారు. నివారణపై దృష్టిసారించారు.

ఎన్‌హెచ్‌65లో రెయిలింగ్ ఏర్పాటు చేయించిన పోలీసులు



జాతీయ రహదారి మధ్యలో ఏర్పాటు చేశారిలా..

35వేల వాహనాల రాకపోకలు..

ఎన్‌హెచ్-65 విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారిపై నిత్యం అన్ని రకాల వాహనాలు 35వేలకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. గొల్లపూడి డీమార్ట్, ఆసుపత్రి వద్ద రోడ్డు దాటేందుకు ఎలాంటి అవకాశం లేదు. అక్కడ ఉన్న డివైడర్ ఎత్తు తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో వేగంగా దూసుకొస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు పోతున్నాయి. ఆ సూపర్ మార్కెట్‌కు నిత్యం వందలాది, వారాంతపు రోజుల్లో షాపింగ్ చేసేందుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అక్కడ ఉండే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వస్తుంటారు. వాహనాలు వేగంగా దూసుకురావడం, రాత్రి సమయంలో హదారిపై లైట్లు వెలగకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

రూ.8లక్షలతో 500 మీటర్లు

సూపర్‌మార్కెట్, ఆసుపత్రి, ఉన్నత పాఠశాల ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు భవానీపురం పోలీసులు చర్యలు చేపట్టారు. అక్కడ 500 మీటర్ల మేర ఐరన్ రెయిలింగ్‌ను ఏర్పాటు చేయించారు. స్టేషన్‌లో నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా అక్కడ సూపర్‌మార్కెట్‌కు వస్తున్న వినియోగదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తించి యాజమాన్యం సహకారంతో సుమారు రూ.8లక్షల వ్యయంతో జాతీయరహదారిపై రోడ్డు దాటకుండా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. గొల్లపూడి మార్కెట్‌యార్డు వరకు వెళ్లి యూటర్న్ తీసుకునేలా ట్రాఫిక్ మార్పులుచేశారు.

చర్యలు తీసుకున్నాం...

జాతీయరహదారిపై రోడ్డు దాటుతుండగా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోయారు. కారణాలు గుర్తించాం. జాతీయ రహదారిలో డివైడర్ దాటకుండా చర్యలు చేపట్టాం. మార్కెట్, ఆసుపత్రికి వెళ్లేవాళ్లు కొంత దూరం వెళ్లి యూటర్న్ తీసుకుని రావాల్సి ఉంది. ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణ బాధ్యతగా తీసుకోవాలి.
-ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం

కొత్త చెరువులో మట్టి అక్రమ రవాణా

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప కొత్త చెరువు నుంచి యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. వినగడప పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ప్రమాదానికి చెరువులో మట్టి అక్రమంగా తరలించే ట్రాక్టర్ కారణమని చెబుతున్నారు. ఇక్కడ ట్రాక్టర్ తగిలి యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలియగానే చెరువులో నుంచి జేసీబీతో పాటు మట్టి తరలించే ట్రాక్టర్లను అక్రమార్కులు బయటకు పంపించారు. ఆ మట్టిని తోటమూలలో ఒక వైకాపా వ్యక్తికి తరలిస్తున్నట్లు సమాచారం ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు తాగునీరు ఇవ్వడమే లక్ష్యం



విద్యార్థులతో మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

నరసాపురం(విస్సన్నపేట), న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురంలో బుధవారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..పోలవరం పూర్తి చేసి ఉత్తరాంధ్రాకు, హంద్రీనీవతో రాయలసీమకు, వెలిగొండతో ప్రకాశం జిల్లాకు, చింతలపూడితో మెట్టప్రాంతమైన ఇక్కడి ప్రజలకు సాగు, తాగునీరు ఇవ్వాలని ప్రాధాన్యతగా తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా నరసాపురంలో తల్లికివందనం పథకం అమలుపై విద్యార్థులు, తల్లిదండ్రులను ఆరాతీశారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ పథకాన్ని ఇంట్లో ఇద్దరు పిల్లలకు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కరికే ఇచ్చి మోసం చేశారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి కుటుంబంలో చదువుతున్న వారందరికీ అమలు చేశారన్నారు. తొలుత గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. తెదేపా మండల నాయకులు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. గొల్లపూడిలోని దర్గా హరిజనవాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందితే గత వైకాపా ప్రభుత్వంలో ఇంటింటికీ మోసం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యపడుతుందన్నారు. పైరవీలు, రాజకీయ జోక్యం, షరతులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, సూపర్-6 హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నారదా, గూడపాటి పద్మశేకర్, నాయకులు పాల్గొన్నారు.

తెదేపాను బలోపేతం చేయాలి

తిరువూరు, న్యూస్‌టుడే: తెదేపా సంస్థాగత ఎన్నికల్లో నూతనంగా నియమితులైన నాయకులంతా తమ పదవులు, బాధ్యతలను నామమాత్రం చేయకుండా పార్టీ బలోపేతానికి సద్వినియోగం చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన వార్డుల వారీగా కమిటీల అధ్యక్ష, కార్యదర్శులతో ఆయన పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారం చేయించారు. పట్టణంలో పార్టీకి అందించిన సేవలపై వారికి దిశానిర్దేశం చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పట్టణానికి ఎం.శ్రీనివాసరావు, పి.సీతారామలింగేశ్వరరావు, వార్డుల వారీగా 1లో ఎస్‌కే.మస్తాన్, జె.కిషోర్, 2లో ఎస్‌కే.షాహిన్ పాషా, కె.శ్రీదేవి, 3లో ఎస్.దుర్గారావు, జె.అశోక్, 4లో ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.వీరభద్రరావు, 5లో డి.ఉపేంద్ర, పి.మస్తాన్‌ఖాన్, 7లో పి.శ్రీనివాసరావు, ఎస్‌డీ.మౌలాలి, 8లో డి.కాళీవరప్రసాద్, ఎన్.నగేష్, 9లో టి.అనిల్‌కుమార్, డి.మోహన్‌గోపీనాయక్, 10లో డి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే.జానీ, 11లో ఎం.కాటమరాజు, ఎన్.నాగరాజు, 12లో ఎస్.సత్యనారాయణరెడ్డి, డి.కిషోర్, 13లో కె.రామకోటయ్య, బి.ప్రకాశ్, 14లో పి.నాగేశ్వరరావు, ఎ.కృష్ణారావు, 15లో జి.వెంకటేశ్వరరావు, ఎన్.నాయుడు, 16లో ఎస్.పద్మలత, ఎస్.శ్రీనివాసరావు, 17లో ఉమర్, ఐ.హేమంత్‌కుమార్, 18లో కె.సాయిప్రసాద్, బి.లక్ష్మణరావు, 19లో జె.రామశేఖర్, కె.రాంబాబు, 20లో ఆర్.శ్రీనివాసరావు, సీహెచ్.హేమంత్‌కుమార్ నియమితులయ్యారు. పురపాలిక ఛైర్‌పర్సన్ కె.నిర్మల, పార్టీ నాయకులు కె.శేషగిరిరావు, బి.ఉమామహేష్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గజలక్ష్మీదేవికి ఆషాఢ సారె

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస ఆలయంలోని గజలక్ష్మీదేవికి బుధవారం పెనుగొలను శ్రీరంగనాయకస్వామి గుడి భక్తబృందం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. సదరు మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు, పళ్లు, గాజులు, చీర, జాకెట్టు, పిండివంటలను సమర్పించారు. అర్చకులు యోగానందచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయంలో మహిళలు



రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండల కేంద్రమైన రెడ్డిగూడెం గ్రామంలోని శ్రీరాజగోపాలస్వామి దేవాలయంలో అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా బుధవారం మహిళలు మేళతాళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో దేవతామూర్తులను కూరగాయలతో అలంకరించారు.

అర్హులందరికీ దుకాణాలు

మైలవరం, న్యూస్‌టుడే: రైతుబజారులో దుకాణాల నిర్వహణకు అర్హత కలిగిన అందరికీ ఎటువంటి ఆంక్షలు లేకుండా దుకాణాలు కేటాయిస్తామని జేసీ ఎస్.ఇలక్కియా పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైతుబజారును తహసీల్దార్ అబ్దుల్ దరియాతో కలిసి సందర్శించారు. దుకాణాలు, సరకులు, ధరల పట్టికలు ఆ ప్రాంత పరిశుభ్రతను ఆరా తీశారు. ప్రాంగణంలో దిగడానికి ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఎస్టేట్ అధికారి చిట్టిబాబును సూచించారు. ఈ సందర్భంగా జేసీ మీడియాతో మాట్లాడుతూ..రైతుబజారులో కొన్ని దుకాణాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలో అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాజకీయ, సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా కేటాయిస్తామన్నారు. మార్కెటింగ్, ఎస్టేట్ అధికారుల ద్వారా కేటాయిస్తామని, అర్హులు కూడా తక్కువగా ఉన్నందున వీటికే పరిమితమైనట్లు చెప్పారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న జేసీ ఎస్.ఇలక్కియా

సమస్యల పరిష్కారానికి వినతి

మైలవరం: సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కేడీసీసీ బ్యాంకు వద్ద ధర్నా చేశారు. డిమాండ్ల ఫ్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ..సంఘాల్లో 2019 తర్వాత నుంచి పనిచేస్తున్న ఉద్యోగుల పే స్కేలు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని 7 సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మైలవరం: స్థానిక శీలంవారి గిరిజన పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ 1 పి.నరసింహారావు బుధవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉదయ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహ్వాన లేఖలు అందాయి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ సమ్మేళనం రెండో ఏడాది నిర్వహించేందుకు ప్రభుత్వ పాఠశాలలు సిద్ధమయ్యాయి. ఉన్నత పాఠశాలల్లో భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయగా, ప్రాథమిక పాఠశాలల్లోనూ నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఇప్పటికే పలు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆహ్వానలేఖను తయారు చేయించి, ప్రముఖులకు, తల్లిదండ్రులకు అందజేశారు. -న్యూస్‌టుడే, మైలవరం


వర్షం వస్తే ఇంతే

చిన్నపాటి వర్షానికే గొల్లపూడి బైపాస్ రహదారిపై నీరు నిలిచిపోతుంది. ముఖ్యంగా రహదారి ఒక వైపు పల్లంగా ఉండటం కారణంగా నీరు నిలిచిపోతుంది. నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా డివైడర్ అడ్డుగా ఉంది. డివైడర్ దిగువన పైపులను అమర్చితే వర్షపు నీరు వెళ్లిపోయేందుకు అవకాశం ఉండేది. ఆ విధంగా లేకపోవడంతో రహదారిపైనే నీరు గంటల తరబడి నిలిచి ఉంటుంది. దీంతో అటుగా వెళ్లే వాహనచోదకులు ఇబ్బందులు పడుతుంటారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గొల్లపూడి



రోడ్డు వెంబడి నీరు నిలుస్తోందిలా.. (పాత చిత్రం)

సందడిగా ఆత్మీయ సమావేశం



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో 1975-80లో 6 నుంచి 10వ తరగతి వరకు అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని చిన్ననాటి తీపి గుర్తులను గుర్తుచేసుకుంటూ ఆనందగా గడిపారు. అనంతరం విశ్రాంత, ప్రస్తుతం బడిలో పనిచేస్తున్న 24 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు అభ్యసిస్తున్న 360 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు బహూకరించారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు



నిందితులతో సీఐ గిరిబాబు, ఎస్సై సత్యనారాయణ, తహసీల్దారు ఉదయ్‌భాస్కర్, సిబ్బంది

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో గంజాయి తరలిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ కె.గిరిబాబు, ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణంలోని ఎన్నెస్పీ కాలనీ వద్ద తనిఖీలు చేస్తుండగా సదరు నిందితులు 5 కిలల గంజాయితో దొరికినట్లు పేర్కొన్నారు. తిరువూరు తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, వీఆర్వోలు సత్తార్, నాగుల్‌మీరా సమక్షంలో అరెస్టు చేసినట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీలేరు నుంచి తిరువూరు తీసుకువచ్చిన గంజాయిని వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తున్న పట్టణంలోని రాజుపేటకు చెందిన కోట ఆకాష్, నాగవరపు కల్యాణ్ (నడిమి తిరువూరుకు) చావల రాజు (చింతలపాలెం), కంచెపోగు వెంకటేశ్వరరావు (అక్కలపాలెం), నాగుల వైష్ణవ్‌కుమార్ (పోలిశెట్టిపాడు)లు పోలీసులకు చిక్కారు. నిందితులను తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించడంతో నూజివీడు ఉప కారాగారానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్సీ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ వ్యాగన్ వర్క్‌షాపుశాఖ బుధవారం గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా వర్క్‌షాపు శాఖ కార్యదర్శి జి.సురేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాల ద్వారా కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన హక్కులను తుంగలో తొక్కుతోందన్నారు. భవిష్యత్తులో కార్మిక మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి నెలకొంటుందన్నారు. 8వపే కమిషన్‌ను వెంటనే నియమించాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తిచేయాలని, రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. బ్రాంచి అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, కార్యనిర్వహక అధ్యక్షుడు దాసరి డేవిడ్, నాయకులు విమల్ సాయి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపు ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మాకు నష్టం తేవొద్దు



మైలవరం పంచాయతీ కార్యాలయ కూడలిలో నినాదాలు చేస్తున్న కార్మికులు



గంపలగూడెం: అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉద్యోగుల ప్రదర్శన

న్యూస్‌టుడే, బృందం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కార్మికవర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు, సహకార సంఘాల నాయకులు వాపోయారు. బుధవారం సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని.. కార్మికుల సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. మండల కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసి వినతిపత్రాలు అందజేశారు.



రింగుకూడలిలో నిరసన తెలుపుతూ..



ఎ.కొండూరులో...

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప పెట్రోల్ బంక్ వద్ద బుధవారం అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొని తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడేనికి చెందిన ఎం.శంకర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో శంకర్ పాటు ద్విచక్ర వాహనంపై ఉన్న మహారాష్ట్రకు చెందిన సోనుసింగ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు వినగడప గ్రామస్థుడైన బి.నాగరాజుకు చెందిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

గొల్లపూడి, న్యూస్‌టుడే: పాఠశాలలు, విద్యాభివృద్ధికి రాజు వేగేశ్న ఫౌండేషన్ సంచాలకులు ఆనందరాజు కృషి చేశారని బి.ఆర్.అంబేడ్కర్ పాఠశాల యాజమాన్య సభ్యులు ఆర్.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇటీవల మరణించిన ఆనందరాజుకు గొల్లపూడిలోని అంబేడ్కర్ పాఠశాలలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆనందరాజు పాఠశాలలో మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.10లక్షలు విరాళంగా అందించారని.. విద్యాదాత, సేవాగుణం కలిగిన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు.

పీసీబీతో ఏ అవకాశాలు?

ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ) పూర్తి చేసినవారికి యూజీ సైన్స్ రిసెర్చ్ ఓరియెంటేషన్‌లో ఏ ఉద్యోగావకాశాలుంటాయి? – ఎం.మనోజ్‌కుమార్

■ పీసీబీని సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీల్లో ఏ స్థాయిలో చేశారో మీరు చెప్పలేదు. ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన పీసీబీ కోర్సు ద్వారా విద్యార్థులు పీసీబీ డిజైన్, ఫ్యాబ్రికేషన్, అసెంబ్లీ, సాల్డరింగ్, టెస్టింగ్ లాంటి సాంకేతిక నైపుణ్యాలను పొందుతారు. దీనిలో డిప్లొమా చేసినవారు మొదట టెక్నీషియన్ స్థాయి ఉద్యోగాలు చేపట్టి, డిగ్రీ పూర్తి చేసి సర్టిఫికేషన్లు, నైపుణ్యాల అభివృద్ధి ద్వారా డిజైన్/ డెవలప్‌మెంట్/ టెస్టింగ్ ఇంజినీర్ స్థాయికి చేరుకోవచ్చు. రిసెర్చ్ ఓరియెంటెడ్ ఉద్యోగాల కోసం కనీసం పీజీ చేసి వుండాలి.

పీసీబీలో నైపుణ్యాలున్నవారికి కింది ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

పీసీబీ అసెంబ్లీ టెక్నీషియన్: చిన్న, మధ్య తరహా ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో పీసీబీ అసెంబ్లీ, సాల్డరింగ్, కంపోనెంట్ ఫిక్సింగ్, ప్రొటోటైప్ డెవలప్ చేస్తారు. జూనియర్ లెవెల్ టెక్నీషియన్‌గా ప్రారంభించి అనుభవంతో సీనియర్ టెక్నీషియన్/ అసెంబ్లీ సూపర్‌వైజర్ వరకు ఎదగవచ్చు.

పీసీబీ టెస్టింగ్ టెక్నీషియన్: కొత్తగా తయారుచేసిన పీసీబీలను వివిధ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉపయోగించి పరీక్షిస్తారు. సర్క్యూట్లలో ఏవైనా లోపం ఉంటే కనుక్కొని మరమ్మతు చేయడం కూడా ఈ ఉద్యోగ బాధ్యత.

పీసీబీ ఫ్యాబ్రికేషన్ ఆపరేటర్: ఫ్యాబ్రికేషన్ యూనిట్లలో మాస్క్, ప్రింటింగ్, డ్రిల్లింగ్, ప్లేటింగ్, కటింగ్ లాంటివాటిని పరిశీలించి మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్‌లో సహకరిస్తారు.

మెయింటెనెన్స్ టెక్నీషియన్: పరిశ్రమల్లో ప్యానెల్ బోర్డ్స్, కంట్రోల్ సిస్టమ్స్ మెయింటెనెన్స్‌లో పనిచేయవచ్చు.

సర్వీస్ టెక్నీషియన్: ఎలక్ట్రానిక్స్ పరికరాల సర్వీస్ సెంటర్లలో టీవీ, యూపీఎస్, ఇన్వర్టర్, మొబైల్ ఫోన్ సర్వీసింగ్‌లో అవకాశం ఉంటుంది.

స్వయం ఉపాధి: చిన్న స్థాయి పీసీబీ అసెంబ్లీ యూనిట్ పెట్టి ఎల్ఈడీ బల్బులు, సోలార్ పవర్ సప్లైస్, చార్జర్ సర్క్యూట్లు లాంటి ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌లో సరఫరా చేయవచ్చు. డిప్లొమా తరువాత డిగ్రీ, ఆపై ఎంటెక్ ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ లాంటి విభాగాల్లో పీజీ, ఆ పై అవకాశం ఉంటే పీహెచ్‌డీ కూడా చేస్తే పరిశ్రమల్లో, పరిశోధన సంస్థల్లో మెరుగైన ఉద్యోగం పొందవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



పేరున్న ఓ సిమెంట్ కంపెనీలో ట్రెయినీగా చేరాడు రమేష్. అక్కడ ఉద్యోగులు తమ నైపుణ్యాలు, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకుంటూ తరచూ సోషల్ ఈవెంట్స్‌లో పాల్గొంటూ సంస్థ లక్ష్యాన్ని సాధించడానికి కలిసి పనిచేస్తారు ('కొలాబరేటివ్ వర్కింగ్'). రమేష్ దీనికి దూరంగా ఉండిపోవడంతో సాంకేతిక ప్రతిభ బాగున్నప్పటికీ అతడికి కొత్త ప్రాజెక్టులు ఇవ్వడం లేదు. ఆ సంస్థ సంస్కృతికి తాను అడాప్ట్ కాలేక మరో చిన్న కంపెనీలో చేరాల్సివచ్చింది.

మార్పును స్వీకరిస్తారా?

ఇలా కాకూడదంటే.. ఉద్యోగులు సంస్థ అంతర్గత, బాహ్య వాతావరణంలో సంభవించే మార్పులను స్వీకరిస్తుండాలి. కొత్త పరిస్థితులకు తగినట్టు తమ పని విధానాలు, వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. ఈ సామర్థ్యం (అడాప్టబిలిటీ) ఉన్నవారినే కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగులుగా ఎంపిక చేసుకుంటాయి.

కంపెనీ పాలసీలకు అడాప్ట్ కానందున 2024-25 సంవత్సరంలో సుమారు 33 శాతం మంది ఫ్రెషర్స్ ఉద్యోగాలు కోల్పోయారని గణాంకాలు తెలియజేస్తున్నాయి.

▼ ఎకనామిక్ టైమ్స్ (హెచ్.ఆర్. వరల్డ్) 2023-24 నివేదిక ప్రకారం మొదటి పది స్థానాల్లో ఉన్న టైర్ 1 కాలేజీల్లో ఎంబీఏ చదివి కార్పొరేట్‌లో జాయిన్ అయినవారిలో తొలి సంవత్సరం అట్రిషన్ (ఉద్యోగులు మానేయడం) రేటు 40% గా ఉంది.

▼ బీటెక్, బీకాం గ్రాడ్యుయేట్లలో ఒక సంవత్సరంలోపే ఉద్యోగాలు మానేసిన (ఇన్‌ఫాంట్ అట్రిషన్) వారి సంఖ్య 33%గా ఉందని 'డెలాయిట్ సర్వే' చెప్తోంది.

ఫ్రెషర్స్ ఉద్యోగాలు మానడానికి ఉన్న కారణాల్లో పోటీ సన్నద్ధతకు అనుకూలంగా తమను తాము మార్చుకోలేకపోవడం ఒక ముఖ్యమైనదని సర్వేలు తెలుపుతున్నాయి.

వీటితో తిరుగుండదు

కొత్త సవాళ్లను ఎదుర్కొని మార్పును స్వీకరించడానికి ఉద్యోగికి సహాయపడే అనేక రకాల అడాప్టబిలిటీ నైపుణ్యాలను 'సెంటర్ ఫర్ క్రియేటివ్ లీడర్ షిప్' అనే సంస్థ గుర్తించింది.

1. జ్ఞాన సంబంధ అనుకూలత (కాగ్నిటివ్ అడాప్టబిలిటీ): మారుతున్న కొత్త పరిస్థితులకు స్పందిస్తూ ఆలోచనలూ, వ్యూహాలను మార్చుకోగలగడం, క్లిష్ట సమస్యలను పరిష్కరించటం, కొత్త సమాచారాన్ని త్వరగా గ్రహించి అమలు చేయడం లాంటివి. ఇవి ఉన్న ఉద్యోగులు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రాజెక్ట్ అవసరాలను సులభంగా అర్థం చేసుకోగలరు. కంపెనీల పరంగా చూస్తే... డీవీడీల రెంటల్ సర్వీసెస్ నడిపే నెట్‌ఫ్లిక్స్ సంస్థ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని స్ట్రీమింగ్‌కు మారి ఘన విజయం సాధించింది. ఒకప్పుడు విజయవంతమైన నోకియా మొబైల్ సంస్థ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోలేక వెనకబడిపోయింది.

2. భావోద్వేగ అనుకూలత: అనిశ్చితిని ఎదుర్కోవలసి వచ్చినపుడు ఉద్యోగులు భావోద్వేగాలను గుర్తించి వాటిని నియంత్రించి సానుకూల వైఖరిని కొనసాగించే సామర్థ్యం. ఈ ఎమోషనల్ అడాప్టబిలిటీ ఉన్నవారు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోగలరు. సవాళ్లు ఎదురైనప్పుడు సంయమనం కోల్పోకుండా ఉంటూ సహోద్యోగులకు, బృంద సభ్యులకూ ఆసరాగా ఉంటారు.

3. పరస్పర అనుకూలత: విభిన్న దృక్పథాలున్న వ్యక్తులతో సమర్థంగా సంభాషించడం, వారి పనికి సహకరించడం, కలిసి పనిచేయడం. ఈ నైపుణ్యం ఉన్నవారు చురుకుగా వినడం, సానుభూతితో ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకుంటూ, ప్రతి ఉద్యోగినీ గౌరవిస్తుంటారు. నేటి 'వర్క్ ఫ్రమ్ హోమ్' పని వాతావరణంలో మానవ సంబంధాలను నిర్మించడానికీ, వ్యక్తుల మధ్య విభేదాలను పరిష్కరించి సానుకూల బృంద సంస్కృతిని పెంపొందించడానికి బలమైన ఇంటర్ పర్సనల్ రిలేషన్స్ అవసరం.

4. సృజనాత్మక సమస్యా పరిష్కారం: ఈ నైపుణ్యం కలిగిన ఉద్యోగులు 'అవుట్ ఆఫ్ ది బాక్స్' ఆలోచనలతో జటిల సమస్యలకు అసాధారణ పరిష్కారాలను సూచించగలరు. వ్యాపార సంస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నందున సృజనాత్మక సమస్యా పరిష్కారం అనేది ఉద్యోగుల్లో విలువైన నైపుణ్యంగా మారింది.

5. చురుకైన అభ్యాసం: ఎంచుకున్న రంగంలో నిరంతరం అప్‌డేటెడ్‌గా ఉంటూ కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నించడం. 'గ్రోత్ మైండ్ సెట్'తో వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనం ద్వారా అవకాశాలను చురుకుగా వెతకడం. మార్పునకు అనుగుణంగా కొత్త బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండటం.

6. ట్రెండ్‌ని అందిపుచ్చుకోవటం: మారుతున్న మార్కెట్ ట్రెండ్స్‌ను, కొత్త టెక్నాలజీని అర్థం చేసుకుని ఆ మార్పులకు అనుగుణంగా మారడం. ఇందుకు నిరంతర సాధన అవసరం.

కార్పొరేట్ ప్రపంచంలో కొత్తగా అడుగు పెట్టాలని భావించే యువతకు 'అడాప్టబిలిటీ' జీవన విధానంగా కూడా ఉండాలి. పైన పేర్కొన్న సూత్రాలను పాటిస్తూ వాటిని రోజువారీ కార్యక్రమాల్లో అలవరచుకోవాలి. అప్పుడే కార్పొరేట్ సంస్థలు ఎదురుచూసే సరైన అభ్యర్థిగా విజయవంతమైన కార్పొరేట్ కెరియర్‌ను నిర్మించుకోవడం సాధ్యం!



దొరైరాజ్
ప్రముఖ కార్పొరేట్ సంస్థలో సీనియర్ జనరల్ మేనేజర్

కోస్ట్ గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్స్

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్.. పురుషుల నుంచి 170 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

▶ అసిస్టెంట్ కమాండెంట్ (జనరల్ డ్యూటీ - జీడీ): 140 ▶ అసిస్టెంట్ కమాండెంట్ (టెక్నికల్ - ఇంజినీరింగ్ & ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్): 30

అర్హత: జనరల్ డ్యూటీ కోసం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు. ఇంటర్మీడియట్ లేదా డిప్లొమాలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ ఉండాలి. టెక్నికల్ బ్రాంచ్ కోసం సంబంధిత ఇంజినీరింగ్ శాఖల్లో డిగ్రీ (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ తదితరాలు). ఫైనలియర్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: 21 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. కోస్ట్ గార్డ్/ఆర్మీ/నేవీ/ఎయిర్ ఫోర్స్ సిబ్బందికి, ఎస్సీ/ఎస్టీలకు 5 సంవత్సరాలు, ఓబీసీ (నాన్-క్రీమీ లేయర్) కు 3 సంవత్సరాల సడలింపు ఉంది. **మూల వేతనం:** రూ.56,100+ ఇతర అలవెన్సులు. **ఎంపిక:** 5 దశల్లో. **సీజీక్యాట్ (స్టేజ్–I):** కంప్యూటర్ బేస్డ్ పరీక్ష. **పీఎస్‌బీ (స్టేజ్–II):** అర్హతా పరీక్షలు & గ్రూప్ డిస్కషన్. **ఎఫ్ఎస్‌బీ (స్టేజ్–III):** సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టాస్క్ & ఇంటర్వ్యూ. **మెడికల్ టెస్ట్ (స్టేజ్–IV):** న్యూదిల్లీ బేస్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు. **ఇండక్షన్ (స్టేజ్–V):** మొత్తం మెరిట్ ఆధారంగా తుది ఎంపిక. ▲ పరీక్ష ఫీజు రూ.300. ఎస్సీ/ఎస్టీలకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.07.2025

వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in

వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంటర్న్‌షిప్స్

కంటెంట్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: బుక్స్‌యాప్ నైపుణ్యాలు: కేన్వా, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.3,000-5,000 ☛ https://lnk.ink/UUvZ9

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: కిఫేటి హెల్త్ నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, నోడ్.జేఎస్, నోఎస్‌క్యూఎల్, రియాక్ట్, ఎస్‌క్యూఎల్
స్టైపెండ్: రూ.5,000-7,500 ☛ https://lnk.ink/nnklU

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ట్యాక్స్‌హెల్ప్‌ప్రో నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.3,500-5,000 ☛ https://lnk.ink/UN4Vs

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 1

చదువు

■ **e-mail:** edc@eenadu.in

నౌకాదళంలో మ్యుజీషియన్లు

భారతీయ నౌకాదళం అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ మ్యుజీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పదో తరగతి విద్యార్హతతో వీటికి పోటీ పడొచ్చు. మహిళలూ అర్హులే. వాద్య పరికరాల్లో ప్రావీణ్యం ఉండాలి. ఎంపికైనవారు నాలుగేళ్లు సేవలందిస్తారు. అనంతరం వీరిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగానికి అవకాశమిస్తారు. అందరికీ సర్టిఫికెట్, ఆర్థిక ప్రోత్సాహకాలు అందుతాయి.

తాజా నోటిఫికేషన్ 2025(2) ఇన్‌టేక్‌కు చెందింది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. పరీక్షల్లో ఎంపికైనవారికి శిక్షణ అనంతరం విధుల్లోకి తీసుకుంటారు. వీరికి ఐఎన్ఎస్, చిలకలో ఈ సెప్టెంబరు నుంచి శిక్షణ మొదలవుతుంది.

పదో తరగతిలో పొందిన మార్కుల మెరిట్‌తో దరఖాస్తులు వడపోస్తారు. వీరు పంపిన వాద్య పరికరాల్లో ప్రావీణ్యానికి సంబంధించి సర్టిఫికెట్లు పరిశీలించి, సంతృప్తి చెందితే ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టు (పీఎఫ్‌టీ), మ్యూజిక్ ఎబిలిటీ టెస్టుల కోసం పిలుస్తారు. వీటిని ఈ జులై చివరలో లేదా ఆగస్టు ప్రారంభంలో నేవీ కేంద్రాల్లో నిర్వహిస్తారు.

పీఎఫ్‌టీలో 1.6 కి.మీ. దూరాన్ని పురుషులు 6 నిమిషాల 30 సెకన్లలో, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. ఇక్కడ విజయవంతమైతే.. పురుషులు 15 పుష్ అప్స్, 15 బెంట్ నీ సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 10 పుష్ అప్స్, 10 బెంట్ నీ సిట్ అప్స్, 15 స్క్వాట్స్ చేయగలగాలి. ఇవన్నీ అధిగమిస్తే మ్యూజిక్ ఎబిలిటీ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో విజేతలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఏ సమస్యా లేనివారిని శిక్షణ అనంతరం ఉద్యోగానికి తీసుకుంటారు.

ముఖ్య వివరాలు

అర్హత: పదో తరగతిలో 50 శాతం మార్కులతో పాటు, వాద్య పరికరాలపై ప్రావీణ్యం ఉండాలి. ఇందుకు సంబంధించి డిగ్రీ/డిప్లొమా/గ్రేడ్/కాంపిటీషన్ సర్టిఫికెట్ వీటిలో ఏదో ఒకటి ఉండాలి. గుర్తింపు పొందిన లేదా పేరున్న సంగీత సంస్థ నుంచి సర్టిఫికెట్ అవసరం. **ఎత్తు:** 157 సెం.మీ. తప్పనిసరి. అవివాహితులై ఉండాలి. **వయసు:** సెప్టెంబరు 1, 2004 - ఫిబ్రవరి 29, 2008 మధ్య జన్మించాలి. **ఆన్‌లైన్ దరఖాస్తు గడువు:** 13.07.2025 **వెబ్‌సైట్:** https://www.joinindiannavy.gov.in/

ప్రోత్సాహకాలు

తొలి ఏడాది ప్రతి నెలా రూ.30,000 చెల్లిస్తారు. రెండో సంవత్సరం నెలకు రూ.33,000 వేతనం ఉంటుంది. మూడో ఏడాది రూ.36,500 అందుతుంది. నాలుగో సంవత్సరం రూ.40,000 ప్రతి నెలా పొందుతారు. ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. నాలుగేళ్ల వ్యవధికి సేవానిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని నుంచి జమవుతుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వమూ జత చేస్తుంది. రెండూ కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని కలిపి, అగ్నివీర్ నేవీ మ్యుజీషియన్లకు అందిస్తారు.

నాలుగేళ్ల వ్యవధి పూర్తిచేసుకున్నవారిలో ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని నేవీలో సెయిలర్ హోదాతో శాశ్వత ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు. శాశ్వత ఉద్యోగంలో అవకాశం రానివారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్/ఆంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. వీరు కార్పొరేట్, ప్రైవేటు సంస్థల్లో అవకాశాలు అందుకోగలరు.

తాజా ఉద్యోగ నోటిఫికేషన్లు, మిగతా ఇంటర్న్‌షిప్పుల కోసం https://epaper.eenadu.net చూడండి.

పెండింగ్ కోర్టు కేసుల సత్వర పరిష్కారం



శిక్షణలో పాల్గొన్న వారితో న్యాయమూర్తులు, న్యాయవాదులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వివిధ కోర్టుల్లోని పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం దిశగా దేశ వ్యాప్తంగా 90 రోజుల మీడియేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయమూర్తి గుత్తల గోపి తెలిపారు. విజయవాడ నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం మీడియేటర్ల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి పాల్గొని ప్రసంగించారు. కౌరవ, పాండవులకు శ్రీకృష్ణుడు మధ్యవర్తిగా వ్యవహరించినా.. వినకపోవడం వల్ల యుద్ధ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా జడ్జి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎంపిక చేసిన 11 బార్ అసోసియేషన్లకు చెందిన 64 మంది న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. తమిళనాడుకు చెందిన సీనియర్ ట్రైనర్లు సుదర్శన సుందర్, విజయ కమల శిక్షణ ఇచ్చారు. తొలుత కృష్ణా జిల్లా తొలి మీడియేటర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా నమూనా మధ్యవర్తిత్వం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీపీసీ సెక్షన్ 89 ప్రకారం కోర్టుల్లో దాఖలు చేసిన అన్ని రకాల కేసులను మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపాల్సి ఉందన్నారు. వైవాహిక సంబంధిత కేసులు మాత్రమే వస్తున్నాయని, సరైన ప్రాంగణ వసతి కావాలని కోరగా వీటిపై సానుకూల స్పందన లభించినట్టు పేర్కొన్నారు. 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్ తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ నుంచి లంకిశెట్టి బాలాజీ, అడపా మురళీ, గరిమెళ్ల ప్రభాకరరావు, జి.నాగేంద్రం, విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు పెనుమాల రాంబాబు, ఎ.శివరాం ప్రసాద్, సునీల, జయప్రభ, ఝాన్సీ, చంద్రకుమారి, జంగా జయలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో తెదేపా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

తీసుకున్న సొమ్ము తిరిగి ఇమ్మని అడిగినందుకు వైకాపా నాయకుడి బెదిరింపులు

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే



మాజీ సీఎం జగన్‌తో వేల్పుల రమేష్ దంపతులు (పాత చిత్రం)

అధికారంలో లేకపోయినా వైకాపా నాయకుల వేధింపులు ఆగడం లేదు. ఈ క్రమంలోనే ఓ వైకాపా నాయకుడి బెదింపులకు భయపడి తెదేపా కార్యకర్త మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కంచికచర్ల మండలం కీసరలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర గ్రామానికి చెందిన అంగిరేకుల రాంబాబు లారీ డ్రైవరు కాగా.. గతంలో సొంతంగా లారీలు కిరాయికి తిప్పి వ్యాపారం లేకపోవడంతో అమ్మేశారు. వచ్చిన నగదుతో పొలం కొందామనుకుంటున్నట్టు తన గ్రామానికే చెందిన జడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి భర్త, స్థానిక వైకాపా నాయకుడైన రమేష్‌కు చెప్పారు. ఇందుకోసం ముందుగా కొంత నగదు తనకు ఇమ్మని రమేష్ అడగడంతో రాంబాబు 2019లో రూ.18.50 లక్షలు ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన మీసాల కాంతారావు పొలం అమ్ముతాడని రాంబాబుకు చెప్పిన రమేష్.. అందుకు అడ్వాన్స్‌గా రూ.5 లక్షల నగదు కాంతారావుకు ఇచ్చాడు. నెలలు గడిచినా పొలం అమ్మకంపై ఏ విషయం తేల్చకుండా రమేష్, కాంతారావులు వాయిదాలు పెడుతూ వచ్చారు. కాంతారావును పొలం అమ్మకం విషయమై రాంబాబు నిలదీయగా.. తనకు నగదు రమేష్ ఇచ్చాడని, ఏదైనా ఉంటే అతడితోనే తేల్చుకోవాలని చెప్పడంతో రాంబాబు పొలమైనా ఇవ్వు.. లేదా నగదైనా తిరిగి ఇవ్వు అంటూ పలుమార్లు రమేష్‌ను అడిగారు. ఈ విషయంపై గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినా రమేష్ నగదు ఇవ్వలేదు. గత మార్చిలో తన సొమ్ము ఇవ్వాలని ఇంటికెళ్లి అడిగిన రాంబాబుపై.. రమేష్ దుర్భాషలాడుతూ డీజిల్ పోసి చంపేందుకు ప్రయత్నించాడంటూ రాంబాబు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రమేష్‌పై కేసు నమోదు చేశారు.

తెదేపాలో ఉన్నా న్యాయం జరగలేదు: బాధితుడు



సెల్ఫీ వీడియోలో బాధితుడు రాంబాబు

తనకు అప్పులు ఉన్నాయని డబ్బులు ఇవ్వాలని మంగళవారం సాయంత్రం రమేష్‌ను రాంబాబు నిలదీయగా.. రమేష్ తన వర్గీయులతో కలిసి దుర్భాషలాడడమే కాకుండా బెదిరింపులకు దిగాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రాంబాబు జరిగిన విషయాన్ని సెల్ఫీ వీడియోలో రికార్డు చేశారు. 'తెదేపా కోసం కష్టపడినా తనకు న్యాయం జరగడం లేదు. ఇదే విషయంపై గత మార్చిలోనే కేసు నమోదైనా ఫలితం లేకపోయింది. తెదేపా అధికారంలోకి వచ్చినా వైకాపా నాయకుడి బెదిరింపుల నుంచి రక్షణ దొరకలేదు. ఇప్పటికీ వైకాపా నాయకుడి హవానే కొనసాగుతోంది. వైకాపా నాయకుడి నుంచి తనకు రావాల్సిన నగదు ఇప్పించి తనకు న్యాయం జరిగేలా చూడాలని' రాంబాబు.. మంత్రి నారా లోకేశ్‌ను వేడుకుంటూ స్థానిక గుడి వద్ద శీతల పానీయంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు రాంబాబును నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా వైకాపా నాయకుడు రమేష్‌పై ఇప్పటికే అర డజనుకు పైగా కేసులు నమోదయ్యాయి. అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

డెల్టా రైతుల కష్టాలు తొలగాయి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కృష్ణా-గోదారమ్మల కలయికతో డెల్టా ప్రాంత రైతాంగ కష్టాలు సమసిపోయాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద మంత్రి నిమ్మల, ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్‌లు జల హారతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కృష్ణా-గోదారమ్మలకు పసుపు, కుంకుమ సమర్పించడంతో పాటు చీర, సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో తొలిసారిగా నదుల అనుసంధానం చేసి భగీరథునిగా చంద్రబాబు చరిత్రలో తన పేరును లిఖించుకున్నారన్నారు. రైతుల కష్టాలు తీర్చడంతో పాటు ఎందరికో తాగునీటి కష్టాలు తొలగించారని చెప్పారు. పోలవరం నుంచి గోదారి జలాలు పట్టిసీమ ద్వారా ఇబ్రహీంపట్నం కృష్ణాలో కలపడానికి 2017లో చంద్రబాబు ఓ యజ్ఞమే చేశారన్నారు. ఎంపీ చిన్ని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి తప్పనిసరిగా జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెంకట గోపాలకృష్ణారావు, కొండపల్లి ఛైర్మన్ చిట్టిబాబు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు జంపాల సీతారామయ్య, ఉయ్యూరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల. పక్కన ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నీటి సంఘాల నాయకులు తదితరులు

వైకాపా పాపమే చింతలపూడి పథకానికి శాపమైంది

నరసాపురం(విస్సన్నపేట): మండలంలోని నరసాపురంలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .జిల్లాలోని మెట్ట ప్రాంతమైన తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల రైతులకు సాగునీటి వనరులు మెరుగు పరిచేందుకు చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి తెదేపా అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకెళ్లారని మంత్రి తెలిపారు. దురదృష్టమేమిటంటే వైకాపా పాలనలో జగన్ ఈ ప్రాజెక్టుపై ఈసీ పరిష్కరించకపోవడంతో ఇప్పుడు పలు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. కానీ దీనిని పూర్తి చేసి మెట్టప్రాంతమైన ఇక్కడి ప్రజలకు సాగు, తాగునీరు ఇవ్వాలని ప్రాధాన్యంగా తీసుకున్నామన్నారు.

పోలెండ్ కప్‌లో అనూషకు కాంస్యం



విజయవాడ క్రీడలు: నగరానికి చెందిన నెలకుదిటి అనూష పోలెండ్ కప్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నీలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు పోలెండ్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన అనూష మహిళల డబుల్స్ విభాగంలో తలపడి తృతీయ స్థానంలో నిలిచింది.

అమ్మా.. నాకేం కాలేదే..!

● కళ్లముందే కుమారుడికి గాయం.. ● తల్లడిల్లిన తల్లి ఆకస్మిక మృతి



తల్లి మృతదేహాన్ని ఒడిలోకి తీసుకుని రోదిస్తున్న అమర్నాథ్

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కళ్ల ముందే కన్న కొడుకు తల నుంచి రక్తం కారుతుంటే గుండె నీరుగారిన ఆ వృద్ధ తల్లి ఒక్కసారిగా కుప్పకూలి కన్నుమూసింది. ఈ హృదయవిదారక సంఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో బుధవారం చోటు చేసుకుంది. ఆస్తి వివాదంలో ఇరువురి మధ్య జరిగిన కొట్లాట..ఒక వృద్ధురాలి ఆకస్మిక మరణానికి కారణమైంది. ఎస్సై సీహెచ్. కృష్ణ తెలిపిన వివరాల మేరకు..ఎ.కొండూరు గ్రామంలో ఉన్న 80 సెంట్ల భూమి విషయమై పాత కొండూరుకు చెందిన యలమంచిలి పాండురంగారావు, కృష్ణారావుపాలేనికి చెందిన దమయంతికి, కంభంపాడు గ్రామానికి చెందిన కుదరవల్లి అమర్నాథ్ మధ్య కొంత కాలం వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం పాత కొండూరు చెరువు కట్టపై పాండురంగారావు, అమర్నాథ్ ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో అమర్నాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ క్రమంలో అమర్నాథ్ తల్లి కనకదుర్గ(70) తన కుమారుడి తల నుంచి రక్తం కారడం చూసి ఒక్కసారిగా కుప్పకూలి తుదిశ్వాస విడిచింది. తన తల్లి తలను ఒడిలో పెట్టుకుని అమర్నాథ్ రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమీప ప్రజలు చేరుకుని ఇరు వర్గాలను విడదీశారు. కనకదుర్గతోపాటు పరస్పరం దాడుల్లో గాయపడిన అమర్నాథ్, పాండురంగారావును ఎ.కొండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి తిరువూరు ఆస్పత్రికి తీసుకువచ్చారు. తీవ్ర గాయాలైన కుమారుడిని చూసి షాక్‌కు గురవడమే ఆమె ఆకస్మిక మృతికి కారణమై ఉంటుందని ఎస్సై తెలిపారు. క్షతగాత్రులిద్దరూ పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దేశ, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ కళాశాలలో సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభించామని అడ్మిషన్స్ విభాగం ఇన్‌ఛార్జి కె.శివరామకృష్ణ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీఎస్సీ(హెచ్‌అండ్‌హెచ్ఏ) కోర్సుకు ఇంటర్‌లో 40 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ -పాటిస్సెరీ కోర్సు, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి పర్యాటక శాఖ హోటళ్లతో పాటుగా ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం ఉందని, ఆసక్తి గలవారు ఈ నెల 21వ తేదీ లోపు ఎస్ఐహెచ్ఎంటీపీటీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9701343846, 91005 58006, 97004 40604 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.భార్గవి పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలు విడనాడాలి'



బీసెంట్‌రోడ్డు ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసనలో ఉద్యోగులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను విడనాడాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి చిలకలపూడి కళాధర్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా బుధవారం బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెడుతున్నారని.. ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమాన్ని మరోసారి చేపడుతోందన్నారు. బీమా ప్రీమియంపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేశారు. 3, 4 తరగతుల ఉద్యోగుల నియామకం చేపట్టాలని, నాలుగు సాధారణ బీమా కంపెనీలను విలీనం చేయాలని, పాత పింఛను విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, యూనియన్ నాయకులు ఎం.ఎస్.కె.ప్రసాద్, ఇ.వి.తులసీరావు, శ్రీనివాసకుమార్, జగన్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోదారమ్మ తరలివచ్చె.. రైతన్న తరించె..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పట్టిసీమ ఎతిపోతల (పోలవరం కుడి కాలువ) ద్వారా గోదావరి జలాలు, నగర శివారులోని పవిత్ర సంగమం వద్ద బుధవారం కృష్ణా నదిలో విలీనం అయ్యాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ఏడాది కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను సకాలంలో అందించి తమను ఆదుకుందని, రెండో ఏడాది కూడా సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

పట్టిసీమ నీటి విడుదల పెంపు

పట్టిసీమ నీటి విడుదలను బుధవారం దశల వారీగా పెంచారు. 22 పంపుల ద్వారా 7,788 క్యూసెక్కులు విడుదల చేశారు. గోదావరి జలాలు కృష్ణా నదిలో విలీనం అయిన క్రమంలో పులిచింతల ప్రాజెక్టు నుంచి తగ్గించారు. ప్రస్తుతం పవర్ హౌస్ ద్వారా 4,000 క్యూసెక్కులు విడుదల చేశారు.

పంట కాల్వలకు 8,980 క్యూసెక్కులు

కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 8,980 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 7,764, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 1,216 క్యూసెక్కుల మేర ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 4,001, ఏలూరు 1,204, బందరు 1,354, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,205 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.

వసుంధర

vasundhara@eenadu.net

పేదరికంతో చుట్టరికం చేసే కుటుంబం. దానికితోడు ముగ్గురు ఆడపిల్లలు. అయితేనేం అవేమీ ఆ అమ్మాయి కలలకు అడ్డుకాలేదు. ఊరంతా కలిసి మరీ ఆమెకు దన్నుగా నిలిచింది. అది నిలబెడుతూ ఆ అమ్మాయీ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతోంది. తాజాగా కజికిస్థాన్‌లో జరిగిన పోటీల్లో బంగారు పతకాల్నీ సాధించింది... 17 ఏళ్ల రెడ్డి భవాని!


భవాని

బంగారం ఒడిసిపట్టింది!



భవానిది విజయనగరం జిల్లా కొండకరకం గ్రామం. తల్లిదండ్రులు ఆదినారాయణ, మాధవి భవన నిర్మాణ కార్మికులు. ముగ్గురమ్మాయిల్లో రెండో సంతానం భవాని. తను వెయిట్ లిఫ్టింగ్ మీద ఆసక్తి పెంచుకుంది. ఊళ్లో నేర్చుకునే అవకాశాల్లేవు కానీ పొరుగూరు కొండవెలగాడలో సాధన చేయడమే కాదు, జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో రాణిస్తున్నవారూ ఉన్నారు. దీంతో తనూ నేర్చుకోవాలనుకుంది. వచ్చే ఆదాయంతో కుటుంబం గడవడమే కష్టం. ఉన్న ఇంటినీ పెద్దమ్మాయి పెళ్లికి అమ్మేసి, అద్దె ఇంటికి మారారు. ఇంకా ఇద్దరమ్మాయిలు ఉన్నారు. అయినా కూతురి కోరిక కాదనలేకపోయారు నాన్న. దీంతో కొండవెలగాడలో కోచ్ రాము వద్ద శిక్షణలో చేర్చారు.

సరైన శిక్షణకుతోడు ఆహారమూ కావాలి. అది పెట్టే స్థోమత భవాని కుటుంబానికి లేదు. ఆమె గ్రామానికి చెందిన ఆనంద్‌కీ వెయిట్ లిఫ్టింగ్‌లో ఆసక్తి. దానిలో రాణిస్తున్న భవాని పరిస్థితి తెలిసి, సాయపడాలనుకున్నారాయన. ఆమెను దత్తత తీసుకుని నెల నెలా ఆమె ఖర్చులు భరించడమే కాదు, గ్రామస్థులతో మాట్లాడి ఆమెకు ఆర్థిక సాయం అందేలా చేశారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్థులూ తనకి అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఏలూరులోని శాయ్ అకాడమీలో భవానికి సీటొచ్చింది. 2022 యూత్ నేషనల్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్యం సహా ఎన్నో పతకాలూ గెలుచుకుంది. ప్రస్తుతం ఔరంగాబాద్‌లోని సెంట్రల్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. తాజాగా కజికిస్థాన్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ యూత్ అండ్ జూనియర్ ఆసియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మూడు విభాగాల్లో (స్నాచ్, క్లీన్ అండ్ జర్క్, వెయిట్ లిఫ్టింగ్‌ల్లో) బంగారు పతకాలు గెలిచింది. 'పోటీల కారణంగా పదో తరగతి పరీక్షలు రాయలేకపోయా. దూరవిద్యలోనైనా చదువు కొనసాగిస్తా. బంగారు పతకాలు గెలవడం ఆనందంగా ఉంది. నాకు సాయంగా నిలిచిన ఆనంద్, కోచ్, ఊరి వాళ్లందరినీ మర్చిపోలేను. ప్రభుత్వం ఆదుకుని, సాయమందిస్తే 2026 కామన్‌వెల్త్, 2028 ఒలింపిక్స్‌ల్లో పతకాలు తప్పక సాధించగలను. ఇదే నా ఆశయం కూడా' అంటోంది భవాని.

– పి. శ్రీనివాసరావు, విజయనగరం

అయిదేళ్లకే వంద ప్రకటనల్లో..!

ఈమెవరు?


సారా

కొత్త సినిమాను ప్రకటించగానే అందులో నటీనటుల గురించి తెలుసుకోవాలని అభిమానులు ఆసక్తి చూపడం మామూలే! కానీ తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ కొత్త సినిమా ధురంధర్ ప్రకటించగానే హీరోయిన్ ఎవరో చూసి ఆశ్చర్యపోయారు. కొత్త హీరోయిన్ అనుకుని వెతికిన వాళ్లకి అలా షాక్ తగిలింది మరి. ఇంతకీ తనెవరంటే **సారా అర్జున్**. పేరు చెప్పగానే గుర్తుపట్టడం కాస్త కష్టమే. విక్రమ్ హీరోగా నటించిన 'నాన్న' సినిమా తెలుసుగా! దానిలో నటించిన చిన్న పాపనీ, క్లైమాక్స్‌లో తన నటనతో అందరిచేతా కంటతడి పెట్టించిన విధానాన్నీ మర్చిపోగలమా? ఆ పాపే సారా. ఇప్పుడు హీరోయిన్‌గా బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. తనది ముంబయి. దేశంలోనే అత్యధిక పారితోషికం అందుకున్న బాలనటిగా సారాకి గుర్తింపు ఉంది. నాన్న రాజ్ అర్జున్ నటుడు. అయితే తనకు అవకాశం వచ్చింది మాత్రం అనుకోకుండానే. ఓసారి కుటుంబంతో సరదాగా మాల్‌కి వెళ్లినప్పుడు ఓ యాడ్ సంస్థ ప్రతినిధులు ఆమెను చూసి, తమ ప్రకటనలో నటింపజేయాలనుకున్నారు. అమ్మానాన్నలూ ఒప్పుకోవడంతో అలా కెమెరా ముందుకు అడుగుపెట్టింది. అయిదేళ్లకే 100 వాణిజ్య ప్రకటనల్లో మెరిసిందట. తరవాత సినిమా అవకాశాలూ వచ్చాయి. తెలుగు, తమిళం, హిందీ, మలయాళ చిత్రాల్లో బాలనటిగా నటించింది. అవార్డులూ అందుకుంది. నిజానికి 'పొన్నియిన్ సెల్వన్'లోనూ ఐశ్వర్యరాయ్ చిన్నప్పటి పాత్ర 'నందిని'గా అందరి ప్రశంసలూ అందుకుంది సారా. అయితే అప్పటికీ చిన్న అమ్మాయిగానే చూశారంతా. ఒక్కసారిగా హీరోయిన్ అనేసరికి అందరూ ఆశ్చర్యపోతున్నారు. సారా చదువులోనూ ముందే. సెలవుల్లో షూటింగ్‌లకు హాజరయ్యేదట. 'ఇప్పటివరకూ నటనలో ప్రత్యేక శిక్షణేమీ తీసుకోలేదు. కానీ కోర్సులు మాత్రం చేయాలనుంది. మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనుంది' అంటోన్న 20 ఏళ్ల సారాకి ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా?

ప్లాస్టిక్‌తో పెన్‌కాన్వాస్..!


అమల

మనం వాడే పెన్నుల్లో 80శాతానికి పైగా ప్లాస్టిక్‌తో తయారుచేసినవే. వీటితో పర్యావరణానికి ముప్పని గ్రహించింది అమలా జోష్. 'పెన్‌కాన్వాస్' అంకురంతో ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా బయోడిగ్రేడబుల్ పెన్నులు కనిపెట్టిందీమె.

అమలది కేరళలోని మూలమట్టం. ఇడుక్కి సెయింట్ జోసెఫ్ కళాశాలలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తిచేసింది. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు ఓ సెమినార్‌కి వెళ్లింది అమల. అక్కడ పర్యావరణంపై ప్లాస్టిక్ ఎలాంటి దుష్పరిణామాలు చూపిస్తోందో తెలుసుకుంది. అందుకే దీన్ని రీసైక్లింగ్ చేసే పద్ధతులపై అధ్యయనం చేసింది. ఈ క్రమంలోనే మనం రోజూ వాడే వస్తువులకి ప్రత్యామ్నాయం ఉంటే బాగుణ్ణు అనుకుంది. అందులో భాగంగానే బయోడిగ్రేడబుల్ పెన్నుని తయారుచేయాలనుకుంది. దానికి అవసరమయ్యే మెటీరియల్, 3డీ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. కాలేజీ తరఫున అనేక సెమినార్స్‌లో తన ఆలోచనను పంచుకుంది. తన ప్రాజెక్టు నచ్చి కేరళ అంకురం 'రింక్' (రిసెర్చ్ ఇన్నొవేషన్ నెట్‌వర్క్ కేరళ) పెన్నుల తయారీకీ ప్లాట్‌ఫామ్‌తోపాటూ నగదునీ అందించింది. అంతేకాదు, కాలేజీ, ఇంక్యుబేషన్ సెంటర్, సెంట్రల్ గవర్నమెంట్ పథకం 'ఉష' నుంచి కూడా మద్దతు, ఆర్థిక సాయం లభించాయి. 'ప్రస్తుతం శాంపిల్స్ మాత్రమే తయారుచేశా. అవి అందరి మన్ననలూ పొందాయి. మార్కెట్‌లోకి తీసుకురావడానికి ఇంకో 500 పెన్నులు సిద్ధం చేస్తున్నా. ఒక విద్యార్థినిగా ఇదంతా చేయగలిగానంటే నా కుటుంబం, కాలేజీ అధ్యాపకులు అందించిన సహకారమే కారణం. వారి ప్రోత్సాహమే నన్ను ముందుకు నడిపించింది. మనం రోజూవాడే ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం బయోడిగ్రేడబుల్ వస్తువులుగా మార్చాలన్నదే నా భవిష్యత్ లక్ష్యం' అంటోంది అమల.


నర్మద

ఆమె కష్టానికి జాతీయ పురస్కారం!

పొట్టకూటికి పుట్టెడు కష్టాలు పడి... వలస వచ్చిన కుటుంబం ఆమెది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చేనేత వృత్తినే నమ్ముకున్న తండ్రి పట్టుదలను చూస్తూ పెరిగింది. పెళ్లయ్యాక భర్తదీ అదే పరిస్థితి. తనకు చేతనైన సాయం చేయాలనుకుంది గజం నర్మద. అలా ఈ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె ప్రయాణం తాజాగా మార్కెటింగ్‌లో జాతీయ చేనేత పురస్కారం అందుకునే వరకూ చేరింది.

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. సొంతూరు నల్గొండ జిల్లా కనగల్ మండలంలోని శాబ్దుల్లాపురం. నాన్న ముత్యాలు చేనేత కార్మికుడు. ఊరిలో పనులు లేకపోవడంతో నా చిన్నప్పుడే నల్గొండ పట్టణానికి వలస వచ్చేశాం. అక్కడే ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నా. తర్వాత యాదాద్రి జిల్లా పుట్టపాకకు చెందిన నరేంద్రతో వివాహమైంది. ఆయన కూడా చేనేత కార్మికుడే. అత్తారింట్లోనూ ఇవే పరిస్థితులు. అప్పుడే వీటిపై దృష్టి పెట్టాలి అనుకున్నా. మ్యాచింగ్స్, మిస్ మ్యాచ్ చేయడం లాంటి వాటిపై స్వతహాగానే అవగాహన ఎక్కువ నాకు. అదే ఈ రంగంలో రాణించడానికి కారణమైంది. నాకున్న పరిజ్ఞానంతో సంప్రదాయ డిజైన్లను నవీకరించాను.

భారత ప్రభుత్వం చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఇచ్చే జాతీయ స్థాయి పురస్కారాలకు 2023లోనూ దరఖాస్తు చేశారు నర్మద. కానీ ఎంపిక కాలేదు. అయినా నిరుత్సాహపడకుండా, 2024లోనూ ప్రయత్నించారు. దిల్లీలోని మూడు స్థాయిల్లో వడపోత తర్వాత తుది జాబితాకు ఎంపికయ్యారు. ఆగస్టు 7న రాష్ట్రపతి చేతుల మీదుగా మార్కెటింగ్ విభాగంలో పురస్కారం అందుకోనున్నారీమె. ఇదంతా మరిన్ని చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉపయోగపడుతుంది అంటారు నర్మద.

మహిళల అభిరుచులకు అనుగుణంగా రంగుల కలయికలో మార్పులు చేయించా. తయారు చేస్తే సరిపోతుందా... దానికి తగిన మార్కెట్ కూడా ఉండాలి కదా! అందుకే 2001లో హైదరాబాద్‌కు వచ్చాం. ఇక్కడ చిన్న దుకాణాలతో ప్రారంభించి పెద్ద షాపింగ్ మాల్స్ వరకూ మా డిజైన్లు చూపించాం. అవి నచ్చడంతో మార్కెట్లో ఆదరణ పెరిగింది. కానీ, అన్నీ చిన్నచిన్న ఆర్డర్లే. వ్యాపారం పుంజుకోవడానికి పన్నెండేళ్లు పట్టింది. అలా 2013లో 'నరేంద్ర హ్యాండ్లూమ్స్' పేరుతో సంస్థను రిజిస్టర్ చేయించా. రూ.లక్ష పెట్టుబడితో ప్రారంభమైన మా వ్యాపారం... ఇప్పుడు రూ.8 కోట్లకు చేరింది. ఇదంతా ఏళ్ల కష్టం. అంతా వర్డ్ ఆఫ్ మౌత్‌తోనే సాధ్యమైంది. ఇప్పుడు దిల్లీ, చెన్నై, ముంబయి, కోల్‌కతాల్లోని ప్రముఖ సంస్థలకు, వ్యాపారులకు వస్త్రాల్ని విక్రయిస్తున్నాం. మాలాంటి 300 చేనేత కుటుంబాలకు పని కల్పిస్తున్నా. ఒకప్పుడు కుల వృత్తి తిండి పెట్టదని చేనేతను వదులుకున్న వారే ఎక్కువ. అలాంటి రోజుల్ని దాటుకుంటూ వందల కుటుంబాలకు ఉపాధి ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. దీన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నా.

– సూరపల్లి రఘుపతి, చౌటుప్పల్
కొండ శ్రీనివాస్‌గౌడ్, సంస్థాన్ నారాయణపురం

గృహిణి బాధ్యత నిర్వర్తించాకే మహిళలకు వృత్తిజీవితం. అందుకే కెరియర్‌లో మొదట బాగా రాణించినా సీనియర్ స్థాయికి వచ్చాక పిల్లలు, పెద్దల్ని చూసుకోవాల్సి రావడంతో నెమ్మదిస్తున్నారు. ఈ విషయాన్ని మహిళలే అర్థం చేసుకోగలరు. అందుకే మా సంస్థలో మహిళలకు మెంటర్‌షిప్, అప్‌స్కిల్లింగ్, లీడర్‌షిప్ శిక్షణతోపాటు నానీ ఫీజునీ చెల్లిస్తున్నాం. ఇంటి పనుల్లో భార్యకు సాయపడాల్సిన అవసరాన్ని పురుష ఉద్యోగులకు వివరిస్తున్నాం. ఇవన్నీ సానుకూల ఫలితాల్ని ఇస్తున్నాయి. ఈ మార్పు అన్ని చోట్లా వస్తే, మరింత మంది మహిళల్ని మేనేజ్‌మెంట్ స్థానాల్లో చూస్తాం.



– షెఫాలీ గొరాడియా, ఛైర్‌పర్సన్, డెలాయిట్, దక్షిణాసియా

మీకు తెలుసా?

కొంతమంది ఎక్కువగా ఆలోచిస్తూ, బద్ధకంగా కనిపిస్తుంటారు. మీరూ అలాంటి అమ్మాయేనా? పర్లేదు... ఎందుకంటే ఎక్కువ ఐక్యూ ఉన్నవాళ్లు మిగతావారితో పోలిస్తే తక్కువ యాక్టివ్‌గా కనిపిస్తారట. ఆలోచించటంలో ఎక్కువ సమయం గడుపుతారని పరిశోధనలు చెబుతున్నాయి.





బంగారం - వెండి

9న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,440	90,400	1,09,817
విజయవాడ	96,415	92,700	1,10,600
ప్రొద్దుటూరు	96,700	88,960	1,08,500
రాజమహేంద్రవరం	98,180	90,000	1,20,000
విశాఖపట్నం	97,820	89,990	1,12,000
తమిళనాడు	------	90,000	1,20,000

మాంసాహారమే కావాలి అంటున్నాడు!

మా బాబుకి పదేళ్లు. కాయగూరలు తినడానికి ఇష్టపడడు. నాన్‌వెజ్‌నే ఎక్కువగా తింటున్నాడు. నెలకోసారి జ్వరం వస్తుంది. పూర్తిగా మాంసాహారంపై ఆధారపడటం వల్లే ఇలా జరుగుతోందా? ఈ వయసులో ఎలాంటి పోషకాహారం పెట్టాలి?

– సీత, వరంగల్

డియర్ వసుంధర


డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

మాంసాహారం తీసుకోవడం వల్ల మంచి ప్రొటీన్ లభిస్తుంది. కానీ, కాయగూరలు, పండ్లలో ఉండే విటమిన్లు శరీరానికి అందవు. అలానే వీటిల్లోని కార్బోహైడ్రేట్లు, ఫైబర్ జీర్ణకోశంలో మేలైన బ్యాక్టీరియాని వృద్ధి చేస్తాయి. అంతేకాదు, మన శరీరానికి రక్షణ కల్పించే కొన్ని రకాల రసాయనాలను కూడా వృద్ధి చేస్తాయి. ఇవన్నీ ఏవైనా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు త్వరగా కోలుకోవడానికి దోహదపడతాయి. పైగా కాయగూరలు, ఆకుకూరల్లోని విటమిన్ ఎ, సి, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, బోరాన్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవన్నీ మాంసాహారంలో ఉండవు. అందుకే తరచూ జబ్బు పడటం, ఇన్ఫెక్షన్లు పెరిగిపోవడం, త్వరగా నయం కాకపోవడం వంటివి జరుగుతాయి. రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయాలంటే ఫైటోన్యూట్రియంట్స్ తప్పనిసరి. పండ్లు, కాయగూరల్లో మాత్రమే ఇవి లభిస్తాయి. అందుకే పిల్లలకి కచ్చితంగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినడం చిన్నప్పటి నుంచీ అలవాటు చేయాలి. ఇకనుంచైనా మీ పిల్లాడికి నెమ్మదిగా వీటిని తినడం నేర్పించండి.

ప్రొటీన్‌బార్ తినొచ్చా?

నేనో ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నా. ఆఫీసుకి వెళ్లాలంటే రోజూ రెండుగంటలు ప్రయాణం చేయాలి. సమయం సరిపోక ఉదయం అల్పాహారం, సాయంత్రం చిరుతిండిగా ప్రొటీన్‌బార్లు తింటున్నా. ఇవి ఆరోగ్యానికి మంచిదేనా? భవిష్యత్‌లో వీటివల్ల ఏమైనా సమస్యలు వస్తాయా? వీటికి బదులుగా ఎలాంటి పోషకాహారం తీసుకోవచ్చు?

– ఓ సోదరి

ఉద్యోగం చేసే మహిళలకి వేళకు తినడం సాధ్యం కాకపోవచ్చు. మీరు అల్పాహారం, స్నాక్స్‌కి బదులుగా ప్రొటీన్ బార్లు తీసుకుంటున్నాను అన్నారు. ఇక్కడ మీరు ఒక విషయం గమనించాలి. మార్కెట్లో దొరికే ప్రొటీన్‌బార్లలో చాలారకాల రసాయనాలు, ప్రిజర్వేటివ్స్, చక్కెరలు కలుపుతారు. అందుకే వీటిని ఎంచుకున్నప్పుడు కచ్చితంగా కొన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. మీరు తినే బార్‌లో ఎన్ని ప్రొటీన్లు, కెలోరీలు, ఫైబర్ ఉన్నాయన్నది గమనించుకోవాలి. ఒక మీల్‌లో 250-350కెలోరీలు, 10-12గ్రా. ప్రొటీన్ అవసరం. అవి లభిస్తున్నాయో లేదో చూసుకొని మేలైనవాటిని ఎంపిక చేసుకోండి. ఇప్పుడు మీరు అల్పాహారంగా, చిరుతిండిగా తీసుకుంటున్న ఈ ప్రొటీన్‌బార్లు ప్రస్తుతానికి, అత్యవసరానికి ప్రత్యామ్నాయంగా ఉండొచ్చు. కానీ, దీర్ఘకాలంలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అవి రాకూడదంటే రోజుకి 300గ్రా. కాయగూరలు, 150గ్రా. పండ్లు తప్పక తీసుకోవాలి. ఈ పోషకాలన్నీ వేళకు శరీరానికి అందేలా చూసుకోవాలి. అందుకే అల్పాహారాన్ని నిర్లక్ష్యం చేయకండి. కుదరనప్పుడు ప్రత్యామ్నాయంగా మాత్రమే ప్రొటీన్‌బార్లను తీసుకోండి.



అప్పటివరకూ పోటీ పడతా!

వీఆర్ఓ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఎస్సై... ఈ ఉద్యోగాలన్నీ సాధించారు నవితా బోడ. తాజాగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా శిక్షణను పూర్తి చేసుకున్నారు. తన కలల ఉద్యోగం సాధించేవరకూ ఈ ప్రయాణం ఆగదంటున్నారామె!



మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మర్రిగూడెం మాది. నాన్న మంగీలాల్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) విశ్రాంత అధికారి. బీటెక్ పూర్తిచేశాక ఓ కార్పొరేట్ స్కూల్లో ఏడాదిపాటు టీచర్‌గా పనిచేశా. 2020లో సివిల్ ఎస్సైగా ఎంపికై వరంగల్ కమిషనరేట్ పరిధిలో నాలుగున్నరేళ్లు విధులు నిర్వర్తించా. అంతకు ముందు వీఆర్‌ఓగా ఎంపికై నాలుగు నెలలు పని చేశా. తర్వాత ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గానూ ఎంపికయ్యా. సీఐఎస్ఎఫ్‌లో ఎస్సైగా ఎంపికైనా రాష్ట్ర సర్వీసుల్లో ఉండాలనే ఉద్దేశంతో చేరలేదు. డీఎస్పీ కావాలన్నది నా లక్ష్యం. గతంలో గ్రూప్-1 ఇంటర్వ్యూ వరకూ వెళ్లినా ఎంపిక కాకపోవడంతో అది నెరవేరలేదు. డీఎస్పీ కొలువు సాధించేవరకూ ప్రయత్నిస్తూనే ఉంటా. అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)గా తెలంగాణ పోలీస్ అకాడమీలో నాలుగు నెలల శిక్షణను పూర్తిచేసుకున్నా. గతంలో కేవలం ఇండోర్ సబ్జెక్టులు ఉండేవి. మొదటిసారిగా మా బ్యాచ్‌తో రన్నింగ్, ఫైరింగ్ లాంటి ఔట్‌డోర్ అంశాల్నీ చేర్చారు. బ్యాచ్‌లో 96 మంది ఉండగా, వాళ్లలో 20 మంది మహిళలు. ఆల్‌రౌండర్‌గా ప్రతిభను చూపడంతో పాసింగ్ ఔట్ పరేడ్‌కు కమాండెంట్‌గా వ్యవహరించే అవకాశం దక్కింది. నాన్న యూనిఫాం సర్వీసులో పనిచేయడంవల్ల ఆయన నుంచి క్రమశిక్షణ అలవడింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ వచ్చా. సీబీఎస్ఈ స్కూల్ గేమ్స్‌లో జాతీయస్థాయిలో లాంగ్‌జంప్, హైజంప్, 100మీ. పరుగు పోటీల్లో పాల్గొన్నా.

– సత్యకుమార్ నీలి, నర్సింగి

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.



మానేయట్లేదు... మారుతున్నారు!


క్వైట్ క్విటింగ్... ఒకప్పుడు ఇదో పెద్ద ట్రెండ్. పని తాలూకా ఒత్తిడి, బర్న్‌ఔట్... కారణమేదైతేనేం 'ఈ ఉద్యోగం మా వల్ల కాదు' అంటూ ఎంతోమంది రాజీనామాలు సమర్పించేశారు. దీనిలో మహిళల వాటానే ఎక్కువ. అవును మరి... ఇంటా బయటా మల్టీటాస్కింగ్, కుర్చీ కదలకుండా గంటలకొద్దీ చేసినా విలువ లేకపోవడం, పదోన్నతుల్లో వెనకబడటం... వీటి బదులు ఉద్యోగం మానుకున్నంత ఉత్తమం లేదనుకున్నారు. కానీ ఇప్పుడు ఆలోచన మార్చుకున్నారు. పనిచేసే శక్తి, సామర్థ్యాలు ఉండీ ఎందుకు వెనకడుగేయాలి? అనే ఆలోచిస్తున్నారు అమ్మాయిలు. కాబట్టే, క్వైట్ క్విటింగ్‌ను కాదని 'క్వైట్ థ్రైవింగ్' బాట పడుతున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే పని ప్రదేశంలోనూ సెల్ఫ్‌కేర్‌కి ప్రాముఖ్యమివ్వడమే ఈ ట్రెండ్. అమ్మాయిలకు ఓపిక ఎక్కువ. సకాలంలో కాదు, సమయానికి ముందే పని పూర్తి చేయడం వీరికి అలవాటు. ముఖ్యంగా పని ఏదైనా, వేళ కాని వేళైనా 'నో' చెప్పడానికి సంకోచిస్తారు. కాబట్టే, బర్న్‌ఔట్ బారిన పడే వారిలో ముందున్నారు. అందుకే వీటినే మార్చుకుంటున్నారు. ఒత్తిడికి గురిచేసే పర్‌ఫెక్షన్‌కి కాదు పని ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నారు. చిన్న చిన్న విజయాలను సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా పనివేళలకి పక్కా హద్దులు పెట్టుకుంటున్నారు. మల్టీటాస్కింగ్, వేళలు దాటి పనిచేయడానికి అస్సలే సిద్ధంగా ఉండట్లేదు. పని మధ్యలో విరామాలు, ఒత్తిడి సమయంలో చిన్నపాటి వ్యాయామాలు, రిలాక్సింగ్ టెక్నిక్‌లకు ప్రాధాన్యమిస్తున్నారు. నెగెటివ్ ఆలోచనలొస్తే తమకు తామే సానుకూలంగా మలచుకోవడం, బలాలను గుర్తుచేసుకోవడం చేస్తున్నారట. అసంతృప్తులను నోరు తెరిచి చెబుతున్నారు. ఒకరకంగా మనసుకు విశ్రాంతినిస్తూనే మెదడులో అసంతృప్తులు పోగవ్వకుండా చూసుకుంటున్నారు. అలాగని పని పక్కన పెడుతున్నారు అనుకునేరు. పక్కా ప్లానింగ్‌తో పూర్తిచేసుకుంటున్నారు. అదనపు భారాన్నే దింపేసుకుంటున్నారు. అంతేకాదు, ఈ క్రమంలో వాళ్లు ఎదగడానికి కొత్తగా నేర్చుకోవడం, తెలిసినవాటిని తోటి మహిళలతో పంచుకోవడం వంటివి చేస్తూ 'కలిసి ఎదుగుదాం' అన్న నినాదానికి తెరతీస్తున్నారు. బాగుంది కదూ ఈ 'క్వైట్ థ్రైవింగ్' ట్రెండ్!

చిట్టి గులాబీల చమక్కు!









చూడచక్కని రంగుల్లో, అందమైన ఆకృతిలో విచ్చుకునే గులాబీ అంటే మనసు పారేసుకోనివారు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ అవి గుత్తులు గుత్తులుగా విరబూస్తుంటే మనసుకెంతో ఆనందం. పైగా ముళ్లూ తక్కువగా ఉంటే మరింత సంతోషం. అలాంటివే ఈ బటన్‌రోజెస్. వీటినే మినియేచర్ గులాబీలని కూడా అంటారు. మరి వీటినెలా పెంచుకోవచ్చో చూద్దామా!

చైనా, యూరోపియన్ గులాబీలను సంకరం చేయడం ద్వారా అభివృద్ధి చేసిన రకం... బటన్ రోజ్. ఈ మినియేచర్ గులాబీకి 1800వ సంవత్సరంలో ప్రాణం పోశారట. తక్కువ కాలంలోనే దాన్ని అందంతో ఎక్కువ ఆదరణ పొందింది. దీన్ని ఎక్కడ పెంచినా ఆ ప్రదేశం అందాన్ని రెట్టింపు చేస్తుంది. తక్కువ ప్రదేశంలోనూ ఇవి చక్కగా ఎదుగుతాయి. అందుకే, వీటిని కంటైనర్ గార్డెన్స్, బాల్కనీలు... కాలి బాటల పక్కన ఎక్కడైనా పెంచుకోవచ్చు. దీనికి మెయింటెనెన్స్ తక్కువ. ఈ బటన్ రోజ్‌లు 1-2 అడుగుల ఎత్తు వరకూ పెరుగుతాయి. హ్యాంగింగ్ పాట్స్‌కీ ఇవి చక్కని ఎంపిక. బటన్‌రోజ్ ఆకులు చిన్నగా, నిగనిగలాడుతూ ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎరుపు, గులాబీ, పసుపు, తెలుపు, నారింజ... వంటి రంగుల్లో ఇవి విచ్చుకుంటాయి.

ఎలా పెంచాలంటే...

బటన్ గులాబీ మొక్కలు ఇంతటి ప్రజాదరణ పొందడానికి ప్రధాన కారణం... వాటి మెయింటెనెన్స్ సులువు కావడమే. ఇవి ఆరోగ్యంగా పెరగాలంటే కనీసం 4-6 గంటలు ప్రత్యక్ష సూర్యకాంతి ప్రసరించేలా చూసుకోవాలి. ఎండ ఎక్కువగా వచ్చే బాల్కనీల్లోనూ పెంచుకోవచ్చు. నీళ్లు నిలవని సారవంతమైన పొడి నేలల్లో వీటిని నాటుకుంటే మేలు. ఆమ్లతత్వం కోసం ఆ నేలలో కాసిని పటిక నీళ్లు అప్పుడప్పుడూ చల్లుకుంటే సరి. మట్టిలో కాస్త పెర్లైట్ లేదా ఇసుకని చేరిస్తే వేళ్లు కుళ్లవు. పొటాషియం ఎక్కువగా ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని నెలరోజులకోసారి ఇస్తే నిండుగా పూస్తాయి. పూలు పూయడం అయిపోయాక తప్పక ప్రూనింగ్ చేయాలి. వాడిపోయిన పువ్వులనూ ఎప్పటికప్పుడు తీసేయాలి. అప్పుడే పూలతో నిండుగా, ఆరోగ్యంగా ఎదుగుతాయి.

ఛాంపియన్

మధ్యాహ్నం 3.30 నుంచి


బుమ్రా

సిరీస్‌లో తొలి విజయం, అది కూడా భారీ తేడాతో సాధించిన ఉత్సాహం భారత్‌ది.. ఓడింది ఒక్క మ్యాచే, ఆడుతోంది సొంతగడ్డపై కాబట్టి పుంజుకోవడం కష్టమేమీ కాదన్న ఆలోచన ఇంగ్లాండ్‌ది.

బుమ్రా తిరిగొస్తుండడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచేదే. అటు ఆర్చర్ రాక తమ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేస్తుందని ఇంగ్లాండ్ భావిస్తోంది.

లార్డ్స్‌లో పేస్ పిచ్‌తో భారత్‌కు చెక్ పెట్టాలని ఇంగ్లిష్ జట్టు చూస్తుంటే.. ఆ వికెట్‌ను తాము మరింత బాగా ఉపయోగించుకోగలమని ధీమాగా ఉంది టీమ్‌ఇండియా.

ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక మైదానంలో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. 1-1తో సమానంగా ఉన్న సిరీస్.. లార్డ్స్‌లో ఎవరి వైపు మొగ్గుతుందో వాళ్లే అంతిమ విజేత అవుతారనే అంచనాల దృష్ట్యా ఆధిక్యం కోసం రెండు జట్లూ హోరాహోరీగా తలపడతాయనడంలో సందేహం లేదు.


ఆర్చర్


గిల్

జోరుగా హుషారుగా..

● విజయోత్సాహంతో టీమ్‌ఇండియా ● నేటి నుంచే ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు

లండన్


ఆకాశ్‌దీప్

లీడ్స్‌లో అనూహ్య ఓటమి చవిచూసినా, ఎడ్జ్‌బాస్టన్‌లో గొప్పగా పుంజుకుని ఇంగ్లాండ్‌ను ఏకంగా 336 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీమ్‌ఇండియా.. ఈ ఊపులో సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే లక్ష్యంతో గురువారం మూడో టెస్టులో బరిలోకి దిగుతోంది. ప్రఖ్యాత లార్డ్స్ మైదానం ఈ మ్యాచ్‌కు వేదికగా నిలవనుంది. ఎడ్జ్‌బాస్టన్‌లో గత భారత జట్లు 8 టెస్టులు ఆడినా గెలుపు రుచి చూడని పేలవ రికార్డును మార్చిన శుభ్‌మన్ సేన.. పేసర్ల స్వర్గధామంగా పేరున్న లార్డ్స్‌లో ఎదురయ్యే సవాలును ఎలా ఎదుర్కొంటుంది అన్నది ఆసక్తికరం. ప్రపంచంలోనే వేగవంతమైన పేసర్లలో ఒకడైన జోఫ్రా ఆర్చర్‌ను తుది జట్టులోకి తీసుకున్న ఇంగ్లాండ్.. భారత బ్యాటర్లకు సవాలు విసరాలని చూస్తోంది. అయితే పని భార నిర్వహణలో భాగంగా గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న బుమ్రా ఈ మ్యాచ్‌లో ఆడబోతుండడం ఇంగ్లిష్ బ్యాటర్లలోనూ గుబులు రేపుతూ ఉంటుందనడంలో సందేహం లేదు. ఎడ్జ్‌బాస్టన్‌లో అదరగొట్టిన ఆకాశ్‌దీప్, సిరాజ్‌లకు బుమ్రా కూడా తోడైతే భారత పేస్ దాడిని తట్టుకోవడం ఇంగ్లాండ్ బ్యాటర్లకు తేలిక కాదు.

ఆ ఒక్క మార్పేనా?: మూడో టెస్టుకు భారత తుది జట్టు ఎలా ఉంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌లో బుమ్రా ఆడనుండడంతో ఓ మార్పు ఖాయం. తొలి రెండు టెస్టుల్లో ధారాళంగా పరుగులిచ్చేయడమే కాక, ఆశించిన స్థాయిలో వికెట్లు తీయలేకపోయిన ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలోకి బుమ్రా వచ్చే అవకాశముంది. గత మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన నేపథ్యంలో వేరే మార్పులు చేస్తారా అన్నది సందేహం. పిచ్‌ను దృష్టిలో ఉంచుకుని జడేజాను మాత్రమే కొనసాగించి, మరో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను తప్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నప్పటికీ.. రెండో టెస్టులో బ్యాటింగ్‌లో రాణించడమే కాక, కీలకమైన స్టోక్స్ వికెట్ తీసిన అతణ్ని తుది జట్టులో కొనసాగించే సూచనలున్నాయి. ఒకవేళ అతడిని తప్పించాలనుకుంటే సాయి సుదర్శన్ తుది జట్టులో ఆడే అవకాశముంది. కరుణ్ నాయర్ అంచనాలను అందుకోనప్పటికీ అతడికి మరో అవకాశం దక్కవచ్చు. గత మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ నితీశ్ కుమార్ రెడ్డిని కూడా ఆడించనున్నట్లు సమాచారం. గిల్‌కు తోడు జైస్వాల్, పంత్, రాహుల్, జడేజా సూపర్ ఫామ్‌లో ఉండడం బ్యాటింగ్‌లో భారత్‌కు కలిసొచ్చే విషయం. మరి పేసర్లకు అనుకూలించే పిచ్‌పై వీళ్లెలా రాణిస్తారో చూడాలి. లోయరార్డర్ వైఫల్యం తొలి టెస్టులో భారత్‌ను ఎలా దెబ్బ తీసిందో తెలిసిందే. లార్డ్స్‌లో ఆ తప్పు జరగకుండా చూసుకోవాలి. బుమ్రా, ఆకాశ్‌దీప్, సిరాజ్‌లతో భారత పేస్ విభాగం చాలా బలంగా కనిపిస్తోంది. ఈ ముగ్గురూ అంచనాలకు తగ్గట్లు రాణిస్తే మ్యాచ్‌లో పైచేయి సాధించవచ్చు.

ఇంగ్లాండ్ శైలి మారుస్తుందా?: ఇంగ్లాండ్ బజ్‌బాల్ శైలి తొలి టెస్టులో మంచి ఫలితాన్నే ఇచ్చినా.. రెండో మ్యాచ్‌లో ఆ జట్టుకు ఎదురు దెబ్బ తప్పలేదు. రెండో టెస్టు చివరికొచ్చేసరికి బజ్‌బాల్‌ను పక్కన పెట్టి డ్రా కోసం ఆడక తప్పని పరిస్థితి నెలకొంది. మరి పేసర్లకు అనుకూలించే లార్డ్స్‌లో ఇంగ్లాండ్ తనదైన శైలిలో ఆడగలదా అన్నది ప్రశ్న. బుమ్రా నేతృత్వంలో భారత బౌలింగ్ బలంగా కనిపిస్తున్న నేపథ్యంలో దూకుడుగా ఆడే ప్రయత్నం చేస్తే కుప్పకూలే ప్రమాదం ఉంటుంది. మరి స్టోక్స్ సేన ఎలా ఆడుతుందో చూడాలి. ఆ జట్టులో బ్రూక్, జేమీ స్మిత్, డకెట్ ఫామ్‌లో ఉన్నారు. క్రాలీ, పోప్‌ల వైఫల్యం జట్టును ఇబ్బంది పెడుతోంది. స్టోక్స్ నుంచి కూడా జట్టు ఇంకా మెరుగైన ప్రదర్శన ఆశిస్తోంది. సత్తా చాటలేకపోతున్న బౌలింగ్ దళంలో ఆర్చర్ ఏమేర మార్పు తెస్తాడో చూడాలి. జోష్ టంగ్ స్థానంలో ఆర్చర్‌ను ఎంచుకున్న ఇంగ్లాండ్ ఇంకే మార్పులు లేకుండా బరిలోకి దిగుతోంది. వోక్స్, కార్స్‌ల నుంచి ఇంగ్లాండ్ మరిన్ని వికెట్లు ఆశిస్తోంది.

తుది జట్లు.. ఇంగ్లాండ్: క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్, వోక్స్, కార్స్, ఆర్చర్, బషీర్; **భారత్ (అంచనా):** యశస్వి, రాహుల్, కరుణ్ నాయర్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్, జడేజా, నితీశ్‌కుమార్, సుందర్/సాయి సుదర్శన్, ఆకాశ్‌దీప్, బుమ్రా, సిరాజ్.

బుమ్రా.. ఆర్చర్.. మధ్యలో పిచ్

మూడో టెస్టు ఆరంభం కాబోతుండగా.. అందరి దృష్టి పిచ్ మీద నిలిచింది. సిరీస్ తొలి రెండు టెస్టుల్లో పిచ్‌లు బ్యాటింగ్‌కు బాగా అనుకూలించాయి. ఇంగ్లాండ్‌లో సాధారణంగా వికెట్లు పేస్, స్వింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. కానీ ఆ సంప్రదాయ శైలిలో ఆ పిచ్‌లు కనిపించలేదు. మన బ్యాటర్లు ఉపఖండంలో ఆడుతున్నట్లే కనిపించింది. రెండు టెస్టుల్లోనూ ప్రధాన బ్యాటర్లు పరుగుల వరద పారించారు. దీంతో తమ బలానికి తగ్గట్లు మూడో టెస్టుకు పేస్ పిచ్ ఉండాలని జట్టు యాజమాన్యం కోరుకున్నట్లు వార్తలు వచ్చాయి. లార్డ్స్ మైదానం సాధారణంగానే పేసర్లకు అనుకూలిస్తుంది. బ్యాటర్లకు సవాలు విసురుతుంది. గత నెల ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లోనూ పేసర్లు చెలరేగారు. ఇప్పుడు అంతకుమించి పిచ్ పేసర్లకు సహకరిస్తే.. ఇరు జట్ల బ్యాటర్లకూ కష్టమే. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ పెద్దగా సహకరించకపోయినా బుమ్రా బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. లార్డ్స్ వికెట్‌పై అతను మరింత విజృంభించడం ఖాయం. ఇక నాలుగేళ్ల తర్వాత ఇంగ్లాండ్ జట్టులోకి వచ్చిన ఆర్చర్ మీద స్టోక్స్ చాలా ఆశలే పెట్టుకున్నాడు. అండర్సన్, బ్రాడ్ రిటైరయ్యాక పదును తగ్గిన పేస్ విభాగం తొలి రెండు టెస్టుల్లో తేలిపోయింది. ఆర్చర్ వేగం లార్డ్స్ పిచ్‌పై వికెట్ల పంట పండిస్తుందని ఆ జట్టు ఆశిస్తోంది. మరి బుమ్రా, ఆర్చర్‌ల్లో ఎవరు ఈ వికెట్‌ను బాగా ఉపయోగించుకుని ప్రత్యర్థిని దెబ్బ తీస్తారన్నది ఆసక్తికరం.

19 లార్డ్స్‌లో భారత్ ఆడిన టెస్టులు. 3 మ్యాచ్‌లు నెగ్గి, 12 ఓడిపోయింది. 4 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

45 భారత్‌పై టెస్టుల్లో 3 వేల మైలురాయిని అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలవడానికి జో రూట్‌కు అవసరమైన పరుగులు.

585 ప్రస్తుత సిరీస్‌లో గిల్ పరుగులు. అతను మరో 18 పరుగులు సాధిస్తే.. ఇంగ్లాండ్‌లో ఆడిన ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా 2002లో ద్రవిడ్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొడతాడు.

● ఈ మ్యాచ్‌కు ఇంగ్లాండ్ తుది జట్టులో చోటు దక్కించుకున్న ఆర్చర్.. చివరగా 2021 ఫిబ్రవరిలో టెస్టు మ్యాచ్ ఆడాడు. తన చివరి ప్రత్యర్థి కూడా భారతే.


స్టోక్స్

"ఆర్చర్ ఫిట్‌గా ఉన్నాడు. ససెక్స్ తరఫున ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకున్నాకే అతడిని జట్టులో చేర్చాం. నాలుగేళ్ల విరామం తర్వాత టెస్టు ఆడేందుకు అతడు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాడు. పేసర్లకు అనుకూలించే లార్డ్స్ పిచ్‌లో ఎలాంటి మార్పు లేదు"

- బెన్ స్టోక్స్, ఇంగ్లాండ్ కెప్టెన్


జ్యోతి సురేఖ, రిషబ్

ఫైనల్లో సురేఖ బృందం

మిక్స్‌డ్‌లో జ్యోతి, రిషబ్ ప్రపంచ రికార్డు

● ఆర్చరీ ప్రపంచకప్

మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4లో భారత ఆర్చర్లు అదరగొడుతున్నారు. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో టాప్‌సీడ్ భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లగా.. మిక్స్‌డ్ విభాగంలో జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్ ద్వయం ప్రపంచ రికార్డు సృష్టించింది. బుధవారం మహిళల టీమ్ సెమీస్‌లో జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, ప్రీతిక త్రయం 230-226తో ఇండోనేసియాను ఓడించింది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో 235-226తో ఎల్ సాల్వడార్‌ను చిత్తు చేసింది. మహిళల జట్టుకు టాప్‌సీడ్ దక్కడంలో తెలుగమ్మాయి జ్యోతి సురేఖది కీలకపాత్ర. క్వాలిఫికేషన్‌లో సురేఖ 715 పాయింట్లతో మొదటి స్థానం సొంతం చేసుకుంది. పర్ణీత్ కౌర్ (702) 7వ, ప్రీతిక ప్రదీప్ (699) 10వ స్థానాలు దక్కించుకున్నారు. పురుషుల్లో రిషబ్ 716 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించాడు. ప్రథమేశ్ (710) 10వ, అమన్ సైని (709) 11వ స్థానాల్లో నిలిచారు. క్వాలిఫికేషన్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేయడంతో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో జ్యోతి, రిషబ్ ద్వయం 1431/1440 స్కోరుతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. డెన్మార్క్ జట్టు (1429/1440) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును తిరగరాసింది. పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో రిషబ్, ప్రథమేశ్, అమన్ సైని బృందం క్వార్టర్‌ఫైనల్లో నిష్క్రమించింది. టాప్‌సీడ్‌గా బరిలో దిగిన భారత జట్టు 233-234 స్కోరుతో మెక్సికో చేతిలో పోరాడి ఓడింది.


సినర్

నెల కిందట ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను త్రుటిలో చేజార్చుకున్న ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు యానిక్ సినర్.. వింబుల్డన్‌లో మాత్రం ట్రోఫీని వదలొద్దనే పట్టుదలతో సాగిపోతున్నాడు. పచ్చ గడ్డిపై నిలకడగా ఆడుతున్న అతను.. సెమీస్‌కు దూసుకెళ్లాడు. ఫైనల్లో చోటు కోసం అతను తలపడబోయేది మాజీ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్‌తో. మహిళల సింగిల్స్‌లో సెమీస్‌లో టైటిల్ ఫేవరెట్ స్వైటెక్‌తో బెన్సిచ్ తలపడబోతోంది.

సినర్‌తో జకోవిచ్ సై


జకోవిచ్

● సెమీస్‌లో అగ్రశ్రేణి ఆటగాళ్ల అమీతుమీ ● స్వైటెక్, బెన్సిచ్ ముందంజ

లండన్: వింబుల్డన్‌లో సెమీస్‌లో అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య అమీతుమీ చూడబోతున్నాం. తొలి వింబుల్డన్ టైటిల్ కోసం ఉవ్విళ్లూరుతున్న ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్ (ఇటలీ), రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ మీద గురి పెట్టిన మాజీ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) సెమీస్‌లో తలపడబోతున్నారు. సూపర్ ఫామ్‌ను కొనసాగించిన టాప్ సీడ్ సినర్ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 7-6 (7-2), 6-4, 6-4తో బెన్ షెల్టన్ (అమెరికా)ను ఓడించాడు. 2 గంటల 19 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో పదో సీడ్ షెల్టన్ అంత తేలిగ్గా ఏమీ లొంగలేదు. ముఖ్యంగా తొలి సెట్లో సినర్‌ను బాగా కష్టపెట్టాడు. సినర్‌కు దీటైన ఆటతో సర్వీస్ నిలబెట్టుకుంటూ సాగాడు. ఒక్కసారీ బ్రేక్ సాధించే అవకాశం ఇవ్వలేదు. స్కోరు 6-6తో సమం కావడంతో టైబ్రేక్ అనివార్యమైంది. ఆరంభంలోనే సినర్ సర్వీస్ కోల్పోవడంతో షెల్టన్ సెట్ గెలిచి సంచలనం రేపుతాడా అనిపించింది. కానీ తర్వాత నాలుగుసార్లు బ్రేక్ సాధించిన సినర్ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్లోనూ షెల్టన్ ధాటిగానే ఆడాడు. కానీ పదో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సాధించిన సినర్.. మ్యాచ్‌పై పట్టు సాధించాడు. మూడో సెట్ కూడా ఇలాగే సాగింది. సరిగ్గా పదో గేమ్‌లోనే బ్రేక్ సాధించిన సినర్ సెమీస్‌లోకి అడుగు పెట్టాడు. 42 ఏస్‌లు సంధించిన సినర్.. 20 విన్నర్లు కొట్టాడు. అతను 9 డబుల్‌ఫాల్ట్‌లు చేశాడు. షెల్టన్ 57 ఏస్‌లు వేసినప్పటికీ.. 21 డబుల్‌ఫాల్ట్‌లు చేసి దెబ్బ తిన్నాడు. మరో క్వార్టర్స్‌లో ఆరో సీడ్ జకోవిచ్ 6-7 (6-8), 6-2, 7-5, 6-4తో ఇటలీ ఆటగాడు, 22వ సీడ్ ఫ్లావియో కొబొల్లిపై చెమటోడ్చి నెగ్గాడు.

స్వైటెక్ జోరు: మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ ఇగా స్వైటెక్ సెమీస్ చేరడానికి పెద్దగా కష్టపడలేదు. తనకు కలిసి రాని వింబుల్డన్‌లో తొలి టైటిల్ గెలవాలని పట్టుదలతో ఉన్న ఈ పోలెండ్ అమ్మాయి క్వార్టర్స్‌లో 6-2, 7-5తో 19వ సీడ్ సంసొనోవాను ఓడించింది. ఎనిమిదో సీడ్ స్వైటెక్ ఈ మ్యాచ్‌ను గంటా 49 నిమిషాల్లో ముగించింది. 19 ఏస్‌లు కొట్టిన స్వైటెక్.. 22 విన్నర్లు సంధించింది. సంసొనోవా 13 డబుల్ ఫాల్ట్‌లతో మూల్యం చెల్లించుకుంది. గురువారం జరిగే సెమీస్‌లో స్వైటెక్.. స్విట్జర్లాండ్ స్టార్ బెలిండా బెన్సిచ్‌ను ఢీకొంటుంది. హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో బెన్సిచ్ 7-6 (7-3), 7-6 (7-2)తో ఏడో సీడ్ ఆంద్రీవాకు చెక్ పెట్టింది. ఆరు ఏస్‌లు వేసిన బెన్సిచ్ 7 డబుల్‌ఫాల్ట్‌లు చేసింది. ఆంద్రీవా 15 ఏస్‌లు వేసినప్పటికీ.. 12 డబుల్‌ఫాల్ట్‌లు చేయడంతో ఓటమి తప్పలేదు. మరో మహిళల సెమీఫైనల్లో సబలెంకా, అనిసిమోవా తలపడతారు.

నేడు మహిళల సింగిల్స్ సెమీస్
స్వైటెక్ × బెన్సిచ్
సబలెంకా × అనిసిమోవా
సాయంత్రం 6 నుంచి

బంతి బాలేదు..


పంత్

లండన్: టెస్టు సిరీస్‌లో వాడుతున్న బంతుల నాణ్యతపై టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఎర్ర బంతి ఇంత త్వరగా రూపు మారడాన్ని తాను ఇంతవరకు చూడలేదని అన్నాడు. సిరీస్‌లో భాగంగా తొలి రెండు టెస్టుల్లో ఆటగాళ్లు బంతి మార్చాలని చాలాసార్లు అంపైర్లను సంప్రదించిన సంగతి తెలిసిందే. "డ్యూక్స్ బంతి సమస్యగా మారింది. త్వరగా రూపు మారుతోంది. ఇంత త్వరగా బంతి ఆకారం కోల్పోవడం నేను ఎప్పుడూ చూడలేదు. బంతి కొన్ని ఓవర్లకే మృదువుగా మారుతోంది. ఆ తర్వాత మళ్లీ కొత్త బంతి తీసుకునేవరకు బౌలర్లకు కష్టమవుతోంది. బ్యాటర్లు కూడా బంతి స్వభావానికి తగ్గట్టుగా ఆటను మార్చుకోవాల్సి వస్తోంది" అని చెప్పాడు.

హంపి విజయం

బాటుమి (జార్జియా): ప్రపంచ చెస్ కప్‌లో భారత స్టార్ ప్లేయర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక శుభారంభం చేశారు. బుధవారం రెండో రౌండ్ తొలి గేమ్‌లో ఉజ్బెకిస్థాన్ క్రీడాకారిణి అఫ్రుజాపై హంపి విజయం సాధించగా.. సహచరిణి పి.వి. నందిదను హారిక ఓడించింది. మరో గేమ్‌లో వంతిక.. ప్రపంచ మాజీ ఛాంపియన్ అన్నా ఉస్నెనా (ఉక్రెయిన్)కు షాకిచ్చింది. వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ కూడా విజయాలు అందుకున్నారు. రెండో గేమ్‌లో డ్రా చేసుకున్నా వీరంతా తర్వాత రౌండ్‌కు చేరతారు. ఓడితే.. టైబ్రేక్ ఆడాల్సి వస్తుంది. హంపి, హారిక నేరుగా రెండో రౌండు ఆడుతున్నారు.

గడ్డానికి రంగేస్తున్నామంటే..


కోహ్లి

లండన్: టీమ్‌ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు సన్నద్ధమవుతుండగా.. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు పెద్ద షాకే ఇచ్చాడు విరాట్ కోహ్లి. ముందు ఈ విషయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. తర్వాత నెమ్మదిగా అలవాటు పడిపోయారు. రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయం అనిపించిందని ఇంతకుముందు పేర్కొన్న విరాట్.. తాజాగా రిటైర్మెంట్‌పై సరదాగా మాట్లాడాడు. మంగళవారం భార్య అనుష్క శర్మతో కలిసి లండన్‌లో వింబుల్డన్ మ్యాచ్‌లు వీక్షించిన విరాట్.. తర్వాతి రోజు ఆ నగరంలోనే యువరాజ్ సింగ్ సేవా సంస్థ 'యువి కెన్' కోసం విరాళాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా టెస్టు మ్యాచ్‌లో కోహ్లి లేని లోటు గురించి ఓ విలేకరి ప్రస్తావించగా.. "రెండు రోజుల కిందటే నా గడ్డానికి రంగు వేశా. నాలుగు రోజులకోసారి ఇలా రంగేస్తున్నామంటే మనం పని పక్కన పెట్టి సరదాగా గడపాల్సిన సమయం వచ్చిందని అర్థం" అని కోహ్లి పేర్కొనడంతో అక్కడ నవ్వులు విరిశాయి. సచిన్, క్రిస్ గేల్, టీమ్‌ఇండియా ఆటగాళ్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టాప్-10లోకి గిల్

దుబాయ్: టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గణనీయమైన ప్రగతి సాధించాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో సత్తాచాటుతున్న గిల్ కెరీర్‌లో తొలిసారిగా టాప్-10లోకి దూసుకొచ్చాడు. బుధవారం ప్రకటించిన టెస్టు బ్యాటింగ్ జాబితాలో ఏకంగా 15 స్థానాలు మెరుగైన అతడు ఆరో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో మొదటి రెండు టెస్టుల్లో గిల్ 585 పరుగులు చేయడం విశేషం. అందులో మూడు సెంచరీలున్నాయి. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 4, వికెట్ కీపర్ రిషబ్ పంత్ 7 స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్ జాబితాలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఆల్‌రౌండర్లలో రవీంద్ర జడేజా నంబర్‌వన్ ర్యాంకులను నిలబెట్టుకున్నారు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. రోహిత్‌శర్మ 3, విరాట్ కోహ్లి 4, శ్రేయస్ అయ్యర్ 8వ స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్‌లో కుల్‌దీప్ యాదవ్ 2, రవీంద్ర జడేజా 9, మహ్మద్ షమి 13, సిరాజ్ 14వ స్థానాల్లో నిలిచారు.


భారత్-ఎ ఘనవిజయం

ఎన్డోవెన్ (ద నెదర్లాండ్స్): ఐరోపా పర్యటనలో భారత-ఎ హాకీ జట్టు శుభారంభం చేసింది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు 6-1తో ఘన విజయం సాధించింది. ఆదిత్య రెండు గోల్స్ సాధించగా.. ఉత్తమ్‌సింగ్, అమన్‌దీప్ లక్రా, సెల్వం కార్తీ, బాబీ సింగ్ ధామి తలో గోల్ కొట్టారు. ఐరోపా పర్యటనలో భాగంగా భారత జట్టు.. ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం, నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లు ఆడనుంది.

లా లిగా ఫుట్‌బాల్‌కు 9 మంది హైదరాబాదీలు

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక లా లిగా యూత్ ఫుట్‌బాల్ టోర్నీ (అండర్-16)లో 9 మంది హైదరాబాద్ ఆటగాళ్లు బరిలో దిగనున్నారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనే గ్రాస్‌హాపర్స్ (భారత్) జట్టులో హైదరాబాద్ నుంచి ఫవాజ్ మహ్మద్ ఖాన్, అమష్ యూసుఫ్ సుభాని, మహ్మద్ అబాన్ హుస్సేన్, మహ్మద్ ఆఘా తాహా ఖురేషి, మహ్మద్ మహబూబ్‌ఖాన్, ఐమాన్ సుభాని, అర్మాన్ హుస్సేన్, అంజేర్ ఖురేషి, ఫహద్ మహ్మద్‌ఖాన్ చోటు సంపాదించారు. రాజస్థాన్ నుంచి ముగ్గురు, మహారాష్ట్ర తరఫున ఇద్దరు, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నలుగురు జట్టుకు ఎంపికయ్యారు. ప్రముఖ స్పానిష్ ఫుట్‌బాల్ లీగ్ లా లిగా అధికారికంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో భారత్‌తో పాటు స్పెయిన్, చైనా, జపాన్, మలేసియా, ఇండోనేసియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, కొరియా జట్లు బరిలో దిగుతున్నాయి. తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ తలపడనుంది. అనంతరం ఇండోనేసియా, మలేసియా, థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లు ఉంటాయి.

ముల్డర్ తప్పు చేశాడు


గేల్


దిల్లీ: దిగ్గజ బ్యాటర్ బ్రయాన్ లారా (400 నాటౌట్) రికార్డును అందుకోకుండా దక్షిణాఫ్రికా కెప్టెన్ వియాన్ ముల్డర్ తప్పు చేశాడని వెస్టిండీస్ మాజీ ఆటగాడు క్రిస్ గేల్ అభిప్రాయపడ్డాడు. ముల్డర్ భయంతోనే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడని గేల్ అన్నాడు. జింబాబ్వేతో రెండో టెస్టులో ముల్డర్ 367 పరుగుల వద్ద ఉన్నప్పుడు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ (626/5)ను డిక్లేర్ చేశాడు. "367 పరుగుల వద్ద ఉన్నప్పుడు రికార్డు అవకాశాన్ని కచ్చితంగా అందిపుచ్చుకోవాలి. దిగ్గజ ఆటగాడిగా నిలవాలంటే ఆ పని చేయాలి. రికార్డు కోసం ప్రయత్నించకపోవడం ముల్డర్ వైపు నుంచి జరిగిన పొరపాటు. నాకు 400 పరుగులు చేసే అవకాశం లభిస్తే కచ్చితంగా పూర్తిచేస్తా" అని గేల్ పేర్కొన్నాడు.

ఆగస్టు 29 నుంచి పీకేఎల్ 12

ముంబయి: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-12కు ముహూర్తం కుదిరింది. ఆగస్టు 29న ఈ లీగ్ ఆరంభమవుతుందని నిర్వాహకులు ప్రకటించారు. మొత్తం 12 ఫ్రాంఛైజీలు టైటిల్ కోసం బరిలో ఉన్నాయి. మే 31, జూన్ 1న నిర్వహించిన వేలంలో పది మంది ఆటగాళ్లు కోటి రూపాయాల మార్క్ దాటడం విశేషం.

ఐఫోన్ దొంగిలించింది.. లక్షలు అప్పు తీసుకుంది: దయాళ్

దిల్లీ: ఓ మహిళను లైంగికంగా వేధించాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆటగాడు యశ్ దయాళ్ వివాదంపై స్పందించాడు. సదరు మహిళ తన ఐఫోన్ దొంగిలించిందని.. లక్షల రూపాయలు అప్పు తీసుకుందని ఆరోపించాడు. తనను మోసం చేసిన ఆ మహిళపై కౌంటర్ ఎఫ్ఐఆర్ కోరుతూ మూడు పేజీల ఫిర్యాదును దయాళ్ పోలీసులకు సమర్పించాడు. "తనతో పాటు కుటుంబ సభ్యుల వైద్య చికిత్స కోసం, షాపింగ్ కోసం లక్షల రూపాయలు అప్పుగా తీసుకుంది. తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదు" అని దయాళ్ ఆరోపించాడు.



తోతాపురి మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- కిలోకి రూ.4 మద్దతు ధరతో రూ.260 కోట్ల మంజూరు
- రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో 6.5 లక్షల టన్నుల తోతాపురి మామిడిని సేకరిస్తుండగా, ప్రభుత్వ మద్దతు ధరగా కిలోకి రూ.4 చొప్పున చెల్లించేందుకు రూ.260 కోట్లు మంజూరుచేసే నిర్ణయానికి ఆమోదం తెలిపారు. ధాన్యం సేకరణ బకాయిలు రూ.672 కోట్లు మంజూరుచేయగా, గురువారం నుంచి ఈ సొమ్ము రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి వెల్లడించారు.

క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్

■ అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అనే ప్రభుత్వ కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం. దీని ద్వారా దక్షిణాసియాలోనే మొదటిసారి ఏపీలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుచేయనున్నారు. రూ.4వేల కోట్ల పెట్టుబడులతో పాటు వేలమంది యువతకు ఉపాధి లభిస్తుంది.

■ రాష్ట్రప్రభుత్వం 2025-30 కాలానికి అంతరిక్ష రంగాభివృద్ధికి రూపొందించిన ఏపీ స్పేస్ పాలసీ 4.0కి ఆమోదం. దేశంలోనే ఈ రంగంలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు, స్పేస్‌టెక్నాలజీ, వాణిజ్య కార్యకలాపాల అభివృద్ధికి ఈ పాలసీ సహకరిస్తుంది.

■ జలజీవన్ మిషన్‌లో మ్యాచింగ్‌షేర్ కింద అవసరమైన రూ.10వేల కోట్లను రుణాల రూపంలో సమీకరించేందుకు.. స్వయం ప్రతిపత్తిగల సంస్థగా ఏపీ జలజీవన్ వాటర్ సప్లై కార్పొరేషన్ స్థాపనకు ఆమోదం తెలిపారు.

హరిత పన్ను భారం తగ్గిస్తూ..

- రవాణాశాఖలో వాహనాలకు హరిత పన్ను రూ.200 ఉండగా, గత ప్రభుత్వం దీన్ని గరిష్ఠంగా రూ.20వేల వరకు పెంచింది. దీనిని సవరించి.. రెండు శ్లాబులుగా రూ.1500, రూ.3000కు తగ్గించేలా నిర్ణయం. దీనిద్వారా 9.56 లక్షల మంది సరకు, ప్రజారవాణా వాహనదారులకు లబ్ధి చేకూరనుంది.
- జలవనరుల శాఖలో గతంలో ప్రారంభం కాని పనులు, 25%లోపు జరిగిన పనులను రద్దుచేయగా, ప్రజల అవసరాల దృష్ట్యా ఇందులో 71 పనులు చేపట్టేందుకు ఆమోదం.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తిచేసేలా..

● అమరావతిలోని నేలపాడులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌ల నివాస సముదాయాల పనులు వేగంగా పూర్తిచేయాలని మంత్రిమండలి నిర్ణయం. 18 భవనాల్లో 432 నివాసాలతో కూడిన బహుళ అంతస్తుల్లో మిగిలిన పనుల పూర్తికి రూ.524.7 కోట్ల మంజూరుకు ఆమోదం.

● రాజధాని నగరంలో భూసమీకరణ వల్ల జీవనోపాధి కోల్పోయిన నిరుపేదలకు గతంలో చంద్రబాబు ప్రభుత్వం పింఛన్లు మంజూరుచేయగా, వైకాపా ప్రభుత్వం వీటిని రద్దుచేసింది. ఇలాంటి 1,575 కుటుంబాలకు పింఛన్ల పునరుద్ధరణకు ఆమోదం.

కోకో రైతులకు కిలోకి రూ.50 మద్దతు ధర

■ కోకో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మద్దతు ధరగా కిలోకి రూ.50 చొప్పున చెల్లించేందుకు, రూ.14.88 కోట్ల మంజూరుకు ఆమోదం.

■ పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం గుండ్లపాడులో 2022 జనవరి 13న తోట చంద్రయ్య హత్యకు గురికాగా, అతడి కుమారుడు వీరాంజనేయులుకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగమిచ్చే ప్రతిపాదనకు ఆమోదం.

విమానాశ్రయాల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల రుణం

■ కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం విమానాశ్రయాల అభివృద్ధికి నిధుల, ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అత్యవసరాలు తీర్చేందుకు హడ్కో నుంచి రూ.వెయ్యి కోట్ల రుణం సమకూర్చుకునేందుకు ఆమోదం.

■ అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రతిపాదిత బల్క్ డ్రగ్ పార్క్ సరిహద్దుల సవరణ, ఏఎంఎన్ఎస్ఐ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ స్థాపనకు కేటాయించిన భూముల తరలింపు పరిహారంగా 790 ఎకరాలను అదనంగా సేకరించడం, ఏపీ బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు 2,001.8 ఎకరాలు బదలాయించి, వాటికి స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించడం, లేఔట్ ఆమోదం ఛార్జీల మినహాయింపు వంటి ఆరు ప్రతిపాదనలకు ఆమోదం.

■ రామాయపట్నంలో భూసేకరణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో 5 బృందాల ఏర్పాటుకు నిర్ణయం.

రైతులను ఒప్పించి భూసమీకరణ

రాజధానికి రెండోవిడత భూసమీకరణ కోసం రైతులను ఒప్పించేలా మంత్రివర్గ ఉపసంఘం వారితో సంప్రదించాలని సీఎం సూచించినట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో రెండోవిడత భూసమీకరణపై నిర్ణయం తీసుకోలేదా? అని విలేకరులు ప్రశ్నించగా.. మంత్రి స్పందించారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజల సమస్యలు, అభిప్రాయాలు, వారి ఆలోచనలు తెలుసుకుంటామని, భూసమీకరణ ఎందుకు చేస్తున్నాం, ఈ ప్రాంతం ఎలా అభివృద్ధి చెందనుందో వారికి వివరించనున్నట్లు తెలిపారు. వారం, పదిరోజుల్లో భూసమీకరణ ప్రతిపాదనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



శ్రీసిటీలో తయారైన లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంకు

శ్రీసిటీ నుంచి ఖతార్‌కు అతి భారీ ట్యాంకు

శ్రీసిటీ (వరదయ్యపాలెం), న్యూస్‌టుడే: శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెరికా కంపెనీ వీఆర్వీ ఆసియా పసిఫిక్ సంస్థ అతి భారీ ట్యాంకును తయారుచేసింది. సూపర్ సైజ్ లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజి ట్యాంకును పేర్కొనే ఈ భారీ వస్తువును ఖతార్‌లోని ఓ సంస్థకు ఎగుమతి చేస్తోంది. అందులో భాగంగా 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగిన ఈ భారీ క్రయోజెనిక్ ట్యాంకును బుధవారం 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం మీద కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ ట్యాంకు తమ ఇంజినీరింగ్ సామర్థ్యాలకు ప్రతీకగా నిలుస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ రంగంలో వినియోగించే భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా తమకు మరింత గుర్తింపు దక్కిందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు.

నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు

ఏర్పాట్లపై సమీక్షించిన సీఎస్ విజయానంద్

ఈనాడు, అమరావతి: విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్) 30వ భాగస్వామ్య సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ.. 'సమ్మిట్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, వసతి అంశాలను ఆన్‌లైన్ చేయాలి. ఏర్పాట్లపై సీఐఐతో సమన్వయం కోసం ప్రభుత్వం తరఫున పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి నోడల్ అధికారిగా ఉంటారు. రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాజెక్టులను ఈ సమ్మిట్‌లో ప్రదర్శించేందుకు ఆయా శాఖల కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి. సదస్సుకు సంబంధించి మీడియా భాగస్వామ్యాన్ని సమాచార శాఖ వెంటనే ఖరారు చేయాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పరిశ్రమల శాఖ, విశాఖపట్నం కలెక్టర్ ఇప్పటి నుంచే తగిన చర్యలు చేపట్టాలి' అని పేర్కొన్నారు. ఈ నెల 16న రెండో వర్కింగ్ కమిటీ సమావేశం నాటికి సమ్మిట్ లోగో, ప్రచార వీడియో మెటీరియల్‌ను సిద్ధం చేయనున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తెలిపారు. సదస్సు ఏర్పాట్లకు సంబంధించి పలు కమిటీలను నియమించనున్నట్లు వెల్లడించారు.

పీఐబీ డైరెక్టర్‌గా పి.రత్నాకర్

సీబీసీ, పీఆర్‌జీఐలో అదనపు బాధ్యతలు



పి.రత్నాకర్

ఈనాడు, అమరావతి: ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) డైరెక్టర్‌గా పి.రత్నాకర్ నియమితులయ్యారు. ఏపీ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ (సీబీసీ) డైరెక్టర్‌గా, ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌జీఐ) డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్‌గా రత్నాకర్ అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. విజయవాడలోని పీఐబీ కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను అందరితో సమన్వయం చేసుకుంటూ సమర్థంగా నిర్వహిస్తానన్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సీనియర్ అధికారి అయిన రత్నాకర్ ఇప్పటివరకు సీబీసీలో ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు.

సెప్టెంబరు 14, 15 తేదీల్లో తిరుపతిలో చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు

ఈనాడు, అమరావతి: చట్ట సభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సును సెప్టెంబరు 14, 15న తిరుపతిలో నిర్వహించబోతున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. పార్లమెంట్‌లోని 'ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్ కమిటీ'తో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లోని మహిళా శిశు సంక్షేమ కమిటీల ఛైర్మన్లు, సభ్యులు సదస్సుకు హాజరవుతారని చెప్పారు. పార్లమెంట్ నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఏపీలో సదస్సుకు ఆతిథ్యమిస్తున్నట్లు వివరించారు. లోక్‌సభ స్పీకర్ సహా కమిటీల్లోని మహిళా సభ్యులు, అధికారులతో కలిపి 500 మంది సదస్సుకు వస్తారని వెల్లడించారు. అసెంబ్లీలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను వచ్చే నెల రెండోవారం నుంచి 10 రోజుల పాటు నిర్వహించే అవకాశం ఉందని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

విశాఖలో సత్వా గ్రూప్ రూ.1,500 కోట్ల పెట్టుబడులు

ఈనాడు, అమరావతి: విశాఖలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో మిశ్రమ వినియోగ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఓ ప్రకటనలో తెలిపింది. మంత్రి లోకేశ్‌తో చర్చల తర్వాత పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరిస్తూ సంస్థ ఎండీ బిజయ్ అగర్వాల్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 25 వేల మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ పేర్కొంది. ''స్మార్ట్ లివింగ్‌కు అనుగుణంగా ప్రపంచ ప్రమాణాల మేరకు గ్రేడ్-ఎ ఆఫీసు స్పేస్, ప్రీమియం రెసిడెన్షియల్ బ్లాక్‌లు.. సమీకృత పట్టణ మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇప్పటికే రాష్ట్రంలో ఒక ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నాం. గత మూడు దశాబ్దాల్లో రెసిడెన్షియల్.. కమర్షియల్ ప్రాజెక్టుల ద్వారా 74 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు పూర్తి చేశాం. మరో 75 మిలియన్ చదరపు అడుగులకు పైగా ప్రాజెక్టులు.. ప్రణాళిక, అభివృద్ధి దశలో ఉన్నాయి'' అని సంస్థ తెలిపింది.

విమానయాన రంగంలో పెట్టుబడులకు సరళ ఏవియేషన్స్ ఆసక్తి

మంత్రి జనార్దనరెడ్డిని కలిసి చర్చించిన పలు సంస్థల ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎయిర్ ట్యాక్సీల తయారీ సంస్థ సరళ ఏవియేషన్ ఆసక్తి చూపింది. సంస్థ ప్రతినిధులు మంత్రి బీసీ జనార్దనరెడ్డిని సచివాలయంలో బుధవారం కలిసి చర్చించారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. దీంతోపాటు పలు సంస్థల ప్రతినిధులు మంత్రిని కలిసి ప్రతిపాదనలపై చర్చించారు.

● రాష్ట్రంలో డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంట్రోల్ ఎస్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. పూర్తిస్థాయి ప్రతిపాదనలతో వస్తే సహకరిస్తామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.

● గోల్డెన్ ఎపలెట్స్ ఏవియేషన్ అకాడమీ సంస్థ విద్యార్థులకు పైలట్ శిక్షణ ఇచ్చే కేంద్రం ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తం చేసింది.

● రాడార్, జీపీఎస్ పరికరాలు, నేవిగేషన్ వ్యవస్థలు సహా వివిధ వైమానిక పరికరాల తయారీ సంస్థ హరిబన్ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా

రాష్ట్ర మంత్రిమండలి ఆమోదంతో అడుగులు ముందుకు



క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. పాల్గొన్న మంత్రులు, అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడేనాటికి అసలు ప్రారంభించని, 25% లోపు పనులు పూర్తయిన ప్రాజెక్టులను నిలుపుదల చేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం కొంత సడలించింది. అలా నిలిచిపోయిన ప్రాజెక్టుల్లో ప్రజలకు ఉపయోగపడేవాటిని తిరిగి చేపట్టాలని నిర్ణయించింది. జలవనరులశాఖ ఉన్నతాధికారులు, స్థానిక చీఫ్ ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు, ఆర్థికశాఖ సంయుక్తంగా కసరత్తు చేసి అలాంటి 71 పనులను తిరిగి చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందులో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని అనేక కీలక ప్రాజెక్టులు ఉన్నాయి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండు దశల్లోని నాలుగు ప్యాకేజీలు, మహేంద్రతనయ, రాయలసీమ ఎత్తిపోతల, వంశధార వరద కట్టల నిర్మాణం, తెన్నేటి విశ్వనాథం పెద్దేరు రిజర్వాయర్ ప్రాజెక్టు, ఉప్పుటేరుపై రెగ్యులేటర్, గోదావరి పెన్నా అనుసంధానం తొలిదశ పనులు, వరికపూడిశెల ఎత్తిపోతల, రాళ్లపాడు ప్రాజెక్టు అదనపు స్పిల్ వే నిర్మాణం, సోమశిల స్వర్ణముఖి లింకు కాలువ పథకం, వేదవతి ఎత్తిపోతల పథకం, రాజోలిబండ మళ్లింపు పథకం తదితరాలు ఉన్నాయి. ఈ పథకాలన్నింటికీ రూ.27,941.34 కోట్ల అంచనా విలువతో ఇప్పటికే పాలనామోదం ఇచ్చారు. ఈ ప్రాజెక్టులకు ఇంతవరకు రూ.1,350.17 కోట్ల పనులు చేసినట్లు గుర్తించారు.

● ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) 2025-29 కాలానికి రూపొందించిన ర్యాంకుల్లో 6.9 స్కోర్ నమోదు చేసి, దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు తెలిపారు. మరింత మెరుగైన పనితీరుతో రాబోయే రోజుల్లో రాష్ట్రం మొదటి స్థానానికి చేరుతుందని చెప్పారు.

తిరిగి చేపట్టే 71 పనుల్లో కొన్ని ముఖ్యమైనవి..

■ శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం చాప్రా వద్ద మహేంద్రతనయపై ప్రాజెక్టు. రిజర్వాయర్ నిర్మాణంతో పాటు కుడి, ఎడమ కాలువలు తవ్వి 24,600 ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించాలి. రూ.852.44 కోట్ల అంచనా వ్యయంతో 2022లోనే పాలనామోదం ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో ఇంతవరకు 6.79% పని మాత్రమే చేయడంతో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలుత నిలిపివేశారు. ఇప్పుడు ప్రాధాన్యం రీత్యా మళ్లీ పనులు చేపట్టేందుకు అనుమతి లభించింది.

■ వంశధార వరద కట్టల పటిష్ఠం ప్యాకేజీ-1 (రూ.316.50 కోట్లు) ప్యాకేజీ-2 (రూ.193.60 కోట్లు) పనుల్లో మిగిలిపోయిన వాటికి అనుమతి. ప్రస్తుతం ఈ రెండు ప్యాకేజీల్లో 6.5% పనులే అయ్యాయి.

■ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు తొలిదశ, రెండుదశల్లో మొత్తం నాలుగు ప్యాకేజీలు (రూ.9,236 కోట్లు). ఇంతవరకు 2% లోపు పనులే చేశారు.

■ గోదావరి-పెన్నా అనుసంధానం తొలిదశ పనులు (రూ.6,020.15 కోట్లు). మొత్తం 20% పనులు అయ్యాయి.

■ గుంటూరు ఛానల్ 47వ కి.మీ. నుంచి 76.400 కి.మీ. వరకు విస్తరించడంతో పాటు మధ్యలో 4 చోట్ల ఎత్తిపోసేలా పనులు (రూ.274.53 కోట్లు)

■ విశాఖ జిల్లా తెన్నేటి విశ్వనాథం పెద్దేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో కాలువ వ్యవస్థ ఆధునికీకరణ పనులు (రూ.84.40 కోట్లు). ఇంతవరకు 2.45% పనులే అయ్యాయి. పనులు చేసేందుకు మళ్లీ అనుమతులు.

■ వరికపూడిశెల ఎత్తిపోతల పథకం. వరిపూడి వాగు నుంచి నీటిని ఎత్తిపోసి 24,900 ఎకరాలకు నీటిని అందించేలా పథకం కొనసాగింపు (రూ.340.26 కోట్లు).

■ గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని నల్లమడ డ్రెయిన్ పనులు 2.900 కి.మీ. నుంచి 39.690 కి.మీ. వరకు ఆధునికీకరించడం. రూ.180.60 కోట్ల అంచనా వ్యయం.

■ ఉప్పుటేరుపై 10.56 కి.మీ. వద్ద రెగ్యులేటర్ నిర్మాణం (రూ.87 కోట్లు), 57.950 కి.మీ. వద్ద రెగ్యులేటర్, వంతెన సంయుక్త నిర్మాణం (రూ.188.40 కోట్లు) 1.40 కి.మీ. వద్ద ఉప్పుటేరుపై రెగ్యులేటర్ కం వంతెన (రూ.136.60 కోట్లు) పనులకు అనుమతి. ఈ పనులు అసలు ఇంతవరకు ప్రారంభించనే లేదు.

■ రాళ్లపాడు మధ్యతరహా ప్రాజెక్టులో అదనపు స్పిల్ వే నిర్మాణం రూ.13 లక్షల వ్యయం

■ నాగార్జునసాగర్ జవహర్‌లాల్ కాలువలోని బుగ్గవాగు బ్యాలెన్సింగ్ జలాశయంలో అవుట్‌ఫాల్ రెగ్యులేటర్, ఇతర మరమ్మతులకు రూ.39.54 కోట్లు

■ హంద్రీనీవా రెండోదశలో భాగంగా పుంగనూరు బ్రాంచి కాలువ వెడల్పు పనులు. రూ.1,925 కోట్ల అంచనా వ్యయం.

■ కర్నూలు జిల్లా హాలహర్వి మండలం గుల్యం వద్ద వేదవతి ఎత్తిపోతల పథకం. 80వేల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం రూ.1,942.80 కోట్ల అంచనా వ్యయం. ఇంతవరకు 6.61% పనులు అయ్యాయి.

■ రాయలసీమ ఎత్తిపోతల పథకం. శ్రీశైలం ఫోర్‌షోర్ నుంచి 3 టీఎంసీల నీరు శ్రీశైలం కుడి కాలువకు మళ్లించేలా నిర్మాణం. రూ.3,825 కోట్ల అంచనా వ్యయం.

■ గాలేరు నగరి సుజల స్రవంతి రెండోదశలో భాగంగా సోమశిల స్వర్ణముఖి లింకు కాలువ పథకం మేర్లపాక చెరువు నుంచి మల్లెమడుగు వరకు పనులు. రూ.292.66 కోట్ల అంచనా వ్యయం. ఇంతవరకు 12.22% పనులు పూర్తయ్యాయి.

■ హంద్రీనీవా తొలిదశలో కాలువ వెడల్పు పనుల్లో మిగులు పనులు చేపట్టేందుకు అనుమతి. రూ.6,182 కోట్ల అంచనా వ్యయం.

■ గండికోట చిత్రావతి బ్యాలెన్సింగ్ జలాశయాల, గండికోట పైడిపాలెం ఎత్తిపోతల పథకాల ఆధునికీకరణ రూ.3,556.76 కోట్ల అంచనా వ్యయం

■ కుందూ ఎత్తిపోతల పథకం. రూ.564.60 కోట్ల అంచనా వ్యయం. ఇంతవరకు 1% పనులూ చేయలేదు.

■ కర్నూలు జిల్లా కోస్గి మండలం బాత్ర బొమ్మలాపురం వద్ద రాజోలిబండ మళ్లింపు పథకం చేపట్టాలి. ఆర్డీఎస్ కుడికాలువను తవ్వి నాలుగు జలాశయాల నిర్మాణం, ఎత్తిపోతల పంపుహౌస్‌ల నిర్మాణం చేపట్టి నీటిని తరలించాలి. రూ.1,985.423 కోట్ల అంచనా వ్యయం.

మద్యం కుంభకోణం కేసులో రజత్ భార్గవకు సిట్ నోటీసులు

- జగన్ హయాంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు



రజత్ భార్గవ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసు కీలక మలుపు తిరిగింది. వైకాపా హయాంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వైకాపా మద్యం ముఠా ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా అడ్డగోలు విధాన నిర్ణయాలు తీసుకొని, ఉత్తర్వులూ ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని రజత్ భార్గవపై అభియోగాలున్నాయి. 'అప్పటి వైకాపా ఎంపీ వి.విజయసాయిరెడ్డి సిఫారసుల మేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లోని (ఏపీఎస్‌బీసీఎల్) అత్యంత కీలకమైన ఎంఐఎస్ సెక్షన్‌లో ఏ.అనూష అనే మహిళను డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా రజత్ భార్గవ ప్రత్యేక మెమో ద్వారా నియమించారు. ఆమె వైకాపా ముఠా ప్రతినిధి పనిచేసేవారు. ఎప్పటికప్పుడు మద్యం విక్రయాల డేటాను వాట్సప్ ద్వారా రాజ్ కెసిరెడ్డి (ఏ-1) ముఠాలో కీలక సభ్యుడైన సైఫ్ అహ్మద్‌కు పంపించేవారు. ఆ సమాచారం ఆధారంగా డిస్టిలరీలకు వెళ్లిన ఆర్డర్ల మొత్తం తెలుసుకొని, ముడుపులు ఎంత వసూలు చేయాలనే దానిపై సైఫ్ అహ్మద్ లెక్కలేసి రాజ్ కెసిరెడ్డికి పంపించేవారు. ఆయన ముప్పిడి అవినాష్‌రెడ్డి, బూనేటి చాణక్య ద్వారా ముడుపుల సొమ్ము వసూలు చేసి బిగ్‌బాస్‌కు చేర్చేవారు' అని సిట్ ఇప్పటికే దర్యాప్తులో గుర్తించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కుట్ర, దాని అమలులో రజత్ భార్గవ ప్రమేయంపై సిట్‌కు ఇప్పటికే కొన్ని కీలక ఆధారాలు లభించాయి. అరెస్టైన నిందితుల రిమాండు రిపోర్టుల్లోనూ రజత్ భార్గవ పేరును సిట్ ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో మొత్తం కుంభకోణానికి సంబంధించిన మరిన్ని మూలాలు వెలికితీసే దిశగా ఆయన్ను ప్రశ్నించనుంది.

భలే తయారు చేశావోయ్!

'బ్యాటరీ సైకిల్' సిద్ధూకు రూ.లక్ష ప్రోత్సాహకం అందించిన పవన్‌కల్యాణ్



రూ.లక్ష చెక్కును అందించిన అనంతరం సిద్ధూను అభినందిస్తున్న పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: అతితక్కువ ఖర్చుతో బ్యాటరీతో నడిచే సైకిల్‌ను తయారు చేసిన విజయనగరం జిల్లాకు చెందిన ఇంటర్ విద్యార్థి రాజాపు సిద్ధూను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందించారు. మంగళగిరిలోని తన కార్యాలయానికి సిద్ధూను పిలిపించుకొని ప్రత్యేకంగా మాట్లాడి, రూ.లక్ష ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా సిద్ధూను ఎక్కించుకుని పవన్‌కల్యాణ్ సైకిల్‌ను నడిపారు.



సిద్ధూను ఎక్కించుకుని బ్యాటరీ సైకిల్ నడుపుతున్న పవన్

విజయవాడలో పెరిగిన హెల్మెట్ ధారణ

- నిధుల కోసం పోలీసుశాఖ చేసిన ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోండి
- సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టు లోతైన విచారణ జరిపింది. విజయవాడలో హెల్మెట్లు ధరించే వాహనదారులు పెరిగారని, పోలీసులు విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని కితాబిచ్చింది. 2024లో 10,176 ప్రమాదాలు చోటుచేసుకుంటే ద్విచక్రవాహనదారులు 4,276 మంది మృతిచెందడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. మోటారు వాహనచట్ట నిబంధనల ఉల్లంఘనలతో కలిగే దుష్పరిణామాలపై పత్రికలు, టీవీలలో ప్రకటనలు ఇచ్చేందుకు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిధులు కేటాయించాలంటూ పోలీసుశాఖ చేసిన ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బాడీ కెమెరాలు ధరించడం తప్పనిసరి చేయాలని గతంలో తామిచ్చిన ఉత్తర్వులపై స్థాయీ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించేందుకు రాష్ట్రంలోని సీసీ టీవీ కెమెరాలను ఏపీ ఫైబర్‌నెట్‌కు అనుసంధానం చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఏపీ ఫైబర్‌నెట్ ఎండీని సుమోటోగా వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చింది. ఆగస్టు 20కి విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

■ మోటారు వాహన చట్ట నిబంధనలను తప్పకుండా అమలుచేయాలని, హెల్మెట్ ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

పోలవరం వద్ద పెరుగుతున్న వరద



పోలవరం వద్ద కుడి, ఎడమ గట్ల మధ్య నిండుగా వరద ప్రవాహం

పోలవరం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా పోలవరం వద్ద కుడి, ఎడమ గట్లను తాకుతూ గోదారమ్మ ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరికి వస్తున్న వరద శనివారం నాటికి మరింత పెరుగుతుందని కేంద్ర జలసంఘం అధికారులు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద బుధవారం సాయంత్రానికి నీటి మట్టం 28.40 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల ద్వారా తిరిగి గోదావరిలోకి 2.35 లక్షల క్యూసెక్కులు వెళుతోంది.

కుడి కాలువలోకి 6,650 క్యూసెక్కులు..

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 3న పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ప్రారంభించిన పంపుల నుంచి కుడి కాలువలోకి చేరిన నీరు ఆరు రోజులపాటు 175 కిలోమీటర్లు ప్రవహించి కృష్ణా నదికి చేరినట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. బుధవారం పంపుల సంఖ్య 16 నుంచి 19కి పెంచి కుడి కాలువలోకి 6,650 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఎత్తిపోతల డీఈ సురేష్ చెప్పారు. పంపుల సంఖ్య పెరగడంతో కుడి కాలువ నిండుగా ప్రవహిస్తోంది.

శస్త్రచికిత్స వికటించి ఇద్దరు బాలింతల మృతి

శ్రీకాకుళం జిల్లాలో విషాదం • కుటుంబ సభ్యుల ఆందోళన



ధనలక్ష్మి అరుణ

సారవకోట, జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం బుడితి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో శస్త్రచికిత్స వికటించి ఇద్దరు బాలింతలు మృతి చెందారు. నార ధనలక్ష్మి(22), పట్ట అరుణ (23) అనే గర్భిణులు కొంతకాలం క్రితం అత్తవారిళ్ల నుంచి జలుమూరు మండలం పాగోడు, అల్లాడపేటల్లోని పుట్టిళ్లకు వచ్చారు. వీరికి తొమ్మిది నెలలు నిండటంతో ప్రసవం కోసం బుడితి సీహెచ్‌సీలో ఈ నెల 7న కుటుంబసభ్యులు చేర్పించారు. అదే రోజు ఇద్దరికీ ఆసుపత్రి వైద్యాధికారిణి బి.శోభారాణి శస్త్రచికిత్స చేసి కాన్పుచేశారు. ఇద్దరికీ మగ పిల్లలు పుట్టారు. రాత్రి సమయానికి మూత్ర విసర్జన కాకపోవడంతోపాటు రక్తస్రావం ఆగలేదు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలింతలను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆరోగ్యం క్షీణించింది. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఇద్దరూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు గ్రామస్థులు మృతదేహాలతో పాగోడు, యలమంచిలి కూడళ్ల వద్ద బుధవారం ఉదయం ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింతలు మృతి చెందారని ఆరోపించారు. మరోవైపు, శస్త్రచికిత్స చేసిన వైద్యురాలు బి.శోభారాణి మాట్లాడుతూ.. ''పీపీహెచ్ సమస్య (బ్లీడింగ్ సమస్య) రావడంతో ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి పంపించాం. వేల కేసుల్లో ఒకరిద్దరికి పీపీహెచ్ సమస్య వస్తుంది. ఇద్దరూ ఈ సమస్యతో చనిపోవడం బాధాకరం'' అని పేర్కొన్నారు. బుడితి ఘటనపై వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు.

రాజస్థాన్‌లో నేలకూలిన శిక్షణ విమానం

• వాయుసేనకు చెందిన ఇద్దరు పైలట్ల మృతి

జైపుర్: రాజస్థాన్‌లోని చురూ జిల్లాలో బుధవారం జాగ్వార్ శిక్షణ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. సూరత్‌గఢ్ వైమానిక స్థావరం నుంచి టేకాఫ్ అయిన ఈ విమానం మధ్యాహ్నం 1:25 గంటల సమయంలో రత్నగఢ్ ప్రాంతంలోని భానూదా గ్రామంలో కూలింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శకలాల కింద మృతదేహాలను గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు నిర్వహిస్తామని వాయుసేన తెలిపింది. ఈ ప్రమాదంలో పౌరుల ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది.


చురూలో కుప్పకూలిన ఐఏఎఫ్ శిక్షణ విమాన శకలం

ప్రపంచంలోనే అత్యంత వృద్ధ ఏనుగు మృతి

• వయసు 100ఏళ్ల పైనే!

ఈటీవీ భారత్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పరిగణించే వత్సల మంగళవారం మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వ్‌లో మృతి చెందింది. ఈ ఆడ ఏనుగు వయసు వందేళ్లకు పైనే. ఓ చిన్న వాగు దాటుతుండగా ఈ ఏనుగు జారిపడింది. అక్కడే కుప్పకూలింది. లేపేందుకు అటవీ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తర్వాత కొంత సేపటికి వత్సల తుదిశ్వాస విడిచింది. అటవీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. ఇది అత్యంత వృద్ధ ఏనుగుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కాల్సి ఉండగా, వయసును ధ్రువీకరించే పత్రాలు లేకపోవడంతో పేరును నమోదు చేయలేకపోయారు. పన్నా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యాటకులకు వత్సలయే ప్రధాన ఆకర్షణ.



జీవితకాల గోల్డెన్ వీసా శుద్ధ అబద్ధం: యూఏఈ

దుబాయ్: కొన్ని దేశాల వారికి రూ. 23.30 లక్షలకే జీవితకాల గోల్డెన్ వీసా జారీ చేస్తున్నట్లు వచ్చిన వార్తల్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తోసిపుచ్చింది. "గోల్డెన్ వీసా మంజూరీ షరతుల్ని సరళీకరించినట్లు కొన్ని పత్రికల్లో తప్పుడు కథనాల్ని గమనించాం. ఒక విదేశీ వాణిజ్య కన్సల్టెన్సీ సంస్థ ద్వారా అన్ని కేటగిరీల వారూ గోల్డెన్ వీసా పొందవచ్చంటూ పేర్కొన్న ఆ కథనాల్లో వాస్తవం, చట్టబద్ధత లేవు'' అని యూఏఈకి చెందిన 'గుర్తింపు, పౌరసత్వ కస్టమ్స్, రేవుల భద్రత' (ఐసీపీ) ప్రాధికార సంస్థ స్పష్టంచేసింది. గోల్డెన్ వీసా దరఖాస్తుల పరిశీలన బాధ్యతను యూఏఈ ప్రభుత్వం నామినేషన్ పద్ధతిన కొన్ని సంస్థలకు అప్పగించిందన్న కథనాల్లో వాస్తవం లేదని పేర్కొంది. గోల్డెన్ వీసా గురించి అధికారిక సమాచారాన్ని ఐసీపీ వెబ్‌సైట్‌లో పొందవచ్చునని అధికారిక ప్రకటన స్పష్టం చేసింది. పెట్టుబడిదారులు, వ్యాపారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, క్రీడాకారులు, విద్యార్థుల కోసం పదేళ్ల కాల పరిమితితో.. పొడిగించుకునేందుకు వీలైన గోల్డెన్ వీసాను యూఏఈ ప్రవేశపెట్టింది. ఈ వీసా కలిగివున్న వారికి స్పాన్సర్ అవసరం లేదు. మరోవైపు యూఏఈ రూ 23.30 లక్షలకే జీవితకాల గోల్డెన్ వీసా జారీ చేస్తోందంటూ పత్రికల్లో వచ్చిన వార్తలకు పూర్తి బాధ్యత వహిస్తూ దుబాయ్‌కి చెందిన ప్రైవేటు సంస్థ, రయద్ గ్రూప్, క్షమాపణ కోరింది.

ముడిసరకు వనరుగా మిగిలిపోవద్దు

• విలువ సృష్టి, సుస్థిరాభివృద్ధిలో ఆఫ్రికా ముందుండి నడవాలి
• ప్రధాని మోదీ ఆకాంక్ష
• ఆయనకు నమీబియా అత్యున్నత పౌర పురస్కారం

విండ్‌హోక్: అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆఫ్రికా పాత్రకు భారత్ ఎంతో విలువిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అధికారం, ఆధిపత్యాలతో కాకుండా.. సమానత్వం, భాగస్వామ్యాలతో వర్ధిల్లే భవిష్యత్తును సృష్టించుకునేందుకు ఇరుపక్షాలూ ఐక్యంగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. భద్రత, రక్షణ రంగాల్లో ఆఫ్రికాకు సహకారాన్ని విస్తరించేందుకు దిల్లీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆఫ్రికా దేశమైన నమీబియాలో పర్యటించిన మోదీ.. ఆ దేశ పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి బుధవారం ప్రసంగించారు. కేవలం ముడిసరకు వనరుగా ఆఫ్రికా మిగిలిపోకూడదని.. విలువ సృష్టి, సుస్థిరాభివృద్ధిలో ముందుండి నడవాలని ఆకాంక్షించారు. "ఆఫ్రికాలో భారత్ అభివృద్ధి భాగస్వామ్యం విలువ 1200 కోట్ల డాలర్లకుపైగా ఉంది. అయితే మన బంధం నిజమైన విలువ డబ్బులో కాకుండా.. పరస్పర వృద్ధిలో దాగుంది'' అని ప్రధాని పేర్కొన్నారు. నమీబియాతో భారత్‌కు ఉన్న బలమైన చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం విలువ 80 కోట్ల డాలర్లు దాటిందని గుర్తుచేశారు. అయితే క్రికెట్‌లోలా ఇది కేవలం వార్మప్ మాత్రమేనని.. మున్ముందు వేగంగా స్కోరు పెంచుతామని పేర్కొన్నారు. మరోవైపు- ప్రధాని మోదీకి తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియెంట్ వెల్‌విచియా మిరాబిలిస్'ను నమీబియా ప్రకటించింది. దేశాధ్యక్షురాలు నెటుంబా నాందీ-ఎందియాత్వా దాన్ని ప్రదానం చేశారు. భారత్, నమీబియా ప్రజలకు ఈ అవార్డును అంకితమిస్తున్నట్లు మోదీ తెలిపారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడు ఆయనే.


ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం అందిస్తున్న ఆ దేశ అధ్యక్షురాలు నెటుంబా

ఈ ఏడాది నుంచే నమీబియాలోనూ యూపీఐ

నమీబియా పర్యటనలో భాగంగా ఆ దేశాధ్యక్షురాలు నెటుంబాతో మోదీ సమావేశమయ్యారు. డిజిటల్ సాంకేతికత, రక్షణ, భద్రత, వ్యవసాయం, ఆరోగ్యసేవలు, విద్య, క్రిటికల్ మినరల్స్ సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. ఈ ఏడాది నుంచే తమ దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నమీబియా అంగీకరించింది. ఆరోగ్యం-ఔషధాల రంగంలో పరస్పర సహకారంపై ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. నమీబియాలో వ్యాపార అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకూ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. భారత్ మద్దతిస్తున్న విపత్తు నిరోధక మౌలిక వసతుల కూటమి (సీడీఆర్ఐ)లో, అంతర్జాతీయ జీవ ఇంధన కూటమిలో చేరాలని నమీబియా నిర్ణయించుకుంది.

బిహార్‌లో ఓట్ల చోరీ జరగనివ్వం

• నిరసన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ వ్యాఖ్య

పట్నా: గతేడాది మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపాకు అనుకూలంగా ఓట్ల చోరీ జరిగిందని, ఇప్పుడు బిహార్‌లోనూ ఎన్డీయే ప్రభుత్వం దానిని పునరావృతం చేయాలనుకుంటోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం(ఈసీ) బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలు బుధవారం ఆ రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటించాయి. పట్నాలోని ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో జరిగిన ఓట్ల చోరీని బిహార్ జరగనివ్వబోమని కాంగ్రెస్ అగ్రనేత పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజల ఓటు హక్కును హరిస్తున్నారని ఆరోపించారు. రాజధాని పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, వామపక్ష పార్టీల అగ్రనేతలు డి.రాజా (సీపీఐ), ఎం.ఎ.బేబీ (సీపీఎం), దీపాంకర్ భట్టాచార్య (సీపీఐ-ఎం.ఎల్) తదితరులు పాల్గొన్నారు.

■ బిహార్ బంద్‌ను భాజపా తీవ్రంగా ఖండించింది. ఈసీ చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణను సమర్థించింది. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకురావడానికే బంద్ నిర్వహించారని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు.


బంద్‌లో పాల్గొన్నవారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాహుల్‌గాంధీ

చురుగ్గా ఓటర్ల స్పందన: సీఈసీ

బిహార్‌లో నిర్వహిస్తోన్న ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ బుధవారం దిల్లీలో తెలిపారు. ఈ కసరత్తుకు మరో 16 రోజులు మిగిలి ఉండగా ఇప్పటికే 57శాతం ఓటర్ల గణన ఫారాలను ప్రజలు ఎన్నికల అధికారులకు సమర్పించారని వెల్లడించారు.



ప్రతి ఒక్కరికీ రెండే ఐచ్ఛికాలు

ప్రతి ఒక్కరికీ రెండే ఐచ్ఛికాలున్నాయి. సాహసోపేతమైన ప్రయత్నాల పట్ల భయంతో అనాసక్తికర జీవితాన్ని కొనసాగిస్తూ పశ్చాత్తాపంతో ఈ లోకాన్ని వీడటమా? లేక ప్రయోగాలు చేస్తూ, సవాళ్లను స్వీకరిస్తూ, సరికొత్త అనుభూతులు సొంతం చేసుకుంటూ సంతృప్తికర జీవితాన్ని గడపడమా? వీటిలో మీ ఎంపిక ఏది?
– బి.ఎస్.గుప్తా, యోగా ట్రైనర్

వడోదరాలో కుప్పకూలిన వంతెన

• 11 మంది మృతి

వడోదర: వంతెన కుప్పకూలడంతో నదిలో వాహనాలు పడిపోయి 11 మంది మృతి చెందారు. ఈ ఘటన గుజరాత్‌లోని వడోదరాలో చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో పాద్రా ప్రాంతంలోని మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన రెండు పిల్లర్ల మధ్య స్లాబ్ కూలిపోయింది. ఆ సమయంలో వంతెనపై వెళ్తున్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఓ ఆటో నదిలో పడిపోయాయి. ఒక ట్యాంకర్ వంతెనపై ఇరుక్కుపోయింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మందిని సహాయక బృందాలు రక్షించాయి. మృతిచెందిన వారిలో బాలిక (4), బాలుడు (2) ఉన్నారని.. వీరిద్దరు అక్కాతమ్ముళ్లు అని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో చిన్నారుల తండ్రి మృతి చెందగా.. తల్లి ప్రాణాలతో బయటపడింది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు నదిలో పడిపోయిన తర్వాత ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారని వివరించారు. 1985లో నిర్మించిన ఈ వంతెన పాతబడటం వల్లే కూలిపోయి ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. వడోదరా-ఆణంద్‌ను కలుపుతున్న వంతెన కూలడంతో ఇరు పట్టణాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనపై ప్రధాని మోదీ, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పన్నాలో గిరిజన కార్మికుడికి దొరికిన రూ.40 లక్షల వజ్రం



పన్నా: మధ్యప్రదేశ్‌లోని పన్నాలో ఓ గిరిజన కార్మికుడిని అదృష్టం వరించింది. కృష్ణ కల్యాణ్‌పుర్ పట్టిలోని ఓ గనిలో పనిచేస్తున్న కార్మికుడు మాధవ్‌కు తాజాగా 11.95 క్యారెట్ల వజ్రం దొరికింది. "ఈ వజ్రం శుభ్రంగా ఉంది. దీని విలువ రూ. 40లక్షల పైనే ఉంటుంది'' అని వజ్రాల కార్యాలయంలోని ఓ అధికారి వెల్లడించారు. కార్మికుడు నిబంధనల ప్రకారం విలువైన రాయిని తమ కార్యాలయంలో డిపాజిట్ చేశాడని తెలిపారు. వజ్రాన్ని తొందర్లోనే వేలం వేస్తామని, వచ్చిన సొమ్ములో 12.5 శాతం రాయల్టీ తీసి మిగిలిన మొత్తాన్ని కార్మికుడికి అందిస్తామని చెప్పారు.

ఆరు రోజులు.. ఊగిసలాటలో ప్రాణాలు

• కేరళ నర్సు నిమిష ప్రియకు యెమెన్‌లో 16న ఉరిశిక్ష ఆగేనా?



దిల్లీ: యెమెన్ రాజధాని సనా జైలులో ఉన్న కేరళ నర్సు నిమిష ప్రియ (37) మరణశిక్ష అమలుకు రోజులు దగ్గర పడుతున్నాయి. ఈ నెల 16న నిమిష ప్రియకు ఉరిశిక్ష అమలు చేయాలని యెమెన్ ప్రభుత్వం నిర్ణయించింది. భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో చివరి నిమిషంలో ఏదైనా అద్భుతం జరగకపోతుందా అనే ఆశతో ఆమె కుటుంబం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష ప్రియ 2008లో యెమెన్‌కు వెళ్లి, ఉద్యోగంలో చేరింది. 2011లో కేరళకు చెందిన వ్యక్తితో ఆమెకు పెళ్లయింది. భర్తతో కలిసి యెమెన్‌లోనే ఉంటూ ఓ క్లినిక్ ప్రారంభించాలని నిమిష ప్రియ నిర్ణయించుకొంది. యెమెన్ చట్టాల ప్రకారం.. ఆ దేశానికి చెందిన తలాల్ అదిబ్ మెహదీని ఆమె వ్యాపార భాగస్వామిగా చేసుకుంది. వీరిద్దరూ కలిసి అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ అనే సెంటర్‌ను ప్రారంభించారు. కొంతకాలం క్లినిక్ సజావుగా సాగింది. భర్త, కుమార్తె కేరళకు వెళ్లిపోయాక.. నిమిష ప్రియకు మెహదీ నుంచి వేధింపులు మొదలయ్యాయి. 2017లో అక్కడి నుంచి పారిపోయేందుకు ఆమె ప్రయత్నించింది. మెహదీకి మత్తుమందు ఇచ్చి, తన పాస్‌పోర్టు లాక్కోవాలని భావించింది. ఈ ప్రయత్నంలో మత్తుమందు మోతాదు ఎక్కువ కావడంతో మెహదీ చనిపోయాడు. ఈ కేసును విచారించిన కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది.

అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న రష్యా

• మలేసియా విమానం అదృశ్యం వెనకా హస్తం
• ఐరోపా మానవ హక్కుల కోర్టు రూలింగ్

ద హేగ్: ఉక్రెయిన్‌తో యుద్ధంలో అంతర్జాతీయ చట్టాలను రష్యా ఉల్లంఘిస్తోందని ఐరోపా మానవ హక్కుల కోర్టు రూలింగ్ ఇచ్చింది. అంతేకాకుండా 2014లో మలేసియా విమానం అదృశ్యం ఘటనలోనూ ఆ దేశం ప్రమేయం ఉందని స్పష్టం చేసింది. రష్యాపై ఉక్రెయిన్‌తోపాటు నెదర్లాండ్స్ దాఖలు చేసిన నాలుగు కేసుల్లో బుధవారం ఈ కోర్టు నిర్ణయాలను వెలువరించింది. హత్యలు, వేధింపులు, అత్యాచారాలు, పౌర సదుపాయాల ధ్వంసం, ఉక్రెయిన్ చిన్నారుల కిడ్నాప్, రష్యా మద్దతున్న ఉక్రెయిన్ వేర్పాటువాదులు మలేసియా విమానం ఎంహెచ్17ను కూల్చివేయడంవంటి ఘటనల్లో రష్యాపై ఆరోపణలు వచ్చాయి. 'ఉక్రెయిన్‌లో రష్యా సేనలు.. అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించాయి. దాడులు చేయడంద్వారా వేల మందిని హతమార్చడంతోపాటు గాయపరిచాయి. ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. యుద్ధంలో అత్యాచారాన్ని ఆయుధంగా మార్చుకోవడంద్వారా రష్యా అత్యంత దారుణమైన అకృత్యాలకు పాల్పడింది' అని స్ట్రాస్‌బర్గ్‌లోని కిక్కిరిసిన కోర్టు హాలులో కోర్టు అధ్యక్షుడు మాటియస్ గ్రైమర్ ప్రకటించారు. అయితే ఈ కోర్టు తీర్పులకు తాము కట్టుబడి ఉండేది లేదని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. మరోవైపు రష్యాపై ఉక్రెయిన్ దాఖలు చేసిన మరిన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటితోపాటు 10,000 మంది వ్యక్తిగతంగా రష్యాపై కేసులు వేశారు.

ఉక్రెయిన్‌పై డ్రోన్ల వర్షం

• 728 డ్రోన్లు, 13 క్షిపణులతో రష్యా దాడి
• ప్రతి దాడుల్లో ముగ్గురు రష్యన్ల మృతి
• తమ సరిహద్దుల్లో దాడులు జరగడంతో సైన్యాన్ని అప్రమత్తం చేసిన పోలండ్


రష్యా దాడితో కీవ్ ప్రాంతంలో చెలరేగిన మంటలు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా భీకరంగా విరుచుకుపడింది. మంగళవారం రాత్రి ఏకంగా 728 డ్రోన్లు, 13 క్షిపణులతో దాడులు చేసింది. షహెద్, డెకాయ్ డ్రోన్లతోపాటు క్రూజ్, బాలిస్టిక్ క్షిపణులతో పోలండ్, బెలారస్ సరిహద్దుల్లో ఉన్న లుట్స్క్ నగరంతోపాటు 10 ప్రాంతాలపై విరుచుకుపడింది. లుట్స్క్ నగర గగన తలాన్ని ఉక్రెయిన్ సైన్యం వినియోగించుకుంటోంది. కార్గోతోపాటు ఫైటర్ జెట్లు రోజూ ఈ ప్రాంతం మీదుగా తిరుగుతుంటాయి. దాడుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇద్దరు గాయపడ్డారు. ఆస్తుల నష్టాన్ని అత్యవసర స్పందన దళాలు అంచనా వేస్తున్నాయి. 296 డ్రోన్లను, ఏడు క్షిపణులను ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థ కూల్చేసింది. 415 డ్రోన్లు రాడార్ల నుంచి తప్పించుకోవడమో.. జామ్ కావడమో జరిగిందని ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. రష్యా షహెద్ డ్రోన్లను కూల్చేయడానికి ఇంటర్‌సెప్టర్లను అభివృద్ధి చేశామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. రష్యాపై మరిన్ని ఆంక్షలను విధించాలని పశ్చిమ దేశాలకు జెలెన్స్కీ పిలుపునిచ్చారు.

■ తమ సరిహద్దుల్లో రష్యా దాడులకు దిగడంతో ఫైటర్ జెట్లు, సైనిక బలగాలను పోలండ్ అప్రమత్తం చేసింది. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పోలండ్ సైన్యం ఎక్స్‌లో పేర్కొంది.

రష్యాపై దాడులు..

6 ప్రాంతాలపై ఉక్రెయిన్ ప్రయోగించిన 86 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా రక్షణ మంత్రి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడుల నేపథ్యంలో దక్షిణ మాస్కోలోని కలుగా అంతర్జాతీయ విమానాశ్రయం, శేరేమేత్యేవో విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. ఉక్రెయిన్ దాడుల్లో ముగ్గురు మరణించడమే కాక 5ఏళ్ల బాలుడు సహా మరో ఏడుగురు గాయపడ్డారని వివరించారు.

పశ్చిమ ప్రాంతంపై అనూహ్య దాడి

ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతంపై రష్యా సాధారణంగా దాడులు చేయదు. కానీ ఈసారి అక్కడి ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. ఉక్రెయిన్‌కు పశ్చిమాన ఉన్న పోలండ్ సరిహద్దుల నుంచే గగనతల రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, ఆయుధ విడి భాగాలు అందుతున్నాయి. నాటోతోపాటు పాశ్చాత్య దేశాలు ఈ ఆయుధ సరఫరా చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలోనే ఉక్రెయిన్ లాజిస్టిక్స్ హబ్‌లు, వైమానిక స్థావరాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు ఆయుధ సామగ్రిని ఆ దేశం తరలిస్తుంది. పశ్చిమ ప్రాంతం సురక్షితమని భావించడంతో ఉక్రెయిన్ ఇక్కడే కీలక వ్యవస్థలను ఉంచుతోంది. అయితే రష్యా ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంపైనా దాడులకు దిగుతోంది.

రోదసిలో రైతుగా మారి..!

మెంతి, పెసర మొలకల్ని పెంచుతున్న శుభాంశు శుక్లా

దిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో రైతు అవతారమెత్తారు. చిన్నపాటి గాజు పాత్రల్లో ఆయన మెంతి, పెసర విత్తనాలు వేసి పెంచుతున్నారు. విత్తనాల నుంచి వచ్చిన మొలకలను తాజాగా ఫొటోలు తీశారు. మొలకల ఎదుగుదలను నిశితంగా పరిశీలించేందుకు స్టోరేజీ ఫ్రీజర్‌లో పెట్టారు. విత్తనాలు అంకురించడాన్ని, తొలి దశల్లో మొలకల ఎదుగుదలను సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తి ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకునే ప్రక్రియలో భాగంగా శుభాంశు కర్షకుడిగా మారి ఈ పరిశోధన చేపట్టారు. కర్ణాటకలోని ధార్వాడ్‌లో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, అక్కడి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్ధపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తల నేతృత్వంలో దీన్ని నిర్వహిస్తున్నారు. భూమిపైకి వచ్చాక- ఆ మొలకల్లో వచ్చిన జన్యుమార్పులు, పోషక విలువలను పరిశీలించనున్నట్లు ఆక్సియం స్పేస్ వెల్లడించింది. మరో ప్రయోగంలో భాగంగా శుభాంశు మైక్రోఆల్గేలను అధ్యయనం చేశారు. గురుత్వాకర్షణరహిత పరిస్థితుల్లో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేయగల వాటి సామర్థ్యాన్ని పరిశీలించారు.

వారధిలా ఉన్నందుకు గర్విస్తున్నా: శుభాంశు

ఐఎస్ఎస్‌లో మూలకణ పరిశోధనలతోపాటు విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణశక్తి ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్క్రీన్‌ల ద్వారా సంభాషణ జరిపేటప్పుడు వారి మేధో సామర్థ్యాలపై పడే భారాన్ని పరిశీలించడం వంటివి తనకు అద్భుతంగా అనిపిస్తున్నాయని బుధవారం ఆక్సియం స్పేస్ చీఫ్ సైంటిస్ట్ లూసీ లోతో సంభాషణలో శుభాంశు పేర్కొన్నారు. పరిశోధకులకు, అంతరిక్ష కేంద్రానికి మధ్య వారధిలా ఉండి.. వివిధ పరిశోధనలు చేపడుతున్నందుకు తాను గర్విస్తున్నానని తెలిపారు.

అమెరికాకు తగ్గిన భారతీయ విద్యార్థులు

ఇంటర్నెట్ డెస్క్: భారతీయ విద్యార్థులు ఈసారి సీజన్ ప్రారంభంలో చాలా తక్కువ సంఖ్యలో అమెరికా వీసాలు తీసుకున్నారు. గతేడాది మార్చి-మే మధ్య సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 27శాతం వీసాలు తగ్గాయి. కొవిడ్ సీజన్‌లో కన్నా ఇవి తక్కువ కావడం గమనార్హం. అమెరికా విదేశాంగశాఖ డేటా ఈ విషయాన్ని వెల్లడిస్తోంది. ఆగస్టు/సెప్టెంబరు మధ్య సెమిస్టర్ ప్రారంభం కానుండటంతో సాధారణంగా విద్యార్థి వీసాలకు సంబంధించి మార్చి-జులై మధ్య బిజీగా ఉంటుంది. కానీ ఈ ఏడాది మార్చి-మే మధ్యలో భారతీయ విద్యార్థులకు కేవలం 9,906 ఎఫ్-1 వీసాలే జారీ అయ్యాయి. కొవిడ్ తర్వాత ప్రయాణాలు పునఃప్రారంభించిన 2022లో ఇదే సీజన్‌లో 10,894గా నమోదయ్యాయి. ఇక 2023లో 14,987, 2024లో 13,478 జారీ అయ్యాయి.

అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ కార్యవర్గం చర్యలకు ఉపక్రమించడం, పాలస్తీనా మద్దతు ఆందోళనల్లో పాల్గొన్న పలువురు విద్యార్థుల వీసాలను రద్దు చేయడం వంటి చర్యలు విద్యార్థులను ఆలోచింపజేస్తున్నాయి. దీనికితోడు మే 27-జూన్ 18 మధ్య కఠినమైన సోషల్ మీడియా వెట్టింగ్ ప్రక్రియ కోసం రెండు వారాలపాటు వీసా దరఖాస్తుల స్వీకరణను నిలిపివేయడం వీసాల సంఖ్య తగ్గడానికి కారణమైంది.

భార్యపై అనుమానంతో బిడ్డకు డీఎన్‌ఏ కోరడం సబబు కాదు

స్పష్టంచేసిన బాంబే హైకోర్టు

ముంబయి: భార్యపై అనుమానంతో బిడ్డకు డీఎన్‌ఏ పరీక్షను కోరడం సబబు కాదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు బదులు మరేదైనా ఆధారాలు చూపి తమ వాదనను నిరూపించుకోవాలని తెలిపింది. ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే డీఎన్‌ఏ పరీక్షను నిర్వహిస్తారని వెల్లడించింది. ఇదే అంశంలో బిడ్డ డీఎన్‌ఏ పరీక్షకు అనుమతించిన కుటుంబ న్యాయస్థాన ఆదేశాలను హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ ఆదేశాలను రద్దు చేస్తున్నట్లు జస్టిస్ ఆర్.ఎం.జోషి స్పష్టం చేశారు. 2011లో దంపతుల వివాహం జరిగింది. వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో 2013లో భార్య మూడు నెలల గర్భంతో ఉన్న సమయంలో అతడు విడాకులు ఇచ్చాడు. తన వాదనలు నిరూపించడం కోసం బాలుడికి డీఎన్‌ఏ పరీక్ష నిర్వహించాలని కోరుతూ.. భర్త కుటుంబ కోర్టును ఆశ్రయించాడు.

న్యూ మెక్సికోలో వరద బీభత్సం

• ముగ్గురి మృతి, కొట్టుకుపోయిన ఇళ్లు

వాషింగ్టన్: అమెరికాలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. టెక్సాస్ రాష్ట్రంలో గత వారం వరద విధ్వంసం సృష్టించగా.. తాజాగా న్యూ మెక్సికోలోని రుయిడోసోలోనూ ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. దీంతో అధికారులు అక్కడ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. వరద నీటి ప్రవాహానికి ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వరదల్లో అనేకమంది ప్రజలు చిక్కుకుపోయారని మేయర్ లిన్ క్రాఫోర్డ్ పేర్కొన్నారు. రియో రుయిడోసో నది 20 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ప్రవహిస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. ఇక, వరద నీటి ప్రవాహానికి పలు ఇళ్లు కొట్టుకుపోయాయి. ఇళ్లు కొట్టుకుపోతున్న వీడియోను ఎవరో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.


కొట్టుకుపోతున్న ఇళ్లు

160 మంది ఆచూకీ గల్లంతు

మరోవైపు.. వరదల కారణంగా టెక్సాస్ రాష్ట్రంలో 109 మంది ప్రాణాలు కోల్పోయారని గవర్నర్ గ్రెగ్ అబాట్ తెలిపారు. మరో 160 మంది ప్రజల ఆచూకీ తెలియరాలేదని వెల్లడించారు. గ్వాడలూప్ నది పరివాహక ప్రాంతంలో వేసవి శిబిరాలకు వెళ్లినవారిలో ఎంతమంది కనిపించకుండా పోయారో స్పష్టత రాలేదన్నారు.

బిహార్ ఓటరు జాబితాల సవరణ కసరత్తుపై సుప్రీంలో విచారణ నేడు

దిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితాలకు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరగనుంది. పలు విపక్ష రాజకీయ పార్టీలు ఉమ్మడి గాను, కొందరు వ్యక్తులు విడిగానూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బుధవారం కూడా మరో రెండు పిటిషన్లు వచ్చాయి.

అమెరికాలో ఆర్థిక నేరస్థురాలు మోనికా కపూర్ అరెస్టు

• 25 ఏళ్ల తర్వాత అదుపులోకి
• సీబీఐకి అప్పగించిన అధికారులు



దిల్లీ: దాదాపు 26 ఏళ్లుగా పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థురాలు మోనికా కపూర్‌ను అమెరికాలో సీబీఐ కస్టడీకి అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎయిర్‌లైన్స్ విమానంలో బుధవారం రాత్రికి ఆమెను భారత్‌కు తీసుకువస్తున్నట్లు తెలిపారు. భారత్- అమెరికా మధ్య ఉన్న ద్వైపాక్షిక అప్పగింత ఒప్పందం ప్రకారం న్యూయార్క్‌లోని డిస్ట్రిక్ట్ కోర్టు ఆమెను భారత్‌కు అప్పగించడానికి అనుమతి ఇచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మోనికా కపూర్ 1999 సంవత్సరంలో ఓ ఆభరణాల వ్యాపారం విషయంలో తన సోదరులతో కలిసి నకిలీ పత్రాలను తయారుచేసింది. వ్యాపారం చేయడానికి కావాల్సిన ముడి పదార్థాలను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి భారత ప్రభుత్వం నుంచి లైసెన్స్‌లను పొందేందుకు ఈ పత్రాలను ఉపయోగించింది. అనంతరం వారు యూఎస్‌కు పారిపోయారు. 1999లో ఆమె చేసిన మోసానికిగాను భారత ప్రభుత్వానికి దాదాపు రూ. 5 కోట్లకు పైగా నష్టం వాటిల్లడంతో 2004లో ఆమెపై కేసు నమోదు చేశారు. దర్యాప్తునకు హాజరవ్వాలని ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ ఆమె భారత్‌కు రాకపోవడంతో మోనికా కపూర్‌ను అప్పగించాలని భారత ప్రభుత్వం 2010లో అమెరికా ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఆమెపై ఇంటర్‌పోల్ అధికారులు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆమెను అదుపులోకి తీసుకున్న అమెరికా అధికారులు భారత్‌కు పంపడానికి ప్రయత్నించగా తనను తిరిగి పంపొద్దని కోరుతూ మోనికా న్యూయార్క్‌లోని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఆమె పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు భారత్‌కు తిరిగి పంపడానికి అధికారులకు అనుమతి ఇవ్వడంతో సీబీఐ అధికారులు ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు.

నేపాల్, చైనా సరిహద్దుల్లో వరదలు

• 9 మంది మృతి, 20 మంది గల్లంతు

కాఠ్‌మాండూ: నేపాల్, చైనా సరిహద్దుల్లో భారీ వర్షాలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వరద నీరు ఉద్ధృతం కావడంతో ఇరు దేశాలను కలుపుతూ నిర్మించిన వంతెన కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఈ వరద నీటిలో కొట్టుకుపోయి 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలను గుర్తించినట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. మరో 20 మంది గల్లంతైనట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు భద్రతా సిబ్బంది కాగా మరో ఆరుగురు చైనీయులు ఉన్నారు. వరదల కారణంగా నేపాల్‌లోని రాసువా జిల్లాలో నాలుగు జల విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి.

ఆధార్ ఎప్పుడూ తొలి గుర్తింపు కాదు: ఉడాయ్ సీఈవో

దిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టిన పరిస్థితుల్లో ఆమోదయోగ్యమైన గుర్తింపు పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను మినహాయించాలనే ప్రతిపాదనపై వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) సీఈవో భువనేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధార్ ఎప్పుడూ తొలి గుర్తింపు కాదని భువనేశ్ కుమార్ స్పష్టం చేశారు. నకిలీ ఆధార్‌కార్డుల సృష్టిని కట్టడిచేసే మార్గాలు అన్వేషిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్ సాయంతో నకిలీ ఆధార్ కార్డులను గుర్తించవచ్చని వెల్లడించారు. కొత్త ఆధార్ యాప్ అభివృద్ధి దశలో ఉందన్నారు.

సెట్టింగులేసి మరీ అరాచకాలు



సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్. చిత్రంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు

- జగన్‌ది అంతా డ్రామా
- ప్రణాళిక ప్రకారమే మామిడికాయలను పారబోసి తొక్కించారు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే వైకాపా లక్ష్యం
- మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్, సత్యప్రసాద్ ధ్వజం
- మూడు జిల్లాల్లో 80%పైగా మామిడిని కొనుగోలు చేశామని వెల్లడి

శవాలు, రక్తపు పునాదులపై పుట్టిన పార్టీ వైకాపా అని జగన్ కుటుంబ సభ్యులే గతంలో చెప్పారు. ..జీవితాంతం కాపాడుకుంటానని దుకే జగన్ ఇప్పుడు పరామర్శల పేరుతో డ్రామాలేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇలాగే ప్రతి జిల్లాలో పర్యటించి అలజడి సృష్టించాలనే ఆయన వ్యూహం. అమాయక రైతుల్ని దీనికి ఉపయోగించుకోవడం దారుణం. జగన్ వ్యక్తిత్వం ఏంటో ప్రజలు తెలుసుకోవాలి. రైతులు జాగ్రత్తగా ప్రవర్తించాలి.

రైతుల నుంచి మామిడి కొనొద్దని పల్ప్ పరిశ్రమలపై వైకాపా నేతలు ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వం రంగంలోకి దిగి మామిడి కొనకపోతే విద్యుత్తు కనెక్షన్లు కట్‌చేస్తామని పరిశ్రమల్ని హెచ్చరించింది. జగన్ ఆత్మగా చెప్పే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఒక పల్ప్ పరిశ్రమ ఉంది. నిజంగా రైతుల్ని ఆదుకోవాలనుకుంటే కిలో రూ.16 చొప్పున ఆయనతో ఎందుకు కొనుగోలు చేయించడం లేదు? అప్పుడు మిగిలిన పరిశ్రమలూ దిగి వచ్చి అదే ధర ఇస్తాయి కదా?

ట్రాక్టర్లలో మామిడికాయలు తెచ్చి జగన్ కారు ముందు పారబోసుకుంటూ వెళ్లాలని ముందే ప్రణాళిక సిద్ధం చేశారు. వైకాపా సానుభూతిపరుడైన దేవేంద్ర అనే న్యాయవాది తమ్ముడుపాలెం నుంచి మామిడికాయలు తెచ్చారు. తంబళ్లపల్లె మాజీ సర్పంచి శేఖర్‌రెడ్డి వాటిని చిత్తూరు జిల్లా వైకాపా కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డికి చెందిన మామిడితోటలో ఉంచారు. ముందుకెళ్లిన జగన్ కాన్వాయ్ మరో మార్గంలో సర్వీస్ రోడ్డు ద్వారా వెనక్కి తెచ్చి, దాని ముందు కాయలు పారబోయించారు.

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైకాపా అధ్యక్షుడు జగన్ పర్యటన సందర్భంగా ప్రణాళిక ప్రకారమే మామిడిపండ్లను ట్రాక్టర్లలో తెప్పించి, రోడ్డుపై పారబోయించి, వాటిపై కార్లను నడిపించారని మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. 'రాజకీయ ముసుగులో జగన్ అరాచకాలు చేస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే ఆయన లక్ష్యం. రాష్ట్రానికి ఎవరూ రాకూడదు.. పెట్టుబడులు పెట్టకూడదు.. పాలన సక్రమంగా సాగకూడదనేదే ఆయన ఆలోచన' అని దుయ్యబట్టారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'హెలిప్యాడ్ ఎక్కడుండాలి? ఎంతదూరం ర్యాలీ చేయాలి? ఎంతమందిని సమీకరించాలి? ఎక్కడెక్కడ ఏం చేయాలి? అనేది అంతా సెట్టింగే. ఒక ప్రణాళిక ప్రకారమే అరాచకాలు చేస్తున్నారు. బంగారుపాళ్యం పర్యటనకు అయిదు జిల్లాల నుంచి వైకాపా కార్యకర్తలను తరలించాలని లక్ష్యం పెట్టారు. వాహనాలు సమకూర్చారు, డబ్బు పంచారు. రైతుల మాక్ కోసమే ఇవన్నీ అవసరమా?' అని మంత్రులు నిలదీశారు. 'మార్కెట్ యార్డు సమీపంలో హెలిప్యాడ్‌కు అనుమతి ఇస్తామన్నా, కాదని 6 కి.మీ. దూరంలో కావాలన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరి, రప్పా రప్పా కోస్తామంటూ బూతులు.. రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేయాలనే క్రిమినల్ ఆలోచనతోనే సెట్టింగులు వేసుకుని మరీ అరాచకాలు చేస్తున్నారు' అని ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా అయిదు ట్రాక్టర్లు ఒక్కసారిగా తోటలో నుంచి బయటకు వచ్చి, మామిడికాయలను రోడ్డుపై పారబోస్తుంటూ వెళ్తున్న వీడియోలను ప్రదర్శించారు. ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు పోలీసుల ఆదుపులో ఉన్నారని చెప్పారు. వైకాపా వాళ్ల సంగతి తెలిసే తాము కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రోన్లు, సర్వైలెన్స్ కెమెరాల ద్వారా మొత్తం వ్యవహారాన్ని చిత్రీకరింపజేశామని పేర్కొన్నారు.

డీఎస్పీని రప్పా.. రప్పా.. నరికేయమంటారా?

వైకాపా కార్యకర్త ఒకరు తనంతట తానే కిందపడి కాలుకు దెబ్బతగిలితే.. మామండూరు పోలీసుల లాఠీఛార్జి చేశారంటూ సాక్షిలో ఫ్లోలింగులు వేయించారని, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం ప్రారంభించారని మంత్రులు తెలిపారు. పర్యటనకు అనుమతి లేదని చెప్పినందుకు డీఎస్పీని రప్పా.. రప్పా.. నరికేయమంటూ పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్ గౌడ్ కార్యకర్తల్ని రెచ్చగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జగన్ పర్యటనలో ఏబీఎన్ ఫొటోగ్రాఫర్‌ను చితకబాదారు. డీఎస్పీ శ్రీనివాస్ కిందపడితే తొక్కుకుంటూ వెళ్లారు' అని మండిపడ్డారు.

రూ.260 కోట్లు విడుదల చేశాం.. రేపటి నుంచే రైతుల ఖాతాల్లో జమ

'చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో ఈ ఏడాది ఏడు లక్షల టన్నుల మామిడి దిగుబడి వచ్చింది. ధర లేకపోవడంతో రెండు నెలల ముందే అప్రమత్తమై కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేసేలా పల్ప్ పరిశ్రమలతో మాట్లాడాం. కిలోకు రూ.4 చొప్పున ప్రభుత్వం బోనస్ ఇస్తుందని చెప్పాం. అన్నమయ్య జిల్లాలో 99%, తిరుపతి జిల్లాలో 98%, చిత్తూరు జిల్లాలో 80% కొనుగోళ్లు పూర్తయ్యాయి. రూ.260 కోట్లు విడుదల చేశాం. రేపటి నుంచి రైతుల ఖాతాలకు నేరుగా కిలోకు రూ.4 చొప్పున జమచేస్తాం' అని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. 'కర్ణాటకలో కిలో రూ.16 చొప్పున కొనుగోలు చేస్తున్నారని జగన్ చెబుతున్నారు. అక్కడ జీవో ఇచ్చినా ఇంకా అమలు చేయడం లేదు. తమిళనాడులోనూ ప్రభుత్వం కొనడం లేదు' అని తెలిపారు.



జెండా రంగుల్లో జలసౌధం!

శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు నీరు వదులుతుండటంతో అక్కడి దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. జాతీయ జెండాను ప్రతిబింబించేలా రంగు రంగుల విద్యుద్దీపాలతో వెలుగులీనుతున్నప్పుడు తీసిన చిత్రమిది. - న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్

సాగర్‌కు కొనసాగుతున్న వరద..

535 అడుగులకు చేరిన నీటిమట్టం



నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతుండడంతో సాగర్ జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బుధవారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం మేరకు.. శ్రీశైలం నుంచి 1,16,757 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా.. ప్రాజెక్టు నీటిమట్టం 535.10 అడుగులకు చేరింది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 3,146 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,500 క్యూసెక్కులు మొత్తం 4,646 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ప్రధాన డ్యాంకు ఎడమ వైపు ఉన్న మట్టి కట్టను నీళ్లు తాకాయి.

అబద్ధాల మోత మోగించిన జగన్

- తన హయాంలో మామిడికి కిలోకు రూ.29 చెల్లించామని ప్రకటన
- అవగాహన లేకుండా ముందుగా పరిశ్రమలు తెరవాలని సూచన

ఈనాడు, చిత్తూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్ మామిడి రైతుల పరామర్శ కార్యక్రమానికి వచ్చి విలేకర్లతో మాట్లాడుతూ అబద్ధాల మోత మోగించారు. తమ హయాంలో ఎప్పుడూ తోతాపురి ధర కిలో రూ.22- 29కు తగ్గలేదని ప్రకటించారు. అవే ధరలు అన్నదాతలకు చెల్లించామని చెప్పారు. 2021, 2023 సీజన్లలో కిలో మామిడి ధర రూ.6-9 పలికినా ఆయన కనీసం సమీక్షించలేదు. రైతాంగానికి ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదు.

- పరిశ్రమలు ముందే తెరిపించి ఉంటే బాగుంటుందని ప్రభుత్వానికి జగన్ సూచించారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూన్ మొదటి వారంలో తోతాపురి కోతకు వచ్చింది. అటువంటప్పుడు మే మొదటి వారంలో గుజ్జు పరిశ్రమలు తెరిచి, ఏం చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రి కనీస అవగాహన లేకుండా మాట్లాడం విస్మయానికి గురి చేసిందంటున్నారు.
- కర్ణాటకలో ఎంత పంట తీసుకొచ్చినా అక్కడి ప్రభుత్వం రూ.40 వేలకు మించి ఇవ్వడం లేదు. రాష్ట్రంలో మాత్రం ఐదు ఎకరాలున్న రైతుకు దాదాపు రూ.90 వేలు- రూ.లక్ష సాయం వస్తుంది.

3.58 లక్షల టన్నుల 'తోతాపురి' కొనుగోళ్లు

ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: రైతుల నుంచి జులై 9వ తేదీ వరకు 3.58 లక్షల టన్నుల తోతాపురి రకం మామిడిని కొనుగోలు చేసినట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన 2,202 టన్నులు కొనుగోలు చేశామని వివరించారు. ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద దిగుమతికి వేచి ఉండే కాలం 12 నుంచి 24 గంటలకు తగ్గిందని వెల్లడించారు. 517 వాహనాలు మాత్రమే దిగుమతి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

ఒంగోలు, నాగార్జునసాగర్‌లో విమానాశ్రయాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఒంగోలు, నాగార్జునసాగర్‌లో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి సాంకేతిక, ఆర్థిక సాధ్యత నివేదిక (టీఈఎఫ్‌ఆర్) తయారు చేసేందుకు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ఓ ప్రకటన జారీ చేసింది. ఈ నెల 29 వరకు ఆన్‌లైన్‌లో బిడ్ల దాఖలుకు గడువు నిర్దేశించింది. మరుసటి రోజు టెక్నికల్ బిడ్‌లను తెరిచి, అందులో అర్హత పొందిన సంస్థల ఫైనాన్షియల్ బిడ్‌లను ఆగస్టు 4న తెరవనుంది. బిడ్ దక్కించుకున్న సంస్థకు 30 రోజుల్లో ఎల్‌వోఏ జారీ చేయనున్నట్లు ఏపీఏడీసీఎల్ తెలిపింది. ఒంగోలులో ప్రతిపాదించిన విమానాశ్రయానికి నగరానికి 7 కి.మీల దూరంలో అవసరమైన భూములను ప్రభుత్వం గుర్తించింది. నాగార్జునసాగర్‌లో ప్రతిపాదించిన విమానాశ్రయానికి విజయపురి సౌత్ దగ్గర నిర్మించనుంది.



డబ్బు ఓ సాధనం మాత్రమే

డబ్బు మీ కలలను నెరవేర్చుకోవడానికి, మీ జీవిత ప్రమాణాలను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడే ఓ సాధనం మాత్రమే. సంపాదనే జీవిత ధ్యేయం కారాదని తెలుసుకోండి. ఆ ఆలోచన లేనివారు డబ్బు కోసం అడ్డదారులు తొక్కి చిక్కుల్లో పడతారు. పైగా అలాంటివారికి ఎంత సంపాదించినా తృప్తి ఉండదు. మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని కృషి చేస్తూ ఉంటే, మీ అవసరాలన్నీ తీరేంత డబ్బు తప్పకుండా సంపాదిస్తారు.

- మనోజ్ అరోడా, రచయిత

మీరు పోలీసులా? రాక్షసులా?

- విచ్చలవిడిగా లాఠీఛార్జ్ చేస్తారా?
- వైకాపా అధినేత జగన్

ఈనాడు, చిత్తూరు: 'నా కార్యక్రమానికి రాకూడదని చెప్పి 1,200 మందిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. విచ్చలవిడిగా లాఠీఛార్జ్ చేశారు. మీరు పోలీసులా? మనుషులా? మనిషి రూపంలో ఉన్న రాక్షసులా?' అంటూ వైకాపా అధినేత జగన్ మరోసారి పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. 'ప్రతి పోలీసుకూ ఒకటే చెబుతున్నా. మీకూ సమస్యలుంటాయి. ఎప్పుడు ఎవరికి సమస్య వచ్చినా పలికేది ఒక్క జగన్ మాత్రమే. పొగాకు రైతులకు సమస్య ఉన్నా, మామిడి, మిర్చి రైతులకు ఇబ్బందులున్నా జగనే పలుకుతున్నాడు. ఉద్యోగులకు ఐఆర్ ఇవ్వాలన్నా.. పీఆర్సీ కోసం డిమాండ్ చేయాలన్నా, వారికి డీఏలు ఇప్పించాలన్నా జగనే ముందుంటాడన్నది గుర్తుపెట్టుకోవాలి. డీఐజీ, ఎస్పీ, లంచాలు తీసుకునే సీఐల మాటల్ని పోలీసులు వినొద్దు. చంద్రబాబు రేపు మీకిచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తే అప్పుడు జగన్ అనే వ్యక్తి ముందుకు రావాలంటే ఇప్పుడు జరుగుతున్న పోలీస్ వేధింపులను అడ్డుకోవాలని ప్రతి కానిస్టేబుల్‌నూ కోరుతున్నా' అని వ్యాఖ్యానించారు. బంగారుపాళ్యంలో బుధవారం జగన్ మీడియాతో మాట్లాడారు.

పంటను కొనుగోలు చేసి ప్రభుత్వమే అమ్ముకోవాలి

'చిత్తూరు జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో మామిడి పంట సాగైంది. 76 వేల మంది రైతులున్నారు. వారి ఖాతాల్లో రూ.12 వేల చొప్పున ప్రభుత్వం డబ్బులు వేయాలి. ఆ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆ తర్వాత ఫ్యాక్టరీలకు అమ్ముకోవాలి. రైతులు తమ పంటను ఫ్యాక్టరీల చుట్టూ నాలుగైదు రోజులు లారీల్లో స్టాక్ పెట్టుకుని.. కిరాయి ఖర్చులూ చెల్లించలేక అగచాట్లు పడుతున్నారు' అని అన్నారు.

చంద్రబాబు ప్రభుత్వం గాడిదలు కాస్తోందా?

'కర్ణాటకలో జనతాదళ్ నేత కుమారస్వామి అడిగితే కిలో రూ.16కి కొనుగోలు చేసేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఆ రాష్ట్రంలో కేంద్రం కొనుగోలు చేసేలా అక్కడి నేతలు చర్యలు తీసుకుంటే మరి ఇక్కడ చంద్రబాబు ప్రభుత్వం గాడిదలు కాస్తోందా? వైకాపా ప్రభుత్వ హయాంలో కిలో రూ.29కి రైతులు విక్రయిస్తే ఇప్పుడు కనీసం రూ.12 కూడా ఇప్పించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పుడు నేను వస్తున్నానని మూడు రోజుల నుంచి రూ.6 ఇస్తామని మెసేజ్‌లు పెడుతున్నారట' అని పేర్కొన్నారు. 'నేను వస్తున్నానని 2 వేల మంది పోలీసుల్ని మోహరించారు. రైతులు రాకుండా కట్టడి చేసే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో పాల్గొంటే రౌడీషీట్లు తెరుస్తామని వారిని బెదిరించారు. ద్విచక్రవాహనాల్లో ఎవరైనా వస్తే పెట్రోలు కూడా పోయొద్దని బంకు యజమానులకు చెప్పారు. 500 మంది రైతులు మాత్రమే రావాలంటున్నారు. కేవలం 500 మంది మాత్రమే నష్టపోయారా? ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది? ఎందుకు ఆంక్షలు పెడుతోంది' అని మండిపడ్డారు.

'రైతులు మామిడి పంట అమ్ముకుంటే టన్నుకు రూ.2 వేలు రావడం లేదు. వైకాపా ప్రభుత్వంలో రూ.29 వేలకు విక్రయించారు. ఏడాది కాలంలోనే రైతుల బతుకులు తలకిందులయ్యాయి. ఏటా మామిడి కొనుగోలు మే 10 నుంచి 15 మధ్య మొదలుపెట్టాలి. ఈ ఏడాది ఎందుకు ప్రారంభించలేదు? జూన్ రెండో వారంలో మార్కెట్ తెరిచేసరికి ఒత్తిడి పెరిగి ఫ్యాక్టరీలకు ఒకేసారి తీసుకెళ్లాల్సిన పరిస్థితి. పంట కుళ్లిపోతున్న పరిస్థితుల్లో.. విక్రయించుకుందామనే సమయానికి రెండున్నర, మూడు రూపాయలకు కూడా కొనే నాథుడే లేరు. జిల్లాలో 52 పల్ప్ కంపెనీలుంటే మే నెలలో తెరవాల్సిన ఫ్యాక్టరీలు జూన్ రెండో వారం వరకు తెరవకుండా ఉంటే చంద్రబాబు గాడిదలు కాస్తున్నారా? చంద్రబాబు చెబుతున్నట్లుగా 76 వేల మంది రైతుల్లో ఎంత మంది నుంచి కిలో రూ.8కి ఫ్యాక్టరీలు కొన్నాయి? ఎంతమంది రైతులకు కిలోకు రూ.4 చొప్పున ఇచ్చారు?' అని జగన్ ప్రశ్నించారు.



నిబంధనలు మీరి హెలిప్యాడ్ నుంచి బంగారుపాళ్యానికి భారీ ర్యాలీగా వస్తున్న జగన్, వైకాపా కార్యకర్తలు

అడుగడుగునా.. నిబంధనల ఉల్లంఘన

- భారీగా జనాన్ని సమీకరించి, బీభత్సం సృష్టించిన వైకాపా శ్రేణులు
- 'ఆ పోలీసు చెయ్యిని నరికేయండ్రా' అంటూ హూంకరింపు


ఈనాడు, చిత్తూరు: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ అడుగడుగునా నిబంధనలు అతిక్రమించారు. పర్యటనకు ముందే పోలీసులు పదేపదే ఆంక్షల గురించి వివరించగా వైకాపా నేతలు షరతులకు అంగీకరించి, అనుమతులు తీసుకున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే జగన్ పర్యటనకు అనుమతి ఉంది. కొత్తపల్లెలోని హెలిప్యాడ్ వద్దకు 30 మంది, మార్కెట్ యార్డుకు కేవలం 500 మందినే తీసుకురావాలని స్పష్టం చేశారు. ఎలాంటి రోడ్‌షోలు, ర్యాలీలకు అంగీకరించబోమని, జనసమీకరణ చేయకూడదని ముందే చెప్పారు. జగన్ కాన్వాయ్ చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి మీదుగా మార్కెట్ యార్డులోకి రావాలని పోలీసులు సూచించారు. వీటన్నింటినీ వైకాపా అధినేత జగన్ ఉల్లంఘించారు. బుధవారం ఉదయం 11.20 గంటల ప్రాంతంలో బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో కొత్తపల్లెకు ఆయన చేరుకోగా అక్కడ నాయకులు, కార్యకర్తలతో కలుపుకొంటే వెయ్యి మంది వరకు ఉన్నారు. దాదాపు 150 మంది హెలిప్యాడ్ లోపలికి చొచ్చుకెళ్లారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో రేణిగుంట డీఎస్పీ, చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి, మరో మహిళ కిందపడ్డారు. జాతీయ రహదారి మీదుగా జగన్ కాన్వాయ్ వెళ్లాల్సి ఉండగా సర్వీసు రోడ్డులో ప్రయాణించారు. 4 కి.మీ. దూరంలోని మార్కెట్ యార్డుకు పది నిమిషాలు పడుతుంది కానీ దాదాపు రెండున్నర గంటల సమయం తీసుకున్నారు. జగన్ ఉద్దేశపూర్వకంగానే రూట్ మార్చుకుని.. జాతీయ రహదారిపై దాదాపు అరగంటపాటు వాహనాలు నిలిచిపోయేలా చేశారు. మధ్యాహ్నం 1.54 గంటలకు మార్కెట్‌కు వచ్చేసరికి అక్కడ 5, 6 వేల మంది ఉన్నారు. ఉదయం చిత్తూరు జిల్లాలో అడుగుపెట్టింది మొదలుకుని మధ్యాహ్నం మూడింటికి తిరిగి వెళ్లే వరకూ జగన్ పోలీసుల ఆజ్ఞలను ఉల్లంఘిస్తూనే ఉన్నారు. నిర్దేశించిన మార్గంలోనే వెళ్లాలని ఎస్పీ మణికంఠ మొత్తుకున్నా ఆయన వినలేదు. వృద్ధులు, చిన్నారులను సైతం మార్కెట్ యార్డులోకి తీసుకొచ్చారు.

ఐదు నియోజకవర్గాల నుంచి తరలింపు: జగన్ పర్యటనకు ప్రధానంగా పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, పలమనేరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలించారు. పోలీసులు కొంతవరకే అడ్డుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఉన్నతాధికారులు విధించిన షరతులను అమలు చేయలేదు. దీంతో మార్కెట్ యార్డులో వైకాపా శ్రేణులు బీభత్సం సృష్టించాయి. ప్రత్యేక పోలీసు బలగాలతో కలుపుకొంటే 800 మందిని మోహరించినా వారిని కట్టడి చేయలేకపోయారు.

రప్పా రప్పా నరికేస్తామంటూ..: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడను తిమ్మోజుపల్లి వద్ద కొంతసేపు పోలీసులు నిలువరించారు. ఎక్కువ మందితో మార్కెట్ యార్డుకు వెళ్లకూడదని హెచ్చరించారు. దీంతో వైకాపా కార్యకర్తలు రెచ్చిపోయారు. అడ్డొచ్చిన పోలీసు ఒకరిని ఉద్దేశించి రప్పా రప్పా నరికేస్తామంటూ బెదిరించారు. ఒక కార్యకర్త మరో అడుగు ముందుకేసి 'రేయ్ పోలీసు చెయ్యి ఒకటి నరికేయండ్రా' అంటూ హూంకరించారు. తోపులాటలో ఆరుగురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. వీరికి బంగారుపాళ్యం సీహెచ్‌సీలో చికిత్స అందించారు. కల్లూరుకు చెందిన వైకాపా కార్యకర్త సుబ్రహ్మణ్యం కాలికి తీవ్ర గాయమైంది.

కొనుక్కున్న భూముల్లోనే ఉంటున్నాం

- దాడిచేసింది భద్రాచలం ఆలయ అధికారులే
- పురుషోత్తపట్నం గ్రామస్థులు, రైతులు



విలేకరులతో మాట్లాడుతున్న రైతులు, గ్రామస్థులు

ఎటపాక, న్యూస్‌టుడే: దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన భూముల్లోనే తాము ఇళ్లు కట్టుకుని ఉంటున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం రైతులు, గ్రామస్థులు తెలిపారు. పురుషోత్తపట్నం గ్రామంలో భద్రాచలం రామాలయానికి చెందిన దేవుడి మాన్యంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ దేవస్థానం అధికారులు, కార్యనిర్వహణాధికారి(ఈవో) రమాదేవి అడ్డుకోవడానికి వెళ్లగా ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో ఈవో సొమ్మసిల్లి పడిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం పురుషోత్తపట్నం రైతులు, గ్రామస్థులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ సుమారు 70-80 ఏళ్ల నుంచి తాము ఇదే గ్రామంలో ఉంటున్నామని తెలిపారు. ఇక్కడే నివాసం ఉంటున్న పున్నమ్మ అనే మహిళకు చెందిన ఇల్లు రెండేళ్ల క్రితం విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయిందన్నారు. ఇప్పుడు అదే స్థలంలో ఆమె రేకులతో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఈవో రమాదేవి సుమారు వందమంది సిబ్బందితో వచ్చి కూల్చేందుకు ప్రయత్నించారని చెప్పారు. అడ్డుకోబోయిన పున్నమ్మను నెట్టివేయడంతో కిందపడిపోయారని తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. పున్నమ్మకు ఏమైనా జరిగితే ఉద్యోగంపై ప్రభావం చూపుతుందనే భయంతో తోపులాటలో కిందపడిపోయిన ఈవో.. తనపై దాడి జరిగిందంటూ డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. దేవాలయ సిబ్బందే గ్రామంపై దాడి చేసి.. తిరిగి తమపై దాడి జరిగిందంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రామాలయ భూముల విషయం కోర్టులో ఉందని గుర్తుచేశారు. తమపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని.. నిజానిజాలు తెలుసుకొని తదనంతర చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదిగల అభివృద్ధికి రూ.40 వేల కోట్లు

మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు కేటాయించినట్లు మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. బుధవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులోని రహదారులు, భవనాల అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'దళితులను ఆదుకోవడానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో ఇన్నోవా కార్లు మంజూరు చేశాం. విదేశీ విద్యను కూడా ప్రారంభించాం. గత ప్రభుత్వం వీటన్నింటినీ కనుమరుగు చేసింది. రాష్ట్రానికి అమరావతి అభివృద్ధి ఎంతో అవసరమని, కూటమి ప్రభుత్వం రూ. లక్షల కోట్ల పెట్టుబడులను రాబడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటోంది' అని వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రివ్యూ చూస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్.. 'బ్రహ్మాండ' దర్శకుడు రాంబాబు మృతి



శివ్వంపేట, న్యూస్‌టుడే: సినీ దర్శకుడు సంద్రు నగేష్ అలియాస్ రాంబాబు(47) తాను దర్శకత్వం వహించిన సినిమా 'బ్రహ్మాండ' విడుదల సన్నాహాల్లో భాగంగా ప్రివ్యూ చూస్తూ.. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సీనియర్ నటి ఆమని ప్రధాన పాత్రలో తెలంగాణ జానపద కళారూపమైన ఒగ్గుకథ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కావాల్సి ఉంది. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రివ్యూ చూస్తుండగా రాంబాబు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ఆయనను తొలుత అపోలో ఆసుపత్రికి, తర్వాత నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య సరిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వగ్రామమైన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం అల్లీపూర్‌లో బుధవారం రాంబాబు అంత్యక్రియలు నిర్వహించారు. 'బ్రహ్మాండ' సినిమా నిర్మాత దాసరి సురేశ్, నటులు బలగం జయరాం, ఆనంద్ బాల్సద్, రవి, దేవిశ్రీ, కార్తిక్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. రాంబాబు 150 సినిమాలకు, 60 సీరియళ్లకు కో-డైరెక్టర్‌గా, కొన్నింటికి దర్శకుడిగా పనిచేశారు. ఈటీవీలో ప్రసారమైన అంతరంగాలు, అన్వేషణ సీరియళ్లకు కో-డైరెక్టర్‌గా వ్యవహరించారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాదారులపై పీడీ

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఈనాడు, అమరావతి: రేషన్ బియ్యం అక్రమ రవాణాదారులపై 6ఏతో పాటు పీడీ, భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని... మార్గదర్శకాలను పాటిస్తూ విదేశాలకు సులభంగా ఎగుమతి చేసుకోవచ్చని సూచించారు. సచివాలయంలో బుధవారం ఆయన కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల సంయుక్త కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు పోర్టు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను పెట్టి 24 గంటలూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కాకినాడ జిల్లాలో 85 కేసులు నమోదవగా.. వాటిలో పోర్టు ప్రాంతంలోనే 21 ఉన్నాయన్నారు.

తహసీల్దార్ సర్టిఫికెట్ ఇస్తేనే... ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

తెలంగాణలో ఇంటర్ చదివిన విద్యార్థులకు ఇక్కట్లు

ఈనాడు, అమరావతి: తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివి.. ఈఏపీసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో స్థానికేతర కోటా పొందాలంటే తల్లిదండ్రులు ఏపీలో పదేళ్లుగా ఉన్నట్లు సర్టిఫికెట్ సమర్పించాలి. మేలో జారీ చేసిన ఉత్తర్వుల్లో ఉన్నత విద్యాశాఖ ఈ విషయాన్ని పేర్కొంది. ఈ నివాస ధ్రువీకరణలను ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో ఈఏపీసెట్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్‌లు వెల్లువెత్తుతున్నాయి. పదేళ్ల నివాసం ఉన్నట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ల జారీని నిలిపివేసినట్లు తహసీల్దార్లు చెబుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. నివాస ధ్రువీకరణ లేకపోతే తల్లిదండ్రులు పదేళ్ల పాటు ఏపీలో చదువుకున్నట్లు ఉన్న స్టడీ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని కౌన్సెలింగ్ అధికారులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు చదువుకున్న వారైతే వారి దగ్గర స్టడీ సర్టిఫికెట్లు ఉంటాయి. మరి చదువుకోని వారి సంగతేమిటి? తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థుల పరిస్థితి ఇప్పుడు అయోమయంగా మారింది. ఈఏపీసెట్‌కు ఈ నెల 13 నుంచి వెబ్ ఐచ్ఛికాల నమోదుకు అవకాశం కల్పించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మూడు రోజులుగా కొనసాగుతోంది.

ఇంజినీర్ సిద్ధయ్యపై ఎంత ప్రేమో!

ఉత్తర్వులు లేకుండానే 11 నెలల పాటు కొనసాగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.సిద్ధయ్యపై రాష్ట్ర క్రీడల శాఖకు ప్రేమ తగ్గినట్లు లేదు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఆయన డిప్యుటేషన్ కాలం 2024 ఆగస్టు 8తో ముగిసింది. అప్పటి నుంచి 11 నెలలపాటు ఎలాంటి పరిపాలనా ఉత్తర్వులు ఇవ్వకుండానే ఆయన్ను కొనసాగించారు. దీనికి సంబంధించి బుధవారం ఆదేశాలివ్వడం చర్చనీయాంశమైంది. ఈ ఆదేశాల ప్రకారం సిద్ధయ్య డిప్యుటేషన్ వచ్చే నెల 4తో ముగియనుంది. వైకాపా ప్రభుత్వంలో శాప్ ఇంజినీరింగ్ విభాగంలో అన్నీ తానై సిద్ధయ్య చక్రం తిప్పారు. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పరికరాల కొనుగోళ్లకు సంబంధించిన టెండర్లలో చోటుచేసుకున్న అవకతవకల్లో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలొచ్చాయి. శాప్ క్రీడా మైదానాల అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి.

ఆణివారం ఆస్థానం నేపథ్యంలో వీఐపీ బ్రేక్ రద్దు


తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈ నెల 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న ఆణివారం ఆస్థానం నిర్వహించనున్నారు. మొదటిరోజు అష్టదళపాద పద్మారాధన మరుసటిరోజు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది. ఈ రెండు రోజులకు వీఐపీ బ్రేక్ దర్శనాలను ఈ నెల 14, 15న స్వీకరించమని తితిదే పేర్కొంది.

మనుషులే పుస్తకాలు... అనుభవాలే పాఠాలు..!

అనుకోని కష్టం వచ్చింది.. దాన్ని ఎవరితోనైనా పంచుకుంటే
పరిష్కార మార్గాలు దొరుకుతాయి..
కాసింతైనా ఆ బాధ తగ్గుతుంది.
కానీ ఆ వ్యథను వినేవారే లేరు!

పట్టరాని సంతోషం వచ్చింది.. ఎవరితోనైనా కలిసి
సంబరం చేసుకోవాలని ఉంటుంది.. ఆనందాన్ని
పంచుకోవాలనిపిస్తుంది... కానీ నా అనేవారు దగ్గర లేరు!

ఇలా బాధపడే వారి కోసం ఏర్పాటైందే 'హ్యూమన్ లైబ్రరీ'.
ఇక్కడ మనుషులే పుస్తకాలుగా మారి...
తమ అనుభవాలనే అక్షరాలుగా మార్చి
పాఠాలు చెబుతారు.
ఆనందాన్ని, విజ్ఞానాన్ని, జీవితసారాన్ని పంచుకుంటారు.



మన కష్టాలు చిన్నవిగా...

- ప్రస్తుత యువతలో చాలామంది మానసిక వ్యధ, ఒత్తిడి, ఒంటరితనం అనుభవిస్తున్నారు. ఆఫీస్ ప్రెషర్, బాస్ నుంచి వచ్చే చివాట్లు, పనిగంటల ఒత్తిడితో సతమతమవుతున్నారు.
- ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, ప్రేమలో విఫలం లాంటి కారణాలతో జీవితంపై విరక్తి చెంది.. బలవన్మరణానికి పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి.
- హ్యూమన్ లైబ్రరీకి వచ్చినవారితో సంభాషించడం వల్ల వారి కష్టాలు, ఇబ్బందులతో పోల్చుకుంటే మన బాధలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి.
- ఇక్కడకు వచ్చి మాట్లాడుకున్న తర్వాత కొత్త స్నేహాలు, బంధాలు, పరిచయాలు ఏర్పడుతున్నాయి.
- లైబ్రరీలో చదివిన పుస్తకాన్ని ఎంత జాగ్రత్తగా మళ్లీ అదే ప్రదేశంలో పెడతామో.. మనతో విషయాలు పంచుకున్న వారి గోప్యతకూ భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.
- ఇక్కడ సంభాషణలే కాకుండా చిన్న చిన్న ఆటలు కూడా ఆడుతుంటారు. పాటలు పాడతారు.

ఏంటీ హ్యూమన్ లైబ్రరీలు...

లైబ్రరీలో సాధారణంగా పుస్తకాలుంటాయి. ఇందుకు భిన్నంగా హ్యూమన్ లైబ్రరీలో మనుషులుంటారు. ఇక్కడికి వచ్చి ఎవరి గురించైనా తెలుసుకోవచ్చు. ఇందులో పాల్గొనాలంటే ముందుగా ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం ఆయా తేదీల్లో, నిర్దేశించిన సమయానికి హాజరుకావచ్చు. ఎదుటివారి కష్టసుఖాలు, అనుభవాలు తెలుసుకోవచ్చు. మనకు సంబంధించిన విశేషాలను వారితో పంచుకోవచ్చు. సుమారు 60 నిమిషాలు వారితో సంభాషించవచ్చు.

ఎలా ఎంచుకుంటారు?

కార్యక్రమం జరిగే ప్రదేశానికి వెళ్లే మనలాగే ఎంతోమంది నమోదు చేసుకున్నవారు అక్కడ ఉంటారు. ఇక్కడ ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చేవారంటూ ఎవరూ ఉండరు. ఈ హ్యూమన్ లైబ్రరీ.. కౌన్సెలింగ్ సెంటర్ మాదిరి కాకుండా.. ఇష్టాగోష్ఠిగా మనసు విప్పి మాట్లాడుకునే వేదిక. ఇక్కడ సమన్వయం చేయడానికి సంబంధిత నిర్వాహకులు ఉంటారు. అందులో ప్రత్యేకంగా 'వారితోనే' మాట్లాడాలనే నిబంధనలేమీ ఉండవు. నచ్చినవారితో సంభాషించవచ్చు. మన అనుభవాలు, కష్టసుఖాలు వారితో పంచుకోవచ్చు. అక్కడ అంతకుముందే సంభాషణ మొదలైతే.. వారితో కూర్చోవచ్చు. ఎదుటివారి అభిప్రాయాలు నచ్చితే స్నేహితులుగా మారిపోవచ్చు.

లాభాలేంటి?

- ఒంటరితనం భావన తొలగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది.
- కొత్త వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. కమ్యూనిటీ బిల్డింగ్ పెరుగుతుంది.
- మాట్లాడే విధానం, అర్థం చేసుకునే సామర్థ్యం మెరుగవుతాయి.
- వివిధ నేపథ్యాలు, అనుభవాలున్న వారితో మాట్లాడటం వల్ల అనేక విషయాలపై అవగాహన పెరుగుతుంది.

ఎక్కడి నుంచి వచ్చింది?

ఈ కాన్సెప్ట్ మొదట డెన్మార్క్‌లోని కోపెన్‌హెగన్ నగరంలో 2000 సంవత్సరంలో ప్రారంభమైంది. ఓ ఫెస్టివల్ కోసం ప్రాజెక్టుగా దీన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత మనుషుల మధ్య సంభాషణలు పెంచడం కోసం ఇప్పటి వరకు సుమారు 80 దేశాలు అనుసరిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌వాసులూ అందిపుచ్చుకున్నారు. భాగ్యనగరంలోని హైటెక్‌సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లలో ఈ తరహా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఒంటరితనంతో ఇబ్బంది పడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం 'కనెక్ట్ కార్నర్' అనే సంస్థ మాదాపూర్‌లో వారాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

గగన్‌యాన్ ప్రొపల్షన్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన ఇస్రో

శ్రీహరికోట, న్యూస్‌టుడే: గగన్‌యాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్ఎంపీఎస్)కు సంబంధించి రెండు హాట్ టెస్టులను విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో బుధవారం పేర్కొంది. రాకెట్ ప్రొపల్షన్ వ్యవస్థను, ఇంజిన్లను వాస్తవ పరిస్థితుల మధ్య మండించడాన్ని హాట్ టెస్టింగ్ వ్యవహరిస్తారు. ఈ నెల 3న తమిళనాడులోని మహేంద్రగిరి ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ స్వల్ప కాలిక హాట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించినట్లు ఇస్రో వెల్లడించింది. తొలుత 30 సెకన్లు, తర్వాత 100 సెకన్ల పాటు ఎస్ఎంపీఎస్‌ను పరీక్షించామని పేర్కొంది. "100 సెకన్ల పరీక్షలో రియాక్షన్ కంట్రోల్ సిస్టం (ఆర్‌సీఎస్) థ్రస్టర్లు, లిక్విడ్ అపోజీ మోటార్ (ఎల్ఏఎం) ఇంజిన్లు సమర్థంగా పని చేశాయి. త్వరలోనే పూర్తిస్థాయి హాట్‌టెస్టును నిర్వహిస్తాం" అని తెలిపింది. గగన్‌యాన్ ఆర్బిటల్ మాడ్యూల్‌లో కీలకమైన ఎస్ఎంపీఎస్‌ను ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టం సెంటర్ (ఎల్పీఎస్సీ) అభివృద్ధి చేసింది. గగన్‌యాన్ యాత్రను 2027లో చేపట్టాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.

కుప్పం అభివృద్ధికి సింగపూర్ బ్లూప్రింట్

కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి తరహాలో కుప్పం అభివృద్ధికి సింగపూర్ బృందంతో మాస్టర్ ప్లాన్, బ్లూ ప్రింట్ వేయిస్తున్నట్లు కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (కడా) పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కడా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విమానాశ్రయం ఏర్పాటులో భాగంగా భూమి కోల్పోయిన రైతులకు 2015-16, 2016-17 సంవత్సరాలకు రూ.13 కోట్ల నష్టపరిహారం చెల్లించడంలో ఆలస్యం కావడంతో వాటికి వడ్డీ వేసి రూ.25 కోట్లు చెల్లించనున్నట్లు చెప్పారు. మరింత భూసేకరణ అవసరమవ్వనుండగా రైతులతో చర్చించి అనుకూలంగా ధరలు నిర్ణయించనున్నట్లు చెప్పారు. గండికోట నుంచి కుప్పం వరకు నీరు తెచ్చేందుకు, మదనపల్లె- క్రిష్ణగిరి నాలుగు వరుసల రహదారికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మాదనపల్లె, యామగానిపల్లె వద్ద రిజర్వాయర్లను పునఃప్రారంభించనున్నట్లు వివరించారు. 2027 నాటికి అర్హులందరికీ ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటనలో 8 వేల మంది ఎస్సీ, ఎస్టీలకు సౌర ఫలకాలు పంపిణీ చేశారని చెప్పారు.

వినియోగించేది మిగులు జలాలా.. వరద జలాలా?

- ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేయాలి
- నిర్మించిన, నిర్మాణంలోని ప్రతిపాదిత ప్రాజెక్టులకు భరోసా ఉండాలి
- పోలవరం-బనకచర్లపై జలసంఘానికి అభిప్రాయాలను తెలిపిన గోదావరి బోర్డు

ఈనాడు, అమరావతి: 'పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో వినియోగించేది గోదావరి వరద జలాలనా... మిగులు జలాలనా అనే అంశాన్ని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేయాలి. ఈ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకునే క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల్లో నీటి వినియోగం, నిర్మాణంలోని ప్రాజెక్టుల అవసరాలు, కొత్తగా ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుల అవసరాలకు కేంద్ర జలసంఘం పూచీగా ఉండేలా చూడాలి' అని గోదావరి నదీ యాజమాన్య బోర్డు చెప్పింది. పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రీ ఫీజిబిలిటీ నివేదిక(పీఎఫ్ఆర్)పై కేంద్ర జల సంఘానికి బోర్డు తన అభిప్రాయాలను తెలుపుతూ లేఖ రాసింది. ఈ పీఎఫ్ఆర్ ప్రతిని గోదావరి బోర్డుకు జలసంఘం జూన్ 11న పంపి అభిప్రాయాలను కోరింది.

లేఖలోని అంశాలు...

★ పోలవరం ప్రాజెక్టు డీపీఆర్‌కు 2009 జనవరి 20న జలశక్తి మంత్రిత్వశాఖకు చెందిన సలహా కమిటీ ఆమోదం తెలిపింది. పోలవరం జలాశయం నుంచి ఇప్పుడు ఏపీ ప్రభుత్వం 200 టీఎంసీలను మళ్లించాలని నిర్ణయించినందున ఆ ప్రాజెక్టు పరిధి మారుతుంది. ప్రాజెక్టు డీపీఆర్‌ను సవరించి మళ్లీ సలహా కమిటీ ముందు పెట్టాల్సి ఉంటుంది.

★ పోలవరం నుంచి రోజుకు 2 టీఎంసీలను మళ్లించడం వల్ల ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూలు (1980 గోదావరి అవార్డు ట్రైబ్యునల్ ప్రకారం అనుబంధం జి ప్రకారం) మార్చాల్సి ఉంటుంది. ఆ షెడ్యూలులో ఎలాంటి మార్పులు చేయాలన్నా గోదావరి పరీవాహక రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి.

★ పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా నదికి మళ్లించే 80 టీఎంసీలను మూడు రాష్ట్రాలు పంచుకోవాలనేది నిబంధన. ఇప్పుడు 80 టీఎంసీలను మించి నీటిని మళ్లిస్తే గోదావరి ట్రైబ్యునల్, కృష్ణా ట్రైబ్యునల్ అవార్డుల ప్రకారం ఈ విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర జలసంఘం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

★ గోదావరి నదీ జలాల పరీవాహకం విషయంలో నీటి లభ్యతను లెక్కించలేదు. అప్పటి పరీవాహక రాష్ట్రాల మధ్య ఉన్న ఒప్పందాలను గోదావరి అవార్డులో భాగం చేశారు. గోదావరి జలాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, పరీవాహక వారసత్వ రాష్ట్రాల మధ్య ఏ ట్రైబ్యునలూ కేటాయించలేదు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఒప్పందమూ లేదు. కేంద్ర జలసంఘం ఈ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి.

హైకోర్టు సర్క్యులర్ మేజిస్ట్రేట్లను బెదిరించేలా ఉంది

- కోర్టుధిక్కరణ ఎదుర్కోవాల్సి ఉంటుందని 'సుప్రీం' తీర్పులలో లేదు
- ఆ సర్క్యులర్‌ను కొట్టేయాలంటూ హైకోర్టులో అత్యవసర వ్యాజ్యం
- విచారణ జరిపిన సీజే నేతృత్వంలోని ధర్మాసనం

ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాలలో అనుచిత, అభ్యంతరకర పోస్టులు/వ్యాఖ్యల కేసులలో నిందితులకు రిమాండ్ విధించేటప్పుడు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని, తమ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కోర్టుధిక్కరణ, శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని హైకోర్టు జారీచేసిన సర్క్యులర్ రాష్ట్రంలోని మేజిస్ట్రేట్లను బెదిరించేలా ఉందని సీనియర్ న్యాయవాది ఎన్.సుబ్బారావు, న్యాయవాది చాపర్ల సీతారాం హైకోర్టులో వాదించారు. ఆ సర్క్యులర్‌ను రద్దుచేయాలని కోరారు. ఈ మేరకు దాఖలైన వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం.. ఈ వ్యవహారాన్ని తాము పరిశీలిస్తామని తెలిపి, విచారణను వాయిదా వేసింది.

★ సోషల్ మీడియాలో పోస్టులపై నమోదు చేసిన కేసులలో నిందితులకు రిమాండ్ విధించేటప్పుడు అర్నేష్‌కుమార్, ఇమ్రాన్ ప్రతాప్ గాధి కేసులలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని, వాటిని ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని, కోర్టుధిక్కరణ, శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) కమలాకర్‌రెడ్డి ఈ నెల 5న సర్క్యులర్ జారీచేశారు. దీన్ని సవాలు చేస్తూ విజయవాడకు చెందిన న్యాయవాది జయంతి ఎస్.సి.శేఖర్ హైకోర్టులో అత్యవసర వ్యాజ్యం వేశారు. బుధవారం కోర్టు ప్రారంభ సమయంలో.. ఈ వ్యాజ్యంపై అత్యవసర విచారణ జరపాలని న్యాయవాది చాపర్ల సీతారాం కోరారు. ఆ సర్క్యులర్ మేజిస్ట్రేట్లను బెదిరించేలా ఉందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో దానిని జారీచేశారని ధర్మాసనం చెప్పగా సుప్రీం తీర్పులలో మేజిస్ట్రేట్లపై కోర్టుధిక్కరణ చర్యల గురించి ఎక్కడా పేర్కొనలేదని సీతారాం అన్నారు. దీంతో వ్యాజ్యంపై అత్యవసరంగా విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది.

సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా సర్క్యులర్

తర్వాత పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎన్.సుబ్బారావు వాదనలు వినిపించారు. 'సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడితే కోర్టుధిక్కరణ ఎదుర్కోవాల్సింది పోలీసులు. హైకోర్టు ఇచ్చిన సర్క్యులర్‌లో మాత్రం మేజిస్ట్రేట్లు కోర్టుధిక్కరణ ఎదుర్కోవాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులలో అలా లేదు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలకే మేజిస్ట్రేట్లు బాధ్యులు' అని పేర్కొన్నారు.

డిసెంబరుకల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల పూర్తి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లు డిసెంబరుకు పూర్తవుతాయని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో పెరగబోయే అసెంబ్లీ స్థానాలతో అదనంగా వచ్చే ఎమ్మెల్యేలకు కూడా సరిపోయేలా ఈ క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బుధవారం ఆయన ఈ భవన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "ఈ క్వార్టర్లలో ఈతకొలను, క్లబ్ హౌస్, వ్యాయామశాల వంటి సదుపాయాలతోపాటు గ్రౌండ్ వాటర్ రీఛార్జింగ్, సౌర విద్యుత్తు వంటివీ ఏర్పాటు చేయాలని సూచించా. మరోవైపు 35 మంత్రుల క్వార్టర్లు, 36 న్యాయమూర్తుల క్వార్టర్ల నిర్మాణం కూడా వచ్చే ఏడాది మార్చికి పూర్తవుతుంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్, ఉప ఛైర్మన్‌లకు కూడా అధికారిక నివాసాలను ఈ క్వార్టర్ల వద్దనే ప్రత్యేక గుర్తింపు ఉండేలా నిర్మించాలని సూచించా. గవర్నర్, ముఖ్యమంత్రి నివాసాలు కృష్ణా నది పక్కన వస్తాయి" అని తెలిపారు.

ఆర్ఎంపీల డిమాండ్ల పరిశీలనకు కమిటీ: మంత్రి సత్యకుమార్



ఈనాడు, అమరావతి: ఆర్ఎంపీల డిమాండ్ల పరిశీలనకు కమిటీ వేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆర్ఎంపీలు, ఆశా కార్యకర్తలు, ఏపీ దేశీయ వైద్య సంఘం డిమాండ్లు, సూచనలపై సచివాలయంలో బుధవారం సమీక్షించారు. ఆశా వర్కర్ల డిమాండ్లలో సీఎం ఆమోదించినవి ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నందున, ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్ మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యానికి అవసరమైన ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలన్న ఏపీ దేశీయ వైద్య సంఘం విన్నపాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. ఆర్ఎంపీల సేవలు గుర్తించి, వారిని కొనసాగించడంపై ఎన్ఎంసీ, సుప్రీంకోర్టు అభిప్రాయాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు కృష్ణబాబు సూచించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం

ఈనాడు, అమరావతి: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పలువురు గంజాయి స్మగ్లర్లు, రవాణాదారులపై రాష్ట్ర ప్రభుత్వం పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగించింది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం, వి.మాడుగుల మండలానికి చెందిన బుదిరెడ్ల కొండలరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి చెందిన గాలి సత్యనారాయణ, జీకే వీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్, హుకుంపేట మండలానికి చెందిన కొర్రా సీతారామ్, జి.మాడుగల మండలానికి చెందిన వంచుర్బ కొండాబాబులు పదేపదే గంజాయి స్మగ్లింగ్, రవాణా వంటి నేరాలకు పాల్పడుతున్నారు. వీరిని ఈ చట్టం కింద ఏడాది పాటు ముందస్తుగా నిర్బంధించనుంది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా బుధవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీపీజీఈసెట్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో గేట్/జీప్యాట్/ఏపీపీజీఈసెట్-2025 ద్వారా ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మా-డీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అప్పగించిందని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య పి.మల్లికార్జునరావు ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి దశ ప్రవేశాలకు ఈ నెల 8న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. అభ్యర్థులు 12 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌టీటీపీఎస్://సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌ను సందర్శించాలని సూచించారు.

ఆటపాటలతో అభ్యసనం


- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పుస్తకాలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: బాల్యానికి భరోసా ఇవ్వడంతోపాటు చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యకర రీతిలో ఎదిగేలా కూటమి ప్రభుత్వం పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా 'నవ చేతన, ఆధార్ శిల' అనే పుస్తకాలను (హ్యాండ్ బుక్స్) రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి అందజేసింది. వీటిలోని అంశాలను వారు అమలు చేయడంతోపాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది. 'నవచేతన' పుస్తకంలో పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వారితో ఎలా ప్రవర్తించాలి. చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా ఎలా కబుర్లు, కథలు చెప్పాలి అనేది చిత్రాలతో సహా ఇచ్చారు. చిన్నారికి 36 నెలలు అంటే మూడేళ్లు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యకరంగా పెరుగుతారో వివరించారు. పిల్లలకు ఏ నెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో కూడా ఈ పుస్తకంలో వివరించారు. ఇందులోని అంశాలపై అంగన్‌వాడీ టీచర్ తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

★ 'ఆధార్ శిల' పుస్తకంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో వివరించారు. అభ్యసన మొత్తం ఆటలు ఆడించే ప్రక్రియగానే ఉంటుంది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరి సీడీపీవో ఎ.సరిత మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా పుస్తకాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు.



గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెదపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం సందర్భంగా తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు



నవచేతన పుస్తకంలోని ఓ పేజీ



మీ ఆలోచనా విధానం ఎలా ఉండాలంటే..

'ఈ ప్రయత్నంలో విఫలమైతే నా పరిస్థితేంటి?' అని కాదు, 'ఈ ప్రయత్నంలో విజయవంతమైతే నా జీవితం ఎలా మారుతుంది' అని ఆలోచించండి.
అదే విధంగా 'ఇతరులు నా గురించి ఏమనుకుంటారు', 'నాకు తగిన సామర్థ్యాలున్నాయా', 'ఈ పని చేయడానికి ఇప్పుడు సరైన సమయమేనా' అని ప్రశ్నించుకోవడానికి బదులు 'నా గురించి నేనేమనుకుంటున్నాను', 'నా సామర్థ్యాలను ఎలా మెరుగుపరుచుకోవచ్చు', 'ఈ పనిని ఇప్పుడే ఎందుకు మొదలుపెట్టకూడదు' అని ఆలోచించండి.
– జోయెల్లా, ఇన్వెస్ట్‌మెంట్ మెంటార్

EENADU Vol: 51, Issue: 331 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

లక్షణాలు ప్రస్ఫుటం కాకముందే రోగ నిర్ధారణ

దిల్లీ: ఒత్తిడితో కూడిన వ్యాయామం, నిద్రలేమి వంటి పరిస్థితుల్లో మానవ శరీరంలోని వివిధ అవయవాలు ఒకదానికొకటి ఏవిధంగా సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయన్న దానిపై అధ్యయనం జరిగింది. లక్షణాలు ప్రస్ఫుటం కాక ముందే వ్యాధిని నిర్ధారించేందుకు దీని ఫలితాలు దోహద పడతాయని పరిశోధకులు చెబుతున్నారు. బ్రిటన్‌లోని పోర్ట్స్‌మౌత్, లండన్ యూనివర్సిటీ కాలేజ్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. ఇందులో గుండె, శ్వాసరేటు వంటి విషయాలను వేర్వేరుగా కాకుండా.. ఒత్తిడి సమయంలో మొత్తం శరీర ప్రక్రియను పరిశీలించారు. ఉదాహరణకు వ్యాయామ సమయంలో కండర వ్యవస్థకు మరింత రక్తాన్ని అందించేందుకు గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఈ సమయంలో ఇతర శారీరక వ్యవస్థల నుంచి గుండె అత్యధిక సమాచారం పొందుతుంది. శరీర సమతుల్యత సాధించేందుకు ఇది తోడ్పడుతుంది. శరీరం ఏకకాలంలో అనేక విషయాలపై స్పందిస్తోందనడానికి ఇది నిదర్శనమని అధ్యయన పత్ర రచయిత అలీరెజా మని పేర్కొన్నారు. 'ఫిజియాలజీ' జర్నల్ ఈ అధ్యయన సారాంశాన్ని ప్రచురించింది. అధ్యయనంలో భాగంగా 22 మంది ఆరోగ్యవంతులైన వాలంటీర్లకు సెన్సర్లు తొడిగారు. తక్కువ ఆక్సిజన్ (హైపాక్సియా), నిద్రలేమి, సైక్లింగ్ వంటి మధ్యతరహా వ్యాయామ పరిస్థితుల్లో వారి శరీర అవయవాల స్పందనను నమోదు చేశారు.

టీబీని గుర్తించడానికి మరో 1,500 ఎక్స్‌రే మిషన్‌లు

- కేంద్ర వైద్యారోగ్యశాఖ నిర్ణయం

దిల్లీ: టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీబీని త్వరగా గుర్తించి, వేగంగా పరీక్షలు నిర్వహించడానికి సుమారు 1,500 ఎక్స్‌రే యంత్రాలను సమీకరించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర వైద్యారోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే 500 యంత్రాలు దేశవ్యాప్తంగా ఉపయోగంలో ఉన్నాయని తెలిపాయి. కేంద్ర ప్రభుత్వ నినాదమైన "టీబీ ముక్త్ అభియాన్" ప్రకారం 2025 నాటికి దేశంలో ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాల్సి ఉంది. ఇప్పటివరకు 46 వేల పంచాయతీలను టీబీ రహిత ప్రాంతాలుగా ప్రకటించారు. టీబీపై పోరాటంలో భారత్ విజయాలను గమనిస్తే.. 2015లో ప్రతి లక్ష మందిలో 237 కేసులు ఉండగా ప్రస్తుతం అది 195గా ఉంది. టీబీ మరణాల సంఖ్య కూడా ప్రతి లక్ష మందిలో 28 నుంచి 22కు దిగి వచ్చింది. చికిత్స అందని, అసలు గుర్తించని టీబీ కేసులు 2015లో 15 లక్షలు ఉంటే 2023 నాటికి అవి 83 శాతం తగ్గిపోయి 2.5 లక్షలకు చేరాయి. ఇన్ని సానుకూల ఫలితాలు నమోదు చేసినా ప్రపంచంలో టీబీ కేసులు ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ తొలిస్థానంలోనే ఉంది.

దివ్యాంగుల సంక్షేమ పథకాల ప్రతిపాదనలకు పోర్టల్

- ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: దీన్‌దయాల్ దివ్యాంగ్‌జన్ పునరావాస పథకం (డీడీఆర్ఎస్), జిల్లా దివ్యాంగ పునరావాస కేంద్రాల(డీడీఆర్‌సీ) కింద వచ్చే ప్రతిపాదనల ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది. డీడీఆర్ఎస్, డీడీఆర్‌సీ ప్రతిపాదనలకు ఉపయోగించే ఈ-అనుదాన్ పోర్టల్ grants-msje.gov.in ను నిలిపివేస్తున్నట్లు దివ్యాంగ వ్యక్తుల సాధికారత విభాగం తెలిపింది. దాని స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన కొత్త పోర్టల్ https://grants.depwd.gov.in ను ప్రారంభించింది. పాత రికార్డులకు ఆటంకం లేకుండా నిరంతరంగా ఉపయోగించుకోవడానికి పాత పోర్టల్‌లో ఉన్న సమాచారాన్నంత కొత్త పోర్టల్‌లోకి బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఉగ్ర సాధనాలుగా ఈ - కామర్స్ వేదికలు?

ఇంటర్నెట్ డెస్క్: ఉగ్రవాద సంస్థల చేతిలో ఈ-కామర్స్ వేదికలు, ఆన్‌లైన్ పేమెంట్ సర్వీసులు దుర్వినియోగం అవుతుండడంపై ఆర్థిక చర్యల కార్యదళం (ఎఫ్ఏటీఎఫ్) తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. భారత్‌లో 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడిని, 2022లో గోరఖ్‌నాథ్ ఆలయంపై జరిగిన దాడిని ఇందుకు ఉదాహరణగా పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా మనీలాండరింగ్, ఉగ్రవాద నిధులను పర్యవేక్షించే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ తన తాజా నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. డిజిటల్ టూల్స్, ఆర్థిక సాంకేతికతలను తప్పుదారి పట్టించి ఉగ్రవాద సంస్థలు తమకు కావాల్సిన నిధుల్ని ఎలా సమీకరించుకుంటాయో, ఎలా తరలిస్తున్నాయో వివరంగా తెలిపింది.


2019 పుల్వామా ఉగ్రదాడిలో సైనికులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఉగ్రవాదులు బాంబుల (ఐఈడీ)తో పేల్చివేశారు. ఈ ఐఈడీ తయారీకి కావాల్సిన అల్యూమినియం పొడిని ఉగ్రవాదులు ఈ కామర్స్ వేదిక నుంచి ఆర్డర్ చేసి తెప్పించుకున్నట్లు తన నివేదికలో పేర్కొంది. ఈ ఘటనలో 40మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులైన విషయం తెలిసిందే. ఈ ఉగ్రదాడి ఘటన వెనక పాకిస్థాన్ హస్తం గల ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ఉన్నట్లు భారత నిఘాసంస్థలు గుర్తించాయి. వస్తు రవాణా, బాంబు తయారీలో ఆన్‌లైన్ వేదికలు ఉగ్రవాదులకు ఉపకరిస్తున్నట్లు వెల్లడైందని సదరు సంస్థ తెలిపింది. గత దశాబ్దకాలంలో ఫిన్‌టెక్ వేదికల పెరుగుదల.. ఉగ్రవాదుల ఆర్థిక కార్యకలాపాలు జరిపేందుకు కొత్త మార్గాలుగా ఉపయోగపడ్డాయని "ప్రపంచ ఉగ్ర కార్యకలాపాల వాచ్‌డాగ్" సంస్థ అయిన ఎఫ్ఏటీఎఫ్ పేర్కొంది.

మరో 7 దేశాలకు ట్రంప్ సుంకాల లేఖలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మరో 7 దేశాలకు సుంకాల లేఖలు పంపారు. ఈ జాబితాలో ఫిలిప్పీన్స్, బ్రూనై, మాల్డోవా, అల్జీరియా, లిబియా, ఇరాక్, శ్రీలంక ఉన్నాయి. తనతో భేటీ అయిన లైబీరియా, సెనెగల్, గబాన్, మారిటానియా, గినీ-బిస్సౌ తదితర దేశాలపై సుంకాల భారం మోపబోనని ట్రంప్ తెలిపారు.

సుంకాలిలా..

లిబియా, ఇరాక్, అల్జీరియా, శ్రీలంక: 30%
మాల్డోవా, బ్రూనై: 25% ఫిలిప్పీన్స్: 20%



స్వయంగా డప్పు వాయించి..

విండ్‌హోక్: ప్రాజెక్టు చీతాకు సహకరించిన నమీబియాకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆఫ్రికాలో భారత్‌కు విశ్వసనీయ భాగస్వామిగా ఆ దేశాన్ని పేర్కొన్నారు. నమీబియా పర్యటన కోసం ఆ దేశ రాజధాని నగరం విండ్‌హోక్‌లో విమానాశ్రయానికి చేరుకున్న మోదీ తనకు సంప్రదాయ స్వాగతం పలికిన కళాకారులతో కలిసి డప్పు వాయించి అందరినీ ఉత్సాహపరిచారు. నమీబియా పర్యటనను ముగించుకున్న అనంతరం మోదీ స్వదేశానికి బయలుదేరారు.

కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు
40 మంది గాజా వాసుల మృతి

దెయిర్ అల్ బలా: ఒకవైపు అంతర్జాతీయ మధ్యవర్తులు గాజాలో కాల్పుల విరమణ కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తుండగా, మరోవైపు ఇజ్రాయెల్ గాజాపై దాడుల పరంపరను కొనసాగిస్తోంది. తాజాగా ఇజ్రాయెల్ బుధవారం జరిపిన వైమానిక దాడుల్లో 40 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మృతుల్లో 17 మంది మహిళలు, 10 మంది పిల్లలు ఉన్నారని ఖాన్ యూనిస్ నగరంలోని నాసర్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పాలస్తీనీయుల మరణంపై మౌనం వహించిన ఇజ్రాయెల్ గాజాలో 100 లక్ష్యాలపై గురిపెట్టి దాడి చేసినట్లు ప్రకటించింది. మిలిటెంట్లపై, అనుమానిత నిర్మాణాలపై, ఆయుధ నిల్వ సదుపాయాలపై, క్షిపణి లాంచర్లపై, సొరంగ మార్గాలపై ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మంగళవారం సాయంత్రం మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు.

హూతీలు ముంచేసిన నౌక నుంచి బయటపడ్డ భారతీయుడు

యెమెన్‌కు చెందిన హూతీలు ఇజ్రాయెల్ దిశగా వెళ్తున్న ఒక సరుకుల నౌకను ఇటీవల ఎర్ర సముద్రంలో ముంచేసిన సంగతి తెలిసిందే. ఇటర్నిటీ సి అనే ఈ గ్రీకు నౌక నుంచి ఇంతవరకూ ఐదుగురు ఫిలిప్పీన్ జాతీయులను, ఒక భారతీయుణ్ని సజీవంగా కాపాడగలిగారు. లైబీరియా దేశం జెండా కలిగివున్న ఈ నౌకపై జరిగిన దాడిలో కనీసం ముగ్గురు నావికులు మృతి చెందినట్లు భావిస్తున్నారు. మరో 19 మంది జాడ తెలియాల్సి ఉంది. నౌకను తామే ముంచేసినట్లు హూతీలు ప్రకటించారు.

దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడి అరెస్టుకు కోర్టు ఆమోదం

సియోల్: దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టుకు కోర్టు ఆమోదం తెలిపింది. గత డిసెంబరులో ఆయన దేశంలో మార్షల్ లా విధించారు. తీవ్ర వ్యతిరేకత తలెత్తడంతో వెంటనే ఎత్తేశారు. ఆ తర్వాత జనవరిలో ఆయనను ప్రభుత్వం అరెస్టు చేసి డిటెన్షన్ సెంటర్‌కు తరలించింది. ఆయనను కస్టడీలో ఉంచి విచారించాల్సిన అవసరం లేదని బయటే ఉండి విచారణను ఎదుర్కోవచ్చని సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పు చెప్పడంతో మార్చిలో విడుదలయ్యారు. ఏప్రిల్‌లో రాజ్యాంగ న్యాయస్థానం ఆయన అభిశంసనను ఆమోదించడంతో పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. తాజాగా ఆయన అరెస్టును కోర్టు ఆమోదించడంతో మళ్లీ డిటెన్షన్ సెంటర్‌కు తరలించే అవకాశముంది.

ఇండిగో విమానాన్ని ఢీకొట్టిన పక్షి

- 175మంది ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

పట్నా: బిహార్‌లోని పట్నా నుంచి 175 మంది ప్రయాణికులతో దిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానానికి బుధవారం తృటిలో ప్రమాదం తప్పింది. "టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఐజీఓ5009 విమానాన్ని పక్షి ఢీకొంది. రన్‌వేపై చనిపోయిన పక్షి శరీర భాగాలు కనిపించడంతో విషయాన్ని పైలట్లకు తెలిపాం. సందేశాన్ని అందుకున్న పైలట్లు ఒక ఇంజిన్‌లో వైబ్రేషన్లు వస్తున్నాయని, వెనక్కి వస్తామని తెలిపారు. అనంతరం రన్‌వేపై విమానం సురక్షితంగా దిగింది. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారు. విమానాన్ని తనిఖీ చేస్తున్నాం. ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఓ ప్రకటనలో పట్నా విమానాశ్రయం తెలిపింది.

ప్రజా జీవనం నుంచి వైదొలిగాక వేద పఠనం, ప్రకృతి వ్యవసాయం: షా

ఇంటర్నెట్ డెస్క్: ప్రజా జీవనం నుంచి వైదొలిగిన అనంతరం వేదాలు, ఉపనిషత్తులు చదవడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. 'రసాయన ఎరువులతో పండించే పంటలతో వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రకృతి వ్యవసాయంవల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. శరీరాన్ని వ్యాధులకు దూరంగా ఉంచడంతోపాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుంది' అని పేర్కొన్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సహకారశాఖ మంత్రిగా తన ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. 'హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ముఖ్యమైన శాఖ ఇచ్చారని అందరూ అన్నారు. కానీ సహకార శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించినప్పుడు.. హోంశాఖ కంటే పెద్ద శాఖ ఇచ్చారని నేను భావించా. ఎందుకంటే ఈ శాఖ దేశంలోని రైతులు, పేదలు, గ్రామాలు, పశు సంపద కోసం పని చేస్తుంది' అని అమిత్ షా వివరించారు.

కుమారుడి ముచ్చట తీర్చేందుకు
సైకిల్‌ను బైకుగా మార్చిన తండ్రి

ఈటీవీ భారత్: తోటి విద్యార్థుల తండ్రులు స్కూటీలు, బైకులపై తమ పిల్లలను స్కూలుకు తీసురావడం చూసిన ఆ కుర్రాడు "నాన్నా.. అందరిలా నన్ను కూడా బైకుపై స్కూలు దగ్గర దింపొచ్చుగా" అని అడిగాడు. ఒడిశాలోని కటక్ నగరంలో గ్యాస్ స్టవ్ మెకానిక్‌గా పని చేస్తున్న శిబకుమార్ సాహూ (38) బైకు కొనేందుకు డబ్బుల్లేవని కుమారుడికి చెప్పలేక, తీవ్రంగా ఆలోచించాడు. చివరకు తన సైకిలునే బైకులా మార్చేయాలని సంకల్పించాడు. పాత ఇనుప సామాన్ల దుకాణాల నుంచి బైక్ ఫ్యూయెల్ ట్యాంకు, సీటు, హ్యాండిల్ బార్, హెడ్‌లైటు, స్పీడో మీటర్ల వంటివి సేకరించాడు. రోజంతా దుకాణంలో పనిచేసి, రాత్రిళ్లు సైకిలును బైకుగా మార్చే పని చేసేవాడు. 45 రోజుల కసరత్తు తర్వాత శిబకుమార్ సైకిలు కాస్తా హీరో హోండా సీడీ 100లా మారిపోయింది. "దాదాపు రూ.20 వేలదాకా ఖర్చయింది. ఇద్దరు సౌకర్యంగా కూర్చోవచ్చు. మూడో వ్యక్తి కూర్చుంటే పెడల్ తొక్కడం కష్టం. ఇపుడు స్కూలుకు దీనిపైనే బాబును దిగబెడుతున్నా. ఏదోలా వాడి ముచ్చట తీర్చినందుకు సంతోషంగా ఉంది" అని శిబకుమార్ 'ఈటీవీ భారత్'కు చెప్పారు.



పదహారేళ్లుగా వేల మందికి
పెరియార్ నదిలో ఈత శిక్షణ

కొచ్చిన్: కేరళలోని ఎర్నాకులం జిల్లా అలువాకు చెందిన సాజీ వలస్సెరి (61) గత పదహారేళ్లుగా ఈతలో ఏకంగా 15 వేల మందికిపైగా ఉచిత శిక్షణ ఇచ్చారు. ఓ ఫర్నీచరు దుకాణం నడిపే సాజీ.. ఆరేళ్ల వయసులో తండ్రి నుంచి ఈత నేర్చుకున్నారు. 2007లో తన ఇద్దరు పిల్లలతోపాటు మరో ఇద్దరికి ఈయన ఈత నేర్పించారు. పెరియార్ నదిని వారు విజయవంతంగా ఈదడంతో.. సాజీ నైపుణ్యం అందరికీ తెలిసింది. ఈ నేపథ్యంలో 2009లో తెక్కడి కొలనులో ఓ బోటు మునిగిపోయి 45 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో చలించిపోయిన సాజీ.. భవిష్యత్తులో మళ్లీ అలా జరగకూడదన్న లక్ష్యంతో 'ఈత' తరగతులకు శ్రీకారం చుట్టారు. తెల్లవారుజామున 4.30 నుంచే స్విమ్మింగ్ శిక్షణ మొదలవుతుంది. రోజూ రెండు బ్యాచులుగా వెయ్యిమంది శిక్షణ పొందుతుంటారు. దాతల సాయంతో క్రమంగా టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే గదుల వంటివి ఏర్పాటు చేశారు. అంబులెన్సు, బోటును కూడా అందుబాటులో ఉంచారు. సాజీ వద్ద శిక్షణ పూర్తి చేసుకున్నవారు గ్రూప్ లీడర్లుగా వ్యవహరించి.. కొత్తవారికి సహకరిస్తుంటారు.



దిల్లీలో అడుగుపెడితే ఎప్పుడు వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటా: గడ్కరీ

ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీలో కాలుష్యం తీవ్రస్థాయిలో పెరిగిపోతుండటంపై కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఫరీదాబాద్-నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ రోడ్డులో 'ఏక్ పేడ్ మా కే నామ్ 2.0' పేరుతో నిర్వహించిన మొక్కల పెంపకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "నేను రెండు లేదా మూడు రోజులు మాత్రమే దిల్లీలో ఉంటాను. ఇక్కడికి వచ్చినప్పుడు ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటా. దిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలి. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాలతో కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత. ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించాలి. పెద్దఎత్తున మొక్కలపెంపకం డ్రైవ్‌లను చేపట్టడంతో కాలుష్యాన్ని తగ్గించవచ్చు' అని పేర్కొన్నారు.

విజయ్ దేవరకొండ వ్యాఖ్యలపై జాతీయ ఎస్టీ కమిషన్‌లో విచారణ

ఈనాడు, దిల్లీ: రెట్రో సినిమా ప్రీరిలీజ్ కార్యక్రమంలో సినీ నటుడు విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలపై గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్ ఫిర్యాదు చేయగా..దీనిపై జాతీయ ఎస్టీ కమిషన్ బుధవారం విచారణ చేపట్టింది. ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ దిల్లీలోని కమిషన్ కార్యాలయంలో విచారణ జరపగా ఫిర్యాదుదారుతో పాటు సైబరాబాద్ కమిషనరేట్ ఏసీపీ శ్రీధర్ హాజరయ్యారు. దీనిపై తొలుత రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ హాజరు కావాలని కమిషన్ ఆదేశించగా ఆయన స్థానంలో ఏసీపీ శ్రీధర్ హాజరై సమాచారం అందించారు. నటుడిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపట్ల హుస్సేన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అశోక్ రాథోడ్ తెలిపారు. 15 రోజుల తర్వాత మరోసారి దీనిపై విచారణ చేస్తామని, ఆరోజు తప్పనిసరిగా కమిషనర్ హాజరు కావాలని ఆయన ఆదేశించినట్లు వెల్లడించారు

సైకిలుపై తిరిగి తాయత్తులమ్మి..
నేడు రూ.వంద కోట్ల ఆసామి!

- యూపీలో ఛంగూర్ బాబా అక్రమాలపై సర్కారు పంజా

ఇంటర్నెట్ డెస్క్: చట్టవిరుద్ధంగా మత మార్పిడులకు పాల్పడుతున్న ఓ ముఠాను ఇటీవల అరెస్టు చేసిన ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు.. ఈ రాకెట్‌కు కీలక సూత్రధారిగా జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ రాకెట్ మూలాలను గుట్టు విప్పే పనిలో నిమగ్నమైన పోలీసులకు కీలక విషయాలు తెలిశాయి. ఒకప్పుడు సైకిలుపై తిరుగుతూ ఉంగరాలు, తాయత్తులు అమ్మిన బాబాకు ఇప్పుడు 40 బ్యాంకు ఖాతాలు, రూ.106 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ పశ్చిమాసియా దేశాల నుంచి వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. యూపీలోని బలరాంపుర్ కేంద్రంగా జరుగుతున్న మతమార్పిడి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు.. ఛంగూర్ బాబాతోపాటు అతడి ముఠా సభ్యులను లఖ్‌నవూలో అరెస్టు చేశారు. పేదలు, నిస్సహాయ కూలీలు, వెనుకబడిన వర్గాలవారు, వితంతు మహిళలే వీరికి లక్ష్యం. నిబంధనలకు విరుద్ధంగా వారికి నగదు, ప్రోత్సాహకాలు ఇచ్చి.. అవసరమైతే బెదిరించి మత మార్పిడులు చేస్తున్నట్లు గుర్తించారు.

✦ ఛంగూర్ బాబాగా పేరొందిన జమాలుద్దీన్ బలరాంపుర్ జిల్లాలోని రెహ్రా మాఫీ గ్రామానికి చెందినవాడు. గతంలో ఓసారి సర్పంచిగానూ పనిచేశాడు. గ్రామ శివారులో ఓ భారీ భవనం నిర్మించుకున్నాడు. రెండు పెంపుడు శునకాలు, 15 సీసీ కెమెరాలతో పహారా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ నివాసం అక్రమమని గుర్తించిన అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు. ఇదేకాకుండా బాబాకు వేరే చోట్ల కూడా ఆస్తులు ఉన్నట్లు సమాచారం. ఈ ముఠాకు ఉగ్రవాదులతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో యూపీ ఉగ్రవాద వ్యతిరేక విభాగం (ఏటీఎస్) దర్యాప్తు చేస్తోంది. మరోవైపు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కూడా కేసు నమోదు చేసింది. బలరాంపుర్‌లో వీరి ముఠా ఆగడాలపై స్థానిక పోలీసులు సైతం దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మూడు విభాగాలతోపాటు ఈడీ కూడా రంగంలోకి దిగింది.



మతమార్పిడి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు..

టిబెట్ విషయంలో జోక్యం చేసుకోవద్దు

- అమెరికాకు చైనా హెచ్చరిక

ఇంటర్నెట్‌డెస్క్: బౌద్ధ మత గురువు దలైలామా వారసుడి ఎంపికపై తీవ్రస్థాయి చర్చ జరుగుతున్న క్రమంలో టిబెట్ విషయంలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని చైనా తప్పుబట్టింది. దలైలామా 90వ పుట్టిన రోజు సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టిబెట్‌కు నాయకుడిగా ప్రపంచంలో ఐక్యత, శాంతి, కరుణను ప్రచారం చేస్తున్నందుకు ప్రశంసించారు. టిబెట్ ప్రజలకు తమ ఆధ్యాత్మిక నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ, మతపరమైన గుర్తింపు కాపాడుకునే హక్కు ఉంటుందన్నారు. ఈ వ్యాఖ్యలపై చైనా మండిపడింది. 'దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. ఆయనకు టిబెట్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే, ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే హక్కు లేదు. ఈ విషయంలో అమెరికా జోక్యం చేసుకోవడం తగదు. ఇది ఒక సున్నితమైన అంశమని గుర్తుంచుకోవాలి' అని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు.

పప్పు కోసం గొడవ..
క్యాంటీన్ సిబ్బందిపై మహారాష్ట్ర ఎమ్మెల్యే దాడి

ముంబయి: పాడైపోయిన ఆహారాన్ని సరఫరా చేశారంటూ క్యాంటీన్ సిబ్బందిపై అధికార శివసేన శిందే వర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఈ చర్యను సీఎం దేవేంద్ర ఫడణవీస్, ప్రతిపక్ష నేతలు ఖండించారు. ఫడణవీస్ మాట్లాడుతూ.. ఈ చర్య శాసనసభ్యులందరూ అధికార దుర్వినియోగానికి పాల్పడతారనే తప్పుడు సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే మాట్లాడుతూ.. "గైక్వాడ్ ప్రవర్తన సరి కాదు. ఆయన లేవనెత్తిన అంశం మాత్రం వాస్తవం. ఆహార నాణ్యత లోపిస్తోంది, దానిపై చర్యలు తీసుకోవాలి" అంటూ చెప్పుకొచ్చారు. మహారాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన బుల్డానా ఎమ్మెల్యే గైక్వాడ్ చర్చిగేట్‌లోని ఆకాశవాణి ఎమ్మెల్యే హాస్టల్‌లో ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఆయనకు క్యాంటీన్ నుంచి ఆహారం వచ్చింది. అందులో పప్పు నుంచి దుర్వాసన రావడంతో ఆయన క్యాంటీన్ వద్దకు వచ్చారు. ఆహారంలో నాణ్యత లేదంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. క్యాంటీన్‌లో పనిచేస్తున్న యోగేశ్‌పై దాడికి పాల్పడ్డారు. అతని చెంపపై గట్టిగా కొట్టడంతో పాటు పిడిగుద్దులు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

కర్ణాటక, మహారాష్ట్రల నుంచి డ్రాగన్ పండ్ల వెల్లువ

- ధరలు పడిపోయి నష్టపోతున్నామంటున్న తెలుగు రాష్ట్రాల రైతులు



రోడ్డుపై డ్రాగన్ ఫ్రూట్ అమ్మకాలు

ఈనాడు, హైదరాబాద్: డ్రాగన్ ఫ్రూట్.. ఒకప్పుడు ఖరీదైన పండు. పోషకాలు ఎక్కువగా ఉంటాయని.. విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. దీంతో కొన్నేళ్లుగా దేశంలోనూ ఈ పంట సాగు పెరిగింది. తెలుగు రాష్ట్రాల రైతులూ అందిపుచ్చుకున్నారు. దీంతో ఒక్కో పండు ధర రూ.200 నుంచి రూ.100 తగ్గింది. ఇప్పుడు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వెల్లువెత్తుతున్న దిగుమతులతో ఈ పండ్ల ధర నాలుగోవంతుకు పడిపోయి తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలుగు రాష్ట్రాల రైతులు వాపోతున్నారు. ఈ మొక్కలను నాటి నాలుగేళ్ల పాటు సంరక్షిస్తే ఆ తర్వాత నుంచి ఏటా పంట చేతికి వస్తుంది. ఎకరాకు 6 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. పంట చేతికి వచ్చేవరకూ రూ.5 లక్షల పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏపీలో 1100, తెలంగాణలో 900 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. రెండు రాష్ట్రాల రైతులూ... నగర శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న బాటసింగారం పండ్ల మార్కెట్‌కు పండ్లను తెచ్చి విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలలో ఈ పంట సాగు భారీగా పెరగడంతో అక్కడి రైతులూ బాటసింగారం మార్కెట్‌కు తెచ్చి తెలుగు రాష్ట్రాల రైతుల కంటే తక్కువ ధరకు ఈ పండ్లను విక్రయిస్తున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల రైతుల ఉత్పత్తుల విక్రయాలు మందగించాయి. ఈ నేపథ్యంలో బాటాసింగారం మార్కెట్‌కు వస్తున్న మహారాష్ట్ర, కర్ణాటక పండ్ల వాహనాలను నిలిపివేయగా... వారంతా నగర శివార్లలోని జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనాలు పెట్టి ఒక్కో పండును రూ.25కే విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్‌లోని ఏజెంట్లు సైతం వారి వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తుండడంతో తెలుగు రైతులు తెచ్చిన పండ్ల కొనుగోళ్లు జరగడం లేదు. 'కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఈ పండ్ల వాహనాలను మార్కెట్‌కు రానీయడం లేదు. దీంతోపాటు తెలుగు రాష్ట్రాల రైతులు పండించిన పండ్లకు కొనుగోళ్లు పెరిగేందుకు అవసరమైన కార్యాచరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తాం" అని బాటసింగారం పండ్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొంది

– వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు రాష్ట్రాల డ్రాగన్ పండ్ల రైతుల సంఘం



మొదట్లో డిమాండ్ దృష్ట్యా ఎకరానికి రూ.6 లక్షల ఆదాయం వచ్చేది. రూ.5 లక్షల పెట్టుబడి పోనూ ఐదో ఏట నుంచి ఎకరానికి రూ.లక్ష లాభం మిగిలేది. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఈ పండ్ల రవాణా మొదలయ్యాక రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల ఆదాయమే వస్తోంది. రూ.2 లక్షలకు పైగా నష్టపోతున్నాం. ఆ రెండు రాష్ట్రాల నుంచి డ్రాగన్ పండ్ల వాహనాలు రాకుండా సరిహద్దుల్లో నిలిపివేస్తే.. ఇక్కడి ఉత్పత్తుల విక్రయాలు పెరిగి లాభాలు వచ్చే వీలుంది. లేకుంటే రెండు రాష్ట్రాల రైతులు నష్టపోతారు. దీనిపై తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విన్నవిస్తాం.

కనిపిస్తే కాల్చేయండి....

- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఆడియో కలకలం

ఇంటర్నెట్‌డెస్క్: బంగ్లాదేశ్‌లో గతేడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అల్లర్లు చెలరేగిన సమయంలో నిరసనకారులను కట్టడి చేసేందుకు దేశ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా పోలీసులకు జారీ చేసిన ఆదేశాల ఆడియో ఒకటి తాజాగా లీక్ అయింది. ఆ ఆడియో ప్రకారం.. ఒక సీనియర్ పోలీసు అధికారికి హసీనా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. నిరసనకారులను కట్టడి చేయడానికి ప్రాణాంతకమైన ఆయుధాలను వినియోగించాలని ఆమె సూచించారు. అంతేకాక, వారు ఎక్కడ కనిపించినా కాల్చేయాలని ఆదేశించారు. గతేడాది జులై 18న ఢాకాలోని తన అధికార నివాసం గణభవన్ నుంచి ఆమె ఈ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత నిరసనలను కట్టడి చేసేందుకు పోలీసు అధికారులు పలు ఆయుధాలు ఉపయోగించినట్లు బీబీసీ పత్రాలు వెల్లడిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక అల్లర్లలో 1,400 మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనల నేపథ్యంలోనే హసీనా ప్రభుత్వం కుప్పకూలిపోయింది.

ప్రధాని పదవిపై ఆశ లేదు: కంగన

ఇంటర్నెట్ డెస్క్: తాను రాజకీయ జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నట్లు హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ ఎంపీ కంగనా రనౌత్ పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. "మీరు రాజకీయ రంగంలో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలనుకుంటున్నారా.. ప్రధాని కావాలన్న లక్ష్యం ఏమైనా ఉందా..?" అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'నేను భారత ప్రధాని పదవికి సమర్థురాలినని అనుకోవడం లేదు. అలాంటి ఆశ కూడా నాకు లేదు. దేవుడు నన్ను ప్రధానిని చేయడు. పూర్తిగా ప్రజాసేవకు అంకితమయ్యే మనస్తత్వం నాది కాదు. నాకు లగ్జరీ సదుపాయాలను అనుభవించాలనే స్వార్థం కూడా ఉంది. నేను జీవించిన జీవితం అలాంటిది. దేవుడు నన్ను ఏ ఉద్దేశంతో ఈ రంగంలోకి పంపాడో నాకు తెలియదు. నా జీవితాన్ని త్యాగం చేసే ఉద్దేశం నాకు లేదు. అలాంటి జీవితం నాకు నచ్చదు" అని కంగన తెలిపారు.

ఈనాడు సినిమా



నాని

రామోజీ ఫిల్మ్‌సిటీలో...
ది ప్యారడైజ్

విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి జట్టు కట్టారు. ఈ కలయికలో రూపొందుతున్న చిత్రమే... 'ది ప్యారడైజ్'. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతోపాటు... మొత్తం 8 భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రీకరణ చేసుకుంటోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో యాక్షన్ కొరియోగ్రాఫర్ రియల్ సతీశ్ నేతృత్వంలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తున్నారు. సినిమాకి కీలకమైన ఈ సన్నివేశాల్లో విదేశీ యాక్షన్ నిపుణులు కూడా పాల్గొంటున్నట్టు చిత్ర బృందం తెలిపింది. "గ్లోబల్ స్థాయిని లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తున్న చిత్రమిది. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ పోస్టర్, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. అందుకు తగ్గట్టుగా సినిమా రూపొందుతోంద"ని సినీ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

సిద్ధు.. కొత్త ప్రపంచం



సిద్ధు జొన్నలగడ్డ

తన కొత్త చిత్రంతో మరో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా రవికాంత్ పేరెపు దర్శకత్వంలో 'బ్యాడాస్' అనే చిత్రం రూపొందుతోంది. 'కృష్ణ అండ్ హిస్ లీల' తర్వాత ఆ ఇద్దరూ కలిసి చేస్తున్న సినిమా ఇది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'డి.జె.టిల్లు', 'టిల్లు స్క్వేర్' తర్వాత సిద్ధు కథానాయకుడిగా ఈ సంస్థల్లో రూపొందుతున్న చిత్రమిదే. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. బుధవారం ఈ సినిమాని అధికారికంగా ప్రకటించారు. "సిద్ధు జొన్నలగడ్డ ఓ సరికొత్త అవతారంలో కనిపించనున్న చిత్రమిది. ఈ కథా ప్రపంచం కూడా కొత్తగా ఉంటుంది. ఎమోషనల్ డ్రామాతో రూపొందుతున్న ఈ సినిమా ఓ సాహసోపేతమైన ప్రయత్నంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తుంది. బలమైన కథ, భారీ బడ్జెట్‌తో పరిమితుల్ని అధిగమించి రూపొందిస్తున్నాం. 2026లో రానున్న ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని విషయాల్ని త్వరలోనే వెల్లడిస్తామ"ని చిత్రవర్గాలు తెలిపాయి.

'పుష్ప' జోడీ మరోసారి?



అల్లు అర్జున్



రష్మిక

పుష్పరాజ్‌గా అల్లు అర్జున్... శ్రీవల్లిగా రష్మిక కలిసి 'పుష్ప' సినిమాలతో చేసిన సందడి అంతా ఇంతా కాదు. మరొకరిని ఊహించుకోలేం అనేంతగా ఆ పాత్రల్లో ఒదిగిపోయారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకి హైలెట్‌గా నిలిచింది. విజయవంతమైన ఆ జోడీ మరోసారి తెరపై సందడి చేయనున్నట్టు సమాచారం. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో ముగ్గురు కథానాయికలకి చోటుందని సమాచారం. ఓ కథానాయిక దీపికా పదుకొణె ఎంపికయ్యారు. మరో పాత్ర కోసం మృణాల్ ఠాకూర్ దాదాపుగా ఎంపికైనట్టు సమాచారం. మరో కథానాయికగా రష్మిక నటించనున్నట్టు సమాచారం. ఇదివరకు జాన్వీ కపూర్ పేరు వినిపించింది. అయితే చిత్రబృందం రష్మిక మందన్నతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. అన్నీ కుదిరితే ఈ జోడీ మరోసారి తెరపై సందడి చేయడం ఖాయం. అల్లు అర్జున్ - అట్లీ కలయికలో సినిమాపై రోజుకొక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. హాలీవుడ్‌కి చెందిన ఓ అగ్ర హీరోని ఇందులో ఓ కీలక పాత్ర కోసం సంప్రదించినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

సుహాస్ ప్రయాణం స్ఫూర్తిదాయకం

– మంచు మనోజ్



హరీశ్, మాళవిక మనోజ్, సుహాస్, మంచు మనోజ్, రామ్ గోధల

యూట్యూబ్‌తో మొదలై కథానాయకుడిగా ఎదిగిన సుహాస్ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు కథానాయకుడు మంచు మనోజ్. తమిళంలో విజయ్ సేతుపతిలా... తెలుగులో సుహాస్ అన్ని తరహా సినిమాల్ని చేస్తున్నాడని మెచ్చుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'ఓ భామ అయ్యో రామ' వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు మంచు మనోజ్. సుహాస్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. మాళవిక మనోజ్ కథానాయిక. రామ్ గోధల దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మించారు. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగానే నిర్వహించిన వేడుకలో మంచు మనోజ్ బిగ్ టికెట్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సుహాస్ ఎలాంటి నేపథ్యం లేకుండా హీరోగా ఎదిగాడు. ఎప్పుడూ చిరునవ్వుతూ కనిపిస్తూ ఎంతో పాజిటివ్‌గా ఉంటాడు. తను నాకు సోదరుడితో సమానం. ఎవరైనా సినీ పరిశ్రమలో కష్టపడితేనే విజయం. కష్టంతోనే విజయాన్ని అందుకున్నాడు సుహాస్. ఈ చిత్రం తనకి మంచి ఫలితాన్నివ్వాలి. దర్శకనిర్మాతలకీ చిత్రంతో ఘన విజయం దక్కాలి" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "ప్రతి అబ్బాయి విజయం వెనక తల్లి, భార్య ఎంతో కీలకం. ఆ మూడు పాత్రలకి సంబంధించిన భావోద్వేగాలు ఇందులో కీలకం. ఈ సినిమా చూశాక అందరూ మాళవిక ప్రేమలో పడిపోతారు. అలీ, అనిత, పృథ్వీ తదితర సీనియర్ నటులతో కలిసి నటించడం ఎంతో ఆనందంగా ఉంది" అన్నారు. నిర్మాత హరీశ్ నల్ల మాట్లాడుతూ "ఈ చిత్రంలో సుహాస్ నటన మరో స్థాయిలో ఉంటుంది. మణికందన్ విజువల్స్, రధన్ సంగీతం, బ్రహ్మ కడలి సెట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ సినిమా నాకొక జీవితకాల జ్ఞాపకం. సుహాస్ కోసమే కథలు రాస్తాను. ఈ సినిమా చేయడానికి కారణం ఆయనే. తనతో ఇంకా ఎన్నో సినిమాలు తీయాలని ఉంది. సుహాస్ ఈ చిత్రంతో ఆల్‌రౌండర్‌గా తన ప్రతిభని మరోసారి చాటుతాడు. హరీశ్‌శంకర్, మారుతి అతిథి పాత్రల్లో నటించి గొప్ప సహకారం అందించారు. ఈ సినిమాతో మాళవిక స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కనకమేడల, రామ్ జగదీష్, అలీ, సంజనారెడ్డి, బి.వి.ఎస్.రవి, డార్లింగ్ స్వామి, నటులు శ్రీనాథ్, మొయిన్, సాత్విక్, గీత రచయితలు రామ్ గోసాల, శ్రీహర్ష ఈమని, ఛాయాగ్రాహకుడు మణికందన్, సంగీత దర్శకుడు రధన్, సహ నిర్మాత ప్రదీప్ తాళ్లపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుదత్‌కు మెల్‌బోర్న్ వేదికగా వందేళ్ల నివాళి



ప్రముఖ నటుడు, దర్శక చిత్రనిర్మాత గురుదత్ శతజయంతి సందర్భంగా ఆయనకు హృదయపూర్వక నివాళిగా. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(ఐఎఫ్‌ఎఫ్ఎం) ఆయన ప్రత్యేక చిత్రాలను 2025వ ఎడిషన్‌లో భాగంగా ప్రదర్శించనుంది. దీనికోసం స్వయంగా ఆయన దర్శకత్వం వహించిన 'ప్యాసా'(1957), 'కాగజ్ కే ఫూల్'(1959) చిత్రాలను ఎంపికచేసింది. ఈ ప్రత్యేక నివాళిపై ఐఎఫ్ఎఫ్ఎం ఫెస్టివల్ డైరెక్టర్ మితు భౌమిక్ లాంగే తన ఆలోచనలు పంచుకున్నారు. "ఈ నివాళి ఆయన ప్రతిభను గుర్తుంచుకునేందుకు, కొత్త తరం ప్రేక్షకులకు ఆయన కాలాతీత రచనలను పరిచయం చేయడానికి మా వినయ పూర్వక మార్గం"అని తెలిపారు. ఈ చిత్రోత్సవం ఆగస్టు 14 నుంచి ప్రారంభం కానుంది.

క్లాసిక్ చిత్రాల ప్రదర్శన

గురుదత్ శతజయంతిలో భాగంగా ఆయన నటించిన క్లాసిక్ చిత్రాలు మళ్లీ వెండితెరపై ప్రదర్శితం కానున్నాయి. ఈ ఐకానిక్ సినిమాలను ఆగస్టు 8నుంచి 10వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా ప్రదర్శించనున్నట్లు అల్ట్రా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రకటించింది. 'ప్యాసా', 'ఆర్ పార్', 'చౌదవీ కా చంద్', 'మిస్టర్ అండ్ మిసెస్ 55', 'బాజీ' లాంటి దత్ అత్యంత ప్రసిద్ధ చిత్రాల పునరుద్ధరించిన వెర్షన్‌లు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటాయి. ఈ చిత్రాల పునరుద్ధరణను కేంద్రప్రభుత్వ జాతీయ చలనచిత్ర వారసత్వ మిషన్ కింద జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ(ఎన్ఎఫ్‌డీసీ), నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా(ఎన్ఎఫ్ఏఐ) చేపట్టాయి.

కలియుగంలోని ఆయుధం కథే.. 'ది 100'

"ప్రేక్షకులు నాకంటూ ఓ ఇమేజ్‌ని ఇచ్చారు. వాళ్ల ఇంట్లో వ్యక్తిలా ప్రేమని పంచారు. అందుకే నేను ఏం చేసినా అందులో సామాజిక కోణం ఉండేలా చూసుకున్నా. సమాజానికి పనికొచ్చే నాణ్యమైన కథలతోనే ప్రేక్షకుల ముందుకొచ్చా. 'ది 100' సినిమా కూడా అలా చేసిందే" అన్నారు ఆర్కే సాగర్. బుల్లితెరపై ఆర్కే నాయుడు పాత్రతో ఇంటింటికీ చేరువైన నటుడాయన. 'సిద్ధార్థ', 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'షాదీ ముబారక్' తదితర చిత్రాలతో వెండితెరపైనా సందడి చేశారు. మరోసారి తనకి ఎంతో గుర్తింపు తెచ్చిన పోలీసు పాత్రతో ఇటీవల 'ది 100' సినిమా చేశారు. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆర్కే సాగర్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.



ఆర్కే సాగర్

"ఆర్కే నాయుడు పాత్రకి దీటుగా తెరపై కనిపించాలి. అలాంటి కథల కోసం ఎదురు చూస్తున్నప్పుడు వచ్చిందే... 'ది 100'. ఒకసారి దర్శకుడు సుకుమార్ దగ్గరకు కథల గురించి చర్చించేందుకు వెళ్లినప్పుడు ఈ ఆలోచనల్ని పంచుకున్నా. ఆయనకు చాలా నచ్చింది. ముందు ఈ కథని చేయమని చెప్పి ప్రోత్సహించారు".

● "బలమైన సందేశం ఉన్న పక్కా వాణిజ్య చిత్రమిది. రామబాణం, సుదర్శన చక్రం... ఇలా ప్రతి యుగంలోనూ దీనులను కాపాడేందుకు ఓ ఆయుధం వచ్చింది. కలియుగంలో అలాంటి ఓ శక్తిమంతమైన ఆయుధమే.. 'ది 100'. ఆ ఆయుధం వెనక కథేమిటన్నది తెరపైనే చూడాలి. సమాజానికి ఎంతో అవసరమైన సినిమా ఇది. అందుకే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దగ్గరకు వెళ్లి ఈ కథ గురించి చెప్పా. వాళ్లు కథ తెలుసుకుని ఎంతో ప్రోత్సహించారు. ఈ సినిమాలో ఉన్న కంటెంట్ ప్రతి ఒక్కరికీ చేరువ కావాలి".

● "నా తదుపరి సినిమా మాత్రం తొందరలోనే వస్తుంది. 'ది 100'కి కొనసాగింపు సినిమాని తెరకెక్కించే ఆలోచన కూడా ఉంది. 'ఓజి'లో నటించే అవకాశం వచ్చింది కానీ, చివరి నిమిషంలో కుదరలేదు. అయితే పవన్‌కల్యాణ్‌తోపాటే, జనసేన పార్టీలో ప్రయాణం చేస్తుండడంతో సినిమా మిస్ అయిన భావన కలగడం లేదు. రాజకీయ ప్రయాణం విషయానికొస్తే తదుపరి ఎన్నికల్లో నేను పోటీ చేస్తానా? లేదా అనేది ఆ సందర్భమే నిర్ణయిస్తుంది".

నరసింహ గర్జన



విష్ణువు దశావతారాల్ని తెరపై ఆవిష్కరించడమే లక్ష్యంగా వరుసగా యానిమేటెడ్ ఫ్రాంఛైజీ చిత్రాల్ని రూపొందిస్తున్నాయి ప్రముఖ నిర్మాణ సంస్థలు హోంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్. ఇందులో భాగంగా వస్తున్న తొలి చిత్రం... 'మహావతార్ నరసింహ'. అశ్విన్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మాతలు. త్రీడీలో రూపొందుతున్న ఈ సినిమా ఐదు భారతీయ భాషల్లో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుడి వరం కోసం తపస్సు చేసే సన్నివేశాలతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తుంది. దర్శకుడు మాట్లాడుతూ "భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవాలనే ప్రయత్నంలో భాగంగా రూపొందిస్తున్న చిత్రాలివి. దైవిక ప్రయాణం ఈ రోజుతో మొదలైంది" అన్నారు. "నరసింహ గర్జనగా వస్తున్న ఇతిహాస చిత్రమిది. ప్రతి ఫ్రేమ్, ప్రతి సన్నివేశం ప్రేక్షకుల మనసులపై ఓ ప్రత్యేకమైన ముద్ర వేస్తాయి" అన్నారు నిర్మాతలు.

నిజ జీవిత కథలతో... 'గేమ్ ఆఫ్ ఛేంజ్'



సిద్ధార్థ్ రాజశేఖర్, ఛాబ్రియా

కుమారగుప్తుడు నిర్మించిన నలందా విశ్వ విద్యాలయం నేపథ్యంలో రూపొందించిన చిత్రమే మా 'గేమ్ ఆఫ్ ఛేంజ్' అన్నారు సిద్ధార్థ్ రాజశేఖర్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, మీనా ఛాబ్రియాతో కలిసి నిర్మించిన చిత్రమే 'గేమ్ ఆఫ్ ఛేంజ్'. సిధిన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగుతోపాటు, ఆంగ్లం, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిద్ధార్థ్ రాజశేఖర్ మాట్లాడుతూ "పలువురు వ్యక్తుల నిజ జీవిత కథల్ని మిళితం చేసి రూపొందించిన చిత్రమిది. సాధారణ క్షణాలు, అసాధారణమైన జీవన మలుపులుగా మారే క్రమం ఈ సినిమాకి కీలకం" అన్నారు.



ఆ గోడ ఎవరు కట్టారు?

సినిమా: 'బ్రిక్'
నటీనటులు: రూబీ ఓ.ఫీ, మాథియాస్ ష్వీగోఫర్
విడుదల: గురువారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

రెడీ ఇన్ ఓటీటీ

సాధారణంగా అందరూ రాత్రి పూట తలుపులు మూసి నిద్రపోతారు. ఉదయం నిద్రలేవగానే తీస్తారు. కానీ తలుపులు తెరవగానే ముందు ఒక గోడ కట్టి ఉంటే.. బయటికి రావడానికి ఏ దారి లేక అందులోనే ఉండిపోవాల్సి వస్తే ఊహించడానికే భయంగా ఉంటుంది ఆ పరిస్థితి. ఒక ఇంటి ముందు గోడైతే పొరుగు వారిని పిలిచి ఏదో రకంగా కష్టపడి దానిని పడగొట్టించేస్తాం. కానీ ఇలాంటి సంఘటన ఎన్నో అపార్ట్‌మెంట్స్ ఉండే ఓ భవనంలో జరుగుతుంది. అందులో నివసించే టిమ్(మాథియాస్), ఒలివియా(రూబీ ఓ.ఫీ) అనే జంట ఇంటి తలుపు తీయగానే వారి ముందు గోడ ఉంటుంది. దానిని తొలగించడానికి చాలా ప్రయత్నాలు చేస్తారు. తర్వాత ఏదోలా రంధ్రం చేస్తే పొరుగు వారు కనిపిస్తారు. కానీ ఏం లాభం వాళ్లందరి అపార్ట్‌మెంట్స్ ముందు అదే గోడ ప్రత్యక్షమై ఉంటుంది. ఇదంతా తెలుసుకుని బయటపడడానికి ఏ మార్గం లేక వాళ్లందరూ భయాందోళనకు గురవుతారు. ఇలాంటి పరిస్థితులలో ధైర్యంగా అక్కడి నుంచి తప్పించుకునే మార్గం వెతికే పనిలో పడతారు టిమ్, ఒలివియా. అలా ఈ సమస్య నుంచి బయటపడడానికి ఇరుగు పొరుగు వారి మధ్య సహకారం పెంపొందించి ఒకరినొకరు అర్థం చేసుకునేలా చేస్తుంది ఒలివియా జంట. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా మనిషి ఒంటరిగా ఎక్కువ సేపు ఉండలేడు. మరి గోడల మధ్యలో వాళ్లంతా ఎలా ఉన్నారు? అసలు ఈ గోడ ఎవరు కట్టారు? ఆ భవనం నుంచి అందరూ తప్పించుకున్నారా? అనేవి తెలుసుకోవాలంటే 'బ్రిక్' సినిమా చూడాల్సిందే. ఈ సినిమాని ఫిలిప్ కోచ్ తెరకెక్కించారు.

ఇకపై నేను హీరోగా ఉండాలనుకుంటున్నా!

"అనుకూలమైన సినిమాలు లేకపోవడం సమస్య కాదు.. పెరుగుతున్న టికెట్ ధరల వల్ల మధ్యతరగతి కుటుంబాలు థియేటర్లకు దూరమవుతున్నాయ"ని అంటోంది బాలీవుడ్ కథానాయిక సోనాక్షి సిన్హా. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న ఈ భామ సందడి థియేటర్లలో కనిపించకా.. మూడేళ్లు కావొస్తుంది. ఇప్పుడాలోటును 'నికితా రాయ్' సినిమాతో తీర్చడానికి సన్నద్ధమైంది. ఖుష్ సిన్హా తెరకెక్కించిన హారర్ చిత్రమిది. ఇందులో టైటిల్ పాత్రలో కనిపించనుంది సోనాక్షి. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని ఆసక్తికర సంగతులతో మన ముందుకొచ్చింది సోనాక్షి.

"అకీరా', 'నూర్' లాంటి మహిళా ప్రాధాన్య సినిమాలు నా కెరీర్‌లో మైలురాయి లాంటివి. ఆ కోవకు చెందిందే 'నికితా రాయ్'. థియేటర్‌కు వచ్చిన ప్రతి ప్రేక్షకుడిని పరుగులు పెట్టిస్తుందీ చిత్రం. గత 8-9 సంవత్సరాలుగా నేను నటించిన పాత్రలకు పూర్తి భిన్నంగా ఇప్పుడు నా భవిష్యత్తు ప్రయాణం ఉండాలనుకుంటున్నా. బలమైన మహిళా పాత్రలు, కథలపై దృష్టి పెట్టాలనుకుంటున్నా. ఒక సినిమాను భుజాన వేసుకొని టైటిల్ పాత్ర పోషించడం అంటే చాలా పెద్ద విషయం. ఇకపై నా సినిమాలకు నేనే హీరోగా ఉండాలనుకుంటున్నా".



సోనాక్షి సిన్హా

వీటికి కొరత లేదు

"ప్రస్తుతం చిత్రపరిశ్రమలోని వ్యక్తులు ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ మధ్యతరగతి కుటుంబాలు సినిమాలకు ఎందుకు దూరంగా ఉన్నాయో ఎవ్వరూ ఆలోచించట్లేదు. పెరుగుతున్న టికెట్ ధరల వల్ల ఒక సాధారణ కుటుంబానికి థియేటర్‌కి వెళ్లడం చాలా ఖరీదైనదిగా మారింది. ప్రస్తుతం చిత్రపరిశ్రమలో ఫ్యామిలీ నేపథ్యంలో రూపొందుతున్న సినిమాలకు ఎలాంటి కొరత లేదు. యాక్షన్, కామెడీ, డ్రామా ఇలా అన్ని జానర్స్‌లో ప్రేక్షకుణ్ని ఆకర్షించే చిత్రాలు ఉన్నాయనే నేను అనుకుంటున్నా. కానీ ధరల పెరుగుదల వల్ల ఓటీటీల బాట పడుతున్నారు. సమస్య కంటెంట్‌లో కాదు.. మారుతున్న ప్రేక్షకుల అలవాట్లలో ఉందనేది నా అభిప్రాయం".

వాటికే ప్రాధాన్యం

"ఓటీటీలు దూసుకెళుతున్న ఈ రోజుల్లో ప్రేక్షకుల్ని సినిమాలో నిమగ్నం చేసే కథలే చాలా ముఖ్యం. ప్రస్తుతం ప్రేక్షకుడు ఒక 15నిమిషాలు సినిమా చూసి అది హిట్టా.. లేక ఫ్లాప్ అనేది ఒక అంచనాకు వచ్చేస్తున్నాడు. అందుకే సినిమా ప్రారంభంలోనే వారి దృష్టిని ఆకర్షించాలి. థ్రిల్లర్, మిస్టరీ.. ఇలా కథ ఏదైనా ఆసక్తి రేకెత్తిస్తూ అభిమానుల్ని సినిమా హాల్లో కూర్చోబెట్టాలి. ఆలస్యం అయినా భవిష్యత్తులో అలాంటి కథలకే ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా".

సల్మాన్ వల్లే కలిశాం

"గతేడాది నేను నా ప్రియుడు జహీర్ ఇక్బాల్‌తో ఏడడుగులు వేశాను. మా ప్రేమ గురించి చాలా మందికి తెలుసు. కానీ అతనితో నా ప్రయాణం ఎక్కడ మొదలైందో ఎవ్వరికి తెలియదు. అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ నిర్వహించిన ఓ పార్టీలో మా ప్రేమకథ ప్రారంభమైంది. అక్కడే నేను మొదటి సారి జహీర్‌ను కలిశా. నిజం చెప్పాలంటే మా కథకు సూత్రధారి సల్మాన్ (నవ్వుతూ). ఆయన మా పెళ్లి విషయంలో చాలా సంతోషంగా ఉన్నారు. సల్మాన్ వల్లే మేము కలిశాం. ఇక నా సినిమాల విషయానికొస్తే.. వృత్తిపరంగా నేను గొప్ప స్థానంలో ఉన్నా. ప్రస్తుతం తెలుగు సినిమా 'జటాధర', 'హీరామండీ 2' లాంటి ఎన్నో ఉత్తేజకరమైన ప్రాజెక్టులకు సిద్ధమవుతున్నా".

రాజుగాడు లోకల్



రవీందర్, రితిక

తెలంగాణ సంస్కృతి.. అనుబంధాలే ప్రధానంగా రూపొందించిన సినిమానే మా 'రాజుగాని సవాల్' అన్నారు లెలిజాల రవీందర్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన చిత్రమిది. రితికా చక్రవర్తి కథానాయిక. సంధ్య రాథోడ్, రవీందర్ బొమ్మకంటి కీలక పాత్రలు పోషించారు. రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఈ సినిమాని ఆగస్టు 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. శ్రీలక్ష్మి పిక్చర్స్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ సినిమా టీజర్‌ని ఇటీవల ప్రముఖ నటుడు జగపతిబాబు ఆవిష్కరించారు. చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. లెలిజాల రవీందర్ మాట్లాడుతూ "హాస్యంతోపాటు... భావోద్వేగాలకి ప్రాధాన్యమున్న చిత్రమిది. హైదరాబాద్ సంస్కృతితోపాటు... ఇక్కడ తోబుట్టువుల మధ్య, స్నేహితుల మధ్య బంధాలు ఎలా ఉంటాయో మనసుల్ని హత్తుకునేలా తెరపై ఆవిష్కరించాం. తెలంగాణలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయో ఇందులో సహజంగా చూపించే ప్రయత్నం చేశాం" అన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, పంపిణీదారుడు బాపిరాజు, తరుణిక, పద్మ, రవీందర్ బొమ్మకంటి తదితరులు పాల్గొన్నారు.

200% పన్ను వేస్తారా?



- ట్రంప్ వ్యాఖ్యలపై దేశీయ ఫార్మా వర్గాల్లో అసహనం
- అమెరికాకే ఎక్కువ నష్టం

ఈనాడు - హైదరాబాద్

'భారతదేశం నుంచి దిగుమతి అయ్యే మందులపై 200% పన్నులు విధిస్తాం, ఈ వడ్డింపునకు సిద్ధంగా ఉండండి' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన హెచ్చరికలపై దేశీయ ఫార్మా వర్గాలు అసహనానికి గురవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు నిలకడ లేకుండా ఏది తోస్తే, అది మాట్లాడుతున్నారని.. ఇది కనుక అమల్లోకి వస్తే ఔషధ పరిశ్రమకే కాక, అమెరికా ప్రజలకూ నష్టం చేస్తుందని పేర్కొంటున్నారు. ఇంత అధికంగా పన్నుల భారం మోపితే, మందుల ధరలు పెరిగి అమెరికా ప్రజలే ఇబ్బంది పడతారని.. వారి ఆరోగ్య బీమా ఖర్చులూ అనూహ్యంగా పెరుగుతాయని వివరిస్తున్నారు. అదే సమయంలో మన ఫార్మా కంపెనీలకూ కష్టాలు తప్పవు. మందులను ఎగుమతి చేయడానికి ఇతర మార్కెట్లను అన్వేషించడం పెరుగుతుంది.

అంచనాలకు 10 రెట్లు అధికంగా..

అమెరికా దిగుమతి చేసుకునే మందులపై 10 - 20% అదనపు పన్ను మోపుతారనే ఆందోళన ఇంతకాలం ఉంది. అదే ఇబ్బందికరమని భావిస్తుంటే, ఏకంగా 200% పన్ను వేస్తామని ట్రంప్ పేర్కొనడాన్ని దేశీయ ఫార్మా వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఇది సాధ్యమయ్యేది కాదనే అభిప్రాయాన్ని అధికులు వ్యక్తం చేస్తున్నారు. చైనాపై భారీగా సుంకాలు వేసి, ఆనక తగ్గింపునకు అమెరికానే చర్చలకు ముందుకు రావడాన్ని ప్రస్తావిస్తున్నారు.

మనదేశం నుంచి అక్కడికే అధికం

మనదేశం నుంచి ఎగుమతి అయ్యే మందుల్లో మూడో వంతు అమెరికాకే వెళ్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 9 బిలియన్ డాలర్ల (సుమారు రూ.77,000 కోట్ల) విలువైన మందులు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. యూఎస్ఎఫ్‌డీఏ (అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ) అనుమతి గల ఫార్మా యూనిట్లు అమెరికా వెలుపల మనదేశంలోనే ఎక్కువగా ఉన్నాయి. ఏటా యూఎస్ఎఫ్‌డీఏ వద్ద డీఎంఎఫ్ (డ్రగ్ మాస్టర్ ఫైల్), ఏఎన్‌డీఏ అనుమతుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తు చేసేవి, అనుమతులు పొందేవి మన ఫార్మా కంపెనీలే. ఏటా అమెరికాలో విక్రయమయ్యే మందుల్లో జనరిక్ ఔషధాల వాటా 20- 25 శాతంగా ఉంటోంది. ఎంత ఎక్కువగా పన్నులు విధిస్తే, మనదేశం నుంచి జనరిక్ ఔషధాల ఎగుమతులు అంతగా తగ్గొచ్చు. ఫలితంగా అమెరికాలో మందుల ధరలు పెరిగి, అక్కడి ప్రజలే ఇబ్బంది పడతారనే అభిప్రాయాన్ని పరిశ్రమ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

మన కంపెనీలకూ కష్టాలు

అధిక పన్నుల భారం వల్ల దేశీయ ఫార్మా కంపెనీలకు సైతం ఇబ్బందులు తప్పకపోవచ్చు. పన్ను విధించినా, ప్రస్తుత ధరలకే ఔషధాలు అందించాలంటే ధర తగ్గించాలి. అలా చేస్తే కంపెనీలు ఆదాయాలు కోల్పోతాయి. జనరిక్ ఔషధాల్లో లాభాల శాతం బాగా తక్కువగా ఉంటుంది. అందువల్ల ధర తగ్గించే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితుల్లో ఇతర దేశాల మార్కెట్ల వైపు చూడటం తప్పించి, మరొక ప్రత్యామ్నాయం మన ఫార్మా కంపెనీలకు ఉండదు. అమెరికాలో తగ్గే అమ్మకాలను ఇతర దేశాల్లో అమ్మకాలు పెంచుకోవటం ద్వారా భర్తీ చేసుకోవాలి. ఇది ఇప్పటికిప్పుడు జరిగే పని కాదు. కొన్నేళ్లు పడుతుంది. అంటే స్వల్పకాలంలో ఇక్కడి ఫార్మా కంపెనీల అమ్మకాలు, ఆదాయాలు తగ్గుతాయి.

అంత ఉండకపోవచ్చు!: తమ ప్రజలకే ఇబ్బంది అవుతుంది గనుక, మనదేశం ఎగుమతి చేసే మందులపై భారీ పన్నులను అమెరికా విధించకపోవచ్చనే అభిప్రాయం మన పరిశ్రమ వర్గాల్లో ఉంది. కానీ ట్రంప్ నిర్ణయాలు ఎప్పుడు ఎలా ఉంటాయో అంచనా వేయలేము కాబట్టి, ఎటువంటి పరిస్థితికి అయినా సిద్ధంగా ఉండాల్సి వస్తుందని పేర్కొంటున్నాయి.

ఈనాడు బిజినెస్

శాంసంగ్.. 3 ఫోల్డబుల్ ఫోన్లు



న్యూయార్క్: శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ 3 ప్రీమియం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లను, గెలాక్సీవాచ్ 8ను ఆవిష్కరించింది. మరింత వెడల్పాటి స్క్రీన్, తక్కువ బరువు, 200 మెగాపిక్సల్ వైడ్-యాంగిల్ కెమేరా, ఏఐ వినూత్నతలతో వీటిని తీసుకొచ్చినట్లు తెలిపింది. గెలాక్సీ జడ్ ఫోల్డ్7 (రూ.1.75- 2.11 లక్షలు), గెలాక్సీ జడ్ ఫ్లిప్ 7 (రూ.1.10-1.22 లక్షలు), గెలాక్సీ జడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ (రూ.89,000-95,999)లను ప్రదర్శించింది. గెలాక్సీ ఏఐ సాంకేతికతతో ఈ ఫోన్లను రూపొందించారు.
✦ గెలాక్సీ జడ్ ఫోల్డ్ సిరీస్‌లో ఏడో తరంగా వస్తోన్న ఫోల్డ్7 బరువు 215 గ్రాములు. గెలాక్సీ ఎస్25 అల్ట్రా కంటే కూడా ఇది తేలికైందని కంపెనీ పేర్కొంది. మడత పెడితే 8.9 ఎమ్ఎమ్, మడత తీస్తే 4.2 ఎమ్ఎమ్ మందంలో ఈ ఫోన్ ఉంటుందని తెలిపింది. 8 అంగుళాల 5 డైనమిక్ అమోల్డ్ 2ఎక్స్ ప్రధాన డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్ వంటి ప్రత్యేకతలున్నాయి. ✦ 16 జీబీ వరకు మెమొరీ, 1టీబీ వరకు నిల్వ సామర్థ్యం వీటి సొంతం. ✦ జెమినై లైవ్, ఏఐ రిజల్ట్స్ వ్యూ, సర్కిల్ టు సెర్చ్, డ్రాయింగ్ అసిస్ట్, రైటింగ్ అసిస్ట్ వంటి ఏఐ ఫీచర్లున్నాయి. ✦ భారత్‌లో ముందస్తు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. రూ.12,000 వరకు ఆఫర్లు ఇస్తున్నట్లు విక్రయ సంస్థలు తెలిపాయి.

సౌదీలో మనమూ స్థిరాస్తులు కొనొచ్చు

దిల్లీ: సౌదీ అరేబియాలో భారతీయులూ స్థిరాస్తులు కొనుగోలు చేసే వీలు కలగనుంది. ఇప్పటివరకు సౌదీయేతరులు ఆ దేశంలో స్థిరాస్తులు కొనేందుకు అనుమతి లేదు. సౌదీలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, చమురేతర ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంలో భాగంగా.. 2026 జనవరి నుంచి సౌదీలోని రియాద్, జెద్దా వంటి ప్రాంతాల్లో స్థిరాస్తులు కొనేందుకు విదేశీయులనూ అనుమతించాలని సౌదీ మంత్రివర్గం నిర్ణయించింది. సౌదీ పౌరులకు ప్రయోజనాలను కాపాడుతూనే, విదేశీయులు స్థిరాస్తులు కొనేందుకు అనుమతించేలా ప్రణాళికలను ఎపిక చేయడంతో పాటు, పూర్తి నిబంధనలను 180 రోజుల్లోగా డిజిటల్ రియల్ ఎస్టేట్ జనరల్ అథారిటీ విడుదల చేయనుందని సమాచారం. సౌదీ మున్సిపల్, గ్రామీణ, గృహ నిర్మాణ మంత్రి-రియల్ ఎస్టేట్ జనరల్ అథారిటీ చైర్మన్ మాజిద్ హొగైల్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. మక్కా, మదీనాల్లో కొనాలంటే మాత్రం మరికొన్ని అదనపు షరతులు ఉంటాయన్నారు.

హైదరాబాదీ అంకురం జెహ్‌లో ఇండిగో వెంచర్స్ పెట్టుబడి

ముంబయి: విమానయాన సంస్థ ఇండిగోకు చెందిన వెంచర్ కేపిటల్ సంస్థ ఇండిగో వెంచర్స్, తొలి విడత కింద రూ.450 కోట్ల నిధుల సమీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. తన తొలి పెట్టుబడిని హైదరాబాద్‌కు చెందిన అంకుర సంస్థ జెహ్ ఏరోస్పేస్‌లో పెట్టినట్లు తెలిపింది. ఎంత పెట్టిందీ వెల్లడించలేదు. కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే 100 మందితో ప్రత్యేక నైపుణ్యాలున్న ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల బృందాన్ని జెహ్ తయారుచేసుకుందని ఇండిగో వెంచర్స్ తెలిపింది. ఎఎస్9100 ప్రమాణాలతో కూడిన 1,00,000 వరకు విమానాల కీలక ఏరోఇంజిన్ విడిభాగాలు, ప్రెసిషన్ పరికరాలనూ జెహ్ సరఫరా చేసిందని పేర్కొంది. అంతర్జాతీయ ఏరోస్పేస్ కంపెనీలతో 100 మిలియన్ డాలర్ల దీర్ఘకాలిక కాంట్రాక్టులను జెహ్ దక్కించుకుందని వెల్లడించింది. డిజిటల్ తయారీ మౌలిక సదుపాయాల విస్తరణ, ఏఐ ఆధారిత ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థలను మరింతగా అనుసంధానం చేయడం, ఇంజినీరింగ్, ఉత్పత్తి సంబంధిత నిపుణుల నియామకం కోసం ఈ నిధులను జెహ్ ఉపయోగించుకోనుంది.

వేదాంతా ఆర్థిక పరిస్థితి నిలకడగా లేదు!

- యూఎస్ షార్ట్‌సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ నివేదిక
- ఖండించిన వేదాంతా గ్రూప్



దిల్లీ: అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంతా గ్రూప్ ఆర్థిక పరిస్థితి నిలకడగా లేదని, రుణదాతలను తీవ్రమైన ముప్పు కలిగించే పరిస్థితి ఉందని ఆరోపిస్తూ యూఎస్ షార్ట్‌సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ బుధవారం 85 పేజీల నివేదిక విడుదల చేసింది. ఈ ఆరోపణలను వేదాంతా గ్రూప్ 'ఎంపిక చేసిన తప్పుడు సమాచారం-నిరాధారమైనది'గా ఖండించింది. వైస్రాయ్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. ముంబయిలో నమోదైన వేదాంత లిమిటెడ్, తన మాతృ సంస్థ-మెజార్టీ వాటాదారు-యజమాని అయిన వేదాంత రిసోర్సెస్ రుణ స్టాక్ (షార్టింగ్ డెట్)ను తగ్గిస్తోంది. బాండ్ల షార్ట్ సెల్లింగ్ అని పిలిచే షార్టింగ్ డెట్ అనేది ఒక ట్రేడింగ్ వ్యూహం. ఇందులో పెట్టుబడిదారుడు 'బాండ్‌ను అప్పుగా తీసుకుని, ప్రస్తుత మార్కెట్ ధరకు విక్రయిస్తారు. ఆపై తిరిగి తక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా లాభం ఆర్జిస్తారు'. వేదాంతా రిసోర్సెస్ సొంతంగా ఎలాంటి కార్యకలాపాలు చేయకుండా పరాన్నజీవి (పారసైట్) హోల్డింగ్ కంపెనీగా మారిందని.. వేదాంతా లిమిటెడ్ నుంచి నగదును డివిడెండ్ రూపంలో పొందుతోందని పేర్కొంది. దాని మరో యూనిట్ హిందుస్థాన్ జింక్ కూడా వేదాంతా రిసోర్సెస్‌కు భారీ మొత్తంలో డివిడెండు చెల్లిస్తోందని వివరించింది.

వైమానిక శిక్షణ సంస్థలకు ర్యాంకింగ్ వ్యవస్థ


భద్రత, నాణ్యత మెరుగుకే: డీజీసీఏ

దిల్లీ: వైమానిక శిక్షణ సంస్థలకు ర్యాంకింగ్ వ్యవస్థను విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ ఆవిష్కరించింది. పైలట్ శిక్షణ కార్యకలాపాల్లో భద్రత, నాణ్యత మెరుగుపరిచేందుకు దీనిని తీసుకొచ్చింది. ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌టీఓ)కు చెందిన విమానాల ప్రమాదాలు, ఇతరత్రా నిబంధనల ఉల్లంఘనలు నేపథ్యంలోనూ ర్యాంకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పేర్కొంది. 2025 అక్టోబరు 1 నుంచి ఈ ర్యాంకింగ్ వ్యవస్థ అమల్లోకి వస్తుంది. ఏటా అక్టోబరు 1, ఏప్రిల్ 1 తేదీల్లో (ఏడాదికి రెండుసార్లు) ర్యాంకులను ప్రకటిస్తామని తెలిపింది. వివిధ అంశాల ఆధారంగా స్కోరు ఉంటుందని, ఏదైనా ఎఫ్‌టీఓ స్కోరు 50% కంటే తక్కువగా చేరితే నోటీసు జారీ చేస్తామని, వారు తమ పనితీరు మెరుగుపరచుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ఈ ఏడాది ఉండకపోవచ్చు!

దిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ ఏడాది ఉండకపోవచ్చు. ఈ ఏడాది పబ్లిక్ ఇష్యూకు రావాలని భావించిన ఆ సంస్థ.. తాజాగా ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. మార్కెట్ వర్గాలు, మదుపర్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్న వాటిలో జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ కూడా ఒకటి. పబ్లిక్ ఇష్యూకు రావడానికి ముందే, సంస్థ విలువను మరింతగా పెంచుకోవాలని భావిస్తుండటమే.. ఆలస్యానికి కారణమని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం జియో ప్లాట్‌ఫామ్స్ విలువ 100 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,50,000 కోట్లు)గా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టెలికాం వ్యాపారానికి సంబంధించి చందాదారుల సంఖ్యను, ఆదాయాన్ని మరింతగా పెంచుకోవడం, డిజిటల్ సేవల విస్తరణ ద్వారా ఈ విలువను మరింతగా పెంచుకునే యోచనలో కంపెనీ ఉంది. ప్రస్తుతం జియో ప్లాట్‌ఫామ్స్‌కు వస్తున్న ఆదాయంలో 80% టెలికాం వ్యాపారం (రిలయన్స్ జియో ఇన్ఫోకామ్) నుంచే ఉంటోంది.

యాపిల్ సీఓఓగా సబీహ్ ఖాన్



దిల్లీ: ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్, తమ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా భారత సంతతికి చెందిన సబీహ్ ఖాన్‌ను నియమించింది. 30 ఏళ్లగా సంస్థలో వివిధ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఖాన్, ప్రస్తుతం సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ప్రస్తుత సీఓఓ జెఫ్ విలియమ్స్ నుంచి ఈ నెలాఖరులోగా నూతన బాధ్యతలను సబీహ్ చేపడతారు. ఇప్పటివరకు ఆయనకే సబీహ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌కు రిపోర్టు చేస్తూనే, డిజైన్ టీమ్‌తో పాటు యాపిల్ వాచ్ బాధ్యతలను విలియమ్స్ చూస్తారు. సబీహ్ ఖాన్ 1966లో ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జన్మించారు. పాఠశాల విద్య సింగపూర్‌లో చేసిన ఆయన తదుపరి అమెరికాలో స్థిరపడ్డారు.

ఎన్‌విడియా @ 4 లక్షల కోట్ల డాలర్లు

వాషింగ్టన్: చిప్ తయారీ అంతర్జాతీయ దిగ్గజం ఎన్‌విడియా మార్కెట్ విలువ 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.342 లక్షల కోట్ల)ను అధిగమించింది. బుధవారం వాల్‌స్ట్రీట్‌లో కంపెనీ షేరు విలువ ఆల్‌టైం గరిష్ఠమైన 164.42 డాలర్లకు చేరడం ఇందుకు దోహదం చేసింది. మైక్రోసాఫ్ట్ (3.751 లక్షల కోట్ల డాలర్లు), యాపిల్ (3.135 లక్షల కోట్ల డాలర్లు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గత ఆరునెలల్లో ఎన్‌విడియా మదుపర్లకు 1,455% ప్రతిఫలం ఇచ్చింది. ఏదాది వ్యవధిలో 24% లాభాలను అందించింది. గత నెల రోజుల్లోనే ఈ షేరు 14.28% ప్రతిఫలాన్ని అందించింది. కృత్రిమ మేధ (ఏఐ) వృద్ధిపైన అపార నమ్మకం, ఏఐ సాంకేతికతకు చిప్ తయారీ వెన్నెముకగా ఉండడంతో మదుపర్లు ఈ కంపెనీ షేరు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

కోడి గుడ్లు

10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వందకు రూపాయల్లో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	540
గోదావరి	515
విశాఖపట్నం	540
చిత్తూరు	613

బ్యాంకుల ఆదాయం తగ్గుతోంది

● రెపో కోత ప్రభావం ● బీసీజీ నివేదిక



ఈనాడు, హైదరాబాద్: వడ్డీ రేట్లు క్రమంగా తగ్గుతుండటం రుణగ్రహీతలకు ఊరట కలిగిస్తోంది. పాలసీ రేటు రెపోను 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే.. బ్యాంకుల నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ)లో 1.20% క్షీణతకు దారి తీస్తోందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) నివేదిక వెల్లడించింది. ఒకవేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును 0.50% పెంచితే, బ్యాంకుల నికర వడ్డీ ఆదాయంలో 1.11% పెరుగుదల నమోదవుతోందని పేర్కొంది. ప్రైవేటు రంగ బ్యాంకులతో పోలిస్తే, ప్రభుత్వ బ్యాంకులపై రెపో రేటు ప్రభావం అధికంగా కనిపిస్తోంది. రెపో రేటులో 50 బేసిస్ పాయింట్లు తగ్గితే, ప్రభుత్వ బ్యాంకుల ఎన్ఐఐలో 1.56% క్షీణత నమోదవుతోంది. అదే 50 బేసిస్ పాయింట్ల పెంపుతో 1.45% పెరుగుదలకు దారితీస్తోందని బ్యాంకింగ్ రంగంపై విడుదల చేసిన ఈ నివేదిక వెల్లడించింది. ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 100 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించి, 5.50 శాతంగా చేసింది. రెపో రేటు తగ్గినప్పుడు ఆదాయంపై ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ, బ్యాంకు ఈక్విటీ మార్కెట్ విలువ మెరుగుపడుతుందని నివేదిక పేర్కొంది. పెద్ద బ్యాంకులపై ఈ రేటు మార్పుల ప్రభావం పరిమితంగానే కనిపిస్తోందని వివరించింది.

అమెరికా నుంచి 33 వేల సీసాల ఔషధం వెనక్కి: గ్రాన్యూల్స్

ఈనాడు, హైదరాబాద్: మెటోప్రొలోల్ సక్సినేట్ ఈఆర్ ట్యాబ్లెట్ బాటిళ్లను అమెరికా మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని గ్రాన్యూల్స్ ఇండియా నిర్ణయించింది. ఒక్కో సీసాలో 100, 500 ట్యాబ్లెట్లు ఉంటాయి. ఇటువంటి 33 వేల సీసాలను వెనక్కి తీసుకోవాల్సి వస్తోంది. ఈ మందును రక్తపోటును తగ్గించడానికి వినియోగిస్తారు. ఈ ట్యాబ్లెట్లు నిర్ణీత సమయంలో నీటిలో కరగకపోవటం, 'స్టెబిలిటీ స్టడీస్' ప్రమాణాల ప్రకారం లేనందునే, సంస్థ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. యూఎస్ఎఫ్‌డీఏ నిబంధనల ప్రకారం దీన్ని 'క్లాస్-2 రీకాల్' అని వ్యవహరిస్తారు.

'అపోలో ఆయుర్వేద' వైద్య సేవల విస్తరణ

ముంబయి: అపోలో ఆయుర్వేద అనే ఆయుర్వేద వైద్య సేవల సంస్థ తన కార్యకలాపాలను విస్తరించనుంది. ఫలితాలపై స్పష్టమైన రుజువులు ఉన్న ఆయుర్వేద వైద్య సేవలు అందించడంపై దృష్టి సారించనున్నట్లు అపోలో ఆయుర్వేద వ్యవస్థాపకుడు, ఎండీ- సీఈఓ రాజీవ్ వాసుదేవన్ పేర్కొన్నారు. దీని కోసం రూ.15 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు తెలిపారు. అయిదేళ్లలో రూ.500 కోట్ల టర్నోవర్ సాధించాలనేది తమ లక్ష్యమని వివరించారు. కొన్ని ఆయుర్వేద మందులను డాక్టర్ల ప్రిస్క్రిప్షన్‌పై మందుల షాపుల ద్వారా విక్రయిస్తామని, ఓటీసీ (ఓవర్ ద ప్రొడక్ట్స్) మందులు, ఆహార పదార్థాలు, ఇతర వైద్య వస్తువులను రిటెయిల్ స్టోర్లు, ఆన్‌లైన్ స్టోర్ల ద్వారా అందిస్తామని అన్నారు. దాదాపు 50 వేల మంది రోగులకు చికిత్సలు అందించే విధంగా 350 వైద్య పడకల సామర్థ్యం గల 9 వైద్య చికిత్సల కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

కాయ్ ఛైర్‌పర్సన్‌గా అభిజిత్ కిశోర్

దిల్లీ: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) ఛైర్‌పర్సన్‌గా అభిజిత్ కిశోర్ మళ్లీ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన వొడాఫోన్ ఐడియా సీఓఓగా వ్యవహరిస్తున్నారు. కాయ్ వైస్ ఛైర్‌పర్సన్‌గా భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వట్స్ నియమితులయ్యారు. కాయ్‌లో సభ్యులుగా రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఉన్నాయి.

స్టార్‌లింక్‌కు తుది అనుమతులు

- అంతరిక్ష నియంత్రణ సంస్థ నుంచి లైసెన్సు
- స్పెక్ట్రమ్ కేటాయింపే మిగిలింది



ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, మనదేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను వాణిజ్య పద్ధతిలో ఆవిష్కరించేందుకు భారత అంతరిక్ష నియంత్రణ సంస్థ అయిన ఇన్-స్పేస్ నుంచి లైసెన్సు పొందింది. భారత మార్కెట్లోకి అడుగుపెట్టడానికి మిగిలిన ఒకే ఒక్క నియంత్రణపరమైన అడ్డంకినీ ఆ కంపెనీ అధిగమించింది.

అయిదేళ్ల కాలానికి: అయిదేళ్ల కాలానికి లేదా లో ఎర్త్ ఆర్బిట్(ఎల్ఈఓ) ఉపగ్రహాల మాలిక అయిన స్టార్‌లింక్ జెన్1 కార్యకలాపాల జీవనకాలం వరకు.. ఏది ముందైతే అప్పటివరకు ఈ అనుమతులు వర్తిస్తాయి.

2022 నుంచీ ఎదురుచూపులు: మన దేశంలో శాటిలైట్ బ్రాడ్‌బాండ్ సేవలను వాణిజ్య పరంగా అందించేందుకు 2022 నుంచీ స్టార్‌లింక్ వేచిచూస్తోంది. స్పేస్ ఎక్స్ అభివృద్ధి పరచిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవే ఈ స్టార్‌లింక్. సంప్రదాయ శాటిలైట్ సేవలకు మారుగా ఎల్ఈఓ శాటిలైట్ల ఆధారంగా సేవలందించడమే దీని ప్రత్యేకత.

తర్వాత ఏంటి?: ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్ పొందడం, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడం, టెస్టింగ్, ట్రయల్స్ ద్వారా భద్రతా నిబంధనలను పాటిస్తున్నట్లు నిరూపించుకోవడమే ఇక మిగిలింది. యూటెల్‌శాట్‌కు చెందిన వన్‌వెబ్, రిలయన్స్ జియో దరఖాస్తులకు ఇప్పటికే మనదేశం అనుమతులు ఇచ్చింది. దీంతో ఈ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు అనుమతులు పొందిన మూడో కంపెనీగా స్టార్‌లింక్ నిలిచింది.

ధరలు ఇలా ఉండొచ్చు: స్టార్‌లింక్ కిట్ ధర భారత్‌లో రూ.33,000 వరకు ఉండొచ్చని సమాచారం. నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రూ.3,000-4,200 వరకు ఉండొచ్చు. దేశంలో శాటిలైట్ సేవలను అందించడం కోసం ఇటీవలే రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో స్టార్‌లింక్ ఒప్పందం కుదుర్చుకుంది.

జూన్‌లో ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రూ.23,587 కోట్ల పెట్టుబడులు



ఈనాడు, హైదరాబాద్: మన స్టాక్ మార్కెట్లపై మదుపర్లకు విశ్వాసం పెరగడంతో, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)లోకి గత నెలలో రూ.23,587 కోట్ల నికర పెట్టుబడులు తరలి వచ్చినట్లు భారత మ్యూచువల్ ఫండ్ల సంఘం యాంఫీ బుధవారం వెల్లడించింది. 2024 జూన్ నెల పెట్టుబడులతో పోలిస్తే ఇవి 24% అధికం. ఈక్విటీ విభాగంలోకి మదుపర్ల పెట్టుబడులు రావడం వరుసగా ఇది 52వ నెల. ఈ ఏడాది తొలి 5 నెలల్లో మాత్రం వీటిల్లోకి పెట్టుబడులు కాస్త తక్కువగా వచ్చినా, జూన్‌లో మాత్రం సూచీలు రాణించడంతో మదుపర్ల ధోరణిలో మార్పు వచ్చింది. క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) పెట్టుబడుల్లో ఆరోగ్యకర వృద్ధి కూడా ఈక్విటీ ఎంఎఫ్‌లలో పెట్టుబడులు పెరిగేందుకు దోహదం చేసింది. సిప్ పెట్టుబడులు మేలో రూ.26,688 కోట్లు కాగా, జూన్‌లో రూ.27,269 కోట్లకు పెరిగాయి.

నిర్వహణలోని ఆస్తులు రూ.74.40 లక్షల కోట్లు: మ్యూచువల్ ఫండ్ల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) జూన్ చివరికి రూ.74.40 లక్షల కోట్లకు చేరింది. ఎంఎఫ్ పోర్ట్‌ఫోలియోల సంఖ్య 24,13,44,556కు చేరింది. రిటెయిల్ మ్యూచువల్ ఫండ్ ఫోలియోలు 19,07,05,687గా ఉన్నాయి. రిటెయిల్ విభాగంలోని పెట్టుబడులు రూ.43.99 లక్షల కోట్లకు చేరాయి. గత నెలలో కొత్తగా 61,91,178 సిప్‌లు నమోదయ్యాయి. సిప్‌ల ఏయూఎం రూ.15,30,573.88 కోట్లకు చేరింది. మొత్తం సిప్ ఖాతాల సంఖ్య 8,64,70,491కు చేరింది. ఇది జీవన కాల గరిష్ఠం. గత నెలలో మొత్తం 20 ఓపెన్ ఎండెడ్ పథకాలు విడుదలయ్యాయి. ఇవన్నీ కలిపి రూ.1,986 కోట్లు సమీకరించాయి. యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని మాట్లాడుతూ ఎంఎఫ్‌ల ఏయూఎం రూ.74 లక్షల కోట్లను అధిగమించి కొత్త మైలురాయిని చేరుకుందన్నారు.

రైల్వే విడిభాగాల తయారీ కోసం టాటా ఆటోకాంప్, స్కోడా జట్టు

దిల్లీ: విడిభాగాల తయారీ రంగ సంస్థ టాటా ఆటోకాంప్, ఐరోపా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే స్కోడా గ్రూప్, మనదేశంలో రైల్వే విడిభాగాల తయారీ కోసం జట్టుకట్టాయి. రైల్వే ప్రొపల్షన్ సిస్టమ్‌లు, విడిభాగాలను తయారు చేసేందుకు సంయుక్త సంస్థను నెలకొల్పుతున్నట్లు తెలిపాయి. ఎన్ని కోట్లు పెట్టుబడి పెడుతోందీ స్పష్టంగా వెల్లడించలేదు. మన దేశానికి ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలను తమ భాగస్వామ్యం తీసుకు వస్తుందని టాటా ఆటోకాంప్ వివరించింది. మీడియమ్ హై స్పీడ్, ప్రాంతీయ రైళ్లు, మెట్రోలు, తేలికపాటి రైళ్ల కోసం కన్వర్టర్లు, డ్రైవ్స్, ఆక్జిలరీ కన్వర్టర్లను సంయుక్త సంస్థ తయారీ చేయనుంది. సరసమైన ధరల్లో మొబిలిటీ సొల్యూషన్స్ తెస్తామని పేర్కొంది. అత్యాధునిక సాంకేతికతను భారతదేశంలోకి తెస్తామని స్కోడా గ్రూప్ ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ) పీటర్ నోవోట్నీ తెలిపారు.

ఐటీ, చమురు షేర్లు పడేశాయ్

సెన్సెక్స్ ▼ 176	నిఫ్టీ ▼ 46
83536	25476

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.77 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.921 కోట్లు



సమీక్ష

ఐటీ, చమురు-గ్యాస్ షేర్లలో అమ్మకాలతో బుధవారం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. కార్పొరేట్ సంస్థల ఏప్రిల్-జూన్ ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభానికి ముందు మదుపర్లు అప్రమత్తత పాటించడమే ఇందుకు నేపథ్యం. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలూ ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 85.73 వద్ద స్తబ్దుగా ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.51% లాభంతో 70.51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.
✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ బుధవారం రూ.1000 కోట్లు పెరిగి రూ.461.39 లక్షల కోట్లు (5.38 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
✦ సెన్సెక్స్ ఉదయం 93 పాయింట్ల (క్రితం ముగింపు 83,712.51) నష్టంతో 83,625.89 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,781.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, ఆఖర్లో అమ్మకాలతో మళ్లీ నష్టాలకు జారుకుంది. చివరకు 176.43 పాయింట్ల నష్టంతో 83,536.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.40 పాయింట్లు కోల్పోయి 25,476.10 దగ్గర స్థిరపడింది.
✦ సెన్సెక్స్ 30 షేర్లలో 17 డీలాపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.03%, టాటా స్టీల్ 1.82%, టెక్ మహీంద్రా 1.39%, రిలయన్స్ 1.28%, బీఈఎల్ 1.01%; ఎల్ అండ్ టీ 0.77% నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్ 1.40%, హెచ్‌యూఎల్ 1.24%, అల్ట్రాటెక్ 0.90%, ఎం అండ్ ఎం 0.62% లాభపడ్డాయి.
✦ **వేదాంతా షేర్లకు నష్టాలు:** అమెరికా షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ నివేదిక నేపథ్యంలో వేదాంతా షేరు ఇంట్రాడేలో 7.71% కుదేలై రూ.421 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 3.38% నష్టంతో రూ.440.80 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,021.99 కోట్లు తగ్గి రూ.1.72 లక్షల కోట్లకు చేరింది.
✦ రాగిపై 50 శాతం సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో హిందుస్థాన్ కాపర్ 3.76%, భాగ్యనగర్ ఇండియా 3.03%, ఎన్‌డీ మెటల్ ఇండస్ట్రీస్ 2.15% నష్టపోయాయి. హిందుస్థాన్ జింక్ 2.56%, హిండాల్కో 1.92%, నాల్కో 1.90%, టాటాస్టీల్ 1.82%, ఏపీఎల్ అపోలో 1.72%, సెయిల్ 0.85%, జిందాల్ స్టెయిన్‌లెస్ 0.67%, జేఎస్‌పీఎల్ 0.61%, ఎన్ఎండీసీ 0.59% చొప్పున పడ్డాయి.
✦ క్రిజాక్ షేర్లు అరంగేట్రంలో రాణించాయి. ఇష్యూ ధర రూ.245తో పోలిస్తే, బీఎస్ఈలో షేరు ట్రేడింగ్ 14.28% లాభంతో రూ.280 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 25.69% దూసుకెళ్లి రూ.307.95 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 25.48% లాభంతో రూ.307.45 వద్ద ముగిసింది.
✦ **అదానీ ఎంటర్‌ప్రైజెస్** రూ.1000 కోట్ల బాండ్ల ఇష్యూకు, బుధవారం ప్రారంభమైన 3 గంటల్లోనే పూర్తి స్పందన లభించింది.
✦ ఆక్జో నోబెల్ ఇండియాలో ఉన్న మొత్తం 4.42% వాటాను రూ.734 కోట్లకు **ఏషియన్ పెయింట్స్** విక్రయించింది.
✦ కెనడాకు చెందిన అంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ నుంచి పుణెకు చెందిన సహ్యాద్రి హాస్పిటల్స్‌ను మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఎంత పెట్టి కొనుగోలు చేసిందీ వెల్లడి కానప్పటికీ.. ఈ లావాదేవీ విలువ రూ.6,400 కోట్లుగా ఉండొచ్చని తెలుస్తోంది.


ఐపీఓ సమాచారం

✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ఐసీఐసీఐ బ్యాంక్ అనుబంధ సంస్థ **ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)** ప్రాథమిక పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్‌లో 1.76 కోట్ల షేర్లను ప్రమోటర్ సంస్థ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ విక్రయించనుంది. మొత్తం ఇష్యూ పరిమాణం రూ.10,000 కోట్లుగా ఉండొచ్చని చెబుతున్నారు.
✦ ఔషధ రంగ కంపెనీ **యాంథెమ్ బయోసైన్సెస్** ఐపీఓ ఈ నెల 14న ప్రారంభమై 16న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.540- 570 నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.3,395 కోట్లు సమీకరించనుంది. గరిష్ఠ ధర ప్రకారం.. కంపెనీ విలువ రూ.31,800 కోట్లను మించనుంది. రిటైల్ మదుపర్లు కనీసం 26 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి.
✦ కార్యాలయ స్థలాన్ని అందించే **స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్** ఐపీఓ ఈ నెల 10న ప్రారంభమై 14న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.387-407 నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించనుంది. రిటైల్ మదుపర్లు కనీసం 36 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి.
✦ **ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్** ఐపీఓ ముగిసేసరికి 2.88 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,34,12,842 షేర్లను ఆఫర్ చేయగా, 3,86,35,064 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 7.70 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 1.58 రెట్లు, రిటైల్ మదుపర్లనుంచి 69% స్పందన లభించింది.

మా చిరునామా: **మకరందం**, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

ఎల్లరను కాపాడే ఎల్లమ్మదేవి

సకల చరాచర సృష్టికీ కారకురాలైన అమ్మల గన్న అమ్మని- జగజ్జననిగా, మహాదేవిగా, శక్తి స్వరూపిణిగా, దుర్గాదేవిగా, కాళీమాతగా అర్చిస్తాం, ఆరాధిస్తాం. లలితాంబగా సహస్ర నామాలతో పూజిస్తాం. ఏ పేరుతో పిలిచినా, ఏ రూపంలో కొలిచినా.. కరుణించి, కటాక్షిస్తుంది ఆ జగన్మాత. ఆషాఢమాసం సందర్భంగా రేణుకాదేవి అమ్మవారిని స్మరించుకుందాం.



భగవత్ తత్వాన్ని తెలియజేసే సంస్కృత గ్రంథాల్లో వేద వ్యాస విరచిత దేవీభాగవతం ఒకటి. ఈ మహాపురాణం శక్తి తత్వాన్ని జగత్తుకు అందిస్తుంది. సృష్టి స్థితి లయకారులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మహాదేవిలో భాగమే. సరస్వతి, లక్ష్మి, పార్వతి అమ్మవార్లతోపాటు మహాదేవి ఎన్నో రూపాలను పొందింది. లోక కల్యాణార్థం దుష్ట సంహారం చేసింది. ఒక్కో చోట ఒక్కో పరమార్థంతో అవతరించి పూజలు అందు కుంది.

కథలూ.. గాథలూ..

చెట్టుకు ఎన్నో శాఖలు, ఎన్నో ఊడలు. ఒక్కో ఊడ నేలలో పాతుకుని, మహావృక్షమై మరెన్నో మొక్కల్ని ఉద్భవింపచేస్తుంది. పౌరాణిక ఇతివృత్తాలూ అంతే. రామాయణ, భారత, భాగవతాల నుంచి ఎన్నో కథలు, విశ్వాసాలూ వేళ్లూనుకుని వ్యాపిస్తు న్నాయి. అమ్మ భగవతి గురించి భక్తులు తమకు తెలిసిన, తాము అనుభూతి చెందిన అంశాలను పంచుకున్న ప్పుడు.. అవి రూపాంతరం చెందడం పరిపాటి. అందుకే అమ్మవారి సంగతులు కథలు, గేయాలు, చిత్రాలు, శిల్పాల రూపంలో వేరువేరుగా కనిపిస్తాయి. మహిమాన్వితమైన రేణుక ఎల్లమ్మ కథలోనూ ఎన్నో రూపాంతరాలు. బైండ్ల అనే తెగకు చెందినవారు వాద్యం మోగిస్తూ ఆమె కథను చెబుతుంటే కన్నీళ్లు పెట్టనివారుండరు. అనేక పురాణాల్లో ఈ అమ్మవారి ప్రస్తావన ఉంది. రేణుక ఎల్లమ్మ- శివపార్వతులకు పుట్టలో దొరికిన బిడ్డ అని చెప్పే కథ, రేణుకేశ్వరరాజు కుమార్తె అని మరో కథ, ఎన్ని కష్టాలెదురైనా ఓరిమి చూపిన ఓ మహాసాధ్వీమణి అని ఒక గాథ ప్రచారంలో ఉన్నాయి.

విస్తృత ప్రచారంలో ఉన్న మరో కథను అనుసరించి- ప్రసూనజిత్తు రాజకుమార్తె రేణుకాదేవి. అపురూప సౌందర్యవతి అయిన ఆ రాజబిడ్డకు జమదగ్నిమునితో పెళ్లిచేశారు. రాచభోగాల్లో పెరిగిన ఆమె.. పతి ఉండే చోటే తన స్థానమని జమదగ్నితో ఆశ్రమంలో జీవించింది. వారికి ఐదుగురు కుమారులు. ఆఖరి పుత్రుడైన పరశురాముడు విష్ణుమూర్తి దశావతారాల్లో ఆరో అవతారం. నదికి వెళ్లి ఏ రోజుకారోజు స్వయంగా తన చేతులతో ఒక మట్టికుండను చేసి నీళ్లు తెచ్చేది రేణుక. ఒకరోజు ఆమె నదికి వెళ్లిన సమయంలో గంధర్వులను తిలకించింది. అలా ధ్యాస మళ్లడాన.. మట్టికుండ చేయాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. సత్యాన్ని అతిక్రమించి, ఆలస్యంగా ఆశ్రమానికి వచ్చిన రేణుకపై ఆగ్రహించాడు జమదగ్ని. తల్లిని గొడ్డలితో నరకమని పుత్రులను ఆజ్ఞాపించాడు. మాతృహత్య మహాపాపమని.. నలుగురు కుమారులు తండ్రి మాట వినలేదు. పరశురాముడు మాత్రం అది తప్పని తెలిసినా, మళ్లీ బతికించుకోవచ్చునన్న నమ్మకంతో తండ్రి ఆజ్ఞను కాదనలేదు. ఆమెను హతమార్చేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడా తల్లి ఆక్రందన హృదయ విదారకం. కాపాడమంటూ గ్రామంలో వీధివీధీ, వాడవాడా తిరిగింది. పుత్రుడు ఆమెని వెంటాడుతూ.. తల్లే అనుకొని మరో స్త్రీ తల నరికాడు. తర్వాత తల్లిని కూడా హతమార్చి, ఆనక దుఃఖితుడయ్యాడు. ఆవేశం తగ్గిన తర్వాత జమదగ్ని- భార్య రేణుకాదేవి జ్ఞాపకాలను స్మరించుకున్నాడు.

పుత్రుని విధేయతను మెచ్చుకొని అతని కోరిక మేరకు రేణుకను, మరణించిన మరో మహిళనూ కూడా బతికించాడు. అయితే ఒకరి తల ఒకరి మొండెంతో రేణుక ఎల్లమ్మగా, ఒక్కరిగా, ఇద్దరిగా, సత్యరూపంగా ప్రసిద్ధిపొందింది. చండి, మాయ, భద్రకాళి.. ఇలా ఎన్నో రూపాల్లో సాక్షాత్కరిస్తోంది. జగాలను కాపాడి జగజ్జననిగా, త్రిలోకమాతగా, అసుర సంహారిణి, అభయంకరి, శాంకరి, కన్యక, మాయ, అఖిలిదేవి, ఏకవీర తదితర పేర్లతో పూజలందుకుంటోంది.

రేణుక ఎల్లమ్మ తాను కూడా బోనమెత్తిందని, ఆమెకు బోనాలంటే ఎంతో ఇష్టమని తెలియజేసే కథలు వ్యాప్తిలో ఉన్నాయి. ఈ అమ్మను భక్తిశ్రద్ధలతో పూజిస్తే.. మనలోనే కొలువుండి ఆశీర్వదిస్తుంది. మన కుటుంబాన్నీ, మొత్తం గ్రామాన్నీ కనిపెట్టుకుని ఉంటూ భోగభాగ్యాలను అందిస్తుంది. బోనాల సంబరాల్లో- 'గోల్కొండ ఖిల్లా మీద జగదాంబిక మా నాగాంబిక.. ఆషాఢ మాసాన ఆదివారం పూట, ఊరంతా హోరెత్తె బోనాల సంబరం..', 'ఎల్లు ఎల్లమ్మతల్లి ఎల్లూ తల్లీ.. బావి నుంచి బయటికి ఎల్లూ తల్లీ.. జరా వరాల జల్లు కురిపించవమ్మా..', 'కత్తులు బల్లెం చేతబట్టి, దుష్టుల తలలు మాల కట్టి.. నువ్వు పెద్దపులి.. నువ్వు పెద్దపులి నెక్కినావమ్మో గండిపేట గండి మైసమ్మ.. మా కష్టాలన్ని తీర్చ రావమ్మో గండిపేట గండి మైసమ్మా..', 'మాయదారి మైసమ్మో మైసమ్మా.. మనం మైసారం పోదమే మైసమ్మా..' వంటి హుషారైన పాటలు వీధుల్లో మారుమోగుతుంటే ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, మారమ్మ తదితర పేర్లతో కొలువుతీరిన అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తారు.

– డాక్టర్ బండారు సుజాత శేఖర్

> **తలచిన తలపులు తీర్చే తల్లి**
>
> గ్రామాలను కాచే గ్రామదేవతగా ఎల్లమ్మ అమ్మవారు పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ, మారమ్మ, అంకాలమ్మ, ఏకవీర- ఇలా ఎన్నో పేర్లతో ఊరూరా కొలువు తీరింది. ఎల్లరను కాచే రేణుక ఎల్లమ్మదేవిగా పూజలందుకుంటోంది. ఈ అమ్మ కొలిచినవారికి కొంగు బంగారం. తలచినంతలో తలపులు తీర్చే మహాతల్లి.

నిత్యచైతన్య స్ఫూర్తి..
జ్ఞానదీప ప్రదీప్తి..

జులై 10 గురుపూర్ణిమ

అదొక అద్భుత శక్తి. చైతన్య స్ఫూర్తి. సృష్టిలోని సకల జీవరాశుల నుంచి మనిషిని జ్ఞానిగా తీర్చిదిద్ది వేరుచేసింది ఆ శక్తే. జీవన గమనంలో చైతన్యానికి నాంది పలికి, జ్ఞాన కాంతులను నింపి మనిషిని మనీషిగా తీర్చిదిద్దిందీ ఆ శక్తే. అదే గురువు అనుగ్రహం. ఆచార్యుల చేయూత లేనిదే మనం అడుగు కూడా ముందుకు వేయలేం. అందుకే గురుదేవులను గౌరవించి పూజించాలని మన ధర్మగ్రంథాలు ప్రబోధించాయి.



గురువు మార్గదర్శకత్వంలోనే అటు లౌకిక, ఇటు పారమార్థిక జీవిత లక్ష్యాలు సిద్ధిస్తాయి. అలాంటి అపురూప గురుశక్తి రూపుదిద్దుకున్నవాడే వ్యాసుడు. వేదరాశిని నాలుగు వేదాలుగా విభజించి వేదవ్యాసుడయ్యాడు. బ్రహ్మవిష్ణుమహేశ్వర స్వరూపుడై భాసించాడు. భారత భాగవతాది గ్రంథ భాండాగారాన్ని అందించాడు. అందుకే ఈ జగత్తులో ఉన్న అక్షరజ్ఞానం అంతా వ్యాసభగవానుడు ప్రసాదించిందే అంటారు.

గురుగీతలోని 'గురుహీనః పశుః కీటః..' అనే శ్లోకానికి గురువు లేనివాడు పశువుతో సమానం. గురువు లేకపోతే కీటకంతో, పక్షితో సమానుడవుతాడు. దైవాన్ని తెలుసుకోలేడు, అలాగే ఆత్మజ్ఞానాన్ని పొందలేడు- అని అర్థం. అంటే చదువు లేకుంటే మనిషి జన్మకు సార్థకత లేదన్న అంతరార్థం ఇందులో ఉంది.. ఉత్తమ గురువు జ్ఞానంతో, వేదాంత తత్వంతో ప్రకాశిస్తుంటాడు. అలాంటి గురుదేవుని ఆశ్రయించి నప్పుడు మన అజ్ఞానం నశిస్తుంది. జీవన గమనంలో ఏర్పడే సంశయాలన్నీ తొలగుతాయి. ఇహలోకంలో ఏది మంచి, ఏది చెడు అనేది బోధపడుతుంది. పారమార్థికంగా చూస్తే గత జన్మల నుంచి వస్తున్నవి, ఈ జన్మలోనివి అయిన సర్వ పాపాలనూ నశింపచేసే శక్తి గురువుకు ఉంది. కనుక ఆయన అనుగ్రహంతో పాపవిముక్తి కలుగుతుంది.

ఆయనే గురువు.. ఎందరికో!

వ్యాసుడు అందించిన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు.. ఈ లోకంలో ఆనందమయ జీవనం గడపటానికీ, పరలోకంలో ముక్తి పొందటానికి ఉపయుక్తంగా ఉన్నాయి. అందుకే ఆయనను మానవాళికంతటికీ గురువుగా కీర్తిస్తారు, వ్యాసభగవానుడిగా ఆరాధిస్తారు. ఆయన జన్మించిన తిథి పర్వదినమైంది. మన ధర్మగ్రంథాలు గురువును భగవంతుడికీ భక్తుడికీ మధ్య సంధానకర్తగా పేర్కొన్నాయి. వేదవ్యాసుడు గొప్ప ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించాడు. కాబట్టి వ్యాసుడి జన్మ తిథి అయిన ఆషాఢ పూర్ణిమను గురు పూర్ణిమగా చేసుకోవడం ఆచారమైంది.

> **గురువా? దైవమా?**
>
> దేవుడెలా ఉంటాడో తెలుసుకోవటం అంత సులభం కాదు. కానీ దైవాన్ని తెలుసుకోవటం ఎలా అనే విషయాన్ని గురువు శిష్యుడికి బోధించగలుగుతాడు. ఆ మార్గాన్ని అనుసరించిన శిష్యుడు దైవాన్ని దర్శిస్తాడు. అందుకే గురువు, గోవిందుడు ఒకేచోట ఉంటే ముందు ఎవరికి నమస్కరిస్తావని అడిగితే- గురువుకే నమస్కరిస్తాను.. ఎందుకంటే గోవిందుడు ఉన్నాడని చెప్పింది గురువే కదా అన్నాడు భక్త కబీర్‌దాస్.

నారాయణుడి మొదలు నేటి వరకూ

ఇతర రోజుల్లో కన్నా వ్యాస పూర్ణిమ నాడు గురువు నుంచి పొందే ఆశీస్సులు వెయ్యిరెట్ల అధిక ఫలాన్ని ఇస్తాయన్నది పురాణ వచనం. అందుకే గురుపూర్ణిమ నాడు గురుపూజోత్సవం చేసి, ఆయన కరుణా కటా క్షాలను పొందాలి. జన్మనిచ్చిన తల్లిదండ్రుల పక్కన గురువుకు స్థానం కల్పించిన గొప్ప సంస్కృతి మనది. గురువును మించిన తత్వం, తపస్సు లేవన్నది అక్షర సత్యం. నారాయణ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం- అన్న శ్లోకాన్ని అనుసరించి గురుపూర్ణిమ నాడు- గురుపీఠానికి ఆద్యుడైన నారాయణుడి మొదలు.. సదాశివుడు, బ్రహ్మదేవుడు, వసిష్ఠులవారు, శక్తిముని, పరాశరుడు, వ్యాసుడు, శుకమహాముని, గౌడపాదులు, గోవింద భగవత్పాదులు, శంకరాచార్యులు, ప్రస్తుత గురువులు.. ఇలా గురు పరంపరను పూజించాలి.

సర్వజీవుల పట్ల దయ, సత్యమార్గంలో నడవటం, శాంతగుణాన్ని కలిగి ఉండటం- ఈ మూడు గుణాలను అందరూ అలవరచుకోవాలన్న సందేశం వ్యాసభగవానుడి నుంచి ఈ లోకానికి అందుతుంది. మానవాళికి దేవరుణం, రుషిరుణం, పితృరుణం తదితర రుణాలుంటాయి. వీటితోపాటు తోటివారి రుణం కూడా ఉంటుంది. ఈ రుణాల నుంచి విముక్తి పొందాలంటే సర్వప్రాణుల మీద దయ చూపాలి, మనకు చేతనైన ఉపకారం చెయ్యాలి- అని హితవు పలికాడు వ్యాసభగవానుడు. ప్రతి జీవిలో ఉండేది ఆ పరమాత్ముడేనని ఈ సందేశం తెలియజేస్తుంది. హింసను విడిచి, అహింసా మార్గాన్ని అనుసరించాలనే ఆలోచన కలిగిస్తుంది.

– ఆచార్య యల్లాప్రగడ మల్లికార్జున రావు, గుంటూరు

వైభవం.. ఆణివార ఆస్థానం

జులై16 తిరుమలలో ఆణివార ఉత్సవం



శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం వేడుక జరగనుంది. ఉత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని అలంకరించి పుష్పపల్లకీపై తిరుమల వీధులగుండా ఊరేగిస్తారు. శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానంలో భాగంగా ఉదయం బంగారు వాకిలి ముందున్న ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో దేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా, మరో పీఠంపై విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా కొలువుతీరతారు. మూలవిరాట్టుకు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు నివేదిస్తారు. పెద్దజీయర్ స్వామి మంగళవాయిద్యాల నడుమ వెండితట్టలో పట్టువస్త్రాలను తలపై ధరించి తీసుకురాగా.. మూలవిరాట్టుకు, మలయప్ప, విష్వక్సేనులకు సమర్పిస్తారు. 'లచ్చన'గా పిలుచుకునే ఆలయ తాళపుచెవిగుత్తిని అర్చకులు- పెద్దజీయరు స్వామి, చిన్నజీయరు స్వామి, కార్యనిర్వాహక అధికారులకు వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు. తర్వాత హారతి, చందనం, తాంబూలం, తీర్థం, ప్రసాదం, శఠారి మర్యాదలు నిర్వహిస్తారు. అంతటితో ఆణివార ఆస్థానం ముగుస్తుంది. సాయంత్రం 6 గంటలకు పుష్పపల్లకీపై స్వామి, అమ్మవారు కొలువుదీరిన నాలుగుమాడ వీధుల్లోని భక్తులకు అభయప్రదానం చేశారు.

– కొల్లా వెంకటేష్, న్యూస్‌టుడే

దానధర్మాలు.. సత్సంగాలు



ఆషాఢ పూర్ణిమకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ రోజు సూర్యోదయానికి ముందే స్నానం ఆచరించాలి. అవకాశం ఉంటే నదీ స్నానం ఉత్తమం. పూజగదిలో ఒక పీఠం ఏర్పాటు చేసుకొని విష్ణు మూర్తి విగ్రహాన్ని లేదా చిత్రపటాన్ని ఉంచి పూజ చేసుకోవాలి. ధూప దీప నైవేద్యాలు సమర్పించాలి. ఇంట్లో పూజ చేసుకునే వీలు లేకుంటే ఆలయాన్ని సందర్శించి పూలు, పండ్లు, తీపపదార్థాలు సమర్పించాలి. ఆషాఢ పూర్ణిమ రోజున విష్ణు సహస్రనామం జపించడం శుభప్రదం. ఈ రోజున దానధర్మాలు చేయడం వలన ఉత్తమ ఫలితాలు కలుగుతాయి. ఆహారం, వస్త్రాలు, ధనం, ధాన్యం దానం చేయవచ్చు. సత్సంగాల్లో పాల్గొనటం, భజనలు చేయడం పుణ్యప్రదం. కొందరు భక్తులు ఈ రోజున సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకుంటారు. ఈ పూజ అనంత ఫలితాన్నిస్తుంది. ఈ పవిత్ర దినాన ఉపవాసం ఉండటం మంచిది. రోజంతా ఉపవాసం ఉండలేని వాళ్లు పండ్లు తినవచ్చు.

– త్రినేత్ర

ఇస్లాం సందేశం

తుమ్మితే అల్లాహ్‌ను కీర్తించాలి

ముహమ్మద్ ప్రవక్త (స.అ.) ఆధ్యాత్మిక, సామాజిక విషయాలను సామాన్యులకు కూడా అర్థమయ్యేలా చెప్పేవారు. ఆయనోసారి వీధిలో వెళ్తుండగా కొందరు వ్యక్తులు ఒకతన్ని పట్టుకుని విలపించటం చూశారు. దగ్గరగా వెళ్లి ఏమైందని అడిగితే.. ఆ వ్యక్తి తుమ్మాడు కనుక చనిపోతాడని ఏడుస్తున్నట్లు చెప్పా రు. 'తుమ్మితే చనిపోతారనుకోవటం సరికాదు. తుమ్ము శుభసూచకం, ఆరోగ్యానికి చిహ్నం. తుమ్ము వస్తే వెంటనే 'అల్హందొలిల్లాహ్' అని దేవుణ్ణి కీర్తించాలి' అన్నారు ప్రవక్త. అప్పట్నుంచీ ఎవరైనా తుమ్మగానే 'అల్హందొలిల్లాహ్' అనటం ఆరంభమైంది.



ఆ కాలంలో కొందరు ఆడపిల్ల పుడితే నిర్దయగా సజీవంగా పాతిపెట్టేవారు. మహమ్మద్ ప్రవక్త ఈ మూఢ నమ్మకాన్ని తీవ్రంగా నిరసించి మాన్పించారు. తన కూతురు బీబీ ఫాతిమాని (స.అ.) చూడగానే గౌరవసూచనగా లేచి నిలబడి అభివాదం చేసేవారు. అలా స్త్రీలను గౌరవించాలని చెప్పకనే చెప్పారు.

ఒక వ్యక్తి ఇమామ్ హజ్రత్ అలీని (అ.స.) 'జీవుల్లో ఏవి గుడ్లు పెడతాయి, ఏవి పిల్లల్ని కంటాయి?' అనడిగాడు. ఇమామ్ 'చెవులు ప్రస్ఫుటంగా కనిపించే జీవులు పిల్లల్ని కంటాయి. చెవులు బయటకు కనిపించక, అంతఃశరీరంలో కలిగుండే జీవులు గుడ్లు పెడతాయి' అంటూ తేలిగ్గా అర్థమయ్యేట్టు చెప్పారు.

– నియాజ్ అలీ

క్రీస్తువాణి


కరుణామయుడి ఆశీస్సులు



చెడును ద్వేషించి, మంచిని ప్రేమించమన్నది బైబిల్ వాక్యం. మనం ఎలాంటి దురాలోచనలూ దుర్మార్గాలకూ పాల్పడకుండా సన్మార్గంలో నడవాలి. తోటివారి పట్ల సానుభూతితో ప్రవర్తిస్తూ సహకారం అందించాలి. అప్పుడే దేవుని దీవెనలు సమృద్ధిగా మనమీద వర్షిస్తాయి- అని భక్తుడైన ఆమోస్ సెలవిచ్చాడు. దైవాన్ని విశ్వసించి హృదయపూర్వకంగా ప్రార్థించాలి. పాపభీతితో మెలగుతూ ఆయన పవిత్ర నామాన్ని ఘనపరచాలి. క్షణభంగురమైన సౌఖ్యాలకు ప్రాముఖ్యత ఇవ్వకుండా ఆయన వైపు మన మనసును మళ్లించినట్లయితే గతంలో మనం కోల్పోయిన ఆశీర్వాదాలన్నీ తిరిగి మనకు అనుగ్రహిస్తాడు. తద్వారా దీవెనలు రెట్టింపవుతాయి. అందువల్ల మనం సదా దైవాన్ని స్మరిస్తూ ఆయన కోసం అన్వేషించాలి. సాతానును మన మనసులోంచి బయటకు తోసేసినట్లయితే ఏసు రక్తంతో పరిశుద్ధులమవుతాం. అద్భుతాలు చేయగల ఏసు మన జీవితాలను ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతాడు. ప్రభువు ఊహలు మనకు అందవు. ఆయనే సత్యం, నిత్యం. ఆయనే మనకు సర్వస్వం. కనుక లౌకిక విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సిలువ వైపు దృష్టి సారించాలి. సాతాను కారణంగా దారి తప్పకుండా దైవమార్గాన్ని అనుసరించాలి. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ నమ్మకం కోల్పోకుండా ముందుకు సాగితే ఆ కరుణామయుడి ఆశీస్సులు పొందగలుగుతాం.

– మర్రి ఎ.బాబ్జి

కంచి ఆలయంలో బల్లులు ఎందుకంటే..



బంగారు, వెండి బల్లులు కంచి ఆలయంలో ఉంటాయని మనందరికీ తెలుసు కదా! దీనికి సంబంధించి ఓ కథ ప్రచారంలో ఉంది. గౌతమ మహర్షి వద్ద ఇద్దరు శిష్యులు ఉండేవారు. వాళ్లో రోజు నీళ్ల కోసం నదీ తీరానికి వెళ్లారు. తీసుకెళ్లిన కుండలో బల్లి పడిన సంగతి వారు గుర్తించలేదు కానీ గౌతమ మహర్షి గమనించారు. ఆ నిర్లక్ష్యాన్ని సహించలేక వాళ్లని బల్లులుగా మారిపొమ్మని శపించారు. శిష్యులు శాపవిముక్తి కోసం ప్రార్థించగా.. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో వారికి విముక్తి లభిస్తుందని శాపవిమోచనం చెప్పారు. దాంతో వాళ్లు బల్లుల రూపంలో పెరుమాళ్ ఆలయంలోనే ఉంటూ స్వామివారిని ప్రార్థించసాగారు. కొన్నాళ్లకు వారికి శాపవిమోచనం కలిగింది. ఆ సమయంలో సూర్యచంద్రులు సాక్ష్యంగా ఉన్నారు. శాపవిమోచనం కలిగిన శిష్యులు బంగారు, వెండి బల్లుల రూపంలో భక్తులకు దోష నివారణ కలిగిస్తున్నారు. బల్లుల పక్కన సూర్యచంద్రుల చిత్రాలుంటాయి. బంగారం సూర్యుడికి, వెండి చంద్రుడికి ప్రతీకలు. సరస్వతీదేవీ నుంచి శాప విముక్తి పొందిన ఇంద్రుడు పెరుమాళ్ ఆలయంలో బల్లి బొమ్మలను ప్రతిష్ఠించినట్టు మరో కథనం ఉంది. కంచి ఆలయంలోని ఈ బల్లి బొమ్మలను తాకినట్లయితే శరీరం మీద బల్లి పడటం వల్ల కలిగే దోషాలు తొలగుతాయని, అలాగే తెలిసో తెలియకో చేసిన పాపాలు నశిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.


కంచిలో అనేక ఆలయాలు ఉన్నప్పటికీ వరదరాజ పెరుమాళ్ ఆలయం మరింత విశిష్టమైంది. ఇది పెరుమాళ్ ఆలయంగా కంటే బంగారు బల్లి ఆలయంగా ఎక్కువ ప్రసిద్ధి

– డా.జయదేవ్ చల్లా

మనసు స్మరణకు.. తనువు సేవకు..

దైవాన్ని స్మరిస్తే సరిపోదు. సేవ కూడా చేయాలి. ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి- సీతాన్వేషణ నిమిత్తమై వెళ్లిన హనుమం తునితో విభీషణుడు- 'హనుమా! నీవెంత అదృష్టవంతుడివయ్యా! హాయిగా రామసన్నిధిలోనే ఉంటున్నావు. నేనెన్నో సంవత్సరాలుగా శ్రీరాముని నామజపం చేస్తున్నప్పటికీ నాకింకా ఆ స్వామి దర్శనమే ప్రాప్తించలేదు' అని బాధపడ్డాడు. అప్పుడు హనుమంతుడు 'విభీషణా! నువ్వు కేవలం రామ రామ అని ఉచ్చరిస్తున్నావే కానీ రామసేవలో పాల్గొన్నావా? సీతమ్మవారు లంకకు వచ్చి ఎంతో కాలమయ్యింది. ఒక్కసారైనా ఆమెను చూశావా? ఆమె బంధవిమోచన గురించి ఏమైనా ప్రయత్నం చేశావా? కనీసం ఆమెను సాంత్వనపరిచే విషయాలేమైనా చెప్పావా? రామకార్యంలో పాల్గొనకుండా కేవలం నామాన్ని స్మరిస్తే రామతత్వం ఎలా బోధపడుతుంది? ఆ స్వామి దర్శనం ఎలా కలుగుతుంది?' అన్నాడు. ఇది హనుమ విభీషణుడికే చెప్పినా.. అందరికీ ఉపయుక్తమయ్యే ఉపదేశం. కనుక నామస్మరణతో పాటు సేవ కూడా చేయగలిగితే దైవదర్శనానికి రెండు చక్రాల్లాంటి ఆధ్యాత్మిక వాహనం లభించినట్లే.

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి



అరటిపండు ఎందుకు విశిష్టమంటే..



ప్రచారంలో ఉన్న కథను అనుసరించి- దుర్వాసుడి భార్య కదళి. ఆ మహర్షి కోపిష్టి కదా! ఒకరోజు అలసటగా అనిపించి పగలు నిద్రకు ఉపక్రమించారాయన. గాఢనిద్రలో ఉండటా న.. సాయంత్రమైనా మెలకువ రాలేదు. సంధ్యా వందనానికి వేళ దాటిపోతున్నా అతడు లేవలేదు. నిద్రలేపితే కోపావేశంతో శపిస్తాడేమోనని భయపడింది భార్య కదళి. కానీ ధర్మపత్నిగా బాధ్యతను విస్మరించ కూడదని నిద్రలేపింది. నిద్రాభంగమైనం దుకు ఆగ్రహించాడు. అతడి కళ్లలో కనిపించిన కోపాగ్నిని చూడగానే ఆమె భస్మమయ్యింది. స్థిమితపడి నిదానంగా ఆలోచించిన దుర్వాస మహర్షి వేదనచెందాడు. కానీ జరిగిన వైపరీత్యానికి ఎంతగానో దుఃఖించి.. స్వాంతన పొందే మార్గం కోసం ఆలోచించాడు. తన తపోబలాన్ని ఉపయోగించి కదళి భస్మరాశితో ఒక వృక్షాన్ని సృష్టించాడు.. అదే కదళీవృక్షం. కొన్నాళ్ల తర్వాత కదళి తండ్రి కూతురిని చూద్దామని రాగా.. ఆయన శపిస్తాడనే సందేహం కలిగినా దుర్వాసుడు నిజం దాచలేదు. జరిగిన సంగతి చెప్పడమే గాక.. చింతాగ్రస్తుడైన ఆయనకు తాను చేసిన పనికి ప్రాయశ్చిత్తంగా కదళీవృక్షాన్ని సృష్టించిన సంగతి కూడా తెలియజేశాడు. 'ఇదెంతో పవిత్రం. ఈ ఫలాలు భగవంతుని ఆరాధనలో విశిష్ట ప్రాధాన్యతను అందుకుంటాయి. నోములు, వ్రతాల్లో అరటిపండ్లు విశేష స్థానం పొందుతాయి. భగవదారాధనలో అగ్రస్థానం అందుకుంటాయి' అంటూ చెప్పాడు.

– యల్లాప్రగడ లక్ష్మి

వందే విష్ణుం! విజయః



విష్ణు సహస్ర నామావళిలో 147వది. 'విజయః' అంటే జయించటమే స్వభావ స్వరూపంగా ఉన్నవాడు అని అర్థం. ఆ దేవదేవుడికి జయమే తప్ప అపజయం ఉండదు. ఈ విషయం తెలియక ఎందరెందరో రాక్షసులు ఎన్నెన్నో ఆంక్షలను పెడుతూ తమకే జయం కలగాలని బ్రహ్మాది దేవతల దగ్గర వరం పొందిన సంఘటనలు పురాణాల్లో కనిపిస్తాయి. కానీ వాళ్ల కుటిల ఆలోచనలేవీ ఫలించవు. చివరకు స్వామిదే విజయమై తీరుతుంది. ఆ విషయాన్నే వివరిస్తుందీ నామం. బ్రహ్మ రుద్రాదుల విజయాలకు కూడా ఆ స్వామే కారణమై విజయుడయ్యాడు.

– సి.ఎ.వై.తన్వి

కరెంట్ అఫైర్స్

■ సుదిర్మన్ కప్ - 2025 విజేతగా ఏ దేశం నిలిచింది? (ఈ అంతర్జాతీయ మిశ్రమ జట్టు బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఈ దేశం టైటిల్ విజేతగా నిలవడం ఇది 14వ సారి. ఫైనల్లో దక్షిణ కొరియాను 3-1తో ఓడించి విజేతగా నిలిచింది.) జ: చైనా



మాదిరి ప్రశ్నలు

■ ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా వాణిజ్య నివేదిక ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి దేశం మొత్తం ఎగుమతులు గరిష్ఠ స్థాయిలో ఎంత మొత్తానికి చేరుకున్నాయి? (2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన మొత్తం ఎగుమతుల విలువ 778.1 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 6.01 శాతం అధికం.) జ: 824.9 బిలియన్ డాలర్లు

■ భారత దేశపు మార్గదర్శక యాంజియోప్లాస్టీ నిపుణుడిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ మాథ్యూ శామ్యూల్ కలరికల్ (77) ఇటీవల ఎక్కడ మరణించారు? (1986లో భారత్‌లో యాంజియోప్లాస్టీని ప్రవేశ పెట్టడం ద్వారా ఈయన దేశంలో గుండె సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.) జ: చెన్నై

■ ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం(యూఎన్‌డీపీ) విడుదల చేసిన 2025 మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)లో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది? జ: 130వ

మరింత సమాచారం

సరితో సరి కలిస్తే సరి!



షాపింగ్ చేసినా, సమయం చూసినా, కొలతలు వేసినా అన్నింటిలో సంఖ్యలు ఉండాల్సిందే. అవి లేకపోతే అడుగు కూడా ముందుకు పడదు. పరిమాణాలు, మొత్తాలు, వరుస క్రమాలను సూచించడానికి ఉపయోగపడే గణితపరమైన భావనే సంఖ్యలు. మరో రకంగా చెప్పాలంటే వస్తువులను లెక్కించడానికి, కొలవడానికి, పోల్చడానికి వాడే గుర్తులు లేదా పదాలు. ఇందులో అనేక రకాలు ఉన్నప్పటికీ ముఖ్యమైనవి సరి సంఖ్యలు, బేసి సంఖ్యలు, ప్రధాన సంఖ్యలు. వీటిపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు వస్తున్నాయి. అభ్యర్థులు సంఖ్యల్లో రకాలను స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ప్రాథమిక గణిత ప్రక్రియలు, భిన్నాలు, శాతాలు, గుణిజాలను తెలుసుకోవాలి.



సంఖ్యలు రకాలు

సరిసంఖ్యలు (Even Numbers)

★ 2తో భాగించగా శేషం '0' వచ్చే సంఖ్యలు. ఇవి 2n రూపంలో ఉంటాయి.

★ సరిసంఖ్యల ఒకట్ల స్థానంలో 2, 4, 6, 8, 0 ఉంటాయి.

ఉదా: 2, 4, 6, 8, 10, 12, 14,..

బేసి సంఖ్యలు (Odd Numbers)

★ 2తో భాగించగా శేషం '1' వచ్చే సంఖ్యలు.

★ ఇవి 2n – 1 లేదా 2n + 1 రూపంలో ఉంటాయి.

★ బేసి సంఖ్యల ఒకట్ల స్థానంలో 1, 3, 5, 7, 9 ఉంటాయి.

ఉదా: 1, 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, ...

నోట్: ★ సరి ± సరి = సరి

బేసి ± బేసి = సరి

సరి ± బేసి = బేసి

★ సరి × సరి = సరి

బేసి × బేసి = సరి

సరి × బేసి = బేసి

ప్రధానసంఖ్యలు (Prime Numbers):

★ 1, అదే సంఖ్య కారణాంకంగా ఉన్న సంఖ్యలు.

★ కేవలం 2 కారణాంకాలు మాత్రమే ఉంటాయి. 1, అదే సంఖ్య.

ఉదా: 7 = 1 × 7, 23 = 1 × 23

19 = 1 × 19, 29 = 1 × 29

★ 100 వరకు ప్రధాన సంఖ్యలు = 25

2, 3, 5, 7, 11, 13, 17, 19, 23, 29, 31, 37, 41, 43, 47, 53, 59, 61, 67, 71, 73, 79, 83, 89, 97.

★ 1 అంకె ఉన్న ప్రధాన సంఖ్యలు = 4

★ 2 అంకెలున్న ప్రధాన సంఖ్యలు = 21

★ 3 అంకెలున్న ప్రధాన సంఖ్యలు = 143

★ 1000 వరకు ఉన్న ప్రధాన సంఖ్యలు = 168

★ 2 → సరి ప్రధాన సంఖ్య, అతి చిన్న ప్రధాన సంఖ్య.

★ 2 తప్ప మిగిలిన ప్రధాన సంఖ్యలన్నీ బేసి సంఖ్యలు.

★ 3, 5, 7 → గ్యాప్ 2గా ఉన్న వరుస ప్రధాన సంఖ్యలు.

★ 1 ప్రధాన సంఖ్య కాదు, సంయుక్త సంఖ్య కాదు.

మాదిరి ప్రశ్నలు

1. $N^2 - 33, N^2 - 31, N^2 - 29$ లు ప్రధాన సంఖ్యలు. N ఒక పూర్ణసంఖ్య అయితే N విలువ?

1) 4 2) 5 3) 6 4) 8

వివరణ: $N^2 - 33,\ N^2 - 31,\ N^2 - 29$ (+2, +2)

ఇవి గ్యాప్ '2'గా ఉన్న ప్రధాన సంఖ్యలు కాబట్టి, 3, 5, 7 లు గ్యాప్ 2గా ఉన్న ప్రధాన సంఖ్యలు.

$N^2 - 33 = 3 \Rightarrow N^2 = 36$

$N = \pm 6$ జ: 3

2. మూడు ప్రధాన సంఖ్యల మొత్తం 100. వాటిలో ఒక ప్రధాన సంఖ్య, మరొక ప్రధాన సంఖ్య కంటే 36 ఎక్కువ. అయితే దానిలో ఒక ప్రధాన సంఖ్య?

1) 17 2) 29 3) 31 4) 43

వివరణ: a + b + c = 100 (సరి సంఖ్య)

a ↓ సరి ↓ 2; b + c ↓ సరి ↓ 98 → 31, 67 (gap = 36)

కాబట్టి, మూడు ప్రధాన సంఖ్యలు 2, 31, 67 జ: 3

3. 1 నుంచి 50 వరకు సంఖ్యల్లో ఉన్న ప్రధాన సంఖ్యల శాతం?

1) 20% 2) 25% 3) 30% 4) 40%

వివరణ: 1 నుంచి 50 వరకు ఉన్న ప్రధాన సంఖ్యలు ... 15.

శాతం $= \frac{15}{50} \times 100 = 30\%$ జ: 3

4. మొదటి 5 బేసి ప్రధాన సంఖ్యల సగటు?

1) 7.6 2) 5.6 3) 7.8 4) 5.8

వివరణ: మొదటి 5 బేసి ప్రధాన సంఖ్యలు 3, 5, 7, 11, 13

సగటు $= \frac{\text{రాశుల మొత్తం}}{\text{రాశుల సంఖ్య}} = \frac{39}{5} = 7.8$ జ: 3

5. కింది వాటిలో ప్రధాన సంఖ్యను గుర్తించండి.

1) 1331 2) 1003 3) 1001 4) 1009

వివరణ: $1331 = 11^3$

$1003 = 17 \times 59$

$1001 = 7 \times 11 \times 13$

కాబట్టి 1009 ప్రధాన సంఖ్య జ: 4

జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

కవల ప్రధాన సంఖ్యలు (Twin primes)

ప్రధాన సంఖ్యల భేదం 2గా ఉన్న సంఖ్యలు.

ఉదా: (3, 5) (5, 7) (11, 13)....

⇒ 100లోపు కవల ప్రధాన సంఖ్యలు 8.

(3, 5) (5, 7) (11, 13) (17, 19) (29, 31) (41, 43) (59, 61) (71, 73)

1. **a, b లు కవల ప్రధాన సంఖ్యలు. a > b అయితే కింది వాటిలో ఏది**





సత్యం?

1) a + 2 = b 2) a – 2 = b 3) a = b – 2 4) a = 2 – b

వివరణ: a, b లు కవల ప్రధాన సంఖ్యలు కాబట్టి gap = 2

∴ a – b = 2 ⇒ a – 2 = b జ: 2

2. 50 లోపు కవల సంఖ్యలు ఎన్ని?

1) 4 2) 5 3) 6 4) 7

వివరణ:

50 లోపు కవల సంఖ్యలు 6.

(3, 5) (5, 7) (11, 13) (17, 19) (29, 31) (41, 43) జ: 3

సహ/పరస్పర ప్రధాన సంఖ్యలు: (Relative - Primes)/Co - Primes

★ రెండు సంఖ్యలకు 1 తప్ప మరే ఇతర ఉమ్మడి కారణాంకం ఉండకూడదు.

ఉదా: (8, 15) (18, 19)

★ వీటినే 'సాపేక్ష ప్రధాన సంఖ్యలు' అంటారు.

నోట్: 1) రెండు వరుస సంఖ్యలు .... పరస్పర ప్రధాన సంఖ్యలు.

2) రెండు వరుస బేసి సంఖ్యలు .. పరస్పర ప్రధాన సంఖ్యలు.

3) రెండు ప్రధాన సంఖ్యలు ... పరస్పర ప్రధాన సంఖ్యలు.

నోట్: ఎ) పరస్పర ప్రధాన సంఖ్యల కసాగు = వాటి లబ్ధం

బి) పరస్పర ప్రధాన సంఖ్యల గసాభా = 1

1. కింది వాటిలో పరస్పర ప్రధాన సంఖ్యల జత ఏది?

1) (11, 111) 2) (22, 222) 3) (33, 333) 4) (44, 444) జ: 1

2. కింది వాటిలో సరైన వాక్యం?

1) ప్రధాన సంఖ్యలన్నీ బేసి సంఖ్యలు.
2) ప్రధాన సంఖ్యలన్నీ పరస్పర ప్రధాన సంఖ్యలు.
3) పరస్పర ప్రధాన సంఖ్యలన్నీ ప్రధాన సంఖ్యలు.
4) ప్రధాన సంఖ్యలు కానివన్నీ సంయుక్త సంఖ్యలు. జ: 2

సంయుక్త సంఖ్యలు: (Composite Numbers)

★ రెండు కంటే ఎక్కువ కారణాంకాలున్న సంఖ్యలు.

ఉదా: 4 కి కారణాంకాలు 1, 2, 4

6 కి కారణాంకాలు 1, 2, 3, 6.

1. 100 లోపు సంయుక్త సంఖ్యలు?

1) 72 2) 73 3) 74 4) 75 జ: 2

2. అతిచిన్న బేసి సంయుక్త సంఖ్య?

1) 4 2) 8 3) 9 4) 27 జ: 3

పరిపూర్ణ సంఖ్యలు: (Perfect Numbers)

★ ఒక సంఖ్య కారణాంకాల మొత్తం ఆ సంఖ్యకు రెట్టింపు.

6 కారణాంకాలు 1, 2, 3, 6.

1 + 2 + 3 + 6 = 12

(ఇది 6 కి రెట్టింపు)

పరిపూర్ణ సంఖ్యలు:

6, 28, 496, 8128,....

1. ఇచ్చిన వాటిలో పరిపూర్ణ సంఖ్య కానిది?

1) 6 2) 12 3) 28 4) 496 జ: 2

2. 28 కారణాంకాల యొక్క వ్యుత్క్రమాల మొత్తం ఎంత?

1) 28 2) 56 3) 14 4) 2 జ: 4

ప్రాక్టీస్ బిట్స్

1. 350 నుంచి 600 వరకు 5 ఎన్నిసార్లు వస్తుంది?

1) 60 2) 61 3) 62 4) 63

2. 100 – 300ల మధ్య ఉన్న ఎన్ని సంఖ్యలను 13తో భాగించవచ్చు?

1) 13 2) 14 3) 15 4) 16

3. 496 యొక్క కారణాంకాల మొత్తం?

1) 896 2) 992 3) 576 4) 684

4. 200 నుంచి 700 మధ్య ఉన్న అంకెలను రాయడానికి 3 అనే అంకెను ఎన్నిసార్లు ఉపయోగిస్తారు?

1) 150 2) 200 3) 250 4) 300

5. రెండు వరుస బేసి సంఖ్యల వర్గాల మధ్య భేదం ఏ సంఖ్య భాజకం అవుతుంది?

1) 5 2) 7 3) 8 4) 6

6. 10, 100 మధ్య ఉన్న ప్రధాన సంఖ్యల్లో వాటి స్థానాలను మారిస్తే, మళ్లీ ప్రధాన సంఖ్యలుగా ఏర్పడేవి ఎన్ని?

1) 8 2) 10 3) 9 4) 12

7. X, Y, Z లు మూడు వేర్వేరు ప్రధాన సంఖ్యలు. X < Y < Z, X + Y + Z = 70 అయితే Z విలువ ఎంత?

1) 29 2) 31 3) 37 4) 43

సమాధానాలు:

1-3; 2-4; 3-2; 4-2; 5-3; 6-3; 7-3.



రచయిత: పిరాది నరేష్


మేఘాలయ కొండల్లో సున్నపురాతి గుహలు!

పర్వతాల నుంచి పీఠభూముల వరకు విభిన్న భౌగోళిక స్వరూపాల సహజ సౌందర్య దృశ్యాలతో అలరారుతున్న దేశం భారత్. హిమాలయాల్లో మంచుతో నిండిన లద్దాఖ్ పీఠభూమి, వాయవ్యంలో ఎడారి ప్రాంతం, సారవంతమైన భూములతో గంగా మైదానం, అతిపురాతన ఆరావళి పర్వత శ్రేణులు, ఈశాన్యంలో వైవిధ్యమైన కొండ ప్రాంతాలు, దక్షిణాదిన ఇరువైపుల్లో విస్తరించిన తూర్పు, పశ్చిమ కనుమలు తదితరాలన్నీ వేటికవే ప్రత్యేకం. ప్రధాన భూస్వరూపాలున్న ప్రాంతాలు, వాటి సరిహద్దులు, విశేషాల గురించి పోటీ పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. ముఖ్యమైన పర్వతశ్రేణులు, ఎత్తయిన శిఖరాలు, నదులు, నదీ మార్గాలు, హిమానీనదాలు, లోయ ప్రాంతాలు, రాష్ట్రాల వారీగా ప్రసిద్ధ కొండలు, వాటి ఇతర పేర్లు, వేసవి విడిది కేంద్రాలు, బీచ్‌లు మొదలైన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

భారతదేశ భౌగోళిక స్వరూపాలు

1. కింది వాటిలో ఆరావళి పర్వతాలకు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.

ఎ) ఆరావళి పర్వతాలు ఆర్కియన్/ప్రీకేంబ్రియన్ యుగంలో ఏర్పడిన అతి ప్రాచీన ముడుత పర్వతాలు.
బి) ఆరావళి పర్వతాల్లో ఎత్తయిన శిఖరం గురుశిఖర్ అబు కొండల్లో ఉంది.
సి) రాగి నిక్షేపాలకు ప్రసిద్ధి చెందిన ఖేత్రి ప్రాంతం ఈశాన్య ఆరావళి ప్రాంతంలో ఉంది.
డి) ఆరావళి పర్వతాల సగటు వయసు 3.5 - 2.5 బిలియన్ సంవత్సరాలు.



1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

2. కింది వాటిని జతపరచండి.

నదులు	దోబ్
ఎ) సింధు - జీలం	1) బారి
బి) జీలం - చీనాబ్	2) రేచన
సి) చీనాబ్ - రావి	3) చాజ్
డి) రావి - బియాస్	4) సింధు సాగర్

1) ఎ-1, బి-3, సి-2, డి-4 2) ఎ-4, బి-2, సి-3, డి-1
3) ఎ-1, బి-3, సి-4, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

3. సాత్పురా పర్వతాలకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.

ఎ) ఈ పర్వతాలు పశ్చిమాన విస్తరించి ఉన్న ప్రాంతంలో వీటిని 'రాజ్ పిప్లా కొండలు'గా పిలుస్తారు.
బి) వీటికి దక్షిణాన విస్తరించి ఉన్న భాగాన్ని 'గవిల్ ఘర్ కొండలు' అని వ్యవహరిస్తారు.
సి) వీటికి తూర్పున విస్తరించి ఉన్న భాగాన్ని 'మైకాల్ శ్రేణి' అంటారు.
డి) ఈ పర్వతాలు గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వరకు దాదాపుగా 900 కి.మీ.లు విస్తరించి ఉన్నాయి.

1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి, డి లు సరికావు.
4) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.


4. ఇచ్చిన వాటిని జతపరచండి.

రాష్ట్రాలు/ దేశం	శివాలిక్ పర్వతాల పేర్లు
ఎ) అస్సాం	1) డ్వార్ఫ్ కొండలు
బి) నేపాల్	2) ధూద్వా కొండలు
సి) ఉత్తర్‌ప్రదేశ్	3) కచర్ కొండలు
డి) పశ్చిమ బెంగాల్	4) చురియా కొండలు

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-4, డి-2

5. కింది వాటిలో గంగా మైదానాలకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.

ఎ) పంజాబ్ - హరియాణాలోని తాత్కాలిక నదీ ప్రవాహాలను 'చోస్' అంటారు.
బి) ఎడారి ప్రాంతాల్లో ఏర్పడే తాత్కాలిక ఉప్పు నీటి సరస్సులను 'ప్లాయాలు' అంటారు.
సి) ఎడారుల్లోని శిలా పీఠభూములను 'హమడాలు' అంటారు.
డి) గంగా మైదాన ప్రాంతం ఉత్తర మైదానాల్లో భాగంగా విస్తరించి ఉంది. ఇది ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత కలిగి ఉంది.



1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి, డి లు సరైనవి.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.


6. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) బార్కన్స్	1) అరబ్బుల కత్తి ఆకారం ఉన్న ఇసుక దిబ్బలు
బి) సైఫ్	2) అర్ధ చంద్రాకార ఇసుక దిబ్బలు
సి) రిప్ప్యూల్స్	3) కదిలే ఇసుక దిబ్బలు
డి) డ్రైయిన్స్	4) అలల ఆకారంలో ఉన్న ఇసుక దిబ్బలు

1) ఎ-1, బి-4, సి-3, డి-2 2) ఎ-2, బి-1, సి-4, డి-3
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

7. లద్దాఖ్ పర్వత శ్రేణికి సంబంధించి వాక్యాలను సరిచూడండి.



ఎ) లద్దాఖ్ పీఠభూమి ప్రాంతాన్ని 'శీతల ఎడారి'గా పిలుస్తారు.
బి) లద్దాఖ్ పర్వత శ్రేణి ష్యోక్, సింధూనది మధ్య విస్తరించి ఉంది.
సి) ఆక్సాయ్‌చిన్ ప్రాంతం లద్దాఖ్ పీఠభూమికి ఉత్తరాన ఉంది.
డి) లేహ్ పట్టణం సింధూ నది లోయలో, లద్దాఖ్ పర్వతాలకు దక్షిణంగా ఉంది.

1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

8. కింది వాటిని జతపరచండి.

శిఖరం	సరాసరి ఎత్తు (మీటర్లలో)
ఎ) కే2	1) 8,598 మీ.
బి) కాంచన గంగ	2) 8,611 మీ.
సి) నామ్చబర్వా	3) 8,126 మీ.
డి) నంగప్రభాత్	4) 7,756 మీ.

1) ఎ-1, బి-4, సి-2, డి-3 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-2, బి-1, సి-4, డి-3

9. కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) లద్దాఖ్‌లోని ఛాంగ్ లా కనుమ... లేహ్, టిబెట్‌లను కలుపుతుంది.
బి) హిమాచల్‌ప్రదేశ్‌లోని బారాలాచాలా కనుమ... మనాలి, లేహ్‌లను కలుపుతుంది.
సి) సిక్కింలోని జెలెప్‌లా కనుమ.. సిక్కిం, లాసాలను కలుపుతుంది.
డి) అరుణాచల్‌ప్రదేశ్‌లోని దీపు కనుమ.. మయన్మార్, అరుణాచల్‌ప్రదేశ్‌లను కలుపుతుంది.

1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

10. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) పంజాబ్ హిమాలయాలు	1) తీస్తా-బ్రహ్మపుత్ర
బి) నేపాల్ హిమాలయాలు	2) సింధు-సట్లెజ్
సి) అస్సాం హిమాలయాలు	3) సట్లెజ్-కాళీ
డి) కుమావాన్ హిమాలయాలు	4) కాళీ-తీస్తా

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-2, బి-4, సి-1, డి-3
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

11. పీర్‌పంజల్ పర్వత శ్రేణికి సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) కశ్మీర్ లోయ పీర్‌పంజల్ శ్రేణి, ఉన్నత హిమాలయాలకు మధ్య విస్తరించి ఉంది.
బి) జీలం, చీనాబ్ నదులు పీర్‌పంజల్ శ్రేణిని ఖండిస్తూ ప్రవహిస్తాయి.
సి) పీర్‌పంజల్ పర్వత శ్రేణి నైరుతి, దక్షిణ భాగాలు హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా విస్తరించి ఉన్నాయి.
డి) పీర్‌పంజల్ పర్వత శ్రేణులు హిమాచల్ హిమాలయాల్లో భాగంగా ఉన్నాయి.



1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, సి, డి లు సరికావు.

12. కింది వాటిని జతపరచండి.

కనుమ	ప్రత్యేకత
ఎ) బనిహాల్	1) ప్యోంగ్యాంగ్ త్సో ముఖద్వారం
బి) పెన్సిలా	2) గ్రౌండ్ ఆఫ్ కార్ప్సెస్
సి) రోహ్‌తంగ్	3) గేట్ వే ఆఫ్ జన్స్కర్
డి) ఛాంగ్ లా	4) గేట్ వే ఆఫ్ శ్రీనగర్

1) ఎ-4, బి-3, సి-1, డి-2 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

13. కింది వాటిలో మేఘాలయ పీఠభూమికి సంబంధించి వాక్యాలను సరిచూడండి.

ఎ) ఛోటానాగ్‌పుర్ పీఠభూమికి ఈశాన్య భాగంలోని రాజమహల్ కొండలకు, గారో కొండలకు మధ్య ప్రాంతాన్ని 'మాల్టాభ్రంశం' అంటారు.
బి) మేఘాలయ పీఠభూమిలోని గారో కొండల్లో ఎత్తయిన శిఖరం నోక్రేక్.
సి) గారో కొండల్లో సున్నపు రాతి గుహలుగా పిలిచే 'సిజు గుహలు' ఉన్నాయి.
డి) మికిల్ కొండల దక్షిణ భాగాన్ని 'రెంగ్ మా' కొండలు అంటారు.

1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

ట్రాన్స్ హిమాలయాలు	దేశాలు
ఎ) సులేమాన్, కిర్తహర్	1) చైనా
బి) టియాన్ షా	2) పాకిస్థాన్
సి) హిందూకుష్, హిందురాజ్	3) టిబెట్
డి) కున్‌లున్	4) అఫ్గానిస్థాన్

1) ఎ-1, బి-4, సి-3, డి-2 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-2, బి-1, సి-4, డి-3 4) ఎ-4, బి-3, సి-2, డి-1

15. కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) అన్నామలై కొండలను 'ఏనుగు కొండలు' అంటారు.
బి) నీలగిరి కొండల్లో తోడ, ఇరుల, కురుంబ తెగల ప్రజలు నివసిస్తున్నారు.
సి) కార్డమామ్ కొండలు హిందూ మహాసముద్ర తీరం వరకు విస్తరించి ఉంటాయి.
డి) పళని కొండల్లోని వేసవి విడిది కేంద్రం కొడైకెనాల్.

1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

16. కింది వాటిలో దక్షిణ కొండలకు సంబంధించిన వివిధ ప్రాంతాల్లోని కొండలను జతపరచండి.

ప్రాంతం	కొండలు
ఎ) బళ్లారి	1) షవరాయ్
బి) ధర్మపురి	2) శిరుమలై
సి) దిండిగల్	3) నీలగిరి కొండలు
డి) సేలం	4) శాండూర్ కొండలు

1) ఎ-1, బి-4, సి-3, డి-2 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

17. కింది వాటిని జతపరచండి.

రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	బీచ్
ఎ) కర్ణాటక	1) శంఘుముగం
బి) మహారాష్ట్ర	2) కరైకల్
సి) పుదుచ్చేరి	3) జుహు
డి) కేరళ	4) పెనంబూర్

1) ఎ-1, బి-4, సి-2, డి-3
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-1, బి-2, సి-3, డి-4



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-4; 3-1; 4-2; 5-3; 6-2; 7-1; 8-4; 9-2; 10-2; 11-1; 12-4; 13-2; 14-3; 15-1; 16-4; 17-2.

ఈనాడు ప్రతిభ

■ e-mail: pratibhadesk@eenadu.net

20

గురువారం జులై 10, 2025

భారతదేశంలో మౌలిక సదుపాయాలు - రైల్వే వ్యవస్థ

మన దేశ రవాణా రంగంలో రైల్వేలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అతి పెద్ద రైల్వే వ్యవస్థను కలిగి ఉన్న దేశంగా భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో, ఆసియాలో మొదటి స్థానంలో ఉంది.

మన దేశంలో రైల్వేల చరిత్ర

దేశంలో తొలి ఆవిరి ఇంజిన్ రైలు 1853, ఏప్రిల్ 16న బొంబాయి నుంచి థానే మధ్య 34 కి.మీ. ప్రయాణించింది. అప్పటి బొంబాయి ప్రభుత్వ చీఫ్ ఇంజినీర్ జార్జ్ క్లార్క్ ఈ మార్గాన్ని నిర్మించాలని భావించారు.

◆ మొదటి ప్రయాణికుల వాణిజ్య రైలు 1854, ఆగస్టు 15న 24 మైళ్ల దూరం ఉన్న హుగ్లీ - హౌరా మధ్య ప్రారంభమైంది. దేశంలో తూర్పు ప్రాంతంలో ఈస్ట్ ఇండియన్ రైల్వే సెక్షన్ ద్వారా రైలు ప్రయాణం జరిగింది.

◆ దక్షిణాన మొదటి రైలు 1856, జులైలో మద్రాసు రైల్వే కంపెనీ వ్యాసర్పాడి నుంచి ఆర్కాట్ మధ్య నడిచింది.

◆ 1859, మార్చి 3న అలహాబాద్ నుంచి కాన్పూర్ మధ్య 69 మైళ్ల దూరం రైలు ప్రయాణం జరిగింది.

◆ 1880 నాటికి 9000 మైళ్ల పొడవైన రైలు మార్గాలు దేశంలో ఏర్పడ్డాయి.

◆ 2025, జూన్ నాటికి మన దేశంలో 69,181 కి.మీ. పొడవైన రైలు మార్గాలు, 7,349 స్టేషన్లు ఉన్నాయి.

రైల్వే కంపెనీలు

భారతదేశంలో మొదట ఆంగ్లేయుల యాజమాన్యంలోని ప్రైవేట్ సంస్థలు రైళ్లను నడిపాయి. 1849లో గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే కంపెనీ ఏర్పాటైంది. ఆ తర్వాత కలకత్తా అండ్ సౌత్ ఈస్టర్న్ రైల్వేస్ ఏర్పాటైంది. 1868లో నష్టాలు భరించలేక అది ఈ ఆస్తులను ప్రభుత్వానికి స్వాధీనపరిచింది. ఆ విధంగా ప్రభుత్వ యాజమాన్యంలోని మొదటి రైల్వే సంస్థగా మారింది.

❐ 1882 నాటికి భారత్‌లో దాదాపు 75 రైల్వే కంపెనీలు పనిచేసేవి. అందులో కొన్నింటిని స్వదేశీ సంస్థానాలు నడిపేవి. 1889లో నిజాం రైల్వేను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

❐ 1901లో థామస్ రాబర్ట్ సన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైల్వే బోర్డు ఏర్పాటైంది. 1920లో ఆక్వర్త్ కమిటీ సిఫార్సుల మేరకు 1925లో మొదటి సారి రైల్వే కంపెనీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. క్రమంగా అన్ని కంపెనీలను హస్తగతం చేసుకుంది. 1950లో రాజుల సంస్థానాల నడుపుతున్న రైల్వేలను కూడా స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో ఏకస్వామ్య సంస్థగా భారతీయ రైల్వే నడుస్తోంది.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

24 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు దేశవ్యాప్తంగా 333 జిల్లాలను కవర్ చేస్తూ అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రయాణాన్ని అందించే సెమీ హైస్పీడ్ రైళ్లు ఇవి. ప్రస్తుత దేశంలో మొత్తం 68 వందేభారత్ రైళ్లు (136 సర్వీసులు) నడుస్తున్నాయి.

* 2019, ఫిబ్రవరి 15న న్యూదిల్లీ - వారణాసి మధ్య తొలి వందేభారత్ రైలు ప్రారంభమైంది.

అమృత్‌భారత్ రైళ్లు

ఇవి నాన్ - ఏసీ, పుష్-పుల్ రైళ్లు. ఇవి మెరుగైన భద్రత, సౌకర్యాలతో కూడిన ప్రయాణాన్ని అందిస్తాయి.

❐ వీటిని ఇండియన్ రైల్వేస్ చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో రూపొందించి, అభివృద్ధి చేసింది. ప్రస్తుతం 3 అమృత్‌భారత్ రైళ్లు (6 సర్వీసులు) అమల్లో ఉన్నాయి.

ట్రాక్ అప్‌గ్రెడేషన్

2014-24 కాలంలో దేశంలో కొత్తగా 31,000 కి.మీ. పైగా కొత్త రైల్వే ట్రాక్‌లు వేశారు. మొత్తం 45,000 కిలోమీటర్లకు పైగా మార్గాలను పునరుద్ధరించారు.



మన దేశ రవాణా వ్యవస్థకు రైల్వేను జీవనాడిగా పేర్కొంటారు. నిత్యం లక్షలాది ప్రజలు వీటి ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రయాణికులతో పాటు సరుకు రవాణాలోనూ రైల్వేలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. దూరప్రాంత ప్రయాణానికి, రవాణాకు రహదారుల కంటే రైల్వేలే సౌకర్యవంతంగా ఉంటాయి. పైగా ఖర్చు కూడా తక్కువ. ఇవి దేశం నలుమూలల నుంచి ప్రజలను అనుసంధానిస్తూ, వ్యాపార, పర్యాటక, తీర్థయాత్రలు, విద్యాసంబంధ కార్యకలాపాల నిర్వహణను సులభతరం చేస్తున్నాయి.

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

సుదూర మార్గాలను కలుపుతూ.. దేశాభివృద్ధికి బాటలు వేస్తూ!

రైల్వే బడ్జెట్

రైల్వే బడ్జెట్ కేంద్ర బడ్జెట్‌లో భాగమే అయినప్పటికీ 1924 నాటి తీర్మానం మేరకు అక్వర్త్ కమిటీ సిఫార్సుల ప్రకారం 1924-25 ఆర్థిక సంవత్సరం నుంచి రైల్వే బడ్జెట్‌ను చట్టసభకు విడిగా సమర్పిస్తున్నారు. రైల్వే కేటాయింపులకు సంబంధించి 16 పద్దులుంటే, వాటిని పార్లమెంట్ పరిగణనలోకి తీసుకుని విడిగా ఆమోదించాల్సి ఉంటుంది. సాధారణ ఆర్థిక వ్యవహారాల్లో భాగంగా రైల్వే కార్యకలాపాల్లో పౌర అంచనాలను స్థిరంగా ఉంచడమే ఈ తీర్మానం ప్రధాన ఉద్దేశం. 2017-18 నుంచి బిబేక్ దేబ్‌రాయ్ కమిటీ సిఫార్సు మేరకు రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేశారు.

2025–26 రైల్వే బడ్జెట్ ముఖ్యాంశాలు:

❐ 2025-26 బడ్జెట్‌లో రూ.2.65 లక్షల కోట్లు కేటాయించారు.

❐ ఇందులో రూ.2.52 లక్షల కోట్లు సాధారణ ఆదాయాలు, రూ.200 కోట్లు నిర్భయ ఫండ్, అంతర్గత వనరుల నుంచి రూ.3వేల కోట్లు, బడ్జెటేతర వనరుల నుంచి రూ.10 వేల కోట్లు ఉంటాయి.

ప్రస్తుతం దేశంలోని వివిధ రైళ్ల వివరాలు

లగ్జరీ రైళ్లు:	అత్యంత వేగంగా ప్రయాణించే రైళ్లు:	
☛ ప్యాలెస్ ఆన్ వీల్స్ (1982)	☛ తేజస్ ఎక్స్‌ప్రెస్	☛ గతిమాన్ ఎక్స్‌ప్రెస్
☛ దక్కన్ ఒడిస్సీ (2007)	☛ శతాబ్ది ఎక్స్‌ప్రెస్	☛ రాజధాని ఎక్స్‌ప్రెస్
☛ ది గోల్డెన్ చారియట్ (2008)	☛ దురంతో ఎక్స్‌ప్రెస్	☛ హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్
☛ రాయల్ రాజస్థాన్ ఆన్ వీల్స్ (2009)	☛ ఉదయ్ ఎక్స్‌ప్రెస్	☛ యువ ఎక్స్‌ప్రెస్
☛ మహాపరినివాస్ ఎక్స్‌ప్రెస్ (2007)	☛ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్	☛ కవిగురు ఎక్స్‌ప్రెస్
☛ మహారాజా ఎక్స్‌ప్రెస్ (2010)	☛ వివేక్ ఎక్స్‌ప్రెస్	☛ వందేభారత్ ఎక్స్‌ప్రెస్

❐ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికులు, సరకు రవాణా తదితర మార్గాల్లో రూ.3.02 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

❐ ఈసారి ప్రధానంగా 17,500 జనరల్ బోగీలు, 200 వందేభారత్ రైళ్లు, 100 అమృత్‌భారత్ రైళ్లు, 50 నమోభారత్ రైళ్ల ఉత్పత్తికి ఆమోదం తెలిపినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాబోయే నాలుగైదేళ్లలో రూ.4.6 లక్షల కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులు అమలుచేస్తామని చెప్పారు.

❐ 2024-25 సవరించిన అంచనాల్లో రైల్వే భద్రతకు రూ.1,14,062 కోట్లు కేటాయించగా, 2025-26 బడ్జెట్ అంచనాల్లో రూ.1,16,514 కోట్లు ఇచ్చారు. ఏడాదికి 4వేల కిలోమీటర్ల కొత్త లైన్లు వేస్తున్నారు. గడిచిన పదేళ్లలో 31,180 కి.మీ. కొత్త ట్రాక్‌లు వేశారు.

ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)

❐ ఇది భారత రైల్వే అనుబంధ సంస్థ. 1999, సెప్టెంబరు 27న ప్రారంభమైంది. ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది. ఆన్‌లైన్‌లో టికెట్ల జారీ, రిజర్వేషన్, రద్దు చేసుకోవడం, రైలు వేళలు, కదలికలను తెలుసుకోవడం లాంటి సేవలను ప్రధానంగా అందిస్తోంది. ఈ సంస్థ రైల్వే స్టేషన్లలో రెస్టారెంట్లు, వసతి గదులు నిర్వహిస్తోంది. రైళ్లలో భోజనం, తినుబండారాల సౌకర్యం కల్పించడంతో పాటు, పర్యాటక ప్యాకేజీలను అందుబాటులో ఉంచుతోంది.

కవచ్ - ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ

కవచ్ అనేది స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ. ఇందులో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉంది. దీనికి అత్యున్నత స్థాయి భద్రత ధ్రువీకరణ అవసరం.

❐ లోకో పైలట్ విఫలమైతే బ్రేక్‌లను స్వయంచాలకంగా వేయడం ద్వారా నిర్దేశిత వేగపరిమితుల్లో రైళ్లను నడపటంలో కవచ్ లోకో పైలట్‌కు సహాయపడుతుంది.

❐ దక్షిణ, ఉత్తర మధ్య రైల్వేల్లో 1548 రూట్ కి.మీ.లలో కవచ్‌ను ఇప్పటికే అభివృద్ధి చేశారు. ప్రస్తుతం దిల్లీ - ముంబయి, దిల్లీ - హౌరా కారిడార్లలో (సుమారు 3000 రూట్ కి.మీ.) పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ మార్గాల్లో దాదాపు 1081 రూట్ కి.మీ. (దిల్లీ - ముంబయి సెక్షన్‌లో 705 రూట్ కి.మీ., దిల్లీ-హౌరా సెక్షన్‌లో 376 రూట్ కి.మీ.) ట్రాక్ సైడ్ పనులు పూర్తయ్యాయి.



రచయిత

బండారి ధనుంజయ

విషయ నిపుణులు

Word of the Day

706

Galloping

Telugu meaning: వేగంగా కమ్ముకొను, దూకుడుగా

English meaning: The word 'galloping' (గ్యాలపింగ్) is a verb/ adjective that describes moving or progressing very quickly, like a horse running at full speed.


Synonyms: Rushing, Speeding

Antonyms: Crawling, Loitering

Usage: **1.** ***(As a Verb):*** The horse came galloping across the field, raising clouds of dust behind it.

2. ***(As an Adjective):*** With galloping inflation, the cost of living has become a major concern for common people.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర



భారతదేశంలో సంస్థానాల విలీనం

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలోని ప్రాంతాల్లో కొన్ని బ్రిటిష్ పాలనలో, మరికొన్ని స్వదేశీ సంస్థానాధీశుల అధీనంలో ఉండేవి. స్వాతంత్ర్యానంతరం అవి స్వతంత్రంగా ఉండటమా, భారత్ లేదా పాకిస్థాన్‌లో చేరడమా అనే ప్రశ్న తలెత్తింది. భారత్‌లో చేరడమే లాభదాయకమని అనేక సంస్థానాలు భావించాయి. కానీ జునాగఢ్, కశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు స్వతంత్రంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి.

☛ 1947లో భారత్, పాకిస్థాన్‌లుగా విడిపోయే నాటికి మనదేశంలో దాదాపు 562 సంస్థానాలుండేవి. ఈ సంస్థానాలపై ఆంగ్లేయుల అధికారం అంతం కావడంతో వాటి భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయా సంస్థానాధిపతులే నిర్ణయించుకోవాలని లార్డ్ మౌంట్ బాటన్ రూపొందించిన పథకం నిర్దేశించింది.

జునాగఢ్

☛ కథియవార్ ద్వీపకల్పంలోని సంస్థానాల్లో జునాగఢ్ ప్రసిద్ధమైంది. దీని పాలకుడు నవాబ్ సర్ మహ్మద్ రసూల్‌ఖాన్. ఈ సంస్థానంలో 75% మంది ప్రజలు హిందువులు.

☛ సంస్థానంలోని ప్రజలు భారత సమాఖ్యలో చేరాలని ఆశించారు. నవాబ్ మాత్రం తన సంస్థానం పాకిస్థాన్‌లో చేరుతుందని ప్రకటించాడు.


కశ్మీర్

☛ భౌగోళికంగా కశ్మీర్ సంస్థానం జమ్మూ, కశ్మీర్ లోయ, గిల్గిత్, లద్దాఖ్ అనే నాలుగు భాగాలుగా ఉండేది. ఈ సంస్థానానికి రాజా హరిసింగ్ అనే హిందువు అధిపతిగా ఉండేవారు. ఇక్కడ ముస్లిం జనాభా అధికం.

హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం కావడం సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

దేశంలో ప్రధాన బహుళార్థ సాధక ప్రాజెక్టులు

భారత్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశం. నేటికీ అధికశాతం ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పనిచేస్తున్నారు. వ్యవసాయానికి నీరు ప్రధాన సహజ వనరు. సంవత్సరం పొడవునా దీనికి జలాలు అవసరం. పూర్వం వ్యవసాయం వర్షాధారంగా సాగేది. అయితే దేశంలో వర్షపాతం కొన్ని నెలలకే పరిమితం. రుతుపవనాలు అనుకూలంగా లేకపోతే అదీ కష్టమే. వర్షాభావ పరిస్థితులను అధిగమించి పంటలకు కృత్రిమంగా మానవ ప్రయత్నం ద్వారా నీరు అందించడాన్ని 'నీటిపారుదల' అంటారు. జనాభా పరంగా భారత్ ప్రపంచంలోనే తొలిస్థానంలో ఉంది. వేగంగా పెరుగుతున్న జనాభాకు ఆహారం, ప్రాథమిక నిత్యావసర వస్తువులు అందించడానికి నీటిపారుదల అవసరం. అందుకోసమే చెరువులు తవ్వించడం, ఆనకట్టలు, రిజర్వాయర్లు, డ్యామ్‌ల నిర్మాణం జరుగుతోంది.



☛ ప్రాజెక్టులను వాటి ఆయకట్టు ఆధారంగా వర్గీకరించారు. 10 వేల హెక్టార్ల కంటే ఎక్కువ భూములకు నీరు అందించే వాటిని భారీ నీటిపారుదల ప్రాజెక్టులు; 2 వేల నుంచి 10 వేల హెక్టార్ల వరకు నీరందించే వాటిని మధ్యతరహా నీటి ప్రాజెక్టులు; 2 వేల కంటే తక్కువ హెక్టార్ల భూమికి నీరు అందించే వాటిని చిన్నతరహా నీటి ప్రాజెక్టులు అంటారు.

స్టడీ జోన్

☛ దేశాభివృద్ధికి బహుళార్థ సాధక ప్రాజెక్టులు ఎంతో అవసరం. ఇవి మిలియన్ల కొద్దీ హెక్టార్లకు నీరివ్వడంతో పాటు, విద్యుత్ ఉత్పాదన, వినోద విహారాలు లాంటి బహుళ ప్రయోజనాలను అందిస్తాయి. తాగునీరు, సాగునీరు, వరద నివారణ, విద్యుత్ ఉత్పత్తి, జల రవాణా, విహార యాత్రలు, మత్స్య సంపద అభివృద్ధి, భూసార సంరక్షణ, కృత్రిమ వనాల పెంపకం లాంటి ఎన్నో ప్రయోజనాలు బహుళార్థ సాధక ప్రాజెక్టుల వల్ల కలుగుతున్నాయి.

మన దేశంలోని ప్రధాన బహుళార్థ సాధక ప్రాజెక్టులను పరిశీలిస్తే..

పేరు	నది	నిర్మించిన కాలం	ఉన్న రాష్ట్రం
భాక్రానంగల్	సట్లెజ్	1955-62	హిమాచల్ ప్రదేశ్
దామోదర్ లోయ	దామోదర్,	1948-57	పశ్చిమ బెంగాల్
సర్దార్ సరోవర్ డ్యామ్	నర్మద	1961-2017	గుజరాత్
ఇందిరాసాగర్ డ్యామ్	నర్మద	1992-2005	మధ్యప్రదేశ్
హీరాకుడ్ ప్రాజెక్టు	మహానది	1948-57	ఒడిశా
రిహండ్ ప్రాజెక్టు	రిహండ్	1953-62	ఉత్తర్ ప్రదేశ్
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	కృష్ణా	1955-67	ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దులో ఉంది
శ్రీశైలం ప్రాజెక్టు	కృష్ణా	1960-81	ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దులో ఉంది
శ్రీరాంసాగర్ ప్రాజెక్టు	గోదావరి	1963-77	తెలంగాణ
కాళేశ్వరం ప్రాజెక్టు	గోదావరి	2016-19	తెలంగాణ

Current Affairs

Hindustan Shipyard Limited (HSL) delivered INS Nistar to the Indian Navy on 8 July 2025. Nistar is an indigenously built vessel equipped with cutting-edge technology.





Prime Minister Narendra Modi was conferred Brazil's highest civilian honour, 'The Grand Collar of the National Order of the Southern Cross', by President Luiz Inácio Lula da Silva in Brasilia on 8 July 2025.

Sahil Kini was appointed as the new Chief Executive Officer (CEO) of the Reserve Bank Innovation Hub (RBIH). He is the co-founder of Setu, a Bengaluru-based API FinTech that was among the fastest-growing players in the open API space before being acquired by Pine Labs in 2022.

✦ Kini succeeds Rajesh Bansal, who completed his four-year term in April 2025.

For more Current Affairs: Scan QR code

Latest Updates

Faculty Jobs

Employees State Insurance Corporation (ESIC) Uttar Pradesh Medical College & Hospital, Pandepur, is conducting interviews for filling up the faculty posts in various departments on a contractual basis. The total number of posts is 54. The application fee is Rs. 500. Eligible candidates can appear for the interview on 2025 July 18, 19.

Internship Posts

The Defence Research and Development Organisation (DRDO) in Visakhapatnam is inviting applications for filling up the paid internship posts in various departments. The total no. of posts is 35. The last date for online applications is 20 July 2025.

DRDO-RDE

DRDO-RDE Maharashtra is inviting applications for filling up the internship posts in various departments. The total no. of posts is 40. Eligible candidates can apply online before 15 July 2025.

Did You Apply..?

Today (July 10) is the last date for the following jobs/ Internship posts

☛ 86 Technician posts in National Aerospace Laboratories. ***Qualification:*** Tenth, Inter, ITI.

☛ 75 internship posts at DRDL Hyderabad. ***Eligibility:*** BE/BTech (full-time).

For more information and other notifications - scan QR code

Mirror Images

1. Select the correct mirror image of the given figure when the mirror is placed at MN as shown below.

a y q r 4 p d h 5 | (M above, N below)

A) ƨ d p q ɥ ɿ p ʏ ɒ

B) ƨ d b q ɥ ɿ p ʏ ɒ

C) ƨ d b q ɥ ɿ p ʏ ɒ

D) ƨ d p q ɥ ɿ p ʎ ɒ

2. Select the correct mirror image of the given combination when the mirror is placed at MN as shown below.

2 4 r g d a n W | (M above, N below)

A) W n ɒ b g ɿ ɥ ƨ

B) W n ɒ b g ɿ ɥ Ƨ

C) W n ɒ b g ɿ ɥ 2

D) W n ɒ b g ɿ 4 ƨ

3. Which figure should replace the question mark (?) if the series were to be continued?

S 6 T O R C 2	O S 6 T 2 C R	C R O 2 T 6 S	2 C R O S 6 T	?

A) 6 / T 2 S / O R C

B) 6 / S 2 C / T R O

C) O / 2 C R / T S 6

D) R / O 6 C / T 2 S

4.

5 X A □ R	X □ 5 R A	A R □ 5 X	R 5 A X □	?

A) 5 X / R / □ A

B) □ X / 5 / A R

C) □ A / X / 5 R

D) □ X / R / 5 A

5. Select the figure from among the given options that can replace the question mark (?) in the following series.

X Z □ 9 D	X 9 Z □ D	D 9 X □ Z	D □ 9 X Z	?

Railway Exams

Reasoning

A) D / X □ 9 / Z

B) Z / X 9 □ / D

C) Z / □ D X / 9

D) Z / □ 9 X / D

6. Select the correct mirror image of the given figure when the mirror is replaced at MN.

h r 4 9 j k z | (M above, N below)

A) z ʞ j 6 ɥ ɿ d

B) z ʞ j 6 ɥ ɿ q

C) z k j e ɥ ɿ d

D) z ʞ j e ɥ ɿ d

7. Select the correct mirror image of the given figure when the mirror is placed at MN.

G r 3 d 7 e | (M above, N below)

A) ɘ ٢ p Ɛ ɿ Ә

B) ɘ ٢ b Ɛ r Ә

C) ɘ ٢ b Ɛ ɿ Ә

D) ɘ d 7 Ɛ ɿ Ә

8. Identify the figure given in the options which when put in place of the question mark (?) will logically complete the series.

A	A ⦸	A ⦸ S	A ⦸ S T	?

A) A ⦸ S / T / T

B) A ⦸ S / T / S

C) A ⦸ S / T / R

D) A ⦸ S / T / R

These model questions were prepared by ***Rajesh Madhu***

Scan the QR code for Key

పోలవరం వెనుక జలాల ప్రభావిత రాష్ట్రాలతో నేడు కేంద్రం సమావేశం

ఈనాడు, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు వెనుక జలాల ప్రభావిత రాష్ట్రాలతో గురువారం దిల్లీలో కేంద్రం సమావేశం నిర్వహించనుంది. ఈ మేరకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణలకు కేంద్ర జలశక్తి శాఖ సమాచారం అందించింది. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలూ పాల్గొననున్నాయి. ఇటీవల జరిగిన రెండు ప్రగతి సమావేశాల్లో పోలవరం ముంపు అంశం ఎజెండాగా ఉంది. చివరి నిమిషంలో తొలగించారు. ఈ నేపథ్యంలో అత్యవసరంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

●పోలవరం వెనుక జలాలతో తెలంగాణలో ఏర్పడుతున్న ముంపుపై సర్వే చేయాలని కృష్ణా, గోదావరి పరీవాహక సంస్థ(కేజీబీవో)ను పోలవరం ప్రాజెక్టు అథారిటీ బుధవారం ఓ లేఖలో కోరింది.

కన్ఫర్డ్ ఐపీఎస్ పదోన్నతులకు కమిటీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు సర్వీసు (ఏపీఎస్పీ) అధికారులకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటైంది. 2024 ఏడాదికి సంబంధించి అర్హులను ఈ కమిటీ ఎంపిక చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 15న దిల్లీలో కమిటీ సమావేశం కానుంది.

జల్లిపల్లి పెన్నా అహోబిలం రోడ్డుకు రూ.13.28 కోట్లు

ఈనాడు, అమరావతి: జల్లిపల్లి నుంచి పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ జలాశయం రిజర్వాయర్ రహదారి వెడల్పునకు రూ.13.28 కోట్లతో ఆమోదం తెలియజేశారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అనంతపురం చీఫ్ ఇంజినీరు ప్రతిపాదనల మేరకు దాదాపు 5.8 కి.మీ మేర రోడ్డు వెడల్పు చేయనున్నారు.

ఏటీవోపై విచారణకు ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రజారోగ్య శాఖలో వాహనాల పర్యవేక్షణ రవాణా విభాగం సహాయ రవాణా అధికారి జె.మల్లికార్జునరావుపై అభియోగాలు నిగ్గు తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌గా పని చేసిన కాలంలో మల్లికార్జునరావు ఆరోపణలు ఎదుర్కొన్నారు. అప్పట్లో ఆయన లిఖితపూర్వక వివరణతో ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. రాష్ట్ర విభజనలో ఏపీకి ఆయన్ను కేటాయించడంతో నాటి వివరాలు కోరినా తెప్పించి చర్యల్లో భాగంగా విచారణ అధికారిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు గురువులు, సాధువులకు సత్కారం

● భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గురువులను, సాధువులను సత్కరించాలని నిర్ణయించినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాలయాల్లో అవార్డు గ్రహీతలను, వివిధ రంగాల్లో నిపుణులను కూడా గురువారం నిర్వహించే కార్యక్రమాల్లో సత్కరిస్తామని ప్రకటించారు.

కల్తీ కల్లోలం

● హైదరాబాద్‌లో ఐదుగురి మృతి
● నిమ్స్‌లో 31 మందికి చికిత్స
● పెరుగుతున్న బాధితుల సంఖ్య

ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో కల్తీ కల్లు మహమ్మారి తీవ్ర విషాదం మిగిల్చింది. అస్వస్థతకు గురైన వారిలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఒకరు రెండ్రోజుల క్రితమే మృతి చెందగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ... మంగళవారం మరొకరు, బుధవారం ముగ్గురు కన్నుమూశారు. వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులందర్నీ నిమ్స్‌కు తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి బాధితుల సంఖ్య 15 ఉండగా... బుధవారం సాయంత్రానికి 31కి పెరిగింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో బాలానగర్ ఆబ్కారీ ఠాణాలో ఐదు కేసులు, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. ఏడుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో... బాలానగర్ జోన్ పోలీసులు, మేడ్చల్ జిల్లా వైద్యాధికారిణి ఉమ, ఆబ్కారీ అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని హైదర్‌నగర్, శంషిగూడ, నిజాంపేట, నడిగడ్డతండా, ఇందిరాహిల్స్, అల్లగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన రోజువారీ కూలీలు... ఈ నెల 5, 6 తేదీల్లో హైదర్‌నగర్, ఇంద్రానగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లోని కల్లు దుకాణాల్లో కల్లు తాగారు. వారిలో చాలామంది 5-6 గంటల తర్వాత వాంతులు, విరేచనాలు, పొత్తికడుపులో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఎక్కువ మంది వృద్ధులే. వారు తాగేవారే కావడంతో వారి కుటుంబ సభ్యులు సాధారణ కడుపునొప్పిగానే భావించారు. అయితే, కొందరికి మాత్రం విపరీత లక్షణాలు కనిపించడంతో తమ బంధువులను ఆసుపత్రులకు తరలించారు.

అభ్యసన సామర్థ్యాల్లో వెనుకంజ!

● 6, 9 తరగతుల్లో జాతీయ సగటు కంటే దిగువన
● మూడో తరగతిలో కొంచెం మెరుగు
● 2024 డిసెంబరులో నిర్వహించిన సర్వేలో వెల్లడి
● నివేదికను విడుదల చేసిన కేంద్రం

ఈనాడు, అమరావతి: ఆరు, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో జాతీయ సగటు కంటే రాష్ట్రం వెనుకబడింది. తొమ్మిదో తరగతి పిల్లల అభ్యసనలో జాతీయ స్థాయిలో 29, ఆరో తరగతికి సంబంధించి 33 స్థానాల్లో ఏపీ నిలిచింది. మూడో తరగతిలో జాతీయ సగటు కంటే కొంచెం మెరుగ్గా ఉండటంతో 13వ స్థానం దక్కింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) విడుదల చేసిన 'పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్' నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. గతేడాది డిసెంబరులో ఎన్‌సీఈఆర్టీ నిర్వహించిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 2,723 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన 75,758 మంది విద్యార్థులు, 9,699 మంది టీచర్లు పాల్గొన్నారు. మూడో తరగతిలో మాతృభాష, గణితం, ఆరో తరగతిలో మాతృభాష, గణితం, ఈవీఎస్, తొమ్మిదో తరగతిలో మాతృభాష, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించారు. మూడు తరగతుల్లోనూ జాతీయ స్థాయిలో మొదటి 10 ర్యాంకుల్లో ఏపీకి స్థానం దక్కలేదు.

● మూడో తరగతికి సంబంధించి నంద్యాల, కృష్ణా, పల్నాడు, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలు మొదటి వరుసలో నిలవగా.. అనంతపురం, శ్రీకాకుళం, కాకినాడ, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు అడుగున ఉన్నాయి.

● ఆరో తరగతికి సంబంధించి జాతీయ సరాసరి కంటే మంచి ప్రతిభ చూపిన అమ్మాయిల జాబితాలో విశాఖపట్నం ఒక్కటే నిలిచింది. జాతీయ సరాసరి కంటే ఎక్కువ స్కోరు సాధించిన గ్రామీణ విద్యార్థులు కలిగిన జాబితా, ప్రభుత్వ పాఠశాలల జాబితాల్లో ఒక్క జిల్లా కూడా లేదు.

● తొమ్మిదో తరగతిలో జాతీయ సరాసరి కంటే బాలికల అభ్యసన తీరు బాగున్న జిల్లాల జాబితాలో విశాఖపట్నం, విజయనగరం నిలిచాయి. జాతీయ సరాసరి కంటే ఎక్కువ స్కోరు సాధించిన గ్రామీణ విద్యార్థులు కలిగిన జిల్లాల్లో విజయనగరానికి స్థానం దక్కింది.

● బాలబాలికల వారీగా చూస్తే బాలురు 47% స్కోరు సాధించగా.. బాలికలు 51% సాధించారు.

● పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు మెరుగైన అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో 44%.. గ్రామీణ ప్రాంతాల్లో 56% స్కోర్లు నమోదయ్యాయి.


● ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య అభ్యసన సామర్థ్యాల్లో పెద్దగా తేడా లేదు. ప్రైవేటు పాఠశాలలు 38% స్కోరు పొందగా.. ప్రభుత్వ పాఠశాలలు 37% సాధించాయి. ఎయిడెడ్ బడుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ స్కోరు 19%.

● రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాలయాలు 69% స్కోరుతో అభ్యసన సామర్థ్యాల్లో మెరుగ్గా ఉన్నాయి. నవోదయ విద్యాలయాలు వెనకంజలో ఉన్నాయి. ఇక్కడ 21% స్కోరే నమోదైంది.

వివిధ సబ్జెక్టుల్లో రాష్ట్ర, జాతీయ సగటు స్కోరు

తరగతి	సబ్జెక్టు	రాష్ట్రం	జాతీయ
మూడు	మాతృభాష	64	64
	గణితం	61	60
ఆరు	మాతృభాష	48	57
	గణితం	41	46
	పరిసరాల విజ్ఞానం(ఈవీఎస్)	40	49
తొమ్మిది	మాతృభాష	50	54
	గణితం	35	37
	సామాన్యశాస్త్రం	36	40
	సాంఘికశాస్త్రం	37	40

వైకాపాది దిగజారుడుతనం: మంత్రి పార్థసారథి



ఈనాడు, అమరావతి: ఏపీఎండీసీ బాండ్ల అమ్మకాలకు ప్రయత్నించినప్పుడు.. ఉదయ్‌భాస్కర్ అనే వ్యక్తితో ప్రపంచంలోని పెద్ద కంపెనీల అధికారులకు మెయిల్స్ చేయించడం వైకాపా దిగజారుడుతనానికి నిదర్శనమని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసేందుకూ వెనకాడని పరిస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. ఆ పార్టీ ఎంపీలు.. కేంద్ర ఫైనాన్స్ కమిటీలో ఏపీకి నిధులు ఇవ్వొద్దని కోరుతున్నారని పేర్కొన్నారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్నారని, ఇంకా భారీగా పెట్టుబడులు రానున్నాయని, వైకాపా నేతలు ఎన్ని నక్కజిత్తులు వేసినా ఉపయోగం ఉండదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో.. ప్రపంచబ్యాంకు ప్రతినిధులను ఏపీకి వెళ్లొద్దని కేంద్రం సూచించిందని, ఏపీ డిఫాల్ట్ అయితే దేశ పరపతి దిగజారిపోతుందని నాడు ఆ సూచన చేశారని మంత్రి గుర్తుచేశారు.

అధినేత సూచనలను ఆహ్వానిస్తాం

ప్రతిపక్షం చేసే కుట్రలను తిప్పికొట్టాల్సిన, వాటిని బహిర్గతం చేయాల్సిన బాధ్యత మంత్రులపై ఉందని కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ప్రతిపక్షాన్ని సరైన స్థాయిలో ఎదుర్కోవడంలో మంత్రులు విఫలమవుతున్నారంటూ సీఎం మందలించారా? అని విలేకరులు ప్రశ్నించగా.. మంత్రి పైవిధంగా స్పందించారు. ఏ నాయకుడైనా అలా సూచనలు చేస్తారని చెప్పారు. అధినేత నుంచి అలాంటి సూచనలను తాము ఆహ్వానిస్తామని వెల్లడించారు.

నా కుమారుడిని హత్యచేసి 3 ఎకరాలు కబ్జా చేశారు

● జక్కంపూడి రాజా అనుచరులపై తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తన కుమారుడికి గడ్డి మందు ఇచ్చి వైకాపా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అనుచరులు హత్య చేశారని, మూడెకరాల పొలం రాయించుకొన్నారని తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలానికి చెందిన మార్పు విజయలక్ష్మి వాపోయారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని ఆక్రమించిన వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా దుర్గికి చెందిన శ్రీదేవి కోరారు.

పుర కమిషనర్లుగా.. ఇతర శాఖల అధికారులు

● డిప్యుటేషన్లకు మళ్లీ అవకాశం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, ఉద్యానవన అధికారులు, సాంఘిక సంక్షేమ సంయుక్త సంచాలకులు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్.. వీరంతా ఇప్పుడు పురపాలక కమిషనర్లు..! పట్టణ పరిపాలన వ్యవహారాల్లో వీరికి అనుభవం ఉందా? వీరు పని చేస్తున్న శాఖలకు పురపాలక సంఘాలకు ఏమైనా సంబంధం ఉందా? అంటే సమాధానం దొరకదు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ 14 మందిని డిప్యుటేషన్‌పై కమిషనర్లుగా నియమించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం ఐఏఎస్‌లను, గ్రూపు-1 అధికారులను పురపాలక కమిషనర్లుగా నియమిస్తోంది. పట్టణ పరిపాలన వ్యవహారాలతో సంబంధం, అనుభవం లేని ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులను డిప్యుటేషన్‌పై నియమించడం వివాదాలకు దారి తీస్తోంది.

వెనక్కి పంపి... మళ్లీ తీసుకున్నారు

వైకాపా ప్రభుత్వంలో ఏకంగా జైలర్లు, పశు వైద్యాధికారులతో సహా 30 మందిని కమిషనర్లుగా డిప్యుటేషన్‌పై నియమించారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వారందర్నీ మాతృసంస్థలకు తిరిగి పంపారు. ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల్లో మళ్లీ ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను కమిషనర్లుగా డిప్యుటేషన్‌పై నియమించారు. పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్న ఏడుగురిని పక్కనపెట్టి మరీ ఇతరులకు పురపాలక పగ్గాలు అప్పగించారు. పురపాలక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లను సైతం పరిగణనలోకి తీసుకోలేదు. పదోన్నతిపై కమిషనర్‌గా పని చేయాలని ఆశిస్తున్న వంద మందికిపైగా పురపాలక మేనేజర్లు, శానిటరీ సూపర్‌వైజర్లకూ నిరాశే ఎదురైంది. కమిషనర్లుగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించినా తమ కోరిక తీరేదని పదవీ విరమణకు చేరువలో ఉన్న పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేల ఒత్తిడే కారణమా?

పురపాలక కమిషనర్లుగా డిప్యుటేషన్‌పై ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులను తీసుకోరాదని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకున్నా కొందరు ఎమ్మెల్యేల ఒత్తిడితో అనుమతించినట్లు తెలుస్తోంది. దాదాపు 35 మంది ఇతర శాఖల అధికారుల పేర్లు సిఫారసు చేసినా అన్ని కోణాల్లో పరిశీలించాక 14 మందికే అవకాశం కల్పించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి సచివాలయంలో పలువురు సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లను డిప్యుటేషన్‌పై కమిషనర్లుగా నియమించారు.

పుర కమిషనర్లుగా ఇతర శాఖల అధికారులు వద్దు

● రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ అసోసియేషన్ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: మున్సిపల్ కమిషనర్లుగా ఇతర ప్రభుత్వశాఖల ఉద్యోగులను నియమించొద్దని రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను సచివాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగ నరసింహారావు, బాలస్వామి, ఉపాధ్యక్షుడు భవానీ ప్రసాద్, కోశాధికారి శివారెడ్డి తదితరులు బుధవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. కమిషనర్లపై ఉన్న ఆర్థికేతర కేసులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

డిప్యుటేషన్‌పై నియమితులైన ఇతర ప్రభుత్వశాఖల అధికారుల వివరాలు....

పేరు	మాతృ సంస్థ	పురపాలక/నగరపాలక సంస్థ
ఎం.కిరణ్‌కుమార్	అసిస్టెంట్, ఉద్యానవన శాఖ	కదిరి
సి.చరణ్‌తేజ్‌రెడ్డి	అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, ఆడిట్ శాఖ	తిరుపతి అదనపు కమిషనర్
డి.రమణమూర్తి	అదనపు డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ	జీవీఎంసీ అదనపు కమిషనర్
క్రాంతి కుమార్	అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకార శాఖ	పుట్టపర్తి
కె.చక్రవర్తి	అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ	అనకాపల్లి జోనల్ కమిషనర్
బి.సన్యాసినాయుడు	జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి	జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్
షేక్ నజీర్	సెక్షన్ ఆఫీసర్, జీఏడీ సచివాలయం	వైఎస్ఆర్ తాడిగడప
కోన శ్రీనివాస్	సెక్షన్ ఆఫీసర్, జీఏడీ సచివాలయం	ఉప కమిషనర్, కాకినాడ
టి.రవి	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, జీఏడీ సచివాలయం	ఆమదాలవలస
సి.రవిచంద్రారెడ్డి	స్పెషల్ గ్రేడ్-1 డ్రాయింగ్ ఆఫీసర్, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్	ప్రొద్దుటూరు
వి.నిర్మలకుమార్	సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ	అమలాపురం
జి.వెంకటేశ్వర్లు	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, జీఏడీ (ఎలక్ట్రానిక్స్) సచివాలయం	దాచేపల్లి
పి.కృష్ణమోహన్‌రెడ్డి	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, యువజన వ్యవహారాలు, సచివాలయం	కనిగిరి
కేవీ.సతీశ్‌కుమార్‌రెడ్డి	సెక్షన్ ఆఫీసర్	ఉప కమిషనర్, కర్నూలు

జగన్ అక్రమాస్తుల కేసును కొట్టివేయండి

● హైకోర్టును ఆశ్రయించిన దాల్మియా సిమెంట్స్

ఈనాడు, హైదరాబాద్: ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో నమోదు చేసిన సీబీఐ కేసును కొట్టివేయాలని కోరుతూ దాల్మియా సిమెంట్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం దాల్మియా సిమెంట్స్‌కు అక్రమ పద్ధతుల్లో లీజులు కట్టబెట్టినందుకు ప్రతిఫలంగా ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో దాల్మియా సిమెంట్స్ రూ.95 కోట్ల ముడుపులను పెట్టుబడిగా పెట్టిందని సీబీఐ కేసు నమోదు చేసింది. భారతి సిమెంట్స్‌లో దాల్మియా వాటాలను ఫ్రెంచి కంపెనీకి విక్రయించగా రూ.146.58 కోట్లు వచ్చింది. అందులో పెట్టుబడులపై లాభం పన్ను పోనూ రూ.139 కోట్లు మిగిలింది. ఈ సొమ్మును ఖాతాల్లో చూపకుండా హవాలా మార్గంలో జగన్‌కు రూ.55 కోట్లు అందించిందని పేర్కొంది. దాల్మియా ఉద్యోగి జాయ్‌దీప్ బసు నుంచి ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్ నుంచి రాబట్టిన సమాచారం ప్రకారం సీబీఐ దర్యాప్తును కొనసాగించగా.. 'జేఆర్' ఖాతాలో రూ.55 కోట్లకు సంబంధించిన లావాదేవీలు బయటపడ్డాయని, జేఆర్ అంటే జగన్ మోహన్‌రెడ్డేనని పేర్కొంది. హవాలా మార్గాల్లో వచ్చిన సొమ్ముకు సంబంధించి ఆడిటర్ విజయసాయిరెడ్డికి, పునీత్ దాల్మియా, దాల్మియా ఉద్యోగుల మధ్య సంకేత భాషలో ఈమెయిల్ వ్యవహారాలు నడిచాయని తెలిపింది. 3500 టన్నులు అందాయంటే రూ.35 కోట్లు అందాయంటూ కోడ్ భాషలో సాగిన ఈమెయిల్ గుట్టు రట్టయిందని సీబీఐ పేర్కొంది. అయితే అక్రమంగా నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలంటూ దాల్మియా సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు.

జరిమానాలే ఉంటాయి.. కేసు ఉండదు!

పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చట్టవిరుద్ధంగా లీజులు మంజూరైతే జరిమానాలు ఉంటాయి తప్ప క్రిమినల్ కేసు ఉండదన్నారు. నీకది-నాకిది (క్విడ్ ప్రో కో) పెట్టుబడులు పెట్టారని సీబీఐ ఆరోపిస్తోందని, దీన్ని విక్రయించడం ద్వారా లాభాలు వచ్చాయన్నారు. విక్రయించిన సొమ్ము జగన్‌కు అందిందని, ఈ విషయం పెన్‌డ్రైవ్ ద్వారా బయటపడిందని సీబీఐ అంటోందని, ఈమెయిళ్లలో సంకేత భాష వినియోగించారన్న ఊహాజనిత ఆరోపణలతో కేసు నమోదు చేసిందని వివరించారు. పెన్‌డ్రైవ్‌లోని వివరాలను ఇవ్వాలని కోరితే సీబీఐ నిరాకరించిందన్నారు. ఈ కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆస్తులను జప్తు చేస్తోందని, అందువల్ల విచారణను నిలిపివేయాలని కోరారు. సీబీఐ తరఫు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ.. ఇదే కోర్టు ఇండియా సిమెంట్స్ కేసులో ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని దాల్మియా సిమెంట్స్ ఈ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఇండియా సిమెంట్స్‌పై కేసును కొట్టివేస్తూ ఈ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశామని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేస్తామని అన్నారు. దీనికి న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు

వైకాపా హయాంలో ఏడీ-సెట్ పేరుతో నిధుల దుర్వినియోగం

ఈనాడు, అమరావతి: ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు నిర్వహించే ఆర్ట్, డిజైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(ఏడీ-సెట్) నిర్వహణ పేరుతో వైకాపా ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్ బంధువు ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఏడీ-సెట్ నిర్వహణకు కన్వీనర్‌గా అడ్వాన్సులు తీసుకున్న ఆయన వాటికి లెక్కలు చెప్పలేదు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో సెట్ నిర్వహించేందుకు అడ్వాన్స్‌లు తీసుకున్నా అసలు సెట్టే నిర్వహించలేదు. 2023లో రూ.8లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్న ఈసీ సురేంద్రనాథ్ రెడ్డి వీటి లెక్కలను ఇంతవరకు చెప్పలేదు. గతేడాది రూ.10 లక్షలు తీసుకున్న ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ విశ్వనాథకుమార్ సైతం లెక్కలు చెప్పలేదు. గత నాలుగేళ్లలో రూ.34 లక్షలు ఉన్నత విద్యామండలి నుంచి వీరు అడ్వాన్స్‌లుగా తీసుకున్నారు.

ప్రవేశాలకు అనుమతి..

ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు ప్రకటన ఇచ్చేందుకు వర్సిటీకి అనుమతిస్తూ ఉన్నత విద్యామండలి ఆదేశాలు ఇచ్చింది. గత నాలుగేళ్లగా ఏడీ-సెట్ నిర్వహించకుండానే అర్హత పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించారు. ఈ ఏడాది సైతం ప్రకటన ఇచ్చి, అర్హత పరీక్షల్లో వచ్చిన మార్కులతో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించాలని వర్సిటీకి ఉన్నత విద్యామండలి సూచించింది.



ఎక్సైజ్, ప్రొహిబిషన్ కమిషనర్ నిశాంత్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న స్టార్ హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి, ఇతర ప్రతినిధులు

ఆతిథ్య గమ్యస్థానంగా రాష్ట్రం అభివృద్ధికి కృషి

● స్టార్ హోటళ్ల అసోసియేషన్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సహకారంతో ప్రముఖ ఆతిథ్య గమ్యస్థానంగా రాష్ట్రం అభివృద్ధికి కృషి చేస్తామని ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. ఆగస్టు 31తో ఎక్సైజ్ పాలసీ కాలపరిమితి ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త పాలసీ రూపకల్పనకు సంబంధించి స్టార్ హోటళ్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్ మూర్తి చిట్టూరి, కోశాధికారి శివకుమార్, సంయుక్త కార్యదర్శి పవన్ కార్తీక్ తదితరులతో రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ కమిషనర్ నిశాంత్‌కుమార్ బుధవారం విజయవాడలోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతినిధుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్టార్ హోటళ్లకు విదేశీ మద్యాన్ని అందుబాటు ధరల్లో సరఫరా చేయాలని, రాత్రి 2 గంటల వరకు హోటళ్లలో బార్లు తెరిచి ఉంచే అవకాశం ఇవ్వాలని ప్రతినిధులు విన్నవించారు.

మాంగనీస్ అక్రమ తవ్వకాలపై పవన్ కల్యాణ్ ఆరా

● సమగ్ర నివేదిక ఇవ్వాలని విజయనగరం జిల్లా యంత్రాంగానికి ఆదేశం

ఈనాడు, అమరావతి: విజయనగరం జిల్లా గరివిడి మండలం దేవాడ మైనింగ్ బ్లాక్‌లో అనుమతికి మించి సాగిస్తున్న మాంగనీస్ తవ్వకాలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆరా తీశారు. మాంగనీస్ తవ్వకాలు, అనుమతులిచ్చిన విధానం, ఈ-వేలం ప్రక్రియ, ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఉపముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఆదేశించింది. దేవాడ బ్లాక్‌లో ఏడాదికి పది లక్షల టన్నుల మాంగనీస్‌ను తవ్వాల్సి ఉండగా అంతకు మించి తవ్వుతున్నారని, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఫిర్యాదులు అందడంతో పవన్‌కల్యాణ్ స్పందించారు.

మోదీకి బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారం దక్కడంపై పవన్ హర్షం

ప్రధాని మోదీకి బ్రెజిల్ అత్యున్నత పౌరపురస్కారం 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదర్న్ క్రాస్' ప్రదానం చేయడంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. 'మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 26 అంతర్జాతీయ పురస్కారాలు సొంతం చేసుకోవడం దేశానికి గర్వకారణం. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. ఆయన దార్శనిక నాయకత్వం దేశాన్ని ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మార్చింది' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ కొనియాడారు.

బీచ్ రోడ్డును సీఆర్‌జడ్-2లోకి మార్చాలని ఉప ముఖ్యమంత్రికి వినతి

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలోని రుషికొండ నుంచి భీమునిపట్నం బీచ్ రోడ్డును తీరప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జడ్)-3 నుంచి 2కి మార్చాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ప్రమాదకర, ఇతర వ్యర్థాల నిర్వహణ డివిజన్ టెక్నికల్ రివ్యూ కమిటీ సభ్యుడు బి.రవీంద్రనాయుడు బుధవారం వినతి పత్రం అందజేశారు. సీఆర్‌జడ్-2కి మార్చడం ద్వారా బీచ్ రోడ్డు ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కొత్తగా అనేక వాణిజ్య భవన నిర్మాణాలకు అనుమతులు వస్తాయన్నారు. ఇదే రోడ్డును భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానిస్తున్నందున సీఆర్‌జడ్ నిబంధనల సడలింపుల ద్వారా కొత్తగా అనేక స్టార్ హోటళ్లు, ఐటీ కంపెనీలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రవీంద్రనాయుడు వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సీఆర్‌జడ్-2లోకి బీచ్ రోడ్డును మార్చేలా చూడాలని కోరారు.

అర్జీల పరిష్కార తీరుపై పునఃపరిశీలనకు ప్రత్యేక యంత్రాంగం

ఈనాడు, అమరావతి: ప్రజల నుంచి అధికారులకు అందే విజ్ఞప్తుల పరిశీలన, పరిష్కారం, తిరస్కృతి తీరును సమీక్షించేందుకు జిల్లాల్లో ప్రత్యేక యంత్రాంగం రాబోతోంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు.. ప్రతి జిల్లా కేంద్రంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు లేదా ముగ్గురు విశ్రాంత తహసీల్దార్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉన్న వారిని ఒప్పంద విధానంలో నియమించాలని ప్రభుత్వం కలెక్టర్లకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. వీరి ఎంపికకు మౌఖిక పరీక్షలు కూడా నిర్వహించాలని తెలిపింది. రెవెన్యూ అధికారులు తిరస్కరించిన ప్రతి అర్జీనీ వీరిచేత పునఃపరిశీలన చేయించాలంది. పరిష్కరించిన వాటిని కూడా ర్యాండమ్ విధానంలో పరిశీలన చేయించాలని పేర్కొంది. ఐవీఆర్ఎస్, ఇతర పద్ధతుల్లో ప్రభుత్వం సేకరించిన అభిప్రాయాల సరళిని కూడా వీరు పరిశీలిస్తారు. మరోవైపు కొందరు ఒకే సమస్యపై రకరకాల రూపాల్లో ప్రభుత్వానికి అర్జీలు పంపుతున్నారు. దీనివల్ల దరఖాస్తుల సంఖ్య పెరిగిపోతోంది. ఇకపై అర్జీ స్వీకరణ సమయంలో సదరు వ్యక్తి ఆధార్ నంబరు నమోదు చేయనున్నారు. దాన్ని ట్రాకింగ్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లకు రూ.20.10 కోట్లు

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర-2047 అమల్లో భాగంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.20.10 కోట్ల నిధులు విడుదల చేసింది. కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర పరికరాలకు సంబంధించి ఒక్కో యూనిట్‌కు వన్‌టైమ్ గ్రాంటు కింద రూ.10లక్షలు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు, 26 జిల్లా కేంద్రాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గ యూనిట్‌కు ఛైర్మన్‌గా ఎమ్మెల్యే, కార్యనిర్వాహక వైస్ ఛైర్మన్‌గా ప్రత్యేక అధికారి ఉండనున్నారు. జిల్లా స్థాయిలో ఛైర్మన్‌గా ఇన్‌ఛార్జి మంత్రి, కార్యనిర్వాహక వైస్ ఛైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు.

రైతులకు వ్యక్తిగత యంత్రపరికరాలు అందించాలి

● ఏపీ ఆగ్రోస్ ఛైర్మన్ మాలెపాటి సుబ్బానాయుడు

ఈనాడు, అమరావతి: వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతులకు వ్యక్తిగత యంత్రపరికరాలు అందించాలని ఆగ్రోస్ ఛైర్మన్ మాలెపాటి సుబ్బానాయుడు సూచించారు. ఆగ్రోస్ అభివృద్ధికి కార్యాచరణ, జిల్లాల వారీ కోర్టు కేసులు, బకాయిలు, స్థలాలు, సాధారణ అమ్మకాలపై ఏపీఆగ్రోస్ జిల్లాల మేనేజర్లతో బుధవారం ఆయన వడ్డేశ్వరంలోని కార్యాలయంలో సమీక్షించారు. సమావేశంలో వీసీఎండీ ఢిల్లీరావు, జీఎం రాజమోహన్, మేనేజర్ కూర్మారావు, ఎస్ఈ హరిబాబు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భాజపా అధ్యక్షుడు మాధవ్ డకౌట్: సీపీఐ

ఈనాడు, అమరావతి: భాజపా ఏపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాధవ్ తొలి ప్రయత్నంలోనే డకౌట్ అయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. విజయవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చి, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలని.. లెనిన్‌ను విదేశీయుడని మాధవ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం ఎక్కడున్నాసరే లెనిన్‌తో సంబంధం ఉంటుందనేది జగమెరిగిన సత్యమన్నారు. మొట్టమొదటి కార్మికవర్గ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన శక్తి లెనిన్ అని రామకృష్ణ గుర్తుచేశారు. ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లి, అవార్డులు తీసుకున్నప్పుడు వాటి గురించి భాజపా నేతలు గర్వంగా చెప్పుకోలేదా.. ఆయా అవార్డులు విదేశాలవి అయినందున తీసుకోబోమని ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు.